# బుడ్గ జంగం దర్శిని

డా॥ ఎన్.ఆర్. వెంకటేశం










# బుడ్గ జంగం దర్శిని

రచన, కూర్పు :

**డా॥ ఎన్.ఆర్. వెంకటేశం**

ఎం. ఎ., ఎం.ఫిల్., పిహెచ్.డి.

సహాయకురాలు :

**కుమారి ఎన్. నీరజ**

బి.ఎ (వీణ), ఎం.ఎ. (తెలుగు), (పిహెచ్.డి)

బుడ్గ జంగం కుల విజ్ఞాన పరిశోధనా వేదిక

దివ్యదీప్తి ప్రచురణలు

హైదరాబాదు.

**2002**

# BUDGA JANGAM DARSHINI

*Written and Compiled by*

**DR. N.R. VENKATESHAM**

M.A., M.Phil, Ph.D.

Associate Professor of Telugu

Osmania University, Hyderabad - 500 007.

*Assisted by*

**N. NEERAJA**

B.A. (Veena), M.A. (Telugu), (Ph.D)

Lecturer in Telugu, A.V. Collage,

Gagan Mahal, Hyderabad - 500 028.

సుందరయ్య గ్రంథాలయ సంస్థ
A C.No 957200
గచ్చిబౌలి, హైదరాబాద్-500032

Copy Right : **Author**

అన్ని హక్కులు రచయితవి

Publication No. 7

First Edition : **February 2002**

Copies : 2000

Price : **Rs. 200**

*For Copies :*

**N. VIKRANTH**

18-2-192/2, Jangammet,

Falak Numa, Hyderabad - 500 053.

Phone : **040 - 4380202**

*Composed & printed at :*

**SRI SAI PROCESS**

3-4-528, Narayanaguda,

Hyderabad - 500 027.

Ph : 7563075, 7561981

# గ్రంథ రచయిత



ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బుద్ధ జంగాలను గురించి పరిశోధన చేసినందుకు అప్పటి (1993) గవర్నర్, ఛాన్సలర్ శ్రీకృష్ణకాంత్‌గారి నుంచి పిహెచ్.డి. పట్టా అందుకుంటున్న డా॥ ఎన్.ఆర్. వెంకటేశం వేదికమీద వైస్-ఛాన్సలర్ శ్రీ రామకిష్టయ్యగారు.

# సహాయకురాలు



కుమారి ఎన్. నీరజ

బి.ఎ. (వీణ), ఎం.ఎ. (తెలుగు), (పిహెచ్.డి.)

# అంకితం

బుడ్గ జంగాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించటానికి అహర్నిశలు పట్టుదలతో కృషి చేసిన, చేస్తున్న బుడ్గ జంగం నాయకులకు, కార్యకర్తలకు, ఎల్లప్పుడూ తమ సహాయ సహకారాలు అందిస్తున్న కుల శ్రేయోభిలాషులందరికీ ఈ కుల గ్రంథం అంకితం.

**- డా॥ ఎన్.ఆర్. వెంకటేశం**

# విషయ సూచిక

కృతజ్ఞతలు

'బుద్గ జంగం కుల విజ్ఞాన పరిశోధనా వేదిక'- పరిచయం

1. బుడ్గ జంగం కుల లక్షణాలు ... ... ... 1

2. బుడ్గ జంగాల భాషాసాహిత్యాలు ... ... ... 7

3. బుడ్గ జంగాల ఇంటిపేర్లు ... ... ... 21

4. బుడ్గ జంగాల పాటలు ... ... ... 29

5. గ్రంథాల్లో బుడ్గ జంగాల ప్రస్తావన ... ... ... 63

6. పత్రికల్లో బుడ్గ జంగాల ప్రస్తావన ... ... ... 91

7. ఆంధ్రప్రదేశ్ బుడ్గ జంగం సంఘం చరిత్ర ... ... ... 139

8. జిల్లాల్లోని బుడ్గ జంగం సంఘాల వివరాలు ... ... ... 179

9. రిప్రజెంటేషన్లు - విజ్ఞప్తులు ... ... ... 249

10. జి.వోలు - G.O.s ... ... ... 287

11. ప్రముఖుల పరిచయాలు ... ... ... 335

# ముఖ చిత్రం ఫొటోల వివరాలు

**పైన ఎడమ (నిలుచున్నవారు) :**

కప్పెరి పెంటయ్య (అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ మండల సంఘం)

కప్పెరి శివమ్మ, పొన్నకంటి శాంతమ్మ

న్యూ గంజ్, మహబూబ్‌నగర్ టౌన్.

**పైన కుడి (కూర్చున్నవారు) :**

పొన్నకంటి హనుమంతు (సలహాదారుడు, మహబూబ్‌నగర్ మండల సంఘం),

పొన్నకంటి శాంతమ్మ, కప్పెరి శంకరమ్మ.

న్యూగంజ్, మహబూబ్‌నగర్ టౌన్.

**క్రింద (కూర్చున్నవారు) :**

క్రీ.శే. కల్లెం చంద్రయ్య, పస్తం సరోజనమ్మ

మాదన్నపేట్, హైదరాబాదు.

**క్రింద (నిలుచున్నవారు) :**

నిడుగొండ పెంటయ్య (అధ్యక్షుడు, కిష్టారం గ్రామ బుడ్గ జంగం సంఘం),

నిడుగొండ ఉసేనమ్మ

కిష్టారం గ్రామం, జడ్చర్ల మండలం,

మహబూబ్‌నగర్ జిల్లా.

# కృతజ్ఞతలు

ఇప్పుడు మనం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ యుగంలో జీవిస్తున్నాం. కంప్యూటర్ మన నిత్యావసరవస్తువయింది. పాత తరాల సమాచారాన్ని భద్రపరచుకుని, కొత్త యుగాలకు ప్రణాళికలు సిద్ధం చేసుకునే పనిలో సమాజం నిమగ్నమయింది. ఈ నేపథ్యంలో బుడ్గ జంగాలకు సంబంధించిన సమాచారాన్ని వీలైనంతగా సేకరించి ఈ పుస్తకంలో కుప్ప పోశాను.

ఈ 'బుడ్గ జంగం దర్శిని' ఒకటి రెండు సంవత్సరాల్లో రాయగలిగింది కాదు. దాదాపు 20 సంవత్సరాలుగా బుడ్గ జంగాల మీద నేను చేస్తున్న పరిశోధన, ఇన్ని సంవత్సరాలుగా నేను సాగించిన విషయ సేకరణల ఫలితమే ఈ గ్రంథం. అయినా ఇదొక అసమగ్రమైన గ్రంథమే. కాని ఇది తొలిసారిగా చేసిన ఒక ప్రయత్నం. విస్తృతమైన ప్రణాళికకు రూపకల్పన. బుడ్గ జంగాల అభివృద్ధి మార్గాలను అన్వేషించటానికి ఇదొక ఆలోచనా స్రవంతి.

ముందు స్వస్వరూప జ్ఞానం కావాలి. మన గురించి మనం సమగ్రంగా తెలుసుకోవాలి. అన్ని రంగాల్లో మనమెక్కడున్నామనే అవగాహన మనకుండాలి. ఇంతవరకూ నడిచివచ్చిన బాటను పరిశీలించుకుని, ఇక నడవవలసిన మార్గాలను నిర్దేశించుకోవాలి. ఈ ఆశయంతో చేసిన ప్రయత్నమే ఇందులో కనిపిస్తుంది. రానున్న తరాల వారికి విశాలమైన ప్రాతిపదికతో కులాభివృద్ధి కార్యక్రమాలను రూపొందించుకోవటానికి ఈ గ్రంథం దోహదం చేయాలనే సంకల్పం నన్ను ఈ రచన చేయటానికి ప్రోత్సాహపరిచింది.

అట్టడుగున కొట్టుమిట్టాడుతున్న ఈ కులాన్ని ప్రగతి మార్గంలో నడిపే భావితరాల నాయకులకు గట్టి సాహిత్యపునాదులు వేస్తే, ఆ తర్వాత వారు దానిపై అంతస్తులు నిర్మించుకుంటూ వెళ్తారని నా అభిలాష. 50 సంవత్సరాల కాలాన్ని, 23 జిల్లాల వైశాల్యాన్ని సంక్షిప్తంగా, క్లుప్తంగా మీ ముందుంచాను. ఈ సమాచారంతో ప్రతి బుడ్గ జంగం తనను తాను సమీక్షించుకుని, పునరాలోచించుకుని, జీవన శైలిని మెరుగు పరచుకోవటానికి పట్టుదల చూపాలి. పెద్దలు తమ పిల్లల జీవన మార్గాన్ని విద్య వైపు మళ్ళించాలి. యువత ఆత్మ విశ్వాసంతో, చైతన్యంతో ముందుకు నడవాలి. తరతరాలుగా సమాజానికి దూరంగా జీవిస్తున్న మనం సమాజంలో భాగం కావాలి.

సమాచార సేకరణలో ఎందరో సహకరించారు. వారందరికీ నా కృతజ్ఞతలు. ముఖ్యంగా రాష్ట్రమంతా నాతో పాటు పర్యటనల్లో – ప్రచారాల్లో పాల్గొన్న రాష్ట్ర సంఘం

అధ్యక్షులు పస్తం యాదగిరిగారు కొన్ని తేదీలను, కొన్ని సభల వివరాలను అందించారు. వారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు.

తూర్పు గోదావరి జిల్లా సంఘం అధ్యక్షులు మోటూరి రాముగారికి, ప్రధాన కార్యదర్శి నామాల మరిడియ్యగారికి, విశాఖ పట్నం జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి మోతి పైడప్పడు గారికి, సహాయ కార్యదర్శి కటమంచి నాగరాజు గారికి; గుంతకల్లు (అనంతపురం జిల్లా) మండల సంఘం సలహాదారులు రుద్రాక్షల పెద్ద మారెన్నగారికి, అధ్యక్షులు రుద్రాక్షల సుంకన్నగారికి, ప్రధాన కార్యదర్శి దూపం పెద్ద పుల్లన్న గారికి, అనంతపురం అధ్యక్షులు మోతె మస్తానయ్యగారికి; నల్లగొండ జిల్లాల్లోని యువ కార్యకర్త సిరిసాల కృష్ణ (మునిపంపుల)గారికి నా కృతజ్ఞతా వందనాలు.

రోజూ ప్రెస్సుకు వచ్చి, జరుగుతున్న పనిని చూసి కొన్ని సూచనలు, సలహాలు అందించిన రాష్ట్రసంఘం సలహాదారులు నిదానకవి బాబూరావు గారికి నా కృతజ్ఞతానమస్సులు.

'బుడ్గ జంగం దర్శిని' పేరుతో నేను రచించిన ఈ గ్రంధానికి విరాళాలు ఇవ్వాలని కోరినంతనే, తోచిన రీతిగా ఆర్థిక సహాయం అందించిన కులశ్రేయోభిలాషులకందరికీ కృతజ్ఞతలు అర్పిస్తున్నాను. విరాళాల సేకరణలో పాల్గొని తమ అమూల్య సమయాన్ని వెచ్చించిన రాష్ట్ర సంఘం నాయకులు శ్రీయుతులు నిదానకవి బాబూరావు, ఆనరాశి రాములు, పస్తం యాదగిరి, తూర్పాటి జగదీశ్వర్, తూర్పాటి జంగయ్య, కదమంచి దయానంద్ గార్లకు నా కృతజ్ఞతాభివందనాలు తెలియజేస్తున్నాను.

మా అమ్మాయి నీరజ సాహిత్య పరిశోధనా రంగంలోకి రావటం వల్ల నాకు ఈ గ్రంథ రచన సులభతరమయింది. రచనా ప్రణాళికలోనూ, విషయ వివేచనలోనూ, పట్టికలు సిద్ధపరచటంలోనూ, శుద్ధ ప్రతులు తయారు చేయటంలోనూ ఈమె సహాయం మరువరానిది. మా అబ్బాయి విక్రాంత్ చేదోడువాదోడుగా సహకరించాడు. నా శ్రీమతి లలిత అనుకూల వాతావరణాన్ని కల్పించి ప్రోత్సాహమిచ్చింది. ఈ ముగ్గురికీ నా ఆశీస్సులు.

అనుకున్న సమయంలో గ్రంథాన్ని ముద్రించి ఇచ్చిన శ్రీసాయి ప్రాసెస్ అధినేత వి.రాజశేఖరరెడ్డి గారికి నా కృతజ్ఞతలు.

ఈ గ్రంథం మీ అందరి ఆదరణకు పాత్రమవుతుందని నా విశ్వాసం.

హైదరాబాదు
02-02-2002

ఎన్.ఆర్. వెంకటేశం

## 'బుడ్గ జంగం కులవిజ్ఞాన పరిశోధనా వేదిక'

ప్రపంచంలో ఎక్కడాలేని కులాల కుమ్ములాటలు, వర్ణాల వైషమ్యాలు భారతదేశం లోనే ఉన్నాయి. పెద్ద కులాలు, చిన్నకులాలు, అగ్రకులాలు, అంటరాని కులాలు - ఇలా కులాల పేరుతో మనుషులకూ మనుషులకూ మధ్య ఉన్న అడ్డుగోడలు, అంతరాలు మానవ సమాజాభివృద్ధిని బాగా దెబ్బతీశాయి. సమాజంలో హెచ్చుతగ్గులు, ఉచ్చనీచ భేదాలు ఏర్పడటంతో సమసమాజం కోసం ఉద్యమాలు పుట్టు కొచ్చే పరిస్థితి ముందుకొచ్చింది.

ఒక వ్యక్తి అభివృద్ధి సాధిస్తే, ఆ ప్రభావంతో ఆ కుటుంబమంతా అభివృద్ధి చెందటానికి వీలవుతుంది. సమాజంలో భాగమైన కుటుంబాలకు కుటుంబాలు అభివృద్ధి చెందితే సమాజమే అభివృద్ధికి నోచుకుంటుంది. సమాజాభివృద్ధే దేశాభివృద్ధి అవుతుంది. అందువల్లే అట్టడుగున ఉన్న కులాలకు ప్రభుత్వం రిజర్వేషన్లను కల్పించింది. హెచ్చుతగ్గులను, అసమానతలను తొలగించాలని చట్టాలు చేసింది. ప్రభుత్వం తమ కులానికి కేటాయించిన రాయితీలను, ప్రయోజనాలను అందిపుచ్చుకుని అభివృద్ధిలోకి రావాలని అట్టడుగు కులాలు ఇప్పుడు ఆసక్తి చూపుతున్నాయి.

మన రాష్ట్రంలో ***93*** బి.సి.కులాలు, ***60*** ఎస్.సి.కులాలు, ***33*** ఎస్.టి. తెగలు ఆయా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లను పొందుతున్నాయి. అయితే దురదృష్టకరమైన విషయమేమిటంటే, అట్టడుగున ఉన్న చాలా కులాల, తెగల వారికి ప్రభుత్వం కల్పించిన రిజర్వేషన్ సౌకర్యాల సంగతి సరిగా తెలియదు. విద్యలేకపోవటం వల్ల అజ్ఞానంలో జీవిస్తున్న ఈ కులాలు ఆది మానవుని జీవన స్థితిని గుర్తుకు తెస్తాయి. సమాజమంతా పురోగమిస్తుంటే, ఈ కులాలు మాత్రం తిరోగమిస్తున్నాయి. ఇలాంటి కులాల్లో బుడ్గ జంగం కులం ఒకటి!

***60***షెడ్యూల్డు కులాల్లో సోదర మాలమాదిగ కులాల అభివృద్ధిని చూసైనా మిగిలిన ఎస్.సి. కులాల వాళ్ళు ప్రభుత్వ రిజర్వేషన్లను వినియోగించుకుని బాగుపడటానికి అహర్నిశలు కృషిచేయ వలసి ఉంది. ఇప్పుడు షెడ్యూల్డు కులాల్లో ఏ-బి-సి-డి గ్రూపుల విభాగం చేసినందున అన్ని కులాలు సమాన ప్రాతినిధ్యంతో, సమాన అవకాశాలతో అభివృద్ధిని పొందే వీలు ఏర్పడింది.

ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించినా వాటిని వినియోగించుకోలేక ఎంతో వెనుకబడి పోయిన బుడ్గ జంగాలను రాష్ట్ర సంఘం తట్టి లేపింది. కళ్ళు తెరిపించి ముందుకు కదిలేలా చేసింది. ఇప్పుడిప్పుడే మెల్లమెల్లగా ఈ చైతన్యంతో బుడ్గ జంగాలు ముందుకు కదులుతున్నారు. ఎన్నో ఆటంకాలు, అడ్డంకులు ఏర్పడుతున్నాయి. వీటన్నిటినీ ఐకమత్యంతో, ఆత్మ విశ్వాసంతో, హక్కుల పోరాట పటిమతో అధిగమిస్తూ ముందుకు పోవలసి ఉంది. ఈ ప్రయత్నంలో రాష్ట్ర సంఘం అహర్నిశలు కులస్థులకు అన్నివిధాలా అందుబాటులో ఉండి, ఎల్లవేళలా అండదండలు అందిస్తుంది.

నేను సాహిత్యరంగంలో ఉండటం వల్ల, పరిశోధనా రంగంలో పనిచేయటం వల్ల; చిన్నప్పటి నుంచి మన కులస్థుల దయనీయమైన జీవన పరిస్థితులను, అణగారినతనాన్ని, అట్టడుగున పడిపోయిన దుర్భరస్థితిని కళ్ళారా చూడటం వల్ల - కులాభివృద్ధి కోసం కృషి చేయాలనే దృఢసంకల్పంతో ముందుకు రావటం జరిగింది. గత 20 సంవత్సరాల నుంచి ఒకవైపు రాష్ట్ర సంఘంలో కార్యక్రమాలు చేపడుతూ, మరోవైపు బుడ్గ జంగాల మీద పరిశోధన చేస్తూ, గ్రంథాలు ప్రచురిస్తూ నా వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తు వస్తున్నాను.

ఇక ముందు బుడ్గ జంగాల చరిత్ర, సంస్కృతి మొదలైన అంశాల మీద లోతుగా అధ్యయనం చేయాలని, పరిశోధనా ఫలితాలను ఎప్పటికప్పుడు బుడ్గ జంగాల అభివృద్ధికి సమన్వయ పరచాటానికి కృషి చేయాలని ప్రస్తుతం నేను 'బుడ్గ జంగం కుల విజ్ఞాన పరిశోధనా వేదిక' ను స్థాపించటం జరిగింది. ఈ వేదిక ఆధ్వర్యంలో నేను సంకల్పించిన కార్యక్రమాలు విజయవంతమైతే నా కర్తవ్యం సఫలమైనట్లే.

మీ చేతుల్లో ఉన్న ఈ గ్రంథం కార్యకర్తలకు కొత్త చూపును, సంఘాల కార్యక్రమాలకు ఒక ఊపును, బుడ్గ జంగాల జీవన గమనంలో కొత్త మలుపును, మేలుకొలుపును కలిగిస్తుందని, వెలిగిస్తుందని ఆశిస్తున్నాను.

హైదరాబాదు

ఎన్.ఆర్. వెంకటేశం

02-02-2002

# 1. బుడ్గ జంగం కుల లక్షణాలు



# 1. బుడ్గ జంగం కుల లక్షణాలు

## 1. జంగం కథలు :

బుడగ బు (గుమ్మెట్లు లేక డింకీలు), వాయిస్తూ తందానా కథలు చెబుతారు. నిమ్న కులాలైన జంగాలలో మాల జంగం, బేడ జంగం నుంచి ఈ కులాన్ని వేరు చేసి గుర్తించటానికి, వీరు వాయించే బుడగ విశేషణంగా మారి వీరికి 'బుడగ జంగాలు' అనే వ్యవహార నామం కలిగింది. బుడగ జంగాలు బుడగలు (గుమ్మెట్లు) మరియు తాంబూరా వాయిస్తూ బాల నాగమ్మ కథ, బల్లారి కొండయ్య కథ, కాంభోజరాజు కథ, బుడ్డా వెంగళరెడ్డికథ, గౌండ్ల అంజయ్యకథ, బొబ్బిలి యుద్ధం కథ, అనుముల బ్రహ్మారెడ్డి కథ, అల్లిరాణి కథ, బాలరాజు కథ మొదలైన శతాధిక కథల్ని చెబుతారు. ఒకరు ప్రధానంగా కథ చెబుతూ ఉండగా ఒకరు లేక ఇద్దరు వంత పాడతారు. స్త్రీలేగాని, పురుషులేగాని, స్త్రీ పురుషులు కలిసిగాని కథా బృందంగా ఏర్పడతారు.

## 2. బుడ్గ జంగాల భాష :

వీళ్ళు ఇతరులతో ప్రధానంగా తెలుగును మాట్లాడినప్పటికీ తమలో తాము తమ భాషా పదాలను సంకేత పదాల్లాగా మధ్యమధ్యలో జోడించి మాట్లాడతారు. ఇంచుమించు 300 ఉన్న వీళ్ళ భాషా పదాలతో, ఆ పదాలతో ఏర్పడిన పదబంధాలు-జాతీయాలతో తెలుగు పదాలను కలిపి మాట్లాడుకుంటారు. ఉదాహరణకు కొన్ని పదాలు: మెట్పిల్లు = బియ్యం, జివ్టాలు = గింజలు, శావిడి = అన్నం, చక్రకోటి = రొట్టె, దబ్లికోటి = అంబలి, మత్తె = ఇల్లు, కెంద = వస్త్రం, మంకాడు = గ్రామీణుడు, తోడ్సిగాడు = ఉడత, సేగు = వెళ్ళు.

## 3. ఈత చాపల ఉపవృత్తి :

ప్రధాన వృత్తి కథాగానం కాగా ఉపవృత్తి ఈతచాపలు అల్లటం. దీనివల్ల ఆదాయం స్వల్పం. గిట్టుబాటు కాదు. కాని ఇది వీరి కుటీర పరిశ్రమ. సాంప్రదాయంగా వస్తున్న ఉపవృత్తి.

## 4. వేట - మరో ఉపవృత్తి :

నిత్యం వేటకు వెళ్ళటం వీరి అలవాటు. ఇది కూడా వీరికి సంప్రదాయంగా వస్తున్న ఒక ఉపవృత్తి. చిన్న చిన్న జంతువుల్ని వేటాడటంలో వీళ్ళు నేర్పరులు. ఎలుకలు, ఉడతలు, ఉడుములు, ముంగీసలు, తాబేళ్ళు మొదలైన చిన్న జంతువుల్ని వేటాడే విధానాల (Procedures) ను ప్రక్రియలుగా తీర్చి దిద్దుకున్న అనుభవజ్ఞులు వీళ్ళు. ఉరులు, గూటాలు, కడెం దొర్నాలు, దోటిగాలాలు, శివ్వ ఉచ్చులు, ఈదరలొట్లు, రకరకాల వలలు, బోనులు, మీటులు మొదలైన వేట పరికరాలను తయారుచేయటంలో, నేర్పుగా వాటిని పన్నటంలో ఆరితేరినవారు.

## 5. మాంసాహారులు :

ఎలుకలు, ఉడతలు, ఉడుములు, తాబేళ్ళు మొదలైన చిన్న చిన్న జంతువుల్ని, అన్ని రకాల పిట్టల్ని, చనిపోయిన జంతువుల్ని తింటారు. పంది మాంసాన్ని తింటారు. కాని, ఎద్దు మాంసాన్ని (Beef) తినరు.

## 6. అంటరానితనం :

ప్రస్తుతం అంటరానితనం లేకున్నా తాత ముత్తాతల కాలంలో అంటరానితనంతో బాధ పడ్డారు. బుడ్గ జంగం కథలు గానం చేసే జానపద కళాకారులు కావటంవల్ల వీరికి అంటరానితనం నామమాత్రంగానే ఉండేది.

## 7. ఆరాధనా పద్ధతి :

లింగధారణ చేయరు. గుడిలో పూజారులుగా ఉండరు. గుడికి వెళ్ళే అలవాటు లేదు. పెద్ద గోసాయి, మైసమ్మ, పోశమ్మ, సుంకులమ్మ, అంకమ్మ, మరిడమ్మ, సమ్మక్క సారక్క మొదలైన గ్రామ దేవతల మొక్కుకన్నా, దయ్యాల మొక్కు సాంగోపాంగంగా విస్తృతంగా, నిరంతరంగా ఆచరింపబడుతుంది. వీళ్ళలో దేవతలను తమ బిరాళ్ళ (గూడెం)లో కొలుస్తారు.

## 8. ఇంటి పేర్లు :

బుడ్గ జంగాలకు గోత్రాలు లేవు. ఇంటి పేర్లు ఉన్నాయి. ఇంటి పేర్ల ఆధారంగానే వివాహ సంబంధాలు ఏర్పడతాయి.

## 9. పురుడు :

పుట్టిన మూడోరోజు పురుడు చేస్తారు. కులస్థులందరికీ తలా ముంత కల్లో, పావు సారానో ఇచ్చే ఆచారం ఉండేది. ప్రస్తుతం అక్కడక్కడ గ్రామాల్లో కనిపిస్తుంది.

## 10. పెళ్ళి ఆచారాలు :

బాల్య వివాహాలు కూడ జరుగుతాయి. మారు మనువులు, బహు భార్యాత్వం వీళ్ళలో ఆచరణలో ఉన్నాయి. ఓలి 9 రూపాయలు; మారు మనువు సమయంలో ఓలి 4 1/2 రూపాయలు. వరుడు అత్తమామల వెంట ఉండి జీవిస్తూ, వారికి సేవలు చేసే మ్యార, పూట పద్ధతులు వీళ్ళలో పాటించబడతాయి.

## 11. విడాకులు :

సంతానం కలుగనప్పుడు, అక్రమ సంబంధాలు, వివాదాలప్పుడు కుల పెద్దల సమక్షంలో విడాకులు తీసుకునే ఆచారం వీళ్ళలో ఉంది.

## 12. శవయాత్రలో పాల్గొనుట :

నిమ్న అగ్రకులాల్లో ఎవరైనా చనిపోయినప్పుడు జాగరణ సందర్భంగా రాత్రంతా కథాగానం చేస్తారు. శవ యాత్రలో శవం ముందు గంట శంఖు వాయిస్తూ వెళతారు. హైదరాబాదు, రంగారెడ్డి మొదలైన తెలంగాణా జిల్లాల్లో ఈ పద్ధతి కనిపిస్తుంది. ఒకప్పుడు కుల పద్ధతిగా ఉన్న ఈ ఆచారం రాను రాను తగ్గుతున్నది. ఇతర వృత్తులకు వెళ్ళకుండా ఈ కులవృత్తిలోనే ఉండేవాళ్ళు శవయాత్రలో శవం ముందు ఇలా వెళ్ళటం అక్కడక్కడ చూడవచ్చు. ఇతర జిల్లాల్లో బుడ్గ జంగాలు ఈ పద్ధతిని ఇప్పుడు ఆచరించటం లేదు.

## 13. ఖననం చేసే (బొందపెట్టే) పద్ధతి :

బుడ్గ జంగాల్లో చనిపోయిన వారిని పడుకోబెట్టటమే ఎక్కువ జిల్లాల్లో ఆచరణలో ఉంది. రాయలసీమ మొదలైన కొన్ని జిల్లాల్లో కొంతమంది శవాన్ని బొందలో కూర్చోపెట్టే విధానాన్ని కూడా ఆచరిస్తున్నారు. మూడు రోజులు శౌచం పాటిస్తారు. మూడవనాడే దిన కర్మలు చేస్తారు.

## 14. కుల పంచాయతి :

వీళ్ళలో వీళ్ళకు ఏవైనా వివాదాలు, తగాదాలు వస్తే కుల పెద్దల ముందు 'కుల పంచాయతి'లో పరిష్కారం చేసుకుంటారు. పుల్లకట్టే పద్ధతిని ఆచరిస్తారు.

## 15. కుల పెద్ద ప్రాధాన్యత :

పెళ్ళిళ్ళు చేయటంలో, దయ్యాల మొక్కులు నిర్వహించటంలో, ఆచార కర్మకాండల సందర్భాల్లో కుల పెద్ద ప్రధాన పాత్ర వహిస్తాడు.

## 16. బుడ్గజంగాల గుడిసె :

ప్రస్తుతకాలంలో పూరిగుడిసెలు, పెంకుటిళ్ళు, రేకుల ఇళ్ళు, చిన్న చిన్న RCC రూములు బుడ్గ జంగాల్లో కొందరికి నివాసాలుగా ఉన్నాయి. కాని అర్ధ చంద్రాకారంలో ఉండే మూడు వంకర్ల చిన్న గుడిసే వీళ్ళకు తరతరాలుగా కొనసాగుతూ వస్తున్న సంప్రదాయ గృహం (Model House). ఇప్పటికీ 60 శాతం బుడ్గ జంగాలు ఈ గుడిసెల్లో నివసిస్తున్నారు. ప్రత్యేకమైన ఈ గుడిసెలో నివసించటం వల్ల బుడ్గ జంగాలను కొన్ని చోట్ల 'గుడిసె జంగాలు' అని పిలుస్తారు.

★ ❋ ★

# బుడ్గ జంగాల వేట పరికరాలు





1. బోనులు, ఊదరలొట్టి, వేట కొడవళ్ళు, వలలు, చిక్కాలు, ఉరులు, గూటాలు మొదలైన వేట పరికరాలు.

2. 'పాంజీ'తో పిట్టల వేటకు వెళ్తు తున్న పస్తం రామస్వామి, బ్రాహ్మాండ్లపల్లి, నల్గొండ జిల్లా.

3. ఉడుము, ముంగీస కోసం. పుట్ట గవికి 'కడెం దోర్నం' పన్నిన దృశ్యం



# బుడ్గ జంగాల వేట దృశ్యాలు









1. ఎలుకల కన్నానికి ఊదర కొడుతున్న దృశ్యం.
2. ఉరులకు చిక్కిన ఉడత.
3. నీళ్ళల్లోకి దూకి తాబేలును పట్టుట.
4. 'దోటి గాలం'తో తాబేలును లాగుట.

# మధుమాంసాహారులుగా బుడ్గ జంగాలు



1. ఎలుకల్ని, ఉడతల్ని కాల్చుట.



2. కాల్చిన మాంసం తింటూ కల్లు తాగుట.

# బుడ్గ జంగాల కులపంచాయతీ దృశ్యాలు










1&2. కుల పంచాయతీ : పసుపు, కుంకుమ, వేప మండలు పట్టుకుని ప్రమాణం చేసి, సాక్ష్యం చెప్పుట.

3. పంచాయతిలో పాల్గొన్న కులస్థులు.

# బుడ్గ జంగాల వృత్తి వేషాలు









1. బోడి బాపనమ్మ వృత్తి వేషగాడు : మిరియాల జానయ్య, దాసరి కళానగర్, హైదరాబాదు.

2. తుపాకి రాముని వృత్తి వేషగాడు : గడ్డం పెంటయ్య, బుద్వేల్, రంగారెడ్డి జిల్లా.

3. వీధి భాగోత కళాకారులు : వాంద్రాసి చెన్నయ్య (భస్మాసురుడు), వాంద్రాసి సత్తయ్య, (శివుడు), మహబూబ్‌నగర్.

4. వాద్యగాళ్ళు : వరుసగా పొన్నకంటి సీతారాములు, పస్తం బుచ్చయ్య, వాంద్రాసి భీమసేని, మహబూబ్‌నగర్.

# బుడ్గ జంగాలు ఈత చాపలు అల్లుతున్న దృశ్యం







1. మహబూబ్‌నగర్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గృహ వసతి కోసం ధర్నా చేస్తున్న బుడ్గ జంగాలు. 'జంగం కథలు' చెప్పేవారిని, ఈత చావలు అల్లుతున్నవారిని చిత్రంలో చూడవచ్చు.
2. ఈత చాపలు అల్లుతున్న బుడ్గ జంగం స్త్రీలు.
3. తమ గుడిసెల ముందు కూర్చుని ఈత చాపలు అల్లుతున్న బుడ్గ జంగం కుటుంబాల వాళ్ళు.



# బుడ్గ జంగాల సభల దృశ్యాలు



పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి సంఘంవారు తమ అభివృద్ధికి కృషి చేసిన అప్పటి నరసాపురం ఎం.పి. శ్రీ కనుమూరి బాపిరాజుగారిని, రాష్ట్ర కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ చిలువూరి కుమార దత్తాత్రేయ శర్మగారిని సన్మానిస్తున్న దృశ్యం.



**1998**లో గోకవరం (తూర్పు గోదావరి) బుడ్గ జంగం అధ్యక్షులు మోతి పద్మనాభుడుగారు రైతులకు రుణాల వడ్డీ మాఫీ చేయాలని చేసిన నిరాహారదీక్షను విరమింప చేస్తున్న అప్పటి సహకార శాఖామంత్రి శ్రీ చిక్కాల రామచంద్రరావుగారు, స్థానిక ఎం.పి. ఎమ్మెల్యే గార్లు.

# బుడ్గ జంగాల సభల దృశ్యాలు



మెదక్ జిల్లా తూప్రాన్‌లో 12-10-2000 నాడు జరిగిన సభలో అక్కడి ఎం.ఆర్.ఓగారికి 'బుడ్గ జంగం వాణి' ని అందిస్తున్న డా॥ ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరిగార్లు.




24-9-2000న హైదరాబాదులో జరిగిన కార్యకర్తల సభలో ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం ప్రధానకార్యదర్శి డా॥ ఎన్.ఆర్. వెంకటేశం.

# ౨. బుడ్గ జంగాల భాషాసాహిత్యాలు



# ౨. బుడ్గ జంగాల భాషా సాహిత్యాలు

బుడ్గ జంగాల భాషా ప్రయోగాలు, జాతీయాలు-పలుకుబళ్ళు, సామెతలు, పొడుపు కథలు అనే అంశాలను ఇందులో చాలా క్లుప్తంగా పరిచయం చేయటం జరుగుతున్నది.

బుడ్గజంగాలు తమలో తాము మాట్లాడుకోవటానికి ఒక అసమగ్రమైన భాష ఉపయోగిస్తారు. 300 వరకు ఉన్న ఈ భాషాపదాల్లో చాలా వరకు నామవాచకాలు. దాదాపు 20 క్రియా పదాలు కనిపిస్తాయి. ఈ పరిమిత పదాల తోనే ఏర్పడిన పదబంధాలను, జాతీయాలను వ్యవహారంలో ఉపయోగిస్తుంటారు. వాక్య నిర్మాణానికి తెలుగుభాషా పదాల కలయిక తప్పనిసరి అవుతుంది. బుడ్గజంగం భాషాపదాలకు వ్యాకరణ కార్యాలన్నీ తెలుగు పదాలకు వర్తించే విధంగానే ఉంటాయి.

మొదట్లో బుడ్గజంగాలు గ్రామాల చివరన గుడిసెలు వేసుకొని నివసించేవారు. వీళ్ళ జీవన విధానాలు, కట్టుబాట్లు గ్రామీణులకు తెలియకుండా జీవించటం వీరి ప్రవృత్తి. గ్రామీణులతో సహజీవనం చేసే అవకాశం అప్పట్లో వీళ్ళకు లేదు. దూరదూరంగా, అంటుకోకుండా జీవించే రోజులవి. అందులో సిగ్గరితనం వీళ్ళ జీవలక్షణం. అందువల్ల ఊరి ప్రజలతో తెలుగులో మాట్లాడినా, తమలో తాము మాత్రం తమ భాషలో మాట్లాడుకుంటారు. వీళ్ళ భాష అసమగ్రమైంది. కాబట్టి, తెలుగు పదాలతోపాటుగా సాంకేతిక పదాలలాగా, కోడ్ మాటల్లాగా తమ భాషా పదాలను ఉపయోగిస్తారు.

బుడ్గ జంగాల భాషాపదాల్లో ఆయా కులాలకు సంబంధించిన స్త్రీ, పురుషులను గురించి చెప్పేవి ఎక్కువగా ఉన్నాయి. వీళ్ళకు వేట ఆరో ప్రాణం కాబట్టి; ప్రతిరోజు వేటాడి ఉడతలు, ఎలుకలు, ఉడుములు, ముంగీసలు లాంటి జంతువుల్ని తిన్నదాకా వీళ్ళకు గడవదు కాబట్టి, జంతువులకు సంబంధించిన పదాలు కూడ ఎక్కువగానే కనిపిస్తాయి. స్త్రీ, పురుష రహస్యాంగాలకు సంబంధించిన పదాలు, ఆహారపదార్థాలకు ఇతర నిత్యావసర వస్తువులకు సంబంధించినవి ఈ భాషా పదాల్లో ముఖ్యమైనవి.

తెలుగు పదాలను కొన్నింటిని తీసుకొని వాటికున్న సామాన్యార్థంలో కాకుండా, వీళ్ళు ప్రత్యేకార్థంలో ప్రయోగిస్తారు. సంస్కృతం, ఉర్దూ మొదలైన భాషా పదాలకు, కొన్ని ప్రత్యయాలను చేర్చి, బుడ్గ జంగాల భాషగా మార్చుకోవటం గమనించవచ్చు. వీళ్ళ భాషలో కనిపించే ప్రత్యయాలు ఏ ఇతర భాషల్లో కనిపించవు. సంస్కృతం, ఉర్దూలాంటి ఉత్తరదేశంలో పుట్టిన భాషల్లోనూ; తెలుగు, కన్నడం, తమిళం, మలయాళం వంటి దక్షిణదేశంలో పుట్టిన ద్రావిడ భాషల్లోనూ వీళ్ళు ఉపయోగించే ప్రత్యయాలు కనిపించవు. పదాల చివరన వచ్చే ఆమ్, వామ్, టమ్, కమ్, కోటి, కాశ్కం మొదలైన ప్రత్యయాలు కేవలం బుడ్గజంగాల భాషలోనే ఉండటం విశేషం.

## కొన్ని ఉదాహరణలు

**ఆ యా కులాలకు సంబంధించిన పురుషులను సూచించే కొన్ని ప్రయోగాలు :**

| | | | |
|---|---|---|---|
| 1. | తాటగాడు | = | బ్రాహ్మణుడు |
| 2. | గొంటగాడు | = | వైశ్యుడు |
| 3. | నెట్టగాడు | = | దొర |
| 4. | ఎల్కోడు | = | రెడ్డి |

| | | | |
|---|---|---|---|
| 5. | దారిగాడు | = | ముస్లిం |
| 6. | కడ్డిగాడు | = | గౌడు |
| 7. | జిడ్డెగాడు | = | యాదవుడు |
| 8. | కల్జుగాడు | = | కంసాలి |
| 9. | కీనెగాడు | = | మాదిగవాడు |
| 10. | మబ్బుగాడు | = | బోయవాడు |

**స్త్రీలింగ వాచకాలు**

స్త్రీలింగానికి 'శాంతి' అనే ప్రత్యయం ఉపయోగిస్తారు. కాబట్టి పైన పేర్కొన్న పుంలింగ పదాలకు 'గాడు'కు బదులుగా 'శాంతి' అనే పదం చేరిస్తే, అవి స్త్రీలింగాల వుతాయి.

ఉదాహరణకు తాటశాంతి, గొంటశాంతి, నెట్టశాంతి, ఎల్కుశాంతి, దారిశాంతి మొదలైనవి.

**జంతువులకు సంబంధించిన కొన్ని ప్రయోగాలు**

| | | | |
|---|---|---|---|
| 1. | ఉన్నాసిగాడు | = | ఎలుక |
| 2. | తోడ్సిగాడు | = | ఉడత |
| 3. | వలెంగాడు | = | ఉడుము |
| 4. | కురుంగాడు | = | తాబేలు |
| 5. | మండిగాడు | = | పంది |
| 6. | నర్సిగాడు | = | నక్క |

| | | | |
|---|---|---|---|
| 7. | కొక్కిడిగాడు | = | కోడి |
| 8. | మత్తెకాశ్కం | = | ఊరపిల్లి |
| 9. | ఎంట్వ | = | ముంగీస |
| 10. | మకటాం | = | గేదె, బర్రె |

| వృక్ష వాచకాలు | | | | జడ వాచకాలు | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1. | పచ్చాం | = | ఈతాకు | 1. | బోడ్సాం | = | గిన్నె |
| 2. | పుల్లాం | = | చింతాకు | 2. | తొలిప్యాం | = | అంబలి |
| 3. | శెత్రాం | = | చేను | 3. | గింజాం | = | రూపాయి |
| 4. | శాకాం | = | కూర | 4. | మీటాం | = | ఉప్పు |
| 5. | జోడాలు | = | జొన్నలు | 5. | కన్కె | = | మందు |

| 'కోటి' ప్రత్యయం చేరిన కొన్ని రూపాలు, | | | | 'అట్కం' ప్రత్యయం చేరిన కొన్ని రూపాలు | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1. | అశ్కోటి | = | మాంసం | 1. | కరించాట్కం | = | చంపటం |
| 2. | ఇక్రకోటి | = | చెట్టు | 2. | గీతాట్కం | = | ఏడ్వటం |
| 3. | చక్రకోటి | = | రొట్టె | 3. | దైపాట్కం | = | కొట్టటం |
| 4. | శిర్పకోటి | = | పిల్ల | 4. | పచ్చాట్కం | = | దొంగతనం |
| 5. | పొట్లకోటి | = | గర్భం | 5. | మెస్కాట్కం | = | తినటం |

తెలుగు పదాలనే గ్రహించి వేరే అర్థంలో ప్రయోగించిన రూపాలు

| | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| 1. | నలుపు | = | సారాయి | 6. | కుచ్చుగాడు | = | పోలీసువాడు |

2. కిట్టిపోవు = చనిపోవు 7. జిడ్డెడు = యాదవుడు

3. కారంకోట్లు = మిరపకాయలు 8. తెల్లాం = రూపాయి

4. అంటుకొను = తీసుకొను,దొంగిలించు 9. పుల్లాం = చింతాకు

5. సెర్గువాం(చెరుగు+ వాం)= చేట 10. కొరంజిగాడు = ఎరుకలవాడు

**సంస్కృత పదాలనుంచి ఏర్పడిన రూపాలు**

1. కురుంగాడు = తాబేలు('కూర్మ' శబ్దం నుంచి)
2. కొక్కిడిగాడు = కోడి('కుక్కుట' శబ్దం నుంచి)
3. మ్యాసాం = మేక('మేష' శబ్దం నుంచి)
4. సీలకోటి = స్తనం ('క్షీర' శబ్దం నుంచి)
5. యాగ్రకోటి = పెద్దపులి ('వ్యాఘ్ర' శబ్దం నుంచి)

**అన్యదేశాలైన హిందుస్తానీ పదాలనుంచి ఏర్పడిన రూపాలు**

1. సొన్నాం = సొమ్ములు (సోనా = బంగారం)
2. లాకడాం = కర్ర (లకడీ)
3. గాస్వాం = గడ్డి (ఘూంస్)
4. పత్రకోటి = రాయి (పత్తర్)
5. పాణ్ణాలు = నీళ్ళు (పానీ)

**జాతీయాలు - పలుకుబళ్ళు**

1. కబ్బిగన్న కారిగాడు = గుట్టు తెలిసినవాడు (కబ్బి = గుట్టు, కారిగాడు = బుడ్గజంగం)

2. నత్తెల్లప్ప తుపాకి = వ్యర్థం (పిట్టలదొర వేషం వేసే నత్తి ఎల్లప్ప చేతిలోని పేలని కర్ర తుపాకి)

3. పచ్చబంగ్ల = పోలీస్ స్టేషన్

4. మీ ఇంట్ల అంబలి = కూతురు, పెళ్ళికాని పిల్ల

5. మందు త్రాగుట = చనిపోయిన తమ వ్యక్తి దయ్యంకాగా - భూతవైద్యుని దగ్గరకు వెళ్ళి, తమ దయ్యాన్ని చంపించుకోవటం.

6. కల్లు పోయించుట = నిశ్చితార్థం, పూలుపళ్ళు

7. ఇరమానుచెక్క = ఇంటికోడలు (అంటుకోసం తెచ్చిన ఇతర వృక్షపు చెక్క)

8. బిరాడు = బుడ్గ జంగాల గూడెం

9. మ్యార = ఒప్పందం ప్రకారం వరుడు అత్తమామలకు సేవలు చేస్తూ, వారి దగ్గర ఉండి జీవించటం.

10. పూట = వధూవరులు ఒకరికొకరు ఇష్టపడి, తమ ఇంటిని చక్కదిద్దుకునే దాకా - మధ్యవర్తి అయిన కులపెద్ద దగ్గరే ఉండి జీవించటం.

**వేటకు సంబంధించిన కొన్ని జాతీయాలు**

1. పొలం తిరుగు = వేటకు వెళ్ళు

2. బండ తోడ్సిగాడు = తోడ్సిగాడు అంటే ఉడత. గుట్టకు ఉండే

ఉడత. ఎంత ప్రయత్నించినా దొరకదు. మొండి మనిషిని ఇలా అంటారు.

3. ఉర్లపడ్డ తోడ్సిగాడు = ఉచ్చుల్లో పడ్డ ఉడత = చేతికి చిక్కినవాడు

4. గుట్టగవ్వి = అంతులేనిది

5. కర్కోటిగాని కొండ్లు = ఎండ్రకాయవ్రేళ్ళు = ఎదురుచెప్పే మాటలు

6. ఏదుకొయ్య = ముళ్ళపంది కొయ్య = ప్రాణాంతకం

7. తుక్కేసుకున్నట్లు = కన్నం దగ్గర ఊదరపెడితే, ఎలుకలు పొగ రాకుండా మట్టిని అడ్డంగా పెట్టుకోవటాన్ని 'తుక్కు' అంటారు. తమను తాము రక్షించుకునే విషయంలో ఈ జాతీయాన్ని ఉపయోగిస్తారు.

8. ఆ ఇల్లు ఎల్కపెంట = లంకంత ఇల్లు

9. వలెంగాని నాల్కె = 'వలెంగాడు' అంటే ఉడుము. పాముకున్నట్లు ఉడుముకు రెండు నాలుకలుంటాయి. 'మాటమార్చుట' అనే అర్థంలో దీనిని వాడతారు.

10. కురుంగాడు పూడుకున్నట్లు = తాబేలు బురదలో కూరుకోవటం. ఏదీపట్టించుకోకుండా ఉండే సందర్భంలో ఈ జాతీయం ఉపయోగిస్తారు

**బుడ్గ జంగాల భాషలో కొన్ని వాక్యాలు**

1. కతకు మంకాల్లు గుల్పయి కంచికాలు, కెందలు, మ్యాత ఏగిస్తుంద్రు నాపుకో పింకెడా. (ఊళ్ళో బుడ్గజంగం కథాగానం చేయగా విని, గ్రామస్థులు అభిమానంతో డబ్బులు, వస్త్రాలు ఇస్తున్నారు. అన్నం పెడుతున్నారు. తీసుకోరా పిల్లవాడా!)

2. పుల్లాకోట్లు బంగిజెయ్యకు మంకాడు జానొచ్చి నెట్కిస్తే కశాదం. (చింతకాయలు దొంగతనంగా తెంపుకోకు. భూస్వామి వచ్చి చూశాడంటే అపాయం.)

3. ఈ మట్టిగాడు గొట్టెపాసు శిర్పకోటీ! వొల్తుకు జాన్తే కసింపుతడు. (ఓ పిల్లా! ఈ ఇంటి యజమాని పిసినారివాడు. అడుక్కోవటానికి వెళ్తే తిడతాడు)

4. కారిగాల్ల నాయంల నలుపు, సిదానం మెస్కితే ఎల్కోడు కార్కుడు దైపుతడు. నాగన అని ముందే పల్కాటం జేసిండు. (బుడ్గ జంగాల కుల పంచాయతిలో సారాయి, కల్లు తాగామంటే పటేలు (రెడ్డి) చాలా కోపిష్టివాడు. కొడతాడు. కల్లుసారాయి పెట్టకుండా ఏదో కూర్చొని పంచాయతి మాట్లాడుకోమని ముందే హెచ్చరించాడు)

5. మత్తెల మెటిపిల్లు, జివ్టాలు నచ్చిలేవు. పింకె శావిడి, తొలిప్యాం అంటుకొస్తే మెస్కుతున్నాం. (ఇంట్లో బియ్యం, జొన్నలు ఏవీ లేవు. పిల్ల (అమ్మాయి) అడుక్కొస్తే అన్నం తింటున్నాం. అంబలి తాగుతున్నాం.)

## బుడ్గ జంగాల సామెతలు

**1. తనువుకు నూరేండ్లు - తగువుకు వెయ్యేండ్లు**

బుడ్గజంగాల జీవన విధానంలో కుల పంచాయతులు చాలా ముఖ్యమైన స్థానాన్ని ఆక్రమిస్తాయి. వీళ్ళల్లో ప్రతి విషయానికి పంచాయతే. తిట్టుకుంటే పంచాయతీ, కొట్టుకుంటే పంచాయతీ. వివాహ సంబంధాలకు సంబంధించి, వృత్తిలో వచ్చిన తగాదాలకు సంబంధించి, వేటాడి తెచ్చిన జంతువుల మాంసాన్ని పంచుకోవటానికి సంబంధించి కుల పంచాయతులు జరుగుతూనే ఉంటాయి. అన్నదమ్ములు, ఆలుమగలు, బావాబామ్మరుదులు, చుట్టపక్కాల మధ్యలో వచ్చే తగాదాలు - ఇలా ప్రతి అంశం పంచాయతికి మూలం. కులపెద్ద (నాయగాడు)కు పుల్లలు ఇచ్చుకోవటం, వాజ్మూలాలు (సాలు) చెప్పుకోవటం; పెద్దలు తీర్పు చెప్పి డబ్బు రూపేణా, అంక్షల రూపేణా శిక్షలు విధించటం; వచ్చిన డబ్బుతో కల్లుసారాయి తాగటం వీళ్ళలో పరిపాటి. అర్థం లెకుండా, అనవసరంగా, మూర్ఖంగా మాట పట్టింపులకు పోయి, ఇల్లు గుల్ల చేసుకుంటారు. ఒకసారి వివాదం జరిగి కులపెద్ద దగ్గరికి వస్తే, అప్పుడే వీలుకాని పక్షంలో ఆ పంచాయతిని ఆరు నెలలకో, సంవత్సరానికో వాయిదా వేసుకునే పద్ధతి వీళ్ళలో ఉంది. తనువుకు కాల పరిమితి నూరేండ్లయితే తగువుకు అంటే కుల పంచాయతిని మాట్లాడుకోవటానికి వెయ్యేండ్లు కాల పరిమితి అని వీళ్ళ అభిప్రాయం.

**2. ఎలుక తొంటి కాడ ఏడునూర్లు పెట్టుకున్నట్లు.**

వేటకు వెళ్ళి తెచ్చిన మాంసం పంచుకోవటంలో ఒకనికి ఎలుక తొంటి (Back leg piece) ఎక్కువగా వెళ్ళింది. అది మనసులో పెట్టుకుని, తర్వాత వివాదపడి, కుల పంచాయతిలో ఏడునూర్ల రూపాయలు నష్టపోయిన ఉదంతమే ఈ సామెతగా రూపుదిద్దుకున్నది.

**3. పామునైనా పట్టవచ్చు - పచ్చటి కొమ్మ పట్టరాదు.**

కుల పంచాయతిలో సాక్ష్యం పలికేటప్పుడుగానీ, సాక్షిలేని సందర్భాల్లో వాదో, ప్రతివాదో జరిగిన సంగతిని చెప్పేటప్పుడు,కుల పెద్దలు సత్యం పలకాలని పచ్చకొమ్మ పట్టించి ప్రమాణం చేయిస్తారు. అలా పచ్చటి కొమ్మ పట్టుకుని ప్రమాణం చేసేముందు కుల పెద్దలు హెచ్చరించిన మాటే ఈ సామెతగా నిలిచింది.

**4. కులం విడిచిన పక్షి లేదు - వనం విడిచిన కోతి లేదు.**

**5. కులం కుతికల బంటి - సముద్రం మోకాళ్ళ బంటి.**

**6. కులం కన్ను గద్దకన్ను.**

పై మూడు సామెతలు బుడ్గ జంగాలకు కులం పట్టింపు మీద, కులం కట్టుబాట్ల మీద ఎంతటి పట్టుఉన్నదో తెలియజేస్తున్నాయి. అన్నివేళల కులాచారాలే వాళ్ళకు శిరోధార్యాలు. కులం విడిచి వేరుగా జీవించలేరనే విషయం ఈ సామెతల వల్ల తెలుస్తున్నది.

**7. కూర్చుంటే కులం - లేస్తే పర్దేసి.**

'పర్దేసి' అంటే ఇతర తెగలవాడు అని అర్థం. ఎరుకల, యానాది, చెంచు మొదలైన ఇతర తెగల వాళ్ళను 'పర్దేసి' అంటారు. ఆ తెగల వాళ్ళు కూడా బుడ్గ జంగం కులం వాణ్ణి 'పర్దేసి' అంటారు. వేరువేరు తెగలైనప్పటికి, వీళ్ళలో పరస్పరం తగాదాలు వచ్చినప్పుడు గానీ, లేకపోతే ఏదో కులం వాళ్ళ పంచాయతీ జరుగుతున్నప్పుడుగానీ, ఇతరకులస్థులు పాల్గొన్నప్పుడుగానీ, అందరూ సమానమైన గౌరవాలుఇచ్చి పుచ్చుకుంటారు. పంచాయతీలో కూర్చున్నప్పుడు అందులో ఎన్ని తెగలవాళ్ళున్నా సమానంగా వాళ్ళ మాటకు గౌరవం ఉంటుంది. పంచాయతీ తర్వాత లేచి ఎవరి దారి వారు వెళ్ళినప్పుడు తిరిగి ఎవరి కులం వారికి గుర్తుకు వస్తుంది. ఎవరి కట్టుబాట్లు వారివి. ఎవరి ఆచారాలు వారివి. కుల పంచాయతి విధానం మాత్రం వీళ్ళందరిదీ ఒకటే. ఈ నేపథ్యంలో ఈ సామెత ఏర్పడింది.

**8. ఉడుము తోకతో ఉడుమే కట్టుబడ్డట్లు.**

వేటలో ఉడుము దొరికితే దాని తోకతో మెడకు బంధం వేసి బుట్టలో వేసుకుంటారు. ఆ బంధంతో ఉడుము ఉరకలేకపోతుంది. 'తాను తీసుకున్న గొయ్యిలో తానే పడ్డట్లు' 'తాను మాట్లాడిన విషయానికి తానే కట్టుబడవలసి వచ్చినట్లు' అనే అర్థంలో ఈ సామెత వ్యవహారంలో ఉంది

**9. కంజిమెస్కే కారిగాడు - దత్తు పెట్టే దారిగాడు.**

కారిగాడు అంటే బుడ్గ జంగం, దారిగాడు అంటే మహమ్మదీయుడు, పోలీసువాడు. కంజిమెస్కే అంటే దెంగి తిన్నాడు. దత్తు అంటే అల్లరి అని అర్థాలు. నైజాం కాలంలో ఎక్కువగా ముస్లిములే పోలీసులుగా ఉండేవారు. ఒక పోలీసువాడు బుడ్గజంగం దగ్గర తన సమస్య కోసం వనమూలిక తీసుకోవటమో, మంత్రం వేయించుకోవటమో, యంత్రం కట్టించుకోవటమో చేశాడు. కాని అది అనుకున్నట్లు ఫలించలేదు. కొన్ని రోజులకు బుడ్గజంగం కనిపిస్తే ఆ పోలీసు అల్లరి చేశాడు. ఈ సంఘటనే ఒక సామెత అయింది.

**10. నీవు పాడిందానికి నేను విన్నదానికీ సరిపోయింది. తల ఊపినందుకు తాంబూరా పెట్టిపో.**

భిక్షుక గాయకుడు తాంబూరా పట్టుకుని కథాగానం చేశాడు. తల ఊపించాడు. తగినంత దానం దొరుకుతుందని ఆశించాడు. కాని అతనికి ఆశాభంగం ఎదురయ్యింది. పాట విన్న దొరగారు దానం, ధర్మం చేయటం అటుంచి, పైగా తల ఊపినందుకుగాను తాంబూరా పెట్టిపొమ్మని పేచీపెట్టాడు.

## బుడ్గ జంగాల పొడుపు కథలు

1. బక్క కుక్కకు - బండెడు పేగులు (డింకి = బుడగ లేక మద్దెల)

2. గుండెకు ఒత్తుకో - భుజానికెత్తుకో.
అడ్డం పెట్టుకో - గడ్డం పట్టుకో.
గొంతెత్తి పాడతాడు - గొంతుదాకా పెడతాడు.
(తాంబూరా లెక  శారద)

3. కడుపులో మూడే పేగులు
చెయ్యి తాకితే
కయ్యిమంటాయి. (తాంబూరా తీగలు)

4. వ్రేలు చుట్టుకుని
తలలు గొట్టుకుని
అవి మొత్తుకుంటే
అందరికి ముద్దు. (కథాగానం చేసేటపుడు బొటన వ్రేలుకు
వేసుకుని  వాయించే రెండు కంచు అందెలు)

5. కంచు గొంతు
ఖంగుమనే (తాళాలు)

6. లోపల గొంతులు
మీదన దొంతులు
రాగం దీస్తే
రాజులు మెత్తురు (హార్మోనియం)

7. పదిమంది వేటకు పోయి ఒక జీవాన్ని దెచ్చి పంచుకుంటే
ఒక్కొక్కదానికి ఒక తొడ రావాలి. (ఎంద్రకాయ)

8. ఇంటికి ముగ్గురు మూర్తులు (మూడు వంకర్లు)
(బుడగ జంగాల గుడిసెకు ఉపయోగించే అర్థ
చంద్రాకారంలో గుండ్రంగా వంచి కట్టిన కఱ్ఱలు.)

9 ఇంటికొక్క రాజు, (కావడిదెబ్బ)
(గుడిసె విప్పి, మోపులుగా కట్టి, మరో ఊరికి
మోసుకెళ్ళటానికి కావడిగా ఉపయోగించుకునే
వెదురుదబ్బ.)

10. సరసర కత్తులు - సన్నపు కత్తులు
లంజెల వలపులు - గంధపు చెక్కలు
(ఈతాకులు, ఈతాకులతో అల్లిన పట్టె, అపట్టెతో కూర్చిన ఈత చాప).

ఈ విధంగా బుడ్గజంగాల భాషా సాహిత్యాలను గురించి టూకీగా ఇక్కడ వివరించటం జరిగింది. ఇంకా వివరంగా చదవాలంటే డా॥ ఎన్.ఆర్.వెంకటేశం రచించిన "బుడ్గజంగాలు" అనే గ్రంథంలో చూడవచ్చు.

బుడ్గ జంగాలు ఈ భాషా పదాలను తమ వ్యవహారంలో ఎప్పటి నుంచి ఉపయోగిస్తున్నారో తెలియదు. కుల పెద్దల్ని అడిగినప్పుడు తరతరాల నుంచి ఈ భాషను వాడుతున్నట్లుగా చెప్పారు. బుడ్గజంగాలు ఇతర తెగల వాళ్ళతో, కులం వాళ్ళతో కలిసిమెలసి నివసించడంవల్ల, ఈ భాషాపదాల ప్రయోగం కొంతవరకు ఆ తెగల వాళ్ళలోనూ గమనించవచ్చు.

★ ❋ ★

# 3. బుడ్గ జంగాల ఇంటిపేర్లు

సిరిగిరి పేర్ల చిత్తారి పరదక్షిణ అలేటి కల్లెం పర్వతం సదుల
వద్ది మాదెన కడెం బల్గోల
అనరాసి పెల్లూరి చర్ల కప్పెర ఊర ప్రసాదం గగనం
గంధం కడమంచి కొండపల్లి కొమారి యడవల్లి
అయితి సంకు వేముల చింతల గడ్డం ఒంటెద్దు బోడపుడితి
పానేటి నర్యూటి సిరిసాల చిరుకూరి కర్రె మోతి
రుద్రాక్షల కళ్యాణం నామాల నేరగంటి ఉప్పు పర్రె
గోట్రు భారతకవిదుడ్డు దుద్దుర్కి తోట బూతం పాక
నాగుల కడమంచి మిరియాల కోడిగంటి
పచ్చంగత్తుల కోండ్రపొన్నకంటి గంజాయి మాకిరెడ్డి కడిమి
ఇంగువ ఊబిది కిన్నెర కోదండం గోనెగంతల
కనుగురి శేర్ల శివరాత్రి చెలిమండ్ల కాళహస్తి పుట్టా
కర్రి చెన్నూరి నిదానకవి తూర్పాటి తాటికొండ
ముగ్గు పర్తం జంపెల్లి అశ్వ పస్తం దూపం రేవెల్లె ఎదురుగట్ల రాచూటి
తూర్లపాటి గానుగ గుప్ప కళ్యాణ వాకదండం సిరువాటి
కటుమూరి వాండ్రాసి గుండ్ల పానపుట్టి
బోడపుర్తి నిండుకొండ పూరోత్రం పదిరె దేవరపల్లి
సంకుల వీరణాల కిరీటం
ఈర్నాల చర్లపల్లి ఇప్ప గంధోట్టి ఈర్ల వేర్నపల్లి కోళ్ళ కళ్యాణి
అవదూత కొమారికొట్టి ప్రదక్షిణ శివదేవుని
గంట సనమండ్ల శేజెర్ల
వినుకొండ జంపిల్లి ఉప్పు
తూరపాటి వీర్లపల్లి రాసునూరి పాటిమీది పసుపులేటి మూలి

# 3. బుడ్గ జంగాల ఇంటిపేర్లు

ప్రపంచంలో మానవుని అస్తిత్వం కోసం, గుర్తింపుకోసం పేరు కావాలి. అలాగే సమాజంలో అతి చిన్న భాగం (ప్రైమరీ యూనిట్) కుటుంబమే. కుటుంబం కొందరు వ్యక్తుల సమూహం. కుటుంబ సమూహాలు కలిస్తే సమాజం అవుతుంది. కాబట్టి సమాజంలో గుర్తింపు కోసం కుటుంబానికి కూడ ఒక పేరు కావాలి. అదే ఇంటిపేరు. ఒకే ఇంటి పేరు కలిగిన కుటుంబాలు ఎన్నో ఉన్నప్పటికీ, వాళ్ళ గోత్ర నామం మాత్రం ఒక్కటే ఉంటుంది. అనేక కారణాలవల్ల ఇంటిపేరు మారినా గోత్రం మారదు. రకరకాల సంఘటనల కారణంగా, సందర్భాల కారణంగా ఇంటి పేర్లు లేక గృహనామాలు ఏర్పడుతూ ఉంటాయి. ఎక్కువగా గ్రామ నామాలే ఇంటి పేర్లవుతాయి. కొన్ని సందర్భాల్లో ప్రసిద్ధమైన వ్యక్తుల పేర్లే ఆ తర్వాత ఇంటి పేర్లుగా మారతాయి. ఆయా వ్యక్తులు చేసిన పనుల బట్టి ఇంటి పేర్లు ఏర్పడుతుంటాయి. మతం, కులం, వృత్తి మొదలైన అంశాల ప్రభావంతో కూడ ఇంటి పేర్లు ప్రచారంలోకి వస్తాయి.

బుడ్గ జంగాలకు ఇంటి పేర్లు ఉన్నాయి. కాని గోత్రనామాలు లేవు. ఇంటి పేర్ల ఆధారంగానే వీళ్ళల్లో పెళ్ళి సంబంధాలు కుదురుతుంటాయి. మొదట్లో కేవలం ఐదు ఇంటి పేర్లవాళ్ళే ఉండేవారట. సిరిగిరి, విభూతి, ప్రసాదం, రుద్రాక్షల, కప్పెర అనేవే ఆ ఐదు ఇంటి పేర్లు. ఇప్పుడు ఇంచుమించు 150 ఇంటి పేర్ల వరకు ప్రచారంలో వున్నాయి.

తెలంగాణాలో ఉన్న ఇంటిపేర్లే చాలా వరకు రాయలసీమలో కనిపిస్తాయి. కోస్తా ఆంధ్రాలో కొన్ని ప్రత్యేకమైన ఇంటిపేర్లు వ్యవహారంలో ఉన్నాయి. కర్నాటకలో,

మహారాష్ట్రలో స్థిరపడ్డ బుడ్గ జంగాల ఇంటి పేర్లు కూడ తెలంగాణాతో కలుస్తాయి. వీళ్ళంతా తెలంగాణా నుంచి వలసపోయి ఇటు కర్నాటకలో, అటు మహారాష్ట్రలో స్థిరపడటమే ఇందుకు కారణం.

తెలంగాణా ప్రాంతంలో వినిపించే ప్రత్యేకమైన ఇంటి పేర్లలో ఊర, ఒద్ది (వద్ది), కొమాండ్లపల్లి, కోళ్ళ, గుప్ప, పాటిమీది, పొన్నకంటి, రాసునూరి మొదలైనవి చెప్పుకోదగ్గవి. రాయలసీమకే పరిమితమైన ఇంటి పేర్లలో తోట, కాళహస్త్రి, చిటిముటి, బాదిగ, అవదూత, దేవరపల్లి మొదలైనవి ఉన్నాయి. కోస్తాంధ్ర ప్రాంతంలో ఎంతో వైవిధ్యముంది. పాత ఇంటి పేర్లకే కొత్త ఉచ్చారణ వచ్చింది. కడమంచి – కటమంచి, నిడుగొండ – నిండుగొండ, సిరిగిరి – చిరుకూరి, తూర్పాటి – తూరపాటి, బైల్పాటి – బైలపాటి, మోతె – మోతి, విభూతి – ఊబిది – ఉబ్బిడి మొదలైనవి ఉచ్చారణలో మార్పులు వచ్చిన ఇంటి పేర్లు. అలా కాకుండా ఈ ప్రాంతానికే పరిమితమైన ఇంటి పేర్లు కూడ చాలా ఉన్నాయి. ఇంగువ, ఉప్పు, మోతు, మోటూరి, గోటూరి, బోడపుర్తి, కిరీటం, దుడ్డు, నామాల, పచ్చగంతల, గోనెగంతల, బద్రాక్షి, శివరాత్రి మొదలైనవి కోస్తాంధ్రాలో కనిపించే ప్రత్యేకమైన ఇంటి పేర్లు.

సాధారణంగా ఇంటిపేర్లు ఇతర కులాల్లో కూడ కనిపిస్తాయి. గ్రామనామాల ఆధారంగా ఏర్పడిన ఇంటి పేర్లలో ఈ విధానాన్ని గమనించవచ్చు. ఒక కులానికి ఉన్న సాంస్కృతిక నేపథ్యం అధారంగా ఏర్పడిన ఇంటి పేర్లు ఆ కులానికి ప్రత్యేకమైనవిగా ఉంటాయి. ఇలాంటి ఇంటి పేర్లు ఆ కులాన్ని ఇతర కుల లక్షణాల నుంచి వేరు చేసి చూపిస్తాయి. బుడ్గ జంగాలకున్న ఇంటి పేర్లలో యడవల్లి, మిరియాల, కల్లెం, అల్లం, మోతె, గంధం, గగనం, కొండపల్లి మొదలైనవి ఇతర కులాల్లో కూడ వ్యవహారంలో ఉన్నాయి. మిగతా ఇంటి పేర్లలో బుడ్గ జంగాలకే ప్రత్యేకమైనవి చాలా వున్నాయి. విభూతి, ప్రసాదం, కప్పెర, రుద్రాక్షాల, సిరిగిరి, సిరిసాల మొదలైన ఇంటి పేర్లు పూర్వకాలంలో వీళ్ళు శైవమతాన్ని అవలంబించారని తెలియజేస్తాయి. ఒంటెద్దు, గుర్రాన, మేకల, అశ్వ అనే ఇంటి పేర్లు బుడ్గజంగాలు జానపద కళలతో గ్రామీణుల మెప్పుపొంది,

ఈ జంతువుల్ని దానంగా పొంది, పెంచుకున్న కాలంలో వచ్చి ఉంటాయి. ఇలాగే ప్రతి ఇంటి పేరు వెనక ఒక కథ ఉంటుంది పరిశీలిస్తూ వెళితే మత సాంస్కృతిక జీవనగతులు బయట పడతాయి.

## అకారాది క్రమంలో బుడగ జంగాల ఇంటి పేర్లు.

1 అయితి
2 అయితి రెడ్డి
3. అల్లం
4. అవదూత
5. అశ్వ, అశ్వ
6. ఆలేటి
7. ఇంగువ
8. ఇప్ప, విప్పా
9. ఈప్తి, ఈబిది, విభూతి, ఈబూతి
10. ఈర్నపల్లి
11. ఈర్నాల, వీరణాల
12. ఈర్ల
13. ఉప్పు
14. ఉబ్బిడి
15. ఊబిది, విభూతి
16. ఊర
17. ఎదురుగట్ల
18. ఎర్రపెల్లి
19. ఒంటెద్దు
20. కంకణాల
21. కటుమూరి
22. కడమంచి, కటమంచి
23. కడిమి
24. కడెం, కడియం
25. కనుగురి
26. కప్పెర, కప్పెరి
27. కర్నకోట
28. కర్రె, కర్రి
29. కల్లెం, కళ్యాణం, కళ్యాణ, కళ్యాణి
30. కాన్పాటి
31. కాళహస్తి
32. కిన్నెర, కిన్నిరి, కిందర

33. కిరీటం
34. కొండపల్లి
35. కొండూరి
36. కొమాండ్లపల్లి
37. కొమారి
38. కోంద్ర
39. కోడిగంటి
40. కోదండం
41. కోళ్ళ
42. కోసన, కొసనా
43. గంగిపల్లి
44. గంజాయి
45. గంట
46. గంధం, గందోటి
47. గగనం
48. గడ్డం
49. గానుగ
50. గిత్త
51. గుండ్ల
52. గుప్ప
53. గుర్రాన, గురాని
54. గోటూరి, గోట్రు
55. గోనెగంతల, గోనిగింతల
56. చర్ల, చేర్ల, శేర్ల
57. చర్లపల్లి
58. చింతల
59. చిత్తారి
60. చిరుకూరి (సిరిగిరి)
61. చెన్నాపల్లి
62. చెన్నూరి
63. చెలిమండ్ల, సనమండ్ల
64. చేజెర్ల, శేజెర్ల
65. జంపెల్లి, జంపిల్లి, జాంపల్లి, జంపోలు
66. జీడిమెట్ల
67. టేకి
68. డొక్క
69. తలమంచి
70. తాటికొండ
71. తూర్లపాటి
72. తూర్పాటి, తూరపాటి

73. తోట
74. దుడ్డు, దుడ్డి
75. దుడ్డుకూరి, దుడ్డుర్కి
76. దూపం
77. దేవరపల్లి
78. నడుపూరి, నడికూరి
79. నరికూటి, నర్క్యూటి
80. నాగుల
81. నామాల
82. నిడుగొండ, నిందుకొండ, నిరుకొండ
83. నిదానకవి
84. నూనె
85. నేర్లగంటి, నేరగంటి
86. పంచాది
87. పచ్చగంతల, పచ్చంగత్తల
88. పత్తి
89. పత్రి
90. పదిరె
91. పరదక్షిణ, ప్రదక్షిణ
92. పర్తం
93. పర్రె
94. పర్వతం
95. పసగాడ
96. పస్తం
97. పసుపులేటి
98. పాక
99. పాటిమీది
100. పానపు (పొవ్వాణపు)
101. పానుగంటి
102. పానేటి
103. పాలపాటి
104. పుట్టా
105. పూరోత్రం
106. పెల్లూరి
107. పేర్ల, ప్యార్ల
108. పొన్నకంటి
109. పొవ్వాణం
110. ప్రసాదం

111. బల్గోల, బల్గొల
112. బూతం, బోతం
113. బోడపుడితి
114. బోడపుర్తి, బోడపర్తి
115. బొమ్మిల, బొమ్మల
116. బైల్పాటి, బైలపాటి
117. బద్రాక్షి, బద్రాసి
118. భారతకవి, బార్తకయి
119. మాకిరెడ్డి
120. మాదెన, మాదెనం, మాదెన్ని, మాదీని
121. మామిడి
122. మిరియాల
123. ముగ్గు
124. మూల (మువ్వల)
125. మేకల, మ్యాకల
126. మోటం, మొగుటం
127. మోడెం
128. మోతికురి, మోత్కూరి
129. మోతు
130. మోతె, మోతి
131. యడవల్లి
132. యలవర్తి, యలమర్తి
133. రాచూటి, రాసూటి, రాచుట్టి
134. రాసునూరి
135. రుద్రాక్షల
136. రేవెల్లె, రేవెల్లి, రేవెళ్ళ
137. వద్ది, ఒద్ది
138. వనం
139. వాంద్రాసి, ఆంద్రాసి, వానరాసి, ఆనరాసి
140. వాకదండం
141. వినుకొండ, ఇనుకొండ
142. విభూతి, ఈప్తి
143. వీర్లపల్లి, ఈర్లపల్లి
144. వేముల, ఏముల

145. వేర్నపల్లి

146. శివదేవుని

147. శివరాత్రి

148. సంకు, సంకుల

149. సదుల

150. సల్లా, చల్లా

151. సిరిగిరి, శ్రీరిగి

152. సిరివాటి, సిరువాటి, సిరుపాటి

153. సిరిసాల

154. సోమదాని

(బుడగ జంగాల ఇంటి పేర్ల గురించి వివరంగా చదవాలంటే, విశ్లేషణ చదవాలంటే, 'బుడ్గ జంగాలు' గ్రంథంలో చూడండి.)

★ ❊ ★

# 4. బుడ్గ జంగాల పాటలు









# 4. బుడ్గ జంగాల పాటలు

జానపద కళా ప్రదర్శకులైన ఇతర తెగల వారికంటే, ఇతర కులాల వారి కంటే బుడ్గ జంగాల జీవన చిత్రం చాలా విశాలమైంది. జీవన పరిధి చాలా విస్తృతమైంది. ఎంతో వైవిధ్యభరితమైంది. జానపద వృత్తి గాయకుల్లో ఒక్కొక్క కులం వారు ఒక్కొక్క కళా ప్రదర్శన చేయటం చూస్తాం. కాని, బుడ్గ జంగాలు మాత్రం ఎన్నో జానపద కళల్ని తరతరాలుగా ప్రదర్శిస్తూ వస్తున్నారు. ఆ కళలు కాల గర్భంలో కలిసిపోకుండా, వాటిని నిలబెట్టుకుంటూ వస్తున్నారు. జంగం కథలు, తోలుబొమ్మలాటలు, వీధి భాగోతాలు మొదలైన సామూహిక ప్రదర్శన కళలు; తుపాకి రాముడు, బోడి బాపనమ్మ (బ్రాహ్మణ వితంతువు), ఏక తార పంతు మొదలైన ఏకవ్యక్తి ప్రదర్శన కళలు బుడ్గజంగాలు ప్రదర్శించే కళల్లో ముఖ్యమైనవి. బుడ్గజంగాల కళాజీవితం, వ్యక్తిగత జీవనవిధానం, ప్రస్తుత దుర్భర పరిస్థితులు మొదలైనవన్నీ కలగలిసి ఈ పాటల్లో వినిపిస్తాయి. కనిపిస్తాయి.

ఇందులో మొత్తం *18* పాటలున్నాయి. రెండు మూడు పాటలు బుడ్గజంగం భాషా పదాలతో మిళితమై ఉండటం విశేషం. ఈ పాటల్లో వృత్తులకు సంబంధించినవి ఉన్నాయి. గుడిసె, వేట, కుల పంచాయతులు, చాపలల్లటం, శెంద్ర మొదలైన అంశాలకు సంబంధించినవీ ఉన్నాయి. చదువు ప్రాముఖ్యత, కాలానుగుణమైన నూతన దృష్టి, ప్రగతి బాటలో నడవాలనే భావనలు చోటుచేసుకున్న పాటలూ ఉన్నాయి.

పాటల వివరాలు :

1. మేలుకొలుపు పాట
2. వేట పాట
3. కులపంచాయతి పాట
4. కొత్తదారి
5. గుడిసెపాట
6. ఈతకమ్మ పాట
7. శెంద్ర పాట
8. పిలుపు
9. వృత్తి పాట
10. బతుకు పాట
11. చూడుచూడు చూడరా !
12. చదువు పాట
13. చెప్పలేదంటనక పొయ్యేరూ !
14. సాగుదామోరన్న !
15. వెలుగు బాట
16. వినతి పాట
17. కదలి రండి !
18. మహిళా మండలి పాట

## 1. మేలుకొలుపు పాట

ఈ పాటలో బుడ్గ జంగం సంఘం ప్రచారాంశాలు చోటుచేసుకున్నాయి. అభివృద్ధి నిరోధకమైన ఆచారాలను వదలిపెట్టి, కాలానుగుణమైన కొత్త దారులను వెదకాలని సంఘం పిలుపునిస్తున్నది. బుడ్గ జంగాలు తరతరాలుగా చేస్తున్న భిక్షాటన మానాలి. 'దేహీ' అని యాచించే ఆ దీనమైన పరిస్థితి పోవాలి. భిక్షమడుగుతూ అందరితో తిట్లు తినే హీనమైన జీవన స్థితి మారాలి. గౌరవనీయమైన పనిని చేపట్టి బతకాలి. పూర్వకాలంలో లాగా కథాగానంతో పాటు మూలికలు ఇవ్వటం, మంత్రాలు వేయటం,యంత్రాలు కట్టటం, జాతకాలు చెప్పటం లాంటి పనులు సాగటం లేదు. ఈ వృత్తులకు సమాజంలో ఆదరణ లేదు. ఈత చాపలల్లుకుని బతుకుదామంటే భూస్వాములు, గౌండ్లవారు ఈత కమ్మను కోయనివ్వటం లేదు. బుడ్గ జంగం స్త్రీలు ఇళ్ళ వెంట వెళ్ళి అన్నం అడుక్కోవటం; హోటళ్ళ దగ్గర, బస్సు డిపోల దగ్గర, బజార్లలో ధర్మం చేయండని డబ్బులడుక్కోవటం మానివేయాలి. చిన్న పిల్లలకు గిన్నెలిచ్చి భిక్షాటనకు పంపవద్దు. చదువుకునే వయసులో వారిచేత ఈత చాపలు అల్లించవద్దు. వాళ్ళను బడికి పంపాలి. వాళ్ళను చక్కగా తీర్చిదిద్దాలి. చదువుకునే పిల్లలకు పుస్తకాలు ఉచితంగా ఇస్తారు. స్కాలర్‌షిప్పులు ఇస్తారు. హాస్టళ్ళలో వసతి దొరుకుతుంది. చదువు ముగిశాకా రిజర్వేషన్‌లో ఉద్యోగం దొరికే అవకాశాలుంటాయి.

బుడ్గజంగాల సంప్రదాయంలో వరసేవా వివాహాలున్నాయి. వరుడు పెళ్ళయ్యాక అత్తమామల వెంట ఉండి, వారికి సేవలు చేస్తూ జీవించాలి. ఈ పద్ధతిని 'మ్యార' అంటారు. లేకపోతే అత్తమామల వెంటకాకా ఒక కులపెద్ద వెంట ఉండి జీవనం సాగిస్తూ, భార్యను బాగా చూసుకుంటున్నాడని నిరూపించుకోవాలి. ఈ పద్ధతిని 'పూట' అంటారు. ఈ రెండు మ్యార, పూట పద్ధతుల్లో భార్యను బాగా చూసుకుంటున్నాడనిపిస్తే - అప్పుడు ఆ దంపతులు వేరుగా బతకవచ్చు. ఇష్టమున్న చోట నివసించవచ్చు. ఈ పద్ధతులు ఏర్పడిన కాలంలో అందరికీ బాగానే ఉండవచ్చు. కానీ, రాను రాను వరునికి బాధల్ని తెచ్చిపెట్టాయి. అత్తమామల వేధింపులకు గురికావలసి వచ్చింది. కొన్ని సందర్భాల్లో భార్యాభర్తలు ఇష్టపడుతున్నా వాళ్ళ తల్లిదండ్రుల పట్టింపుల వల్ల పిల్లల

దాంపత్యాలు విడాకులకు దారి తీస్తాయి. మ్యార, పూట పద్ధతులు నేడు వెర్రితలలు వేస్తున్నాయి. అందువల్ల ఈ పద్ధతులను విడనాడాలని ఇందులో సంఘం పిలుపునిస్తున్నది.

బుడ్గజంగాలకు అభివృద్ధి నిరోధకమైన మరో విధానం కుల పంచాయతులు. ఏ చిన్న వివాదానికైనా కుల పంచాయతులు తప్పనిసరిగా జరుగుతాయి. కులపెద్దలే వృత్తి నాయగాళ్ళు. ఈ వివాదాలు తీర్చటంలో పెద్దరికాన్ని దుర్వినియోగం చేస్తారు. కల్లు, సారాయి తాగటం - కోళ్ళు, మేకలు తినటం పరిపాటి. రోజుల తరబడి ఈ కుల పంచాయతులు జరుగుతాయి. వీటి వల్ల వాది ప్రతివాదులు ఇళ్ళు గుల్ల చేసుకుంటారు. అప్పులపాలవుతారు. చితికిపోతారు. కాబట్టి ఈ కులపంచాయతుల పద్ధతి మారాలని సంఘం నొక్కి చెబుతున్నది.

'అన్ని కులాల వాళ్ళు అభివృద్ధిలోకి వస్తున్నారు. మరి మనమెందుకు అభివృద్ధిలోకి రావటంలేదో ఆలోచించండి! అందరూ మనుషులే! వాళ్ళలాగా మనం ఎందుకు బాగుపడకూడదు?, అని సంఘం ప్రశ్నిస్తున్నది.

అభివృద్ధికి ఆటంకంగా నిలిచిన ఆచారాలను పాటించకుండా జీవన వికాసానికి అవసరమైన కార్యక్రమాలతో ప్రగతి బాటలో నడవాలని ఈ పాటలోని సందేశం.

ఈ పాటలో బుడ్గ జంగం భాషా పదాలు వాడటం జరిగింది. బుడ్గజంగాల భాష సమగ్రమైన భాషకాదు. పరిమితమైన పదాలే ఉన్నాయి. తెలుగు భాషలో వీళ్ళ భాషా పదాలు మిశ్రమం చేసి మాట్లాడతారు.

*పాటలో ప్రయోగించిన బుడ్గ జంగం భాషా పదాలకు అర్థాలు :*

కారిగాల్లు = బుడ్గజంగాలు ; మంకాల్లు = కులేతరులైన గ్రామీణులు ;
కసింపులు = తిట్లు ; యాస్కానికి = భిక్షానికి ; జొన్కోకు = వెళ్ళకు ;
నాగన్నా = వద్దు ; శిర్పగా = బుడ్గ జంగమా ! (పిల్లవాడా!) ; మత్తె = ఇల్లు ;
వాల్కోక = కూర్చోక ; కనిక + ఒంట్లకు = కనికొంట్లకు = మందులివ్వటం, జాతకాలు చెప్పటం అనే పనులకు

కశాదాలు = అపాయాలు ; పచ్చాముకు = ఈత ఆకుకు ; దైపులు = దెబ్బలు;
శావిడికి = అన్నానికి ; కంచ్మాలకు = డబ్బులకు ;
శాంతుల = బుడ్గజంగం స్త్రీల ; పల్మ్వాటాలు = భిక్షం అడుక్కోవటం ;
పింకెలు = పిల్లలు ; బోడ్మాలు = గిన్నెలు (అడుక్కోవటానికి) ;
ఏఁ య్యుకు = ఇవ్వకు ; కెందలు = బట్టలు ; జానొస్తే = వస్తే ,
అంటుకుంటారు = తీసుకుంటారు ; మ్యార = పెళ్ళయ్యాకా వరుడు అత్తమామల వెంటే ఉండి వారికి సేవలు చేస్తూ జీవించటం

పూట = వరుడు కులపెద్ద వెంట ఉండి, భార్యను కష్టపెట్టకుండా బాగా చూసుకుంటూ జీవించటం. తోడ్సిగాడు = ఉడత ; ఉన్నాసిగాడు = ఎలుక ;

చింతాకు జీడ్యాకు = పులుసుకోసం చింతాకు, పొయ్యిలోకి కట్టెలు, కూరకు ఉడతనో, ఎలుకనో, చేపలో తేవటం మొదలైన సేవలు చేయటం అని అర్థం.

మెస్కి = తిని ; వెనకేసుకొను = అల్లుడు కూతురును సరిగా చూసుకోక కష్టపెడుతున్నాడని, ఆమె తల్లిదండ్రులు ఆమెను కాపురానికి పంపకుండా తమ ఇంట్లోనే ఉంచుకోవటం.

పుల్లగట్టు = కొట్లాట, వివాదం జరిగినప్పుడు, తనకు జరిగాన అన్యాయాన్ని కులపంచాయతి ద్వారా పరిష్కరించమని అగ్గిపుల్ల సైజులో ఒక కట్టెపుల్లను గాని, వెండి లేక బంగారు వస్తువును గాని కుల పెద్ద చేతిలో పెట్టటం.

నలుపు = సారా ; సిదానం = కల్లు ; నెట్కి = చూడు, గమనించు ;

మట్టిగాల్లు = కులేతరులైన గ్రామీణులు ; గూసు = అవమానం ;

## 1. మేలుకొలుపు పాట

పల్లవి : కారిగాల్ల సంఘము కదిలొచ్చెరో
దారిచూపి బతకమని పిలుపిచ్చెరో ।కారి।

చరణం: 1. మంకాల్లా కసింపులూ - మనన్యాస్టా పెట్టగా
యాస్కానికి జాన్కోకు - నాగన్నా శిర్పగా
మత్తెలోన వాల్కోక - మంచిపనికి పూనుకో కారి ।

2. కనికొంట్లకు కశాదాలు - పచ్చాముకు దైపూలు
శావిడికీ కంచ్కాలకు - శాంతుల పల్కాటాలు
బంద్ జెయిరా జంగామా - బతుకుదాము సంఘానా ॥కారి।

3. పింకెల శేతులకూ - బోడ్యాలేగియ్యకూ
పచ్చామూ కట్టాలూ - శేతుల సుట్టియ్యకూ
సాలెకేసి సదువు జెప్పి - సక్కనోల్ల జేతామూ ।కారి।

4. సదువుకునే పింకెలకూ - పుస్తకాలు కంచికాలూ
శావిడి కెందాలిచ్చి - విద్యా బుద్ధులు జెప్పి
కొల్యుకు జానొస్తె వాన్ని - కోరి అంటుకుంటారు ।కారి।

5. మ్యారదిప్పి పూటకేసి - తోడ్సిగాడున్నాసిగాడు
చింతాకూ జీడ్యాకూ - మెస్కీ ఎన్కేసుకొని
అల్లుండ్లను గోసబెట్టె - ఆలోచన మానాలి కారి ।

6. కొట్లాడీ పుల్లగట్టి - నలుపూ సిదానంబెట్టి
ఇల్లంతా గుల్లైతే - మల్లా అప్పుల్ల బడీ
చితికీపోతవ్ నెట్కీ - బాగుపడీ రాపైకి ॥కారి।

7. మట్టిగాల్లు మనుషులే - మనం గూడ మనుషులమే
వాల్లేమో గట్లియిరీ - మనమెందుకు గిట్లయితిమి
గూసాయే మనకులమూ - గుర్తెరిగీ సాగుదాము కారి

## 2. వేటపాట

బుడ్గజంగాల ప్రధాన వృత్తి కథా గానం చేయటం. ఉపవృత్తి ఈత చాపలు అల్లటం. వృత్తి ఏదైనా ప్రవృత్తికి సంబంధించింది వేటాడటం. ఇప్పుడు అభయారణ్యాలు, ప్రభుత్వ చట్టాలు వచ్చాకా వీళ్ళకు వేటకు వీలు చిక్కటం లేదు కానీ, అంతకు ముందు కాలంలో వేట వీళ్ళకు ఆరోప్రాణం. ఆ రోజు కథాగానన్నైనా మరవవచ్చునేమోగానీ, వేట మాత్రం మరిచే వీలులేదు. వేటతో వీళ్ళకు అవినాభావ సంబంధం ఏర్పడింది. ఉడతలు, ఎలుకలు, ఉడుములు, ముంగీసలు, పిల్లులు, పందులు మొదలైన వాటిలో ఏదో ఒకటి తినటానికి రోజూ కావాలి. జంతువుల మనస్తత్వం బాగా తెలిసినవాళ్ళు. రుతువులకు అనుగుణమైన అవగాహన కలిగిన వాళ్ళు. జంతు సంచార జ్ఞానం, ఉనికి నిర్ధారణ ఎరిగిన వాళ్ళు. వేటకు సంబంధించిన పరికరాలన్నీ తయారు చేసుకుంటారు. వలలు, ఉరులు, గూటాలు, బోనులు, మీటులు మొదలైన పరికరాలను పన్నటంలో నేర్పరులు.

ఈ పాటలో బుడ్గజంగాల మాంసాహార ప్రియత్వం వర్ణించబడింది. అన్ని పనుల కంటే వీరికిష్టమైన పని వేటకు వెళ్ళటం. బుడ్గజంగం వేటలో ఉన్నప్పుడు చింతలు, వంతలు మరిచిపోతాడు. వేటాడి రకరకాల జంతువుల్ని తెచ్చుకు తిన్నా, అతనికి తృప్తి తీరదు. చిన్న చేపలు, పెద్ద చేపలు, ఎండ్రకాయలు, ఎలుకలు, ఉడతలు, ఉడుములు, తాబేళ్ళు, నక్కలు, భూత పిల్లులు తింటాడు. అంతేగాక ఊర పిల్లులు, మేకలు, గొర్రెలు, పందులు ఊళ్ళోనే అతనికి అందుబాటులో ఉంటాయి. జంతువులనే కాక పిట్టల్ని కూడా వదలడు. బుడుముంక, లావంక, గోరింక మొదలైన పిట్టల్ని పట్టి తింటాడు. అతని ఇల్లు గుడిసె. కాని కొండగవ్వి అతనికి బంగళాలాంటిది. అతని దగ్గర ఉన్న ఉరులే అతనికి సిరులు. వలలు మొదలైన వేట పరికరాలే అతనికి సంపదలు – అని ఈ పాటలో వర్ణించటం జరిగింది.

బుడ్గ జంగాల భాషా పదాలు చేర్చి ఈ పాట రాయటం జరిగింది. ఆ పదాలకు అర్థాలిలా ఉన్నాయి.

అశ్కోటి = మాంసం; కారిగా = బుడ్గజంగమా! శికారి = వేట;

బికారిగా = భిక్షగాడా!; తోడ్సిగాడు = ఉడత; వలెంగాడు = ఉడుము;

ఎంట్వ = ముంగీస; కురుంగాడు = తాబేలు; నర్సిగాడు = నక్క;

భూత కాశ్కం = భూత పిల్లి; మత్తెకాశ్కం = ఊరపిల్లి; కొక్కిడిగాడు = కోడి;

మండిగాడు = పంది; మ్యాసాము = మేక;

ఎల్కపెంట = ఎలుకలు ఉండే చోటు, కన్నం

తుక్కు = పొగ రాకుండా కన్నంలోపల ఎలుకలు అడ్డంగా మట్టిని మెత్తుకోనటం

లొట్టి = ముంత

ఊదరపెట్టు = ముంతలో ఎండిన ఆకులు, గడ్డీగాదర నింపి, దాని అడుగుభాగాన చిన్న రంధ్రం చేసి, అందులో నిప్పంటించిన దూది పెట్టి, ఎలకల కన్నానికి లొట్టిని మూతివైపు అమర్చి, చిన్న రంధ్రం దగ్గర నోటితో ఊదటం. (పొగ కన్నంలోపలికి వ్యాపించి ఎలుకలు చస్తాయి.)

లట్టి = ఊదరకొట్టిన తర్వాత, లొట్టి తీసేసి, ఎలుక పొక్క వెంట బారెడు బారెడు దూరంలో గోతి తీయటాన్ని 'లట్టి' అంటారు.

## 2. వేటపాట

పల్లవి : అశ్కోటికి ఎంత బాధరా ! ఓ కారిగా !
శికారంటె చింత లేదురా ! బికారిగా !

చరణాలు: 1 కాల్వలోని చిన్న చేప - మడుగులోని పెద్ద చేప
గవ్విలోని ఎంద్రకాయ - తొవ్వి తొవ్వి పడ్తెకూడ ॥అ॥

2 తుక్కుదీసి ఊద్రగొట్టి - లొట్టిదీసి లట్టిలేసి
ఎల్క పెంట తొవ్వుకున్న - ఏమి చాలదయ్యెనీకు ॥అ॥

3. చెట్టుమీది తోడ్సిగాడు - పుట్టలోని వలెంగాడు
గట్టు గవ్విలోని ఎంట్వ - పట్టుకున్న చాలదయ్యే ॥అ॥

4. తెట్టె మీద ఉండుంబట్టి - బాయ్ల కురుంగాని గొట్టి
నర్సిగాడు భూతకాశ్కం - నానా జంతూల దిన్న ॥అ॥

5. నీళ్ళలోని బుడుముంక - పొదల్లోని లావంక
తొర్రలోని గోర్రింక - ప్రతిపిట్టా నీదింక ॥అ॥

6. మత్తెకాశ్కం లేకున్నా - కొక్కిడిగాడు చిక్కకున్న
మండిగాడు మ్యాసాలు - ఉండనే ఉన్నాయి నీకు ॥అ॥

7 కొండ గవ్వి నీకు బంగ్ల - ఉరులే నీకున్న సిరులు
వలలే నీ సంపదలు - వదలవుగా నీ వేటలు ॥అ॥

## 3. పంచాయతి పాట

బుడ్గజంగాల్లో 'కుల పంచాయతి' ఒక పటిష్టమైన కట్టుబాటు. ఏ తగాదా వచ్చినా కులంలో మాట్లాడుకోవలసిందే. వాదవివాదాలు, కొట్లాటలు, రంకు సమస్యలు, చుట్టపక్కాల జగడాలు, విడాకులు - ఇలా ఏవైనా కుల పెద్దల సమక్షంలో తీర్మానం అవుతాయి. గ్రామాధికారుల వద్దకు, పోలీసుల వద్దకు, కోర్టులకు వెళ్ళకుండానే కులంలోనే తగాదాలు వెంటనే పరిష్కారమవుతుండేవి. తర్వాతి కాలంలో కుల పెద్దలు వృత్తిన్యాయగాళ్ళుగా మారి, కల్లుసారాలకు, కోళ్ళు మేకలకు అతిగా ఖర్చు చేయటం వల్ల, వాదిప్రతివాదులు ఆర్థికంగా చితికిపోయి, అప్పుల పాలై అలమటించే పరిస్థితులు ఏర్పడినాయి. పైస పైస కూడపెట్టుకుంటే కుల పంచాయతి మహమ్మారి గుల్ల చేసి పోతున్నది. అందువల్ల 'ఖర్చు లేకుండా సర్ది చెప్పించుకుంటే బాగుంటుంది కానీ, కల్లు సారాలు పెట్టటం అనర్థదాయకం' అని ఈ పాటలో ప్రబోధించటం జరిగింది.

**కొన్ని పదాలకు అర్థాలు :**

నాయాలు = కుల పంచాయతులు

నాయగాల్లు = కుల పంచాయతీలో విచారించి తీర్పు చెప్పే కుల పెద్దలు.

ముచ్లీక = ముచ్చిలీక = పుల్ల = తగాదా వచ్చినపుడు ప్రతి వాది మీద ఆరోపణ చేస్తూ అగ్గిపుల్లంతటి కట్టెపుల్లను కుల పెద్ద చేతిలో పెట్టటం.

కొాడి = తప్పుపట్టుట (కొాడి + లు = కొాళ్ళు)

## 3. పంచాయతి పాట

పల్లవి : నాయాలు నీ కొద్దురా నారిగా!
మాయల్లో పడబోకురా కారిగా! నా।

అనుపల్లవి: మాయదారి నాయగాల్లు - మేయ వట్రి పైసలన్నీ
చెప్పీన వినకుంటె - చెడీ పోతవ్ కొడ్కా ।నా॥

చరణం: 1. పిల్లా నిచ్చిన కాడ తప్పదాయె నాయాము
పిల్లాను పట్టినంక తప్పదాయె నాయాము
మరిచిపోయి నాయాము - చేసుకోండి సాయము ॥నా।

2. చిన్న చిన్న మాటకాడ - ఎందుకయ్య కయ్యాము
కొట్లాడిన ప్రతిసారి - ఎందుకయ్య నాయాము
కలిసుండీ మీరంత - చెయ్యండి నెయ్యాము ॥నె

3. ముచ్లీక ఇచ్చుకోని - ముంచుకోకు నీ కొంప
కాళ్ళు పట్టి కాళ్ళు పట్టి - కూలిపోకు నీవింక
శరణార్తి అన్నవంటె - తప్పులేదు నీవంక ।నా

## 4. కొత్తదారి

ఈ పాటలో నాటి పరిస్థితుల్ని, నేటి పరిస్థితుల్ని పోల్చుకుని ఒక బుడ్గజంగం తోటి కులస్థునితో బాధ పడటం కనిపిస్తుంది. 'భిక్షం దొరకటం లేదు భార్యాబిడ్డలకు తిండి లేదు. ఇన్ని రోజులు చిన్న గుడిసెల్లో నివసించాము. స్థిరమైన ఇల్లు ఉండాలనే ధ్యాసే లేదు. ఇప్పుడు పిల్లలకు ఇల్లులేదు. నిలువ నీడ లేదు. ముందు చూపు లేక ఒక ఇల్లు కూడా సంపాదించలేక పోయాను.' అని బాధ పడుతున్నాడు.

పూర్వం రోజుల్లో జొన్నరొట్టే - చేపల పులుసు, అన్నంలోకి ఉడతల చారు దొరికేది. ఏమీ లేకున్నా పచ్చడి మెతుకులైనా నోటికి రుచించేవి. 'అమ్మా! అయ్యా!' అని అడిగితే ఎవరైనా ఓ ముద్ద వేసేవారు. ఈనాడు ఎంత మొత్తుకున్నా కూడు దొరకని పరిస్థితి ఏర్పడింది.

పల్లెల్లో, పట్టణాల్లో భిక్షమడిగితే తిట్టటం, కొట్టటం జరుగుతున్నది. ఈ పరిస్థితుల్లో మన పిల్లలు చదువుకుంటే, ప్రభుత్వం సహాయం చేస్తుంది. మనకు చీకూ చింతా ఉండదు. కాబట్టి ఇప్పుడైనా కళ్ళు తెరిచి పిల్లల భవిష్యత్తు తీర్చి దిద్దుదాం - అనేది ఈ పాటలోని సారాంశం.

**పదాలకు అర్థాలు :**

ఒల్తు = భిక్షం ; శాంతి = భార్య ; శిర్పగాల్లు = పిల్లలు

శావిడి = అన్నం ; మత్తె = ఇల్లు ; సొక్కాలు = జొన్నలు

శక్రకోటి = రొట్టె ; కాజాలు = చేపలు ; శాకాము = కూర

మెట్పిల్లు = బియ్యము ;మ్యాత = అన్నము ; తోడ్సిగాడు = ఉడత

దైపు = కొట్టు ; పింకెలు = పిల్లలు

## 4. కొత్తదారి

పల్లవి : ఒల్తులేదు పంతుగో
రేపెట్లనో ?
శాంతి శిర్పగాల్లకైన
శావిడెట్లనో ? ॥ఒ॥

చరణం :1. వంకర్ల మత్తెలోన - వొదిగీ ఉన్నామపుడు
ఊరూరు తిరిగి తిరిగి - ఉత్తచేయి బత్తలాయె
శిర్పగాల్లకిల్లులేక - చింతలోన మునిగిపోతి
నిల్వనింకె నీడ లేదు - తిననింకె శావిడి లేదు
ముందు చూపు లేకనేను - మంద బుద్ధినైపోతి ॥ఒ॥

2. సొక్కాల శక్రకోటి - కాజాల శాకాము
మెట్పిల్ల మ్యాతాకు - తోడ్సిగాని శాకాము
కారమింత నూరుకున్న -నోరాడె రోజు రోజు
అయ్యా ! అమ్మా ! అంటే - అన్ని దొరికె ఆనాడు
కుయ్యో ! మొర్రో! అన్నా - కూడు దొరుకదీనాడు ॥ఒ॥

3. పల్లెల్ల వొల్తడిగితె - పక్కలిరుగదన్న వత్రి
పట్నంల వొల్తుకెల్తె - పట్టుకొని ద్రైపవత్రి
పింకెలన్న చదువుకుంటె - పికరు లేని బ్రతుకౌను
సర్కారు సాయంతో - సాగిపోవు సదువంతా
ఇప్పుడన్న కండ్లుదెరిచి - తెలివి దెచ్చు కుందాము ॥ఒ॥

## 5. గుడిసెపాట

బుడ్గజంగాలకు ప్రస్తుతం పూరిళ్ళు, పెంకుటిళ్ళు, రేకుల ఇళ్ళు నగరాల్లో కొందరికి ఆర్‌సిసి ఇళ్ళు ఉన్నప్పటికీ 'అత్యధిక సంఖ్యలో ఇంకా గుడిసెల్లోనే మగ్గుతున్నారు. వీళ్ళ గుడిసె అద్భుతమైన నిర్మాణ కళకు నిదర్శనం. ఒక మెకానిక్ స్కూటర్నో, కారునో టకటకా విప్పి, చకచకా మళ్ళీ ఫిట్ చేస్తాడు. వీళ్ళు వీళ్ళ గుడిసెను విప్పటంలో, నిర్మించటంలో అలాంటి నేర్పును ప్రదర్శిస్తారు. గుడిసె నిర్మాణంలోని ప్రతి వస్తువుకు ఒక పేరు పెట్టారు. వంకర కట్టెలు (3), బల్గోలలు (10), అస్తర్లు (పై నుంచి వేసే చాపలు–2), బగుల్ రిక్కలు(2), మాడు శివ్వలు (5), మాడు చాప(1), వెంట్రుకల తాళ్ళు, నారతాళ్ళు మొదలైన వస్తువులతో ఇంటిని నిర్మిస్తారు. ప్రతి వస్తువును ఒక పేరుతోగుర్తించటం వల్ల గుడిసె విప్పటంలోనూ, తిరిగి నిర్మించటంలోనూ సౌలభ్యం ఏర్పడటమే కాక, వేగం కూడా సిద్ధిస్తుంది. 'బుడ్గజంగాలు' గ్రంథంలో 'వస్తు సంస్కృతి' అనే చాప్టర్‌లో బుడ్గ జంగాల ఇళ్ళ గురించి ఇంకా వివరంగా చూడవచ్చు.

ఈ 'గుడిసె పాట'లో గుడిసె నిర్మాణం, గుడిసెకూ, బుడ్గజంగానికీ ఉన్న అనుబంధం, అతనికి గుడిసెపై ఉన్న మక్కువ వర్ణించబడింది

## 5. గుడిసె పాట

పల్లవి : మూడు వంకర్ల గుడిసెరా - నాది
ముచ్చటైన చాప మిద్దెరా - ముచ్చటైన చాప మిద్దెరా మూడు

చరణం: 1. మూడు వంకర్లు పాతి - కుంటెన శివ్వలు జేర్చి
వెంట్రుక తాళ్ళను చుట్టి - బల్గోలలు బంధించి
వెన్క మూడు చాప వేసి - పక్క బగుల్‌రిక్క కట్టి
అస్తర్లు మీదంగ వేస్తే - అదే నా గుడిసౌనురా ॥మూడు॥

2. ముందు నుంచి చూస్తేనేమొ - నిఁడు- చందమామ సగం రూపు
వెనక నుంచి చూస్తే అదియే - కనక గిరి అనిపించు
మూడు కాలాలలోనా - నీడ నిచ్చు ఆ గూడు
కావిడి దబ్బుంటె చాలు - కదులుతుంది ఊరూరు ।మూడు॥

## 6. ఈతకమ్మ పాట

బుడ్గ జంగాలకు ఈత చాపలల్లటం ఉప వృత్తి. ప్రధానవృత్తి ఏదైనా ఈత చాపలల్లటం కులస్థులందరూ చేసే పనే. ఈత చాపలల్లటంలో వీళ్ళు మంచి నేర్పరులు. గుడిసెల ప్రక్కన ప్రతి ఒక్కరికి ఎండిన ఈత రెబ్బలు నిలువ ఉంటాయి. తండ్రి, తల్లి, పిల్లలు అందరూ తలా ఓ పని చేసి, చాపను తయారు చేస్తారు. ఇదంతా ఓ కుటీర పరిశ్రమ. ఈత చాప చౌకగా అమ్ముడవుతుంది కాబట్టి, వీళ్ల శ్రమకు తగ్గ ఫలితం లభించదు.

ఈత వనాల్లోకి వెళ్ళి పొడుగాటి ఆకులున్న ఈత రెబ్బలను కోయాలి. రెబ్బకు రెండు వైపులా చీరి,కట్టెనుంచి ఆకులను వేరు చేసి, కట్టెను పారేసి, ఆకులను మాత్రమే గ్రహించాలి. బుడ్గజంగాలు వదిలేసిన ఈత కట్టెలను ఎరుకల వాళ్ళు తీసికెళ్ళి బుట్టలు అల్లుతారు. ఎరుకలవాళ్ళకు ఈత కట్టెలు కావాలి. కాబట్టి వాళ్ళు ఈత రెబ్బలను కోసి, చీరి కట్టెలను తీసుకుని, ఆకులను వదిలేస్తారు. ఆ వదిలేసిన ఆకులను 'బుడ్గ జంగాలు తీసుకెళ్ళి' చాపలు అల్లుకుంటారు. ఇలా బుడ్గజంగాలు, ఎరుకల వాళ్ళు ఈత రెబ్బలను పరస్పరం వినియోగించుకుంటారు.

ఈత రెబ్బలు ఎండిన తర్వాత,రెబ్బనుంచి ఒక్కొక్క ఆకును వేరు చేస్తారు. ఈ పనిని 'కమ్మ రెబ్బుట' అంటారు. తర్వాత 'కమ్మచీరుట' ఉంటుంది. ప్రతి ఒక్క ఆకులో మడతను చీరితే రెండు ఆకులు వస్తాయి. అలా చీరిన ఆకులను నీళ్ళు చల్లి, బాగా కలిపి మెత్తబరుస్తారు. అప్పుడు ఆ ఆకులు పట్టె అల్లటానికి సిద్ధమవుతాయి. పట్టెను మొత్తం 13 ఆకులతో అల్లుతారు. ఎడమకు 6 ఆకులు,కుడివైపు 6 ఆకులు ఉంటాయి. మధ్యలో ఒక ఆకు అటునుంచి ఇటు, ఇటు నుంచి అటు తిరుగుతుంటుంది. ఆకు తిరిగినప్పుడల్లా మధ్యలో కొత్త ఆకును ముగిసిపోతున్న ఆకుమీద కూరుస్తుంటారు. ఇలా పట్టె అల్లుతూ పోతారు. పట్టె అల్లిన తర్వాత 3 అడుగుల వ్యాసార్థంతో పట్టెను వృత్తాకారంలో మలిచి

'కూర్పటాకుల' తో మరో పట్టెతో జోడించి, ఆ పట్టె ఈ పట్టెల అంచుల్లో ఉన్న రెప్పలను కూరుస్తారు అలా 20 పట్టెలు కూర్చాక వృత్తాకారంలో ఉన్న చాపను మధ్యలో అడ్డంగా కోస్తారు అప్పుడది 20 పట్టెలతో 6 అడుగుల పొడుగుతో చాప ఆకారంలోకి వస్తుంది. తర్వాత 7 ఆకులతో చిన్నపట్టె అల్లాలి ఒక వైపు మూడాకులు. మరో వైపు మూడాకులు,మధ్యలో ఒక ఆకు అటూ ఇటూ తిరుగుతుంటుంది ఆకు తిరిగినప్పుడల్లా ఒక కొత్త ఆకును అయిపోతున్న ఆకు మీద పెట్టి అల్లాలి ఈ చిన్నపట్టెను 'కల్బారి' అని అంటారు. పెద్ద పట్టెకు వాడేది కాస్తా పొడవున్న ఆకులు కాగా 'కల్బారి' కి వాడేది పొడవు తక్కువగా ఉన్న ఆకులు. దీన్ని 'కల్బరాకు అంటారు. ఇప్పుడు ఈ కల్బారిని చాప నాల్గు కడలకు బార్డరుగా మడిచి దబ్బడంతో కుట్టాలి కూర్పటాకులనే దారంగా వాడతారు. పట్టె అల్లటానికి ఉపయోగించే ఆకులు సింగిల్ ఆకులు. కూర్పటాకులు మడత చీరకుండా అలాగే ఉంచిన డబుల్ ఆకులు గట్టిగా ఉండి కూర్చటానికి,కడలు కుట్టటానికి పనికొస్తాయి. అంచులగుండా చాప త్వరగా చినిగి పోకుండా,ఎక్కువ కాలం మన్నటానికి కల్బారితో కడలను కుట్టటంతో చాప నిర్మాణం ముగుస్తుంది. అమ్ముకోవటానికి రెడీ అవుతుంది.

ఈ పాటలో బుడ్గజంగం తన భార్య ఎంకమ్మను కమ్మకోయటానికి వెళదామని పిలుస్తున్నాడు. భూస్వాములు,కల్లుతీసే గౌడులు కమ్మ కోయనివ్వరు. తిడతారు, కొడతారు. కమ్మ కత్తి గుంజుకుంటారు. కాబట్టి వాళ్ళ కంటపడకుండా వెళ్ళి మంచి మంచి రెబ్బలు కోసుకొని తెద్దామని చెబుతున్నాడు. కమ్మను ఇంటికి తెచ్చి రెబ్బి, చీరి, అల్లి, కూర్చి చాపను తయారుచేసి, అమ్ముకుని ఆ దబ్బుతో గంజో, అంబలో తాగి హాయిగా ఉందామని భార్యను ఉత్సాహపరుస్తున్నాడు.

**కొన్ని పదాలకు అర్థాలు :**

మంకాడు = కులేతరుడు ; కార్కుడు = కోపిష్టివాడు

నెట్కిస్తే = చూస్తే ; దైపుతాడు = కొడతాడు

## 6. ఈతకమ్మ పాట

పల్లవి : కమ్మా కోతాము రావే
ఎంకమ్మ ఈత
కమ్మా కోతాము రావే ।క।

అనుపల్లవి : గడ శివ్వ దీసుకొని– కమ్మాల కత్తిగట్టి
రెడ్డోని వొంపులాకు – గుట్టాగ మనం బోయి ।క।

చరణం :1. మంకాడు కార్కాడు – నెట్కిస్తే దైపుతాడు
కమ్మకత్తి గుంజుకొని – మనల్నెల్ల గొడ్తాడు
జెప్ప జెప్ప కోస్తుంట – రప్ప రప్ప మోపు గట్టు ॥క॥

2. మంచి మంచి రెబ్బాల – అంది అంది నేన్గొస్తా
చీరేసీ ఆరేసీ – అంతెత్తు మోపుగట్టు
కస్తీగా ఎత్తుకొని – తెస్తాను ఇంటికి ।క।

3. కమ్మ రెబ్బి చీరి పెడ్త – పట్టె అల్లి సాపగూర్చు
కల్బరాకు అల్లి సాప – కడలన్నీ పెట్టేస్తా
అంగట్లో అమ్ముకుని – హాయిగ ఉందాము ।క

## 7. శెంద్ర పాట

పల్లవి · శెంద్రా పోకండయ్యా – మీరు
శెంద్రా పోకండయ్యా
వాంద్రాసి భీమయ్య – ఓ
కోంద్ర రామయ్య ॥శె॥

చరణం : శెంద్రలకు మీరు పోతె
చెడుతారు పిల్లలయ్యా
చదువూ సంధ్యలు లేక
చవటాలవుతారయ్యా ॥శె॥

బుక్కెడు మెతుకుల కోసం
భూముల్దిగ పోకండీ
ఇక్కడ పని చేసుకున్న
ఏమిలోటు రాదండి ॥శె॥

పిల్లలు చదివిన నాడే
పేరుంటది మీదెప్పుడు
తరతరాలు బాగుపడుతు
తరలుతారు మునుముందుకు ॥శె॥

---

శెంద్ర = చెంద్ర = వలస

## 8. పిలుపు

పల్లవి : సంఘమందున సాగుదామూ
సంతసమునా రారయా సంఘ

చరణం :1. బడుగు బతుకుల బుడగ జంగం
బడుగు బతుకుల బుడగ జంగం
ఇడుమలన్నీ కృంగగా
హంగు మీరగ రంగులీనగ
అంతరంగము పొంగగా సంఘ

2. వివాహమందు వివాదమందు
వివాహమందు వివాదమందు
జనన మరణములందునా
కులమె శరణం కుటిల హరణం
కూడి ఉందము రారయా ।సంఘ।

3. త్యాగ నిరతిని సాగి ప్రగతిని
త్యాగ నిరతిని సాగి ప్రగతిని
బాగు చేయగ దీక్షగా
ముందు తరములు అందుకొనగా
సఫలములు సాధించగా సంఘ।

4. ఐక్య భావము అంది కులమూ
ఐక్యభావము అంది కులమూ
సౌఖ్య పదమున ఒప్పగా
ధరను హైదరబాదునందున
వెంకటేశము చెప్పగా ।సంఘ।

## 9. వృత్తి పాట

పల్లవి బుద్ధ జంగాలం - మేము
బుద్ధ జంగాలం
యుగయుగాల చరిత్రను
తరతరాలు పాడగలం బుద్ధ

చరణం: 1. తాంబూరా మీటుకుంటూ
అందెలనూ వేసుకుంటూ
బుద్ధలతో వంత పాడి
గొంతెత్తి కథలు పాడి
జనులను ఆనందపరచి
జేజేలను పొందగలం । బుద్ధ

2. బాలనాగమ్మ కథ
బల్గురి కొండయ్య కథ
బొబ్బిలి ఆ వీరుల కథ
బాలరాజు ప్రేమకథ
ఆకథ ఈ కథ అనక
అన్ని కథలు చెప్పగలం బుద్ధ

3. వీరుల కథలే చెబితే
విన్నవాళ్ళు పొంగుతారు
కరుణరసము కథ పాడితె
కంటనీరు నింపుతారు
నవరసాలు చిప్పిల్లగ
వివరంగా చెప్పగలం బుద్ధ

# 10. బతుకు పాట

పల్లవి : జానపదా కళలనెపుడు
ప్రాణప్రదామని తలచే
బుడగా జంగామ వినవయా - అయ్యయ్యో
బడుగూ బతుకాయెనీదయా - ఓరయ్యో! జానపదా

చరణం: 1. జంగము కధలే వింటూ
పొంగిరి జనులానాడూ
భంగమాయె వృత్తి నీదయా - నేడింకా
మింగమెతుకు లేనెలేదయా - నీకింకా ।జానపదా।

2. తుపాకి రాముని మాటలు
హాస్యపు వ్యంగ్యపు బాటలు
ఆ మాటలు ఇపుడు లేవయా - హాస్యానికి
ఆదరణడుగంటె చూడయా - వేషానికి జానపదా।

3. బోడిబాపనమ్మ మాట
సోడిగాని నవ్వులాట
చూసేవాళ్ళెవ్వరిపుడయా- నీకళలను
కాసే వాళ్ళెవ్వరిపుడయా- నీ బతుకును జానపదా।

4. తోలు బొమ్మలాట కొచ్చె
వీధి బాగోతాల జూసె
ఆ గుంపులు నేడు ఏవయా - లేవు లేవు
అంతట్టైము ఎవరికుందయా - లేదు లేదు జానపదా।

5. సినీమాలు టీవీలిక
చిత్రంగా వ్యాపించగ
సిటీ బతుకు అవతరించెగా - వేగంగా
గ్రామకళలు అంతరించెగా - చూడంగా ।జానపదా।

## 11. చూడు చూడు చూడరా !

పల్లవి చూడు చూడు చూడరా !
బుద్ధ జంగం చూడరా !
సోదర కులాల చూసి
నీదారిని తెలియరా ! ।చూడు

చరణం 1. కేంద్ర రాష్ట్ర మంత్రులైరి
ఐఏఎస్ ఐపీఎస్సైరి
అన్నిట్లో ముందు వారు
అట్టడుగున మీరురా ! ।చూడు।

2. రాష్ట్ర మంత నీ కులాన
సర్పంచే లేదురా !
దేశమంత వెదకినా
ఐఏఎస్ కనరాడురా ! ।చూడు।

3. చదువే దీనికి మూలం
పిల్లల చదివించరా !
అజ్ఞానం పోతె కాని
అభివృద్ధే లేదురా ! ।చూడు॥

4. ఆత్మన్యూనత భావం
అణువణువున ఉందిరా !
ఆత్మ విశ్వాసమిపుడు
అడుగుడుగున పొందరా ! ।చూడు

A C.No 951200

## 12. చదువు పాట

పల్లవి: చదవు చదువు చదువు చదువు
చదవండిరా !
ఎదిగి ఎదిగి ఎదిగి ఎదిగి
నిలవండిరా ! ।చ

చరణం: 1. హీనమైన దీనమైన
ఈ బతుకింకెంత వరకు
జ్ఞానం వెలుగులు నిండిన
ఆ బతుకే అందువరకు ।చ।

2. మనిషిలాగ జీవించగ
మనకు చదువు కావాలి
సంఘంలో శిరసెత్తగ
పరువు మనం నిలపాలి ।చ।

3. అణగారిన మనమంతా
అక్షర శక్తిని పొంది
అలుముకున్న చీకట్లను
వెలుగులతో తరుముదాం ।చ।

## 13. చెప్పలేదంటనక పొయ్యేరూ!

పల్లవి: చెప్పలేదంటనక పొయ్యేరూ
కులస్థులారా
కలిసి ఉంటే బతుక నేర్చేరూ ॥చె

అనుపల్లవి: చెప్పలేదంటనక పొయ్యేరు
తప్పదిదిగో సంఘవాక్యము
చప్పరించీ తొలగిపోతే
ముప్పు తిప్పలు తప్పవింకా ॥చె॥

చరణం: 1. కుదురుగల్గి నిలువకుంటీరీ
స్థిరమైన స్థలమున
నిలిచి బతుకూ గడపకుంటీరీ
అడవి మనుషుల వోలె తిరుగుతు
జీవితార్థం తెలుసుకొనకా
కూడు గూడు గుడ్డ కెపుడూ
కొదువ లేదను మాట ఎరుగరు ॥చె

2. పల్లె పల్లెను పలుకరించితిరీ
మీ విద్యలాతో
ఊరూరా పేరు నిలిపితిరీ
జానపదుల కళలనన్నీ
జాణతనమున ప్రదర్శించీ
నేడు గడిచిన చాలునంటూ
ముందుగతినీ కాంచరైతిరి ॥చె

3. విద్యలేక మొద్దు బతుకాయె
మనపిల్లలాకు
పాఠశాల చదువు కరువాయే
విద్యరాని వాడొక్క
వింత పశువని పెద్దలందురు
ఆస్తులేమీ లేకున్న
అక్షర జ్ఞానమ్మేమిన్నా ।చె

4. కలిమిగూడితె కన్ను బెట్టేరూ
చెడు నాయగాళ్ళూ
బాగ బతికితె లాగజూసేరూ
ఏ నాయమువస్తదో అని
ఎదురుజూస్తు ఉంటరండీ
తనకు తాను బతికె వాణ్ణి
తగువులా పాల్జేస్తరండీ । చె

5. సాటువలు సాంగ్యాలు జెప్పేరూ
మన నాయగాళ్ళూ
సమయమంత వృథా చేసేరూ
కల్లుసారలు తాగమరిగీ
కోడి కూరలు తినమరిగీ
రోజురోజుకు తగవుపెంచీ
వేలు వేలు గుంజేస్తరండీ । చె।

6. పుల్ల గడితే ఇల్లు ముంచేరూ
శాకట్లు జెప్పీ
పిల్లల బతుకు గుల్లచేసేరూ
మ్యార పూటలు పాటించీ
మాట మాటకు కాళ్ళు పట్టీ
నాయగాళ్ళ కడుపునింపే
నాటి రోజులు చెల్లవింకా ।చె।

7. సంఘ బలమును చాటి చెప్పండీ
కులమంత నేడూ
పొంగిపోయే విధము చూడండీ
కులస్థులను కృంగదీసే
దొంగవెధవల భంగపరచీ
ఆత్మసాక్షిగ కులము వారల
అభివృద్ధిని మరువకండీ చె।

8. మనసులందీ మాట నిలుపండీ
కులస్థులారా
కొత్త బాటలో అడుగుపెట్టండీ
ధరను హైదరాబాదునందున
వరలునట్టి బుద్ధ జంగము
నిదానకవి వెంకటేశము
నిజము పలికెను తెలుసుకొండి ।చె॥

## 14. సాగుదామోరన్న

పల్లవి : సాగుదామోరన్న
సంఘంలో ఏకంగా
సాగుదామోరన్న
సంఘంలో ఏకంగా
బుద్ధ జంగాల మంత
భుజం భుజం కలుపుకొని ।సా।

చరణం:1. కోపతాపాలు మాని
మాయా మర్మాలు విడిచి
ఓర్వలేక గర్వపడే
సుద్ది విడిచి బుద్ధి దెలిసి
మంచితనం మానవతను
పంచి పెట్టి ప్రేమతోడ ।సా॥

2. ఒక్క ఊరు ఏరుకొని
ఒక్క స్థలం కోరుకొని
నిలకడగా నివసిస్తే
భూమిచ్చీ గృహమిచ్చీ
ఆధారం చూపించే
అధికారుల దృష్టిలోకి సా॥

3. తాత బతుకు.తండ్రిబతుకు
మన బతుకూ ఒక్కతీరే
కొడుకు బతుకు తీరు మార్చి
కొత్తబాట చూపుదాం
మనమున్నా లేకున్నా
మనపేరు నిల్వగా సా

4. అన్నీ ధనాల కన్న
విద్యాధనమే మిన్న
తెలివీతేటల నిచ్చి
వెలుగునింపు జీవితాన
పిల్లలకూ ఆ విద్యను
ఎల్లకాల మందించగ ।సా

5. మారుతున్న లోకాన్ని
మరోమారు పరికించి
మానవనాగరికతను
మానమంతా గుర్తించి
అభివృద్ధి మార్గంలో
అడుగు ముందుకేయగా సా।

## 15. వెలుగుబాట

పల్లవి : బుడ్గ జంగమా
ఓ బుడ్గ జంగమా
నీ బతుకుదెరువు తెలుసుకొని
నడువు జంగమా బుడ్గ

చరణం:1. ఊరికి దూరంగ నీవు - ఉండెటోనివి
నీకోపేరు లేదు - బికారిగానివి
స్థిరమైన ఇల్లులేదు - గుడిసెలోనివి
ఎంతకాలమిట్లు నీవు- తిరిగెటోనివి ? ।బుడ్గ।

2. నీ కతలు వినేవాడు నేడు - కరువయ్యాడు
నీ ఆట చూసెవాడు నేడు - లేనేలేడు
నీ కళను ఆదరించెవాడు - కానగరాడు
నీ కూడు గూడు గుడ్డ లోటు - తీరెదెన్నడు ॥బుడ్గ॥

3. పేరు ఊరు ఇల్లు నీకు - కావాలి
తెలివి పెంచె విద్య నీవు - నేర్వాలి
నీ బతుకులోన పెద్ద మార్పు - రావాలి
వెలుగు బాటలో పిల్లల - నడపాలి ।బుడ్గ॥

## 16. వినతిపాట

పల్లవి : బడికి నేను ఎల్తనంటె
బడవా చదువెందుకనిరి
బతుకంతా చీకటాయెనో అమ్మలారా !
నా బతుకూ వ్యర్థమాయెనో అయ్యలారా ! ।బ

చరణం: 1 తీరుకొక్క వేషమేసి
ఊరుకొక్క పాటపాడి
రోజుకొక్క జాగమార్చితే అమ్మలారా !
చదువెట్లా సాగగలుగునూ అయ్యలారా ! ॥బ॥

2 శెంద్రలో బిసానకాడ
కాదంటే పసులకాడ
ఊళ్ళోనా జీతగాణ్ణో అమ్మలారా !
లేకుంటే కూలివాణ్ణో అయ్యలారా ! బ।

3. హోటల్లో పనివాణ్ణి
వీథిలోన బిచ్చగాణ్ణి
తంద్రివెంట కథాగాణ్ణో అమ్మలారా !
అడవిలో షికారిగాణ్ణో అయ్యలారా ! । బ।

4. కొడుకుల్ని కన్నవాళ్ళు
కూతుళ్ళను కన్నవాళ్ళు
తెలివిగలిగి పెంచండమ్మో అమ్మలారా !
పేరు నిల్ప తీర్చండయ్యో అయ్యలారా ! ॥బ

---

*శెంద్ర = చెంద్ర = వలస; బిసానా = విడిది చేసి ఉన్న స్థలం;*
*షికారి = వేట*

## 17. కదిలిరండి !

పల్లవి : రండి ! రండి ! జంగాలూ !
రండి ! బుద్ధ జంగాలూ !
సంఘంలో బతకాలి
సాగిరండి జంగాలూ ! రండి

చరణం: 1. కావిడి పెట్కున్నామని
వాస్కాచ్చిందనిగాని
పండుపగిలిపోయిందని
పింజమీదదేకిందని
చప్పరించి వేయకండి
గొప్ప కాలమొచ్చింది! ।రండి।

2. కలిసిమెలసి మనముంటే
కలుగును సుఖాలు మనకు
తొలగును మన కష్టాలు
వెలుగును మన జీవితాలు
కలలన్నీ నిజమౌను
కదలిరండి మీరంతా! రండి।

---

కావడి పెట్టుకొను = ఎం లాభంలేదు; వాస్కాచ్చంది = వ్యర్థమైంది
పండుపగిలిపోయింది = పనివ్యర్థం అయింది
పింజమీదదేకింది = ఏం ప్రయోజనం లేదు.

## 18. మహిళామండలి పాట

పల్లవి : మహిళా మండలి వచ్చిందీ !
పేదలకూ వరమిచ్చిందీ !
చదువూ సాయం అదించీ
చక్కని బాటను చూపింది ! ।మ।

చరణం: 1. అక్షరాలు మదిలోనా
ఆలోచన కలిగించాయి
అభివృద్ధికి ఆలోచనలూ
వూలబాటలేశాయి
ఈ మార్గమె నచ్చిందీ !
కొత్త బతుకు నిచ్చిందీ ! ।మ।

2. శుచి శుభ్రం పాటించగా
ఆరోగ్య సూత్రాలూ
శ్రుతిమించిన ఖర్చు మానగా
పొదుపు చేసె పద్ధతులూ
ఇల్లంతా సంతోషం !
ఇకలేదు అప్పు భయం ! ।మ

3. మూఢ నమ్మకాల వల్లా
కలిగే కష్టాలూ
చెడు అలవాట్లకు బానిసలైతే
జరిగే నష్టాలూ
తెలిసి తిరిగితే కలుగు సుఖం !
తెలివి పెరిగితే లేదు దుఃఖం ! ।మ।।

# 5. గ్రంథాల్లో బుడ్గ జంగాల ప్రస్తావన












# 5. గ్రంథాల్లో బుడ్గ జంగాల ప్రస్తావన

(గ్రంథాలు జ్ఞాన సంపుటాలు నిక్షిప్తమైన అక్షర నిధులు. గడచిన కాలానికి ఛాయా చిత్రాలు. గత చరిత్రకు దర్పణాలు. ముఖాముఖిగా అభిభాషించే మేధస్సులు. సున్నితంగా హృదయాన్ని స్పృశించే సుతిమెత్తని సుమాలు. అజ్ఞాన తిమిరాలను ఛేదించే వెలుగు రేకలు. యుగయుగాల తరతరాల మానవ వికాసపు రికార్డులు. సచేతనంగా, విజయకేతనంగా నిలిచిన మానవుని మజిలీలు.)

గ్రంథాల్లో నిలిచి ఉన్న బుడ్గ జంగాల చరిత్రను, పుట్టుపూర్వోత్తరాలను వెదకాలంటే క్రీ.శ. 12వ శతాబ్దికి వెళ్ళాలి. 12వ శతాబ్దంలో బసవేశ్వరుడు వీరశైవమతాన్ని స్థాపించాడు. కులాతీతంగా వీరశైవ మత స్థాపన జరిగింది. జంగమదేవర అయిన శివుణ్ణి ఆరాధించే మతం కాబట్టి, వీరశైవ మతం పుచ్చుకున్న వాణ్ణి 'జంగం' అన్నారు. దాదాపు ఒక శతాబ్దంపాటు 'జంగం' శబ్దం 'వీరశైవుడు' అనే అర్థంలో వాడబడింది. బసవేశ్వరుని మరణం తర్వాత వీరశైవమతం సన్నగిల్ల సాగింది. ప్రబలమైన కులవ్యవస్థ తిరిగి ప్రత్యక్షమయ్యింది. వీరశైవ ప్రభావంతో అంతకు ముందు ఉన్న కొన్ని కులాలే ఎన్నో కులాలుగా ఏర్పడ్డాయి. ఒక్కో కులం చీలకలై పెక్కు కులాలయినాయి. 13వ శతాబ్దంలో 'జంగం' అనే కులం కొత్తగా ఏర్పడింది.

జంగం కులంలో మళ్ళీ ఉపకులాలు ఏర్పడ్డాయి. మఠపతులు – మడపతులు, పట్టాధికారులు – చరమూర్తులు, స్థిర జంగాలు – చరజంగాలు, విశేష జంగాలు – సామాన్య జంగాలు, మాహేశ్వర జంగాలు – గణాయత జంగాలు, స్థావర జంగాలు– ఊరజంగాలు, తెరనాటకపు జంగాలు – ఇలా జంగాల్లో అనేక ఉపకులాలు,

అగ్రనిమ్నకులాలుగా సమాంతరంగా కొనసాగాయి. దాదాపు ఇటీవలి శతాబ్ది కాలం నుంచి అగ్రవర్ణాల్లో వీరశైవ జంగం, జంగమదేవరలు అనే కులాలు ఉండగా – కేవలం 'జంగం' పేరుతో ఒక శూద్ర కులం మాత్రం స్వాతంత్ర్యం వచ్చాకా వెనకబడిన తరగతిగా నమోదయింది. నిమ్న కులాల్లో మాల జంగం, బేడ జంగం, బుడ్గ జంగం కులాలు షెడ్యూలు కులాలుగా కొనసాగుతున్నాయి.

పై మూడు నిమ్నకులాలను నిజాం హైదరాబాదు స్టేట్‌లో 1901 జనాభసేకరణ లో Inferior Religious Mendicants విభాగంలో పేర్కొన్నారు 1921లో Depressed Classes అని నమోదు చేశారు. భారత ప్రభుత్వం 1935లో వీరికి షెడ్యూల్డు కులంగా నామకరణం చేసి చట్టం చేసింది. 1950లో ఈ కులాలను రాజ్యాంగంలో ఆర్టికల్ 341 షెడ్యూలులో చేర్చి, రిజర్వేషన్లు కల్పించారు. 1956లో The Scheduled castes and Scheduled Tribes lists Modification order వచ్చింది. 1976లో The Scheduled castes and Scheduled Tribes orders (Amendment Act) చేశారు. ఈవిధంగా ఇప్పటి వరకు రాజ్యాంగబద్ధమైన రిజర్వేషన్లు కొనసాగుతూ వస్తున్నాయి.

బుడ్గ జంగం కులం ప్రస్తావనలు ఈ క్రింది సందర్భాల్లో చేయబడ్డాయి. జనాభా సేకరణల్లో, కులాలమీద తెగల మీద పరిశోధనలు చేసినవారి గ్రంథాల్లో, జానపద కళల మీద, కులవిజ్ఞానం మీద విశ్వవిద్యాలయాల లోపలా బయటా పరిశోధనలు చేసినవారి సిద్ధాంత గ్రంథాల్లో, ప్రభుత్వం రిజర్వేషన్ల కోసం లేదా ఆయా సందర్భాల్లో జారీచేసిన GO లలో, మెమోల్లో బుడ్గ జంగం కులం గురించి ప్రస్తావించబడింది. 12వ శతాబ్దం నుంచి నేటిదాకా బుడ్గ జంగాలకు సంబంధించి వివిధ గ్రంథాల్లో దొరికిన సమాచారాన్ని మైలు రాళ్ళుగా ఈ క్రింద చూపించటం జరిగింది.

12వ శతాబ్దివరకు కులాలతో నిండి ఉన్న సమాజాన్ని కులరహిత సమాజంగా మార్చలన్నదే బసవేశ్వరుని ఆశయం. తాను బ్రాహ్మణుడు తన ఎనిమిది మంది అనుచరుల్లో కిన్నెర బ్రహ్మయ్య కంసాలి, నులక చంద్రయ్య మాదిగ, మడివాలు మాచయ్య రజకుడు–ఇలా అన్ని కులాల వారిని కలుపుకుని వీరశైవాన్ని స్థాపించాడు. ఒకే కులం

వారైనప్పటికీ వీరశైవం తీసుకోని వారి కంటే వీరశైవం తీసుకున్నవారు తాము అధికులమని భావించారు. వీరశైవం తీసుకోని బ్రాహ్మణుల కంటే వీరశైవం తీసుకున్న బ్రాహ్మణులు ఆధిక్యతను ఆపాదించుకున్నారు. అలాగే క్షత్రియుల కంటే వీరశైవ క్షత్రియులు, వైశ్యులకంటే వీరశైవ వైశ్యులు, శూద్రులకంటే వీరశైవ శూద్రులు తాము అధికులమని భావించారు. మాలలు వీరశైవం తీసుకుని మాల జంగాలయ్యారు. మాలలకంటే మాల జంగాలు ఆనాడు ఆధిక్యతను ఆపాదించుకున్నారు. ఈవిధంగా వీరశైవం రాకముందు ఉన్న కులాలు వీరశైవం వచ్చిన వంద సంవత్సరాలకే రెండింతలు, మూడింతలయ్యాయి.

బసవేశ్వరుని మరణానంతరం మెలమెల్లగా వీరశైవానికి వ్యాప్తి తగ్గసాగింది. ఒకవైపు వేదాంత దేశికుల వైష్ణవ మత ప్రచారం, మరోవైపు ముస్లిముల పాలన నెలకొనటం మొదలైన కారణాల వల్ల వీరశైవం కొన్ని ప్రాంతాలకే పరిమితమైపోసాగింది. 13వ శతాబ్దం తర్వాత సమాజమంతా తిరిగి కులాల మయం అయిపోయింది. ఒక్కొక్క కులం అనేక కులాలుగా చీలిపోయింది. కొత్తగా 'జంగం' కులం ఏర్పడింది. ఆచార అనుష్ఠానాలను బట్టి, ఆహార విహారాలను బట్టి, జంగాలలో ఉన్న స్థాయీ భేదాలనుబట్టి అనేక చీలికలు ఏర్పడ్డాయి. మాహేశ్వర జంగం, స్థావర జంగం, జంగమదేవర, జంగమయ్యలు మొదలైన శాఖలు అగ్రకులాల్లో ఏర్పడగా, నిమ్న కులాల్లో మాల జంగం, బేడ జంగం, బుడ్గ జంగం కులాలు ఏర్పడ్డాయి.

జంగాల్లో నియమనిష్ఠాగరిష్ఠులైన, శివాచార పరాయణులైన శాఖాహార జంగం కులం 12వ శతాబ్దం నుంచి నేటిదాకా ప్రత్యేక ప్రతిపత్తితో కొనసాగుతూనే వస్తున్నది. అందులో ఒకశాఖ 'వీరశైవ జంగం' పేరుతో నేడు అగ్రవర్ణంగా ఉండగా; సాంప్రదాయ భిక్షాటన కలిగి ఆర్థికంగా, విద్యావిషయకంగా వెనకబడిన మరో కులం వెనకబడిన కులం (BC) గా నమోదై ఉన్నది. అలాగే నిమ్నకులాల్లో ఉన్న మాలజంగం, బేడ జంగం, బుడ్గ జంగం కులాలు కూడా 19వ శతాబ్దం వరకు 'సామాన్య జంగం', 'తెరనాటకపు జంగం' పేర్లతో కొనసాగుతూ వచ్చాయి.

బుడ్గ జంగాలు జానపద కళాకారులు. జానపద భిక్షుక గాయకులు. 12వ శతాబ్దంలో పాల్కురికి సోమన వీరి గురించి ప్రస్తావించాడు. పండితారాధ్య చరిత్రలోని పర్వత ప్రకరణంలో పాటలు పాడుతూ వస్తున్న జంగాలను, జానపద కళలు ప్రదర్శించే జంగాలను సోమన ఇలా వర్ణించాడు.

"భారతాది కథల చీరమటుగుల
నారంగబొమ్మల నాడించువారు
కడునద్భుతంబుగ కంబ సూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు"-(పుట 435) అని పాల్కురికి సోమన జానపద గాయకులను ప్రస్తావించాడు.

16 వ శతాబ్దం ఉత్తరార్ధంలో ఉన్న బైచరాజు వేంకటనాథకవి పంచతంత్రం కావ్యంలో జంగాల్లో రెండు కులాలను పేర్కొన్నాడు. అవి 1. జంగాలు 2. తెరనాటకపు జంగాలు. మొదటి రకం జంగాలు శివాచారపరాయణులుకాగా, రెండవరకం వారైన తెరనాటకపు జంగాలను జానపద కళలను ప్రదర్శించే వారిగా గుర్తించవచ్చు. వీరు నేటి జానపద కళా ప్రదర్శకులైన బుడ్గ జంగాలకు పూర్వీకులే అనటంలో సందేహం లేదు. ఇప్పటికీ బుడ్గ జంగాలు అటు జంగం కథలు చెప్పటం, ఇటు తెరనాటకాలు కూడ ప్రదర్శించటం కనిపిస్తుంది.

17వ శతాబ్దంలో రచింపబడిన చంద్రశేఖర శతకంలోని ఒక పద్యంలో జానపద కళాకారులు చేసిన కథాగానం గురించి పేర్కొనబడింది.

ఉ : ఇంటిని తిమ్మరాజు కత యింటిని యార్ల కథా ప్రసంగముల్
ఇంటిని పాండులాలి యిబమింటిని నాయకురాలిశౌర్రెమె
ప్పంటికి నంది వాక్యముల పాండు చెరిత్రల నాకు భాగ్యమె
న్నంటికి గల్గునోయను నవజ్ఞుడు మూర్ఖుడు చంద్రశేఖరా!

పైపద్యంలో బంగారు తిమ్మరాజు కథ, వీరుల కథలు, నాయకురాలు నాగమ్మకథ, పాండవుల కథలు ప్రస్తావించబడ్డాయి. ఇవన్నీ జనులకిష్టమైన తందానా కథలే. ఈనాడు తందానా కథలు (జంగం కథలు) చెబుతున్న బుడ్గ జంగాలు ఆనాటి నుంచి తమ వృత్తిని అనూచానంగా కొనసాగించారని ఊహించటానికి దీనివల్ల వీలు కలుగుతున్నది.

18వ శతాబ్దంలో అయ్యలరాజు నారాయణామాత్యుడు 'హంసవింశతి' కావ్యాన్ని రచించాడు. మూడవ ఆశ్వాసంలో, జాతర సందర్భంలో అన్ని కులాలవారిని పేర్కొంటూ 'ఊరజంగాలు, తెరనాటకపు జంగాలు' అని జంగాల్లో రెండు కులాలను పేర్కొన్నాడు. ఊరజంగాలు, నేటికి స్థిర నివాసులైన జంగమయ్యలు, జంగమ దేవరలు కాగా, ఈ తెరనాటకాలాడే జంగాలే తర్వాతికాలంలో వీధి నాటకాలు, తోలుబొమ్మలాటలు, తందానా కథలు చెప్పటమే జీవనోపాధిగా చేసుకున్న బుడ్గ జంగాలయ్యారని చెప్పవచ్చు.

**1840లో Madras Journal of Literature and Science** లో C.P. బ్రౌన్ Essay on the creed, customs and literature of the Jangams అనే వ్యాసం రాశారు. జంగాల్లో విశేషజంగాలు, సామాన్య జంగాలు అనే రెండు రకాల వారున్నారని, సామాన్య జంగాలు మాంసాహారులని బ్రౌన్ ఈ వ్యాసంలో రాశారు.

**1841 లో Asiatic Journal** లో బ్రౌన్ దొర వీరగాథల (జంగం కథల) గురించి ఈ క్రింది విధంగా పేర్కొన్నారని బిరుదురాజు రామరాజుగారు 'తెలుగు జానపద గేయ సాహిత్యం' అనే గ్రంథంలో ఉదాహరించారు. "జానపద గేయాల్లో వీరగాథలు (కథాగేయాలు) కూడా ఉన్నాయి. వీటిలో బొబ్బిలి కథ లేక రంగారావు చరిత్ర, నాగమ్మ కథ మొదలైనవి ముఖ్యంగా మౌఖిక ప్రచారంతో కాపాడబడుతున్నాయి. అక్షర జ్ఞానంలేని వృత్తి గాయకుల గానంతో ఈ కథలు అంతటా ఎంతో ప్రచారం పొందాయి. అయినా పండితుల నిరాదరణకు గురైనాయి" అని బ్రౌన్ దొర వివరించినట్టు రామరాజుగారు పేర్కొన్నారు. (పుట60)*

---

**' Finally there are other Ballads (cathalu) of great length framed in a peculiar chant on principles different from all other sorts of poetry. Some of these, as the Bobbili catha or Ranga Rao charitra, the Nagammacatha and the like are chiefly preserved by oral recitation without having been until now committed to writing. These are every where popular though despised, as illeterate, by professed scholars'*

***Asiatic Journal volume 34 page 184-185.***

వీరగాథలు (Ballads) జంగం కథల్లో ఆయువుపట్టు వంటివి. వీటిని గానం చేసేవారు బుడ్గ జంగాలనే విషయం అందరికి తెలిసిందే. ఈనాడు బుడ్గ జంగాల పేరుతో వ్యవహరింపబడేవారు ఆనాడు మాంసాహారులైన సామాన్య జంగాలుగా పిలువబడ్డారు. ఆనాడు సామాన్య జంగాలైనా, ఈనాడు బుడ్గ జంగాలైనా తందానా కథలు చెప్పి పొట్ట పోసుకునే జానపద వృత్తి గాయకులుగా వీరు కొనసాగారన్న విషయం మరువరానిది.

"1842 లో సి. పి. బ్రౌన్ దొర తందాన కథలు చెప్పే ఒక జంగాన్ని నెల రోజులపాటు తమ ఇంట్లో ఉంచుకుని బొబ్బిలి కథ, కుమార రాముని కథ, బాల నాగమ్మ కథ మొదలైన జంగం కథలను పాడించి, వ్రాయించి భద్రపరచినందున మనం ఆ మహనీయుడికి కృతజ్ఞులమై ఉండాలి" అని డా. ఆర్వీయస్ సుందరంగారు 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' అనే గ్రంథంలో పేర్కొన్నారు (పుట. 114). ఇటు శిష్ట కావ్యాల ఉద్ధరణతో పాటు, అటు జానపద సాహిత్యం మీద కూడ బ్రౌన్ దొర దృష్టి పడింది. జానపద సాహిత్య పరిరక్షకులైన భిక్షుక గాయకుల్లో సామాన్య జంగాలు ముఖ్యులని వారిచేత పాడించి, బ్రౌన్ దొర జంగం కథలను సేకరించటం ఆనాడు అందరికి కనువిప్పు కలిగించింది.

1891 మైసూరు జనాభా సేకరణ ప్రకారం జంగాలు ప్రధానంగా రెండు తెగలుగా ఉన్నారని థర్స్టన్ **The castes and Tribes of Southern India** అనే గ్రంథంలో వివరించారు.[1] అవి 1. స్థావర జంగం 2. గణాయత జంగం. ఇందులో స్థావర జంగాలు తర్వాత కాలంలో జంగం దేవరలుగా,జంగమయ్యలుగా పిలువబడ్డారు. గణాయత జంగాలే బుడ్గజంగాలయ్యారు. రాయలసీమలో బుడ్గ జంగాలకు గణాయత జంగాలనే పేరు ఇప్పటకీ ప్రచారంలో ఉండటం ఈ విషయాన్ని బలపరుస్తున్నది.

---

1 *In the census report 1891, it is recorded that '. . only two of the sub-divisions returned are numerically important, Ganayata and Sthavara Vol II page 450.*

1901 Census of India హైదరాబాదు రాష్ట్ర జనాభాలో Inferior Religious Mendicants పేరుతో పేర్కొన్న కులాల్లో బుడ్గ జంగం కులాన్ని చేర్చారు. బుడ్గ జంగాలు మరియు జంగాల జనాభా 6214 గా నమోదు చేశారు[1].

1920 లో సయ్యద్ సిరాజుల్ హసన్‌గారు రాసిన **The castes and Tribes of H.E.H. The Nizam's Dominions** అనే గ్రంథంలో బుడ్గ జంగాలను పేర్కొన్నారు. అయితే వీరు తోలుబొమ్మలాటలు కూడా ప్రదర్శిస్తారని హసన్ గుర్తించారు. (పుట 507)

1950 The constitution (Scheduled castes) order 1950. part X Hyderabad ప్రకారం 32 కులాలు షెడ్యుల్డు కులాలుగా నమోదయ్యాయి. అందులో సీరియల్ నెంబర్ 4 లో బేడ (బుడ్గ) జంగం కులం పేర్కొనబడింది. 1959 లో విజయవాడ నుంచి ప్రచురించిన 'ఆంధ్రదర్శిని' అనే గ్రంథంలో కూడా ఈ లిస్టులు యథాతథంగా ఇచ్చారు. షెడ్యూల్డు కులాలకు ఈ పేరు ఏర్పడక ముందు నిజాం హైదరాబాదు స్టేటులో వీరిని *Depressed Classes* అని వ్యవహరించేవారు.

1958లో బి. రామరాజుగారు 'తెలుగు జానపద గేయ సాహిత్యము' అనే గ్రంథంలో బుడ్గ జంగాలను గురించి వివరించారు. "జంగములకు తెలంగాణమున బుడిగె జంగములని పేరు కలదు. బుడిగె అనునది వీరు వాయించెడు వాద్యమునకు పేరు. కూజా ఆకారమున నుండెడు దానిని ఒక బెత్తపు చట్రమున బిగించి, ఒక వైపు చట్రమునకు తోలు బిగింతురు. రెండవ వైపు కూజా మూతి అనాచ్ఛాదితముగా నుండును. దీనిని మెడకు వ్రేలాడవేసికొన్న కడుపుపైనడ్డముగా నుండును. కుడిచేతి వ్రేళ్ళతో చర్మముపైనను, ఎడమ అరచేత అనాచ్ఛాదితముగా ఉన్న మూతపైనను వాయించుట పరిపాటి. బుడిగ జంగములందరు శైవులు. వీరు చెప్పెడు కథలకు 'జంగం కథ'లని పేరు. వీరు తొలుత కేవలము శైవ సంబంధమైన కథలనే చెప్పెడివారైనను, రాను రాను శైవేతర జంగం కథలను కూడా చెప్పుచున్నారు. దేశింగురాజు కథ వంటి చారిత్రక గేయములు కొన్ని జంగం కథ వరుసలోనున్నట్టివే. విరాట పర్వం జంగం కథ, భళ్ళాణరాజు జంగం కథ,సిరియాళ జంగం కథ, దేవయాని జంగం కథ, వామన విజయం జంగం కథ, అంబరీషోపాఖ్యానం జంగం కథ వంటి ఎన్నో కథలు వీరు చెప్పెదరు (పుట 805).

1 *Census of India 1901, Vol XXII-A, Hyderabad part II page 168.*

ధేనువకొండ వేంకటామాత్యుల వారి జంగం కథల్లోను కధలు చెప్పే జంగాల వర్ణన ఉందని, 'విరాట పర్వం జంగం కథ' రచిస్తూ ఆరంభంలో కవి జంగాలను ఈ విధంగా వర్ణించాడని రామరాజుగారు ఈ క్రింది గేయాన్ని ఉదాహరించారు.

"భారతమొక కథ చేయుమనుచు నను ప్రార్థింపగ జూచి
నేరచియింపగ బూనితి జంగమువారికినుపకృతిగా
నీటుగ విభూతి రేఖలు దీర్చియు నిల్వుటంగీల్దొడిగి
వేటు రుమాలాల్ పేటు పాగాల్వల్లెవాటులొనర దాల్చి
జోడు గుమ్మెటల్ దట్టుచు వంతలు పాడుచు మరియొకడు
వోడిమిగా చేబూని సితారాభుజమున ధరియించీ
గజ్జెలు మువ్వలు అందెలు పదముల ఘల్లని మ్రోయగనూ
తఝణుత తకయని నాట్యము సల్పుచు తంబుర మీటుచునూ
సంగతిగా సభవారికెల్ల ప్రసంగ పూర్వకముగా
చెంగున దుముకుచు జంగంబులకును జీవనధనమనగా " రచించాడు. జంగాల వేషాలు వారుపయోగించే వాద్యాలు ఇందులో చెప్పబడ్డాయి. బుర్రలే, బుడిగెలే గుమ్మెటలనే పేరుతో దీనిలో కనిపిస్తాయని రామరాజుగారు రాశారు (పుట 806).

తెలుగు భాషాసమితి (మద్రాసు) వారు ప్రచురించిన విజ్ఞాన సర్వస్వంలో సంస్కృతికి సంబంధించిన నాల్గవ సంపుటం రెండవ భాగంలో – జంగాలనే తెలంగాణాలో బుడగ జంగాలంటారని, వీరు కథాగానం చేసేటప్పుడు వాయించే వాయించే వాద్యాన్నే 'బుడగ' అంటారని, బుడగలు ఉపయోగించి కథలు చెప్పటం వల్లే, వీరికి బుడగ జంగాలనే వ్యవహారనామం కలిగిందని పేర్కొటనం జరిగింది.

1967 లో కోదాటి నారాయణ రావుగారు "చిన్ననాటి జ్ఞాపకాలు" అనే పేరుతో తమ జీవిత చరిత్రను రచించారు. అందులో బుడ్గ జంగాల విషయాన్ని ఈ విధంగా ప్రస్తావించారు. "హరిజనులలో ముఖ్యంగా మాలల్లో వైష్ణవ, శైవమత అనుయాయు

లున్నారు. వైష్ణవ మతానుయాయులకు గురువు మాలదాసరి అయితే, శైవులలో అగ్రగణ్యులు బుడిగ జంగాలు. వీరు జంగం కథ చెపుతారు. రాత్రులు వేషాలు వేసుకొని, అభినయిస్తూ బొబ్బిలి కథ మొదలైనవి చెపుతారు. ఇట్టి కథలు మా గ్రామంలో నేను విన్నట్టు జ్ఞాపకం లేదుకాని, ఆత్మకూరు అను గ్రామంలో విన్నాను. బొబ్బిలి కథ, అరె మరాఠీల కథ, బలుగూరి కొండల రాయుని కథ చెపుతారు. వీరు శ్రావ్యంగా పాడతారు. హావభావ ప్రదర్శన బాగుంటుంది" అని తమ అనుభవాన్ని గ్రంథస్థం చేశారు (పుట 146).

1969 లో *'ఆంధ్ర నాటక రంగ చరిత్ర'* అనే గ్రంథంలో మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు బుడ్గ జంగాల గురించి తెలిపారు. "దాసరులందరు వైష్ణవులైనట్లే జంగాలందరు శైవులు. వీరు జంగం కథలు చెబుతారు. వీరు కథలు చెప్పేటప్పుడు 'బుడిగె' వాద్య విశేషాన్ని ఉపయోగిస్తారు. కాబట్టి వీరికి బుడిగె జంగాలనే నామం సార్థకమయింది" అని వివరించారు (పుట 205).

1970 లో మరుపూరు కోదండ రామిరెడ్డిగారు *'మాండలిక పదకోశం'* అనే నిఘంటువును కూర్చారు. అందులో బుడ్గ జంగాల గూర్చి ఇలా రాశారు. "బుడ్గ జంగాలు అంటే తందానా కథలు చెప్పి జీవించు జంగములు. బుర్ర కథల వాండ్రు. బుడిగెలు వాద్యము చేయుచు భిక్షమెత్తువారు". అని వివరించారు.

1972 లో రాజమండ్రి నుంచి సహదేవ సూర్య ప్రకాశరావుగారు *'రూపకళ'* అనే గ్రంథాన్ని రచించి ప్రకటించారు. ఇందులో బుడ్గ జంగాలను గురించి పేర్కొన్నారు. "జంగం కథల్ని ప్రత్యేకంగా జంగాలనే ఒక తెలుగు కులం వారు చెప్పుచుండటం చేత ఈ కథా ప్రక్రియకు 'జంగం కథ' అనే పేరు ప్రఖ్యాతమయింది. వీరు వాయించే గుమ్మెట అనే వాద్యాన్ని 'బుడిగె' అంటారు. అందుకే వీరిని బుడిగె జంగాలని పిలుస్తారు" అని వివరించారు (పుట 96).

1977 లో నాయని కృష్ణకుమారి గారు *'తెలుగు జానపద గేయ గాథలు'* అనే

గ్రంథంలో 'జంగం' శబ్దం పుట్టు పూర్వోత్తరాల గురించి, జంగం కథల గురించి, జంగాల గురించి, బుడ్గ జంగాల గురించి విపులంగా చర్చించారు. "జంగం వారు చెప్పునట్టి కథలే శివపరమైనను, శైవేతరములైనను 'జంగం కథలు'గానే పేర్కొనబడు చున్నవి. పాటలు పాడి పొట్ట పోసుకొనెడి యాచనామగ్న జాతులలో జంగము కులము వారున్న విషయము మనకు తెల్లమే. బుడిగె జంగములనియు వీరికి పేరు కలదు. వీరు వాయించెడి వాద్యము పేరు 'బుడిగె' అగుట చేత వీరికా పేరు వచ్చినది" అని వివరించారు (పుటలు 21.27).

1983 లో డా. ఆర్వీయస్ సుందరం గారు 'ఆంధ్రుల జానపద విజ్ఞానం' అనే పరిశోధనా గ్రంథాన్ని ప్రచురించారు. అందులో ఆంధ్రదేశంలోని జానపద వృత్తి గాయకులను వివరిస్తూ బుడ్గ జంగాల గురించి ప్రస్తావించారు. "తెలుగు జానపద గాయకులల్లో ఎన్నదగినవారిలో జంగాలు ఉన్నారు. వీరిని తెలంగాణాలో 'బుడిగె జంగాలు' అంటారు. బుడిగె అన్నది వీరు వాయించే వాద్యానికి పేరు. తెలుగులోని వీరగాథల్లో సగం పాడేది జంగములే అన్న విషయం గమనించదగ్గది. జంగం రగడ వీరావేశానికి తగ్గట్లుంటుంది. బొబ్బిలి వరుసలో ఉండే కథలతో పాటు పద్యాలను, కీర్తనలను చేర్చి యక్షగాన ధోరణిలో జంగం కథలను రూపొందించారు బుడ్గ జంగాలు. భల్లాణరాజు చరిత్ర, వామన విజయం,సిరియాళ చరిత్ర, దేవయాని మొదలైనవన్నీ ఈ విధంగా రూపుదాల్చినవే. **జంగాలు ఈనాటి వారు కారు.** ప్రాచీన కాలం నుంచీ **జానపద సాహిత్యం వీరివల్ల ఊపిరిపోసుకుంటూ ఉంది.** మొదట మొదట వీరు శైవ సంబంధ కథలను మాత్రమే చెప్పేవారు. రాను రాను శైవేతర కథలు చెప్పటానికి కూడా అలవాటు పడ్డారు" (పుట 39).

1987లో డా. ఎన్. యాదగిరి శర్మ గారు 'జానపద భిక్షుక గాయకులు' అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించారు. టైపులో వెయ్యి పుటలకు మించిన గ్రంథమిది. అముద్రితం. ఇందులో బుడ్గ జంగాల గురించి, వారు వేసే వివిధ వృత్తి వేషాల గురించి విపులంగా రాశారు.

1988లో డా. ఎన్. విజయగారు **The Role of Traditional Folk Media in Rural India** అనే ఆంగ్ల గ్రంథాన్ని రచించారు. ఇందులో బుడ్గ జంగాలను 'గుడిసె జంగాలు'గా కూడా పిలుస్తారని తెలిపారు. బుడ్గ జంగాలు ప్రదర్శించే కొన్ని వృత్తి వేషాలను గురించి విజయగారు ఈ గ్రంధంలో పేర్కొన్నారు. నల్గొండ జిల్లా అనంతారం గ్రామానికి చెందిన బుడ్గ జంగం కథకులు పస్తం వెంకటయ్య, మోతె శంకరయ్య, పస్తం వెంకటమ్మ కలిసి కధ చెబుతున్న ఫొటోను గ్రంధానికి ముఖ చిత్రంగా వేశారు.లోపల ఈ ఫొటోతో పాటు తుపాకి రాముని వేషగాడు అనరాశి కిష్టయ్య(అనంతారం) ఫొటో, బుడ్గజంగాల గుడిసెల ఫొటో, వాద్య పరికరాలైన బుడగలు మరియు తాంబూరాల ఫొటో మొదలైనవి ఈ గ్రంథంలో ముద్రించారు.

1992లో వై. పి. రాజు గారు తమ ఎం.ఫిల్. పరిశోధనా వ్యాస గ్రంథం 'బుర్రకథలు–సామాజిక స్పృహ' ను ప్రచురించారు. ఇందులో బుర్రకథకు మూలరూపాన్ని వివరిస్తూ "1941 నుంచి ఈనాటి వరకు సంఘ ప్రయోజనాన్ని ఆశిస్తూ, సమాజాన్ని ప్రభావితం చేస్తూ,సామాజిక స్పృహను కలిగిస్తున్న బుర్రకథకు మూలరూపమే 'జంగం కథలు. ఈ కథలను జంగాలు చెప్పేవారు కనుక వీటికి జంగం కథలనే పేరు వచ్చింది" అని తెలిపారు. పిరికి జంగాలు, ఈతముక్కలజంగాలనే బుడిగె జంగాలు ఈ కథలను వంశపారంపర్యంగా చెబుతారని, వీరు తంబురాతోపాటు 'బుడిగె' లనే వాద్యాన్ని ఉపయోగిస్తారు. కాబట్టి వీరిని 'బుడిగె జంగాలు' అంటారని, కొన్నిప్రాంతాల వారు ఈ బుడిగెను దక్కి, డిక్కి , గుమ్మెట అని కూడా పిలుస్తుంటారని, బహుశా బుడిగెలంటే గుమ్మెట్ల కన్నా చిన్నవి కావచ్చని అభిప్రాయపడ్డారు.

1992లో కళాప్రపూర్ణ డా. మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి గారు 'తెలుగువారి జానపద కళారూపాలు' అనే గ్రంథాన్ని రచించగా, తెలుగు విశ్వ విద్యాలయంవారు ప్రచురించారు. ఇందులో బుడ్గ జంగాల గురించి మిక్కిలినేనిగారు "బుడిగె వాయిద్యకారులే బుడిగె జంగాలు" అనే పేరుతో ఒక చాప్టరే రాశారు (పుటలు 321-326). బుడిగె జంగాలు, శైవ కథలనే ప్రచారం చేశారు, బేడ (బుడ్గ)జంగాలు, బుడిగె స్వరూపం,

బుడిగె జంగాల వేషధారణ, పగటిపూట ఇంటింటా కథ, సంస్కారులు, మొదలైన ఉప శీర్షికలతో రచన చేశారు. "రాత్రిపూట కథలు చెప్పటమే కాక వీరు పగటిపూట కూడా ఇంటింటికీ తిరిగి కథలు చెబుతారు. ఏవిధమైన వర్ణభేదాన్ని పాటించక హరిజన, గిరిజన తదితర శూద్ర గృహాలముందు కూడా నిలబడి, జంగం కథలు చెప్పి వారివద్ద డబ్బుల్నీ, ధాన్యాన్ని సేకరిస్తారు. పాటలు, తత్త్వాలు పాడతారు. కొంతమంది కథలు చెపుతారు. మరికొంతమంది వైద్యం చేస్తారు. సాముద్రికాన్ని చెపుతారు. ఇలా ఎన్నో ఉపవృత్తుల్లో వారు జీవిస్తున్నారు. బుడిగె జంగాలు ఆర్థిక, రాజకీయ, సాంఘిక, వైజ్ఞానిక, విద్యా విషయాలలో షెడ్యూల్డు కులాల జాబితాలలోనున్న 58 కులాలకన్నా తక్కువగా జీవిస్తున్నారు. వీరిని ప్రభుత్వం ఆదరించి, పరిగణనలోనికి తీసుకుని, ఇతర షెడ్యూల్డు కులాలకిచ్చే సౌకర్యాలన్నీ కలిగించే ఏర్పాట్లు చేయాలి" అని మిక్కిలినేనిగారు తమ గ్రంథంలో పేర్కొన్నారు.

1993లో Anthropological Survey of India పక్షాన కె.ఎస్.సింగ్ గారు People of India-National Series Volume II గా **The Scheduled castes** అనే పరిశోధనా గ్రంథాన్ని రచించారు. ఇందులో భారతదేశంలోని షెడ్యూల్డు కులాలను గురించి వివరించారు. బుడ్గ జంగాలను గురించి వివరిస్తూ వారి వ్యాప్తి, ఆహారపు అలవాట్లు, ఇంటిపేర్ల తీరు, వివాహాచారాలు, కట్టుబాట్లు, పంచాయతీ విధానాలు, వృత్తులు, విద్యా, ఉద్యోగ, ఆర్థిక మొదలైన రంగాల స్థితిగతులు, తదితర విషయాలను పేర్కొన్నారు. వాటిలోని కొన్ని అంశాలను ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

బుడ్గ జంగాలను 'బుడిగ జంగాలు' అని పిలుస్తారు. వీరు ఆంధ్రప్రదేశ్‌లో కోస్తా, రాయలసీమ, తెలంగాణా ప్రాంతాల్లో వ్యాపించి ఉన్నారు. వీరిలో అత్యధిక సంఖ్యాకులు గ్రామవాసులు. బుడ్గ జంగాలు మాంసాహారులు. పంది మాంసాన్ని తింటారు. ఎద్దు మాంసాన్ని తినరు. బుడ్గ జంగాల్లో రకరకాల ఇంటిపేర్లు ఉంటాయి. గంధం, బూతం, తూర్పాటి, పస్తం, కల్లెం, ముగ్గు, సిరివాటి, బైల్పాటి మొదలైనవి. ఇంటిపేర్లను బట్టే వీరిలో వివాహ సంబంధాలు కుదురుతాయి. బుడ్గ జంగాలు

సాంఘికంగా తమను తాము ఇతర కులాలకంటే న్యూనకులంగానే భావిస్తారు. ఇతర కులాలవారు కూడా వీరిని తక్కువ కులంగానే పరిగణిస్తారు. బుడ్గ జంగాలకు ఇంటి పేర్లే గాని గోత్రాలు లేవు. ఓలి ఆచారం వీళ్ళలో ఉంది. పెళ్ళి తరువాత కొంతకాలం పిల్ల తల్లితండ్రుల పొరుగునే జీవించాలి. అనువుగానప్పుడు, సరిపడనప్పుడు, రంకు మొదలైన సందర్భాల్లో కులపెద్దల సమక్షంలో విడాకులుతీసుకునే పద్ధతి వీరిలో ఉంది. బాధితులైన వారికి కులపెద్దలు నష్టపరిహారం ఇప్పిస్తారు. వీళ్ళలో పునర్వివాహాచార పద్ధతి, బహుభార్యాత్వం అమలులో ఉంది[1].

కుల పెద్ద సలహాతో పెళ్ళికి ముహూర్తం నిర్ణయిస్తారు. పెళ్ళి తంతునంతా కులపెద్ద నిర్వహిస్తాడు. పెళ్ళి ఖర్చుల్లో అధిక మొత్తాన్ని వరుని తరపు వాళ్ళు భరిస్తారు. చనిపోతే శవాన్ని పూడ్చి పెడతారు. మూడవరోజు దినకర్మ చేస్తారు. చనిపోయినవారు దయ్యంకాకుండా భూతవైద్యుని సంప్రదిస్తారు. భూమిలేని పేద కులాల్లో బుడ్గ జంగం కులం ఒకటి. వీరి పిల్లలు భిక్షాటనంలో, చాపలుఅల్లటంలో పెద్దలకు తోడ్పడుతుంటారు[2].

---

*1 ( Budga Jangam also called the Budiga Jangam. They are distributed in coastal Andhra, and the Rayalaseema and Telangana regions of Andhra Pradesh. They are largely returned from the rural areas The Budga Jangams are non-vegetarians who eat pork, though they abstain from taking Beef The Budga Jangams have different surnames like Gandham, Bootham, Toorpatı, Pastam, Kallem, Muggu, Sırıvati, Bailpati etc. These surnames regulate marriage alliances The Budga Jangams perceive themselves as low caste in the local social hierachy and are perceived as such by other communities. The Budga Jangams are endogamous. They follow surname (intiperu)exogamy. Bride price (oli) is in vogue. After marriage, patrilocal residence is the norm. In compatibility or adultery may lead to divorcé, if either party seeks diverce and once the reasons are justified, the caste elders (Kulapeddalu) approved of it. Compensation is mostly paid to the aggrieved party. Among the Budga Jangams remarriage is permissible for widows, widowers and divorcees. Soro rate, too, is allowed" (page --202).*

*2 ( 'Marriage is fixed in an auspicious day and it is solemnized on the advice of the community elder (kulapedda) The kulapedda officiates at the marriage proceedings. The major part of the marriage expenses are borne by the grooms side.They bury their dead on the third day, mortuary rituals (dinakaryamu) are performed. The witch doctor (Bhootha Vidyudu) is consulted for exorcising evil spirits. They are mainly a land less community Their children help their parents in seeking alms and also in mat-weaving (page--203)*

కుల పెద్దలతో కూడిన 'పంచాయతి' వీళ్లలో వచ్చే విడాకులు, కుల కట్టుబాటు దాటటం, రంకు మొదలైన వివాదాలను పరిష్కరిస్తుంది. డబ్బును జరిమానాగా విధించడం, కులం వెలితి మొదలైనవి శిక్షలుగా ఉంటాయి. కులపెద్దల సమితి తమ గూడెం యోగక్షేమాలను, అభివృద్ధిని చూస్తుంది.బుడ్గ జంగాలు హిందూమతస్తులు, 'పెద్ద గోసాయి' వీళ్ళ కులదేవత. ప్రతి కుటుంబంలోను 'కలికుండ'ను పూజిస్తారు. పవిత్ర పుణ్యక్షేత్రాలైన తిరుపతి, కోటప్పకొండ, వైకుంఠపురం మొదలైన క్షేత్రాలను వీరు దర్శిస్తారు. బుడ్గ జంగాల్లో కుల పెద్దలే పూజారులుగా ఉండి, పుడితే పురుడు-పెరిగితే పెళ్ళి-చస్తే చావు మొదలైన సందర్భాల్లో ఆచారకాండను నిర్వహిస్తుంటారు. దయ్యాల నుండి కాపాడటానికి, దయ్యాలను పారద్రోలటానికి ఈ కులస్థులు భూత వైద్యులను సంప్రదిస్తారు. అన్ని కులాలవారు సామూహికంగా జరిపే హిందువుల పండుగల్ని, గ్రామంలో జరిగే ఉత్సవాలను జరుపుకుంటారు. గ్రామ దేవతలను కొలుస్తారు. ఈతచాపలు అల్లటంలో మంచి నేర్పరులు. వీళ్ళు పాడే జానపద గేయాల్లో కొంత కుల వర్ణన ఉంటుంది. స్త్రీలు పురుషులు జానపద కథా గేయాలను గానం చేస్తారు.ఆ సందర్భాలలో తమ కులానికే ప్రత్యేకమైన జానపద వాద్యాలను ఉపయోగిస్తారు[1].

1994 లో డా.పొద్దుటూరి ఎల్లారెడ్డిగారు 'తెలంగాణలో యక్షగానం - రచన, ప్రయోగం' అనే పరిశోధనాగ్రంథాన్ని రచించారు. ఇందులో ఎల్లారెడ్డిగారు కొంతమంది

*1. ( 'Their traditional caste council, constituted of the caste elders (kulapeddalu) of one or two villages, decides cases like divorce, breach of caste norms, adultery, etc. Cash fines and social boycott/excommunication are the usual forms of punishment The statutory panchayat usually looks after the development of the village. The Budga Jangams are Hindus. Pedda Gussayi is their kulademudu and Perantalu is their kula devata In every family, it is customary to keep a pot of fermented butter milk (pulineella kunda) for worship. They visit sacred places like Tirupati, Kotappakonda Viakuntapuram, etc Their caste leaders (kulapeddalu) function as priests and perform the birth, marriage and death rituals For protection from and removal of evil spirits, they consult the witch doctor (vaidyudu). All major Hindu festivals which are of socio-religious significance and village festivals are celebrated Village deities are worshipped. They are expert in mat-weaving Their fork-songs and folk-tales are partly community-specific. Folk-songs are sung by both men and women. They use percussion musical instruments ' (page 204)*

బుడ్గ జంగం కళాకారులను ఇంటర్వ్యూ చేశారు. బుడ్గ జంగాల వద్ద సేకరించిన జానపదగేయాల వివరాలను ఇచ్చారు. 4వ ప్రకరణం 'యక్షగానం – అనుభవ దర్పణం (ముఖాముఖి)'లో వృత్తి కళాకారులైన కొంతమంది బుడ్గ జంగాలను ఇంటర్వ్యూ చేసిన విషయాలను ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

IV - 2: శిక్షకులు. 4–2–0 : వానరాశి బాబయ్య (జంగంమెట్, హైదరాబాదు నివాసి తండ్రిపేరు – జంగయ్య – 40 సం। కామాటి (ఉద్యోగం), సికిందరాబాదు మునిసిపాలిటీ. "యక్షగాన కళాకారుల్లో బుడ్గ జంగాలెక్కువగా శివసంబంధమైన ప్రదర్శన లిస్తారు. 45 రకాల ఆటలు నేర్చి దాదాపు 800 ప్రదర్శనల్లో పాల్గొన్న వానరాశి బాబయ్య సికిందరాబాదు, మునిసిపాలిటీలో కామాటిగా పనిచేస్తున్నాడు. వీరిచ్చిన ప్రదర్శన సమూహానికి 'బాబయ్య మేళం' అనిపేరు. నిజామాబాదు, కరీంనగర్, మెదక్, రంగారెడ్డి, వరంగల్, మహబూబ్‌నగర్, హైద్రాబాదు తదితర ప్రాంతాల్లో అనేక ప్రదర్శనలిచ్చిన కీర్తి ఈ మేళానికుంది"....... (8పేజీల ఇంటర్వ్యూ పుటలు 186–193)

IV-2-3 : మిరియాల నర్సిహ్మ. తండ్రిపేరు – కిష్టప్ప – 65 సం। బుడ్గ జంగం – దాసరి నారాయణరావు కళానగర్, జిల్లెల్లగూడ, రంగారెడ్డి జిల్లా (5 పేజీల ఇంటర్వ్యూ – పుటలు 198–202).

IV - 3 - 0:జానకి రాములు : వృత్తి – నటుడు :– ".... పాలమూరు కొత్తగంజి నివాసి జానకి రాములు వయస్సు 50 సం బుడ్గ జంగమైన ఇతడు ఒకనాడు యక్షగానాలు ఆడినవాడే. ఆ రోజుల్లో పెద్దలు ఆడించారని తమకది బ్రతుకు తెరువు అయిందని అంటున్న జానకి రాములు ప్రస్తుతం కూలి చేసుకొని పొట్టపోసు కుంటున్నాడు".

"..... ఇప్పుడున్న బుడ్గ జంగాల్లో స్త్రీలు ఈతాకు తెచ్చి చాపలు అల్లుతున్నారు. పురుషుల్లో కొంత మంది హమాలి పనిచేస్తున్నారు. మరికొంతమంది ఉప్పరి పనిచేస్తున్నారు. కాయకష్టానికి లొంగని వాళ్ళు భిక్షాటనే వృత్తిగా స్వీకరించి బ్రతుకుతున్నారు".

"ఇవాళ బుడ్గ జంగాలెవరూ తమ పిల్లలకు ఆట, పాట నేర్పడం లేదు. పిల్లలందర్నీ పాఠశాలలకు పంపిస్తున్నారు. 'ఆడుతుంటే ఆట పాడుతుంటే పాట'. అభ్యాసం

లేదు కాబట్టి వచ్చే ప్రావీణ్యం అంతంత మాత్రమే".(3పేజీల ఇంటర్వ్యూ పుటలు 202-204)

**అనుబంధాలు - 6వ ప్రకరణం - అముద్రిత గీతాలు :** ఈ ప్రకరణంలో ఎల్లారెడ్డిగారు బుడ్గ జంగాల వద్ద సేకరించిన కొన్ని జానపద గేయాలను కూడ పొందుపరిచారు. ఆ వివరాలు ఈ క్రిందివిధంగా ఉన్నాయి.

"5. ఏటవతల 6. ఇంటి ముందట 7. తందనాన త్రైదరొట్టె - ఈ మూడు గేయాలను పాడినవారు పాలమూరు జిల్లాలోని జడ్చర్ల మండలం, జడ్చర్ల నివాసి బుడ్గ జంగం పస్తం వెంకటయ్య 45 సం , మే 1987 (పుట 325).

8. చిన్నపిల్లా 9. తుమ్మసెక్కా 10. కందనోలు చెరువు - ఈ మూడు గేయాలు పాడినవారు పాలమూరు జిల్లా, జడ్చర్ల నివాసి బుడ్గ జంగం కులస్థుడు. తూర్పాటి రామలింగం, వయసు 30 సం॥ మే1987 (పుట 326).

11. మోటసిమ్ములు 12 పోతపోతనే - ఈ రెండు గేయాలను పాడినవారు ఈప్తి పెంటయ్య - బుడ్గ జంగం - జడ్చర్ల నివాసి, పాలమూరు జిల్లా. జనవరి 1988(పుట 327)"

1995లో ఆచార్య మొదలి నాగభూషణ శర్మగారు **Folk performing Arts of Andhra pradesh** అనే గ్రంథాన్ని రచించారు. ఈ ఆంగ్ల గ్రంథాన్ని తెలుగు విశ్వవిద్యాలయం ప్రచురించింది. జంగం కథలను గురించి వివరిస్తూ శర్మగారు జంగం కథలు చెప్పి పొట్ట పోసుకునే వీరిని 'బుడ్గ జంగాలు' అంటారని, బుడిగె (డక్కిలేక గుమ్మెట) అనే వాద్యాన్ని ఉపయోగించటం వల్ల వీరికి బుడ్గ జంగాలు అని పేరొచ్చిందని, వీరగాథలు గానం చేయటంలో వీరికి వెయ్యేళ్ళ చరిత్ర ఉందని వివరించారు[1].

*1. Jangams belong to the Veera Saiva Community who, in olden days, propagated Saivism in Andhra through their ballads. The ballads they recite are called Jangam Kathalu The reciters are also called Budige Jangalu, budige' or 'dhakki or gummeta' being the major percussion instrument that provided the basic rhythm to the narration. They were perhaps the originators of the balled singing tradition in Andhra, because their existence and popularity co-incide with the spread of Veera Saivism in Andhra by about 1000 A.D That they participated in Sivarathri festivals in Saiva temples and drew crowds by their able rendering of stories was evidenced by many Telugu literary texts in Palkuriki Somantha's Basava Puranam (13th c ) Vallabharaya s Kridabhiramam (14th c.) and many others*
***Folk performing Arts of Andhra Pradesh (Page 15).***

బుడ్గ జంగాలు మొదట్లో శైవ సంబంధ కథల్నే చెప్పినా 19వ శతాబ్దారంభం నుంచి శైవేతర కథలను చెప్పటం ప్రారంభించారని పెద్ద బొబ్బిలి రాజు కథ, విరాటపర్వం కథ, బాల నాగమ్మ కథ, లక్ష్మమ్మ కథ, లవకుశల కథ, శరబంది రాజు కథ మొదలైన కథలు చెప్పటంలో వీరు నిష్ణాతులని శర్మగారు రాశారు[1].

కథ చెప్పేటప్పుడు ప్రధాన కథకుడు కథ చెబుతూంటే ఇద్దరు వంతపాటగాళ్ళు వంతలు పలుకుతారని, ఒకసారి 'భళిభాళీ" అని, కొన్ని సందర్భాలో 'తందాన తాన' లేక 'అయ్యోదేవ' అని మరికొన్నిసార్లు 'తందాన తందాన – దేవనందనాన' అని వంతలు వేస్తారని, వీళ్ళు ఉపయోగించే వాద్యాలను బుడిగె, ఢక్కి, గుమ్మెట మొదలైన పేర్లతో ఆయా ప్రాంతాల్లో వ్యవహరిస్తారని శర్మగారు వివరించారు[2].

బుడ్గ జంగాలు ప్రదర్శించే 'పిట్టల దొర' వృత్తి వేషాన్ని గురించి కూడ శర్మగారు వివరించారు. పిట్టల దొరనే 'తుపాకిరాముడు', లేక 'లత్‌కోర్‌గాడు', లేక 'లత్‌కోర్‌సాబ్' అంటారని; బుడ్గ జంగాల కులానికి చెందిన ఈ వేషగాడు ఊరూరా తిరుగుతూ, కులవివక్ష లేకుండ అన్ని కులాల వారిని, అన్ని సందర్భాల్లోనూ యాచిస్తాడని; హాస్యవ్యంగోక్తులతో అందరినీ అలరిస్తాడని వివరించారు.[3]

---

*1. Though the Jangams originally restricted their recitation to Saiva Stories, they later included in it several non-saivite stories as well. By the beginning of 19th century, they were said to have mastered the art of ballad singing They included Peda Bobbili Raju Katha, Virata parvam, Bala Nagamma katha, Laxmamma Katha, Lava Kusa, Sarabandi Raju Katha, etc in their repertoire. It is obvious that the earlier stories of a religious nature have been replaced by heroic ballads.* ***Folk performing Arts of Andhra Pradesh - Page 15.***

*2. Jangam katha contains three participants the main narrator (Kathakudu) and the other two following him (Vanthalu), providing the rhythm and singing the retrain. The retrain, sometimes a short 'bhali-bhali' 'tandana - tana' and 'ayyo-deva' which are the mood referents and sometimes a general refrain 'tandana tandana tandana - deva nandanana' etc., which reflect the metrical length of the song the percussion instruments are variously called budige. dhakki, gummeta etc. in different parts of the state.*
***Folk performing Arts of Andhra Pradesh page15.***

*3 "Pittaladora narrators are Budige Jangalu Who traditionally take to this art to provide entertainment They go to every village and every house irrespective of the creed and community of their patrons. His grim-faced tom-folery sets his art on a different plane of entertaiment, bereft of religious or ritualistic or even social connotations'*
***Folk performing Arts of Andhra Pradesh - Page 162.***

1995లో డా॥ చింతళ్ల యాదయ్యగారు 'నల్లగొండ జిల్లా జాతరలు పరిశీలన' అనే సిద్ధాంత గ్రంథాన్ని ప్రచురించారు. 1992లో ఈ సిద్ధాంత వ్యాసానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పిహెచ్.డి. పట్టా ప్రదానం చేసింది. ఈ గ్రంధంలోని రెండవ ప్రకరణంలో 'జాతర్లలో వినోద ప్రదర్శన కళలు' అనే శీర్షికలో యాదయ్యగారు బుడ్గ జంగాల గురించి ఇలా వివరించారు.

"2. **బుడ్గ జంగాల కథలు** : జాతర్లలో వివిధ కళారాధకులు తమ తమ కళారూపాలను ప్రదర్శించి పొట్టపోసుకుంటారు. వీరిలో బుడగ జంగాలు ఒకరు. ప్రధాన కథకుడు తాంబూరా వాయిస్తూ కథ చెబుతుండగా, బుడగ (డింకీ) అందెలతో ఒకరు లేక ఇద్దరు వంతపాట పాడుతారు. వీరు తందానా కథలతో పాటు వీధి భాగోతాలు మొదలైన కళారూపాలను కూడా ప్రదర్శిస్తారు. వీరు కథలు చెప్పడంలో నేర్పరులు. జాతర సమయంలో తమతమ బండ్ల వద్దనో, చెట్ల నీడల్లోనో బస ఏర్పరచుకున్న గ్రామీణుల దగ్గర అడుక్కుతింటారు. వీరు భిక్షాటన సందర్భంలో శోక, కరుణ రసాత్మక కథలను ఎక్కువగా వినిపిస్తారు. జాతర జరిగే రోజుల్లో గాంధారి కథ, కమ్మొరి పడతి కథ, ఎల్లమ్మ కథ, శివసారయ్యకథ, రామాయణ భారత భాగవతాది కథలను వర్ణించి చెబుతారు.

నల్లగొండ జిల్లాలోని ఆయా జాతరలలో కనిపించే బుడగ జంగాలు జిల్లా అంతట విస్తరించి ఉన్నారు. భూదాన్ పోచంపల్లి, ఇందిరాల, నందనం, బ్రాహ్మణపల్లి, భువనగిరి, కట్టంగూరూ, చౌటుప్పల్, వలిగొండ, సూర్యాపేట మొదలైన ప్రాంతాల్లో ఎక్కువగా ఉన్నారు" అని డా॥ యాదయ్యగారు వివరించారు. (పుట26).

**జాంబపురాణం** మాదిగల కులపురాణం. డక్కలి, చిందు, బైండ్ల, మాష్టి, నులక చంద్రయ్య మాదిగ ఉపకులాలు ఈ జాంబ పురాణాన్ని వివిధ కళారూపాల్లో తరతరాలుగా ప్రదర్శిస్తూ వస్తున్నారు. ఇందులో బ్రాహ్మణునికి జాంబవంతునికి వాద ప్రతివాదాలు సాగుతాయి. బ్రాహ్మణుడు అగ్రకులాల ప్రతినిధికాగా, జాంబవంతుడు అట్టడుగున ఉన్న అంటరాని కులాల వారికి ప్రతినిధి. ఈ లోకంలో ఎన్నెన్ని కులాలున్నాయో చెప్పే సందర్భంలో 11 జంగం ఉపకులలాలను పేర్కొంటాడు. అందులో పదకొండవది బుడ్గె జంగం కులం (జానపద కళాపరిశోధనా వేదిక, హైదరాబాదు వారు 1997లో ప్రచురించిన 'జాంబపురాణం-చిందు భాగోతం'లో పుట-21).

2000 సం॥లో డా.ఎం. ఇందిరాదేవి గారు ప్రచురించిన '**మహబూబ్‌నగర్ జిల్లా గ్రామదేవతలు**' అనే పిహెచ్.డి. సిద్ధాంతగ్రంథంలో బుడ్గ జంగాల కులదైవం అయిన 'పెద్ద గోసాయి తాత గురించి రాశారు. బుడ్గ జంగం కులస్థుడే అయిన పెద్ద గోసాయి తాత ఎలా ఆ కులానికి దేవుడై పూజలందుతున్నాడో రెండుపుటల్లో (280, 281) వివరించారు.

జనవరి 2002లో తిరునగరి శ్రీనివాస్‌గారు 'జానపదం' అనే గ్రంథం వెలువరించారు. ఇందులో 'బుడిగె జంగాలు' అనే శీర్షికతో వ్యాసం రాశారు.



**బుడిగె జంగాలు**

(పేజీలు 10-14). చిన్న చిన్న ఉపశీర్షికలతో బుడ్గ జంగాల గురించి శ్రీనివాస్‌గారు ఇందులో వివరించారు. కావ్యాల్లో జంగములు, బుడిగె జంగాలూ - జంగం కథలూ, జంగాలు - శైవమతం, వేషధారణ - కథా గానం, జంగాలు చెప్పే కథలు, గేయాలూ - రీతులూ, కాలపరిణామంలో 'జీవిక' కోసం ..., ఆదరణకై ఎదురు చూపు అనే అంశాలను టూకీగా వివరించారు.

1995లో ఈ గ్రంథ రచయిత (ఎన్.ఆర్.వెంకటేశం) '**బుడిగె జంగాలు-భాషా సాహిత్యసాంస్కృతికాంశాల పరిశీలన**' అనే సిద్ధాంత గ్రంథాన్ని రచించి ప్రచురించటం జరిగింది. 1992లో ఈ సిద్ధాంత గ్రంథానికి ఉస్మానియా విశ్వవిద్యాలయం పిహెచ్.డి. పట్టాను ప్రదానం చేసింది. అనేకమంది సుప్రసిద్ధ జానపద విజ్ఞానుల చేత ప్రశంసింపబడిన ఈ 480 పుటల గ్రంథం కవర్ రెండు వైపులా బుడ్గ జంగాల జీవన సరళికి సంబంధించిన కలర్ ఫోటోలు ఉన్నాయి. లోపల 15 నలుపు, తెలుపు ఫోటోలు ఉన్నాయి. అవగాహన కోసం ఈ గ్రంథం లోని విషయసూచికను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు.

# విషయసూచిక


**మొదటి ప్రకరణం : బుడిగె జంగాలు - సంస్కృతి పరిచయం** (పుటలు 1-14)

1. జాతి-కులం-తెగ నిర్వచనం -1, 2. బుడిగె జంగాలు- పరిచయం -3, 3. సంస్కృతి నిర్వచనం-8, 4. జానపద సంస్కృతి-కుల సంస్కృతి -12.

**రెండవ ప్రకరణం : జంగం కులాలు** (పుటలు 15-41)

జంగం శబ్దం విచారం -15;

1. జంగం (జంగమయ్య లేక జంగందేవర)-20, 2. మాల జంగం-24, 3. మాదిగ జంగం-26, 4. బేడ జంగం-27, 5. బుడిగె జంగం-32, 6. బుడిగె జంగాలకు ఉన్న మరికొన్ని పేర్లు :- 1)ఊర జంగం-39,
2) గణాయత జంగం -39.
3) శివజంగాలు, శ్రీ జంగాలు, సిరిజంగాలు -40
4) ఈత ముక్కల జంగాలు -40, 5) పిరికి జంగాలు -41.

**మూడవ ప్రకరణం : బుడిగె జంగాలు ప్రదర్శించే జానపద కళారూపాలు (వృత్తి వేషాలు)** (పుటలు 42-128)

1. **ఒకేవ్యక్తి ప్రదర్శించే వృత్తివేషాలు** (పుటలు 43-79)

   1. తుపాకి రాముని వేషం-43, 2. బ్రాహ్మణ వితంతువు(బోడి బాపనమ్మ) వేషం-48, 3. కోయపంతు- 70, 4. ముత్తడి వంతు -73, 5. ఏకతార పంతు-74, 6. ఇతరాలు:- కప్పెర పంతు-77, తెల్లపంతు-77, చెక్క బొమ్మలాట-77, జంగమయ్య వేషం-78, బ్రాహ్మణవేషం-78.

2. **సామూహిక ప్రదర్శన కళారూపాలు(సామూహిక వృత్తివేషాలు)** (పుటలు 80.128)

   1. బుడిగె జంగం కథలు/ శారద కథలు-80, 2. తోలుబొమ్మలాటలు-88, 3. వీధిభాగోతాలు-95, 4. మందెచ్చు వేషాలు -120, 5.గురప్పలు వేషాలు -123, 6.నాటాంపంతు -125,7. ఇతరాలు-126.

నాల్గవ ప్రకరణం : ఆచార సంప్రదాయాలు (పుటలు 129-294)

1. ప్రసూతి ఆచారాలు :- (1) శిష్ట సాహిత్యంలో కనిపించే ప్రసూతి ఆచారాలు - 131, (2) జానపద సాహిత్యంలో -132, (3) ఇతర తెగల్లో, కులాల్లో -133, (4) బుడిగె జంగాల ప్రసూతి ఆచారాలు -135, కొల్లు -137, నామకరణం-138, కొల్లుకూడ్పటం - 139, చన్నీళ్ళు ముట్టటం - 141, దొండాకు పసరు -141, పుల్లలు వేయటం-141, బాలెంత కాయం-142, ఆచారాల అంతరార్థం -142.

2. సమర్త ఆచారాలు :- (1) శిష్టసాహిత్యంలో సమర్త ప్రస్తావన-146, (2) జానపద సాహిత్యంలో సమర్త ప్రస్తావన -148, (3) ఇతర తెగల్లో, కులాల్లో సమర్త ఆచారాలు - 150, మాల జంగం -150, మాలదాసరి-150, సిందోళ్ళు-151, బోయ - 151, ఎరుకల - 151, దొంబ దాసరి-152, దొమ్మరి-152,
(4) బుడిగె జంగాల సమర్త ఆచారాలు -153,
ఆచారాలు - అంతరార్థం-154.

3. నిశ్చితార్థం - 157 :- బుడిగె జంగాల నిశ్చితార్థాచారాలు,
పిల్ల మాది అనిపించుకోవటం -158, పుల్ల విరుపు -159, ఇడెం-159, బుద్దిమాటలు -162, చింతాకు జీద్యాకు - 163, చెయ్యిసాక్షి -163, కోరుకున్నవాళ్ళు-164.

4. వివాహాచారాలు - 165 :-(1) శిష్ట సాహిత్యంలో - 168,
(2) జానపద సాహిత్యంలో; ఇతర తెగల్లో, కులాల్లో - 169,
(3) బుడిగె జంగాల వివాహాచారాలు - 175 :-చాపమీది మాట - 177,
నేవింపులు - 178, ఓలి - 178, కులాచారం 179,
గాజులు వేయించటం-179, పుస్తె కట్టుట-180, చుట్టాల బంతి- 181,

మ్యార - 182, పూట - 184, సోబనబంతి -185, విడాకులు - 185, మారుమనువు - 186.

5. **చావు-కర్మకాండ-187** :- బుడిగె జంగాల్లో చావుతంతు - 191, దినకర్మ - 194, పొగిడింపు పాట - 197.

6. **ఆరాధనా పద్ధతులు -201** A. దేవతారాధన :
I మాతృదేవతలు-202 :-మైసమ్మ-203, పోశమ్మ-204, ఎల్లమ్మ - 206,
II కులదేవతలు - 208 :- పెద్దగోసాయి తాత - 210,
III సిగాలు -211, IV శిష్టదేవతలు - 212, V ఇతర దేవుళ్ళు - 212
VI మొహమ్మదీయ దేవుళ్ళు - 213,
B ప్రేతారాధన - 214 : I సకినాలు :- (1) చాట సకినం -216,
(2) కుండసకినం - 217, తలెసకినం - 218,
(4) దండసకినం - 218, (5) పేనుసకినం - 218,
II పారబోసుకోవటం - 219
III దయ్యాలను చంపించటం - 220 :- (1) మందు తాగటం - 221
(2) తంగెడి దేవర - 221, (3) దయ్యాల వివాదాలు - 221,
(4) మొండిదయ్యం -222.
IV భూతవైద్యులు -222.

7. **కుల పంచాయతులు -225**
·పంచాయతి అంగాలు :(1) పుల్ల లేక ముచ్చిలిక 230, (2) కోరడి -230,
(3) సాలు - 231, (4) ప్రమాణాలు -సాక్ష్యాలు 233,
(5) సాటువలు -237, (6) తీర్పులు - తప్పులు - దండ్గలు -238,
(7) ముగింపు - 239, పంచాయతుల వర్గీకరణ - 239:
(1) చుట్టుపక్కాల పంచాయతులు -240,
(2) కొట్టుకున్న పంచాయతులు -242,

(3) రంకు పంచాయతులు - 243,
(4) ఇతరాలు 244,
కొందరు న్యాయగాళ్ళు - 245, కొన్ని ఉదాహరణలు -246.

8. పండుగలు -247

9. నమ్మకాలు - 248

10. ఇంటిపేర్లు - 253

I బుడిగె జంగాల ఇంటి పేర్లు - 256, 1) మత సంబంధ గృహ నామాలు -256, 2) సంస్కృతి సంబంధ గృహనామాలు - 256, 3) గ్రామనామ సంబంధ గృహనామాలు - 256, 4) వృక్ష సంతతి సంబంధ గృహ నామాలు - 257, 5) జంతువులు, పక్షులు, సరీసృప సంబంధ గృహనామాలు - 258, 6) ఆయుధ, అవయవ, ఆభరణ సంబంధ గృహనామాలు - 258,
7) ఇతరాలు-258,
II. ఇంటి పేర్ల వివరణ పట్టిక - 258,
III. సమీక్షణం - 267.

11. వేట - 270

వేటపరికాలు - 271, వేట కుక్కలు - 272, మృగయా విహారం - 273, వేటలరకాలు - 273. బుడిగె జంగాల వేట -275,
1) తాబేళ్ళ షికారి-276 దోటిగాలం, దూకి పట్టటం, చెరువుదేవుట, పొడుపు షికారి:-కోపుషికారి, నీటి బుడగలు చూసి పట్టుట, జాడషికారి
2) ఉడతల షికారి - 277, 3) ఎలుకల షికారి - 278
4) ఉడుముల షికారి - 279 :-శివ్వయాట, ఊదరయాట, కడెం దోర్నం, కుక్కయాట, 5) ముంగీసల షికారి -280 :-బోను, ఎంటువ గూటాలు,

మీటు, ఊదర, వలలు, 6) అడవి పిల్లుల షికారి - 281, 7) కుందేళ్ళ షికారి-281, 8)మర్నాగి (మానుపిల్లి) షికారి-281, 9)ఏదుల షికారి -281, 10) ఇతర జంతువుల షికారి - 281:- కొంగ్రిగాడు, తోడేళ్ళు, వాల్గ (అలుగు), గటుంగాడు (నీటి కుక్క), పిట్టల షికారి, చేపలు, ఎంద్రకాయలు.

12. వైద్యం - 283

మంత్ర తంత్ర వైద్యం, ప్రకృతి వైద్యం, వృక్ష సంబంధ వైద్యం, ప్రాణి సంబంధ వైద్యం, ఖనిజ సంబంధ వైద్యం, కొన్ని వ్యాధులూ వాటికి బుడిగె జంగాల వైద్యం -286, కొవ్వు వైద్యం - 292, జీడి వైద్యం - 292, అగ్ని వైద్యం -293.

ఐదవ ప్రకరణం : వస్తు సంస్కృతి (పుటలు 295 -326)

1. బుడిగె జంగాల ఇండ్లు - 295, 2. ఇంటిలోని వస్తువులు - 300, ఆహార పానీయాలు -302 :- మాంసాహారం - జంతువులు, పక్షులు, ప్రధానాహారం :- కూరలు, చిగుళ్ళు, ఆకులు, పూతలు, కాయలు, పండ్లు, గింజలు, మొలకలు, గడ్డలు, తీగలు.
బుడిగె జంగాల కొన్ని వంటకాలు -310:-వేటలో వంట, కాల్చుకొని తినటం, వరుగులు, నూనెలు, సేకరణ వస్తువులు, భోజనం చేసే విధానం, పానీయాలు
4. దుస్తులు - ఆభరణాలు - 313: దుస్తులు, ఆభరణాలు, పచ్చబొట్లు.
5. పశుసంపద - 318 :- పెంపుడు జంతువులు, వేటకుక్కలు.
6. చేతి పనులు -320:- చాపలు అల్లటం-321, వేష పరికరాల తయారీ -324, వాద్య పరికరాల తయారీ -324, వేట పరికరాల తయారీ -325, గృహనిర్మాణ, గృహావసర పరికరాలు తయారి-325, చెకుముకి సంచి-326.

**అరవ ప్రకరణం : భాషా సాహిత్యాలు (పుటలు 327-414)**

1) బుడిగె జంగాల సంకేత భాష - వర్ణనాత్మక విశ్లేషణ - 327.

I బుడిగె జంగాల సంకేత భాషా పదాలు, వాటి అర్థాలు - 329.

II ధ్వని పరిణామం - 333,

III నామ ప్రాతిపదికలు -334.

1) సామాన్య నామవాచకాలు - 335,
2) సంశ్లిష్ట నామవాచకాలు :
కృదందాలు - 335, సూత్రాంశాలు - 336, తద్ధితాంతాలు - 339, సూత్రాంశాలు - 340,
3) సమాస నామవాచకాలు - 343
IV.క్రియలు - 343, సామాన్య క్రియలు
V. వచనం. సూత్రాంశాలు - 334, VI. సర్వనామాలు - 346.
VII . అర్థ పరిణామం - 346,
1) దేశ్యాలు - 347, 2) తత్సమ తద్భవాలు - 349,
3) అన్య దేశ్యాలు - 350.

2. జాతీయాలు - పలుకుబళ్ళు - 351
పదబంధాలు - పలుకు బళ్ళు, వేట - జాతీయాలు, ఉపమానాలు, కొన్ని వాక్యాలు.

3.సామెతలు -363
కులాన్ని వర్ణించే సామెతలు, వృత్తులకు సంబంధించిన సామెతలు, కుల పంచాయతులకు సంబంధించిన సామెతలు, విశ్వాసాలు- ఆచారాలకు సంబంధించిన సామెతలు, ఆకారాదిక్రమంలో సామెతల పట్టిక - 371.

4.పొడుపు కథలు - 376

బుడిగె జంగాల పొడుపు కథలు

i. గృహ జీవనం - వస్తు సంచయం, ఆభరణాలు, వాద్యాలు ii. ప్రకృతి సంబంధాలు iii. ప్రాణిసంబంధాలు, ఛందస్సు - 386, గతులు, పాదవర్గీకరణం, యతి, ప్రాస, అలంకారాలు.

5. కథలు - 391 - వృత్తి పరమైన కథలు. కాలక్షేప కథలు, జీవన కథలు - 1) ఎవరి దేవుడు గొప్ప? 2) అడ్డ బొట్టు - నిలువు బొట్టు 3) ఉడుత కుందేలు కథ 4) తాబేలు కధ 5) భార్య మంచితనం 6) పోరడి పులుసు.

6. గేయాలు - 402

7. బుడిగె జంగాల రచనలు - 403

**ఉపసంహారం - 411**

**అనుబంధాలు** (పుటలు 417-460)

**ప్రసంగహారాలు** :- (1) తుపాకిరాముని వేషం - 417, (2) బోడి బాపనమ్మ (బాహ్మణ వితంతువు) - 421, (3) వద్దెర వేషాలు - 436, (4) కొన్ని కథా రహిత గేయాలు -441, (5) సమాచార దాతలు -449

**ఉపయుక్త గ్రంథాలు, పత్రికలు - 451.**

గ్రంథాల్లో బుడ్గ జంగాల ప్రస్తావన వ్యాసంలో ప్రస్తావించబడిన గ్రంథాలు :

1. పండితారాధ్య చరిత్ర - పాల్కురికి సోమనాథుడు - 12వ శతాబ్దం
2. పంచతంత్రం - బైచరాజు వెంకటనాథకవి - 16వ శతాబ్దం
3. చంద్రశేఖర శతకం - 17వ శతాబ్దం
4. హంస వింశతి - అయ్యలరాజు నారాయణామాత్యుడు - 18వ శతాబ్దం

5. Essay on the creed, customs and Literature of the Jangams in Madras Journal of Literature and Science - C.P. Brown - 1840
6. Ballads in Telugu in Asiatic Journal - C.P.Brown - 1841
7. 1891 census of India - Reference in The Castes and Tribes of Southern India - Edgor Thurston - 1903.
8. Report of census of India 1901, Volume XXII - A, Hyderabad part II.
9. The castes and Tribes of H.E.H. The Nizam's Dominians- - Syed Sirajul Hassan - 1920
10. The Constitution (Scheduled castes) order 1950: part X Hyderabad.
11. ఆంధ్రదర్శిని – విశాలాంధ్ర ప్రచురణ – 1959.
12. విరాట పర్వం జంగం కథ – ధేనువకొండ వేంకటామాత్యుడు.
13. తెలుగుజానపద గేయ సాహిత్యము – బిరుదురాజు రామరాజు – 1958
14. తెలుగు విజ్ఞాన సర్వస్వము – 4వ సంపుటం – సంస్కృతి – రెండవ భాగం
15. చిన్ననాటి జ్ఞాపకాలు – కోదాటి నారాయణరావు – 1967
16. ఆంధ్రనాటక రంగ చరిత్ర – మిక్కిలినేని రాధాకృష్ణమూర్తి – 1969
17. మాండలిక పదకోశం – మరుపూరు కోదండరామిరెడ్డి – 1970
18. రూపకళ – సహదేవ సూర్యప్రకాశరావు – 1972
19. తెలుగు జానపద గేయ గాథలు – డా॥నాయని కృష్ణకుమారి– 1977
20. ఆంధ్రులు జానపద విజ్ఞానం – డా। ఆర్.వి.ఎస్. సుందరం – 1983
21. జానపద భిక్షుక గాయకులు (అముద్రితం) – డా। ఎన్.యాదగిరి శర్మ। 1987

22. The Role of Traditional Folk Media in Rural India - Dr.N.Vijaya - 1988

23. బుర్రకథలు - సామాజిక స్పృహ - వై.పి.రాజు - 1992

24. తెలుగువారి జానపద కళారూపాలు - డా॥ మికిల్కిలినేని రాధా కృష్ణమూర్తి - 1992

25. The Scheduled castes (National Series Volume II - Anthropological Servey of India) - K.S. Singh - 1993

26. తెలంగాణలో యక్షగానం - రచన, ప్రయోగం - డా॥పొద్దుటూరి ఎల్లారెడ్డి - 1994

27. Folk performing Art of Andhra pradesh - M.Nagabhushana Sharma - 1995

28. నల్లగొండ జిల్లా జాతరలు - పరిశీలన - డా॥ చింతల యాదయ్య - 1995

29. జాంబపురాణం - జానపద కళాపరిశోధనావేదిక, హైదరాబాదు వారి ప్రచురణ - 1997.

30. మహబూబ్ నగర్ జిల్లా గ్రామదేవతలు - డా॥ ఎం. ఇందిరాదేవి - 2000.

31. జానపదం - తిరునగరి శ్రీనివాస్ - జనవరి, 2002.

32. బుడిగె జంగాలు - భాషాసాహిత్య సాంస్కృతికాంశాల పరిశీలన - డా॥ ఎన్.ఆర్. వెంకటేశం - 1995.

★ ※ ★

# ౬. పత్రికల్లో బుడ్గజంగాల ప్రస్తావన



# 6. పత్రికల్లో బుడ్గ జంగాల ప్రస్తావన

ప్రతికొక్కటున్న పదివేల సైన్యము
ప్రతికొక్కటున్న మిత్రకోటి
ప్రజకు రక్షలేదు పత్రికలేకున్న
నవయుగాల బాట నార్లమాట!

ప్రజల సరస నిలిచి ప్రధనమ్ము నడుపుట
పరమ ధర్మమోయి పత్రికలకు
ప్రజలగొల్వలేని పత్రికలేలరా
నవయుగాల బాట నార్లమాట!

పత్రికల ప్రాముఖ్యాన్ని, కర్తవ్యాన్ని ఇలా నొక్కి చెప్పారు నార్ల వెంకటేశ్వరరావుగారు. నిస్సహాయులకు, నిర్భాగ్యులకు అండదండలు పత్రికలే. సమాజంలోని అసమానతలను ఎత్తి చూపేవి, సామాన్యుని సర్వాంగీణ వికాసానికి పాటుబడేవి పత్రికలే. పత్రికంటే ప్రజావాణి. పత్రికంటే సమాజానికి దర్పణం.

కొన్ని పత్రికల్లో వచ్చిన బుడ్గ జంగాలకు సంబంధించిన వార్తల్లోని, వ్యాసాల్లోని కొన్ని భాగాలను ఇక్కడ ఇస్తున్నాం. వీటిలో కొన్ని ఈ కులం పుట్టుపూర్వోత్తరాలు తెలిపేవైతే, కొన్ని కులాచారాల్ని తెలియజేసేవి ఉన్నాయి. మరికొన్ని బుడ్గ జంగాల జానపద కళాప్రదర్శనల వైశిష్ట్యాన్ని, వైవిధ్యాన్ని వర్ణించేవి ఉన్నాయి. తరతరాలుగా వారసత్వంగా భారతీయ కళా సంస్కృతి జీవవాదాన్ని గానం చేస్తూ కొనసాగిస్తున్న తీరుతెన్నుల్ని వివరించేవీ ఉన్నాయి. బుడ్గజంగాల బడుగు బతుకులకు, అంతులేని గతుకులకు, ఆర్థికంగా చితికి పోయిన వెతలకు, విద్యలేని వింత జీవన విధానాలకు అద్దం

పడుతున్నాయి ఈ వార్తలు. ఈ వార్తలు బుడ్గ జంగాల స్థితిగతులు, సమస్యలు, విన్నపాలు, విజ్ఞప్తులు ప్రభుత్వం దృష్టికి, ప్రజల దృష్టికి రావటానికి ఎంతగానో దోహదం చేశాయి. మానవతా దృష్టితో, పరిశోధనా పుష్టితో, వార్తల సృష్టితో జర్నలిజానికున్న సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చిన ఆయా పత్రికల వారికి మా కృతజ్ఞతాభివందనాలు.

## 'మా బుడ్గ జంగపోల్లకు చావు మధ్యనే బతుకు'

*సిద్దార్థ (ఆంధ్రప్రభ విలేకరి)* ***4-7-1999-*** **హైదరాబాదు.**

ఈమె సదలోల్ల శంకరమ్మ. తెలంగాణాలో మెదిలే బుడగ జంగపోల్ల కళాకారిణి. డెబ్బై సంవత్సరాలకు పైనే ఉంటుంది. మన పట్నంలోనే.... ఇంకా వూరి వేళ్ళుపోని కుల కుటుంబాల్లో ఎవరైన చచ్చిపోయి నపుడు శంకరమ్మను పిలుస్తారు. శంకరమ్మ



మా జంగపోల్లకు చావు మధ్యనే

చాలా గట్టిది శంకరమ్మ పాటల పాదాలతో తడిపినదే. మన లోక కళారూపాల తెలియని అనేక నీరం బారం సంకేత రహస్యం శంకరమ్మ. శంకరమ్మ పాట పాడితే దుఃఖించని ఆత్మ వుండదు. చనిపోయిన వాళ్ళు కూడా తమ గురించి ఆమె పాడే పాటలు విని దుఃఖిస్తారేమో? ఈ కళాకారిణి ఉనికే వొక గాయపడిన జ్ఞాపకం. ఎవరికైనా ఏదైనా కష్టమొచ్చిందని తెలిస్తే. తన అనవాయితీ తడుముకుని, తీగని సవరించుకుని వాళ్ళ ఇంటికి గడప ముందరుంటుంది శంకరమ్మ. శంకరమ్మ మన జీవితాలకే Counter culture ని ప్రతిపాదిస్తుంది. తన మాటల్లోనే:

సదలోల్ల శంకరమ్మ

"మాది బుడగజ
గాల కుటుంబం. మా
షాద్‌నగర్ దగ్గరి దేవు
పల్లె. మా కుల
ళ్ళంతా కళాకారుల
నాకు తెలిసినంత
రకూ మా కుటుంబ
లోఎవరికీ కూడా
విద్యలకు గురు
లేదు. మా పాటలనీ
మేం ఉగ్గబట్టి నేర్చుక
న్నవే. మా నాయన
రంగోజి, గొప్ప వే
గాడు. ఆయనకు ఆ

అక్కడికొచ్చి కుటుంబచరిత్రకంతా వొక ఎలిజీయై నిలిచిపాడుతుంది. పలుగురాళ్ళు రాపాడినపుడు నిప్పు చిల్లినట్టుగా, పసరిక పాము ఊపిరిలో చలిస్తున్నట్టుగా వుంటుంది శంకరమ్మ గొంతు. ఈమె మన పాటల రుదాలి. ఈమె ఇంటిని గుర్తుపట్టడానికి మనకే మహాశ్వేతలూ లేకపోయారు. కుటుంబాల్లో పండుగ పబ్బాలప్పుడు శంకరమ్మను పిలవరు.

శంకరమ్మ జ్ఞాపకానికి వచ్చేది కష్టాల్లోనే, దుఃఖాల్లోనే. చచ్చిపోయిన వారి ఇంటిల్లిపాదినీ గుండెకత్తుకుని పాటలతో సాంపిజల్లి, శుభ్రపరచి ఓదారుస్తుంది శంకరమ్మ. చేతిలోని సితారా (ఏక్‌తారా), డింకీ(బుడగ), అందెలు శంకరమ్మకు అలంకారాలు. దేశంలోని చాలా నగరాల్లో శంకరమ్మ ప్రదర్శనలిచ్చింది. మన Main stream కళ్ళ భూతద్దాల బారినుండి తప్పుకుని శంకరమ్మ, తన కళను ఎన్నో కష్టాల్తో కాపాడుకుంటుంది. ఈమె దగ్గర దుఃఖం తప్ప ఏమీలేదు. మనకే తెలియని మన కులచరిత్రని శంకరమ్మ పసిగట్టి పాటగా చెబుతుంది. ఒక్కో కతను రేండు మూడురోజులవరకు చెప్పుకుంటూ పోతుంది. నలచక్రవర్తి కత, భూలచ్చిమికత, సూర్యచంద్రుల కత, హరిశ్చంద్రుని కత, నాగవతి కత, బొక్క వెంకటారెడ్డి కత, గౌండ్ల అంజయ్య కత, రజకార్లమీఁద పాటలు, శివకుమారుల కత ఇట్లా 33 కతల దాకా చెప్పుకుంటూ పోతుంది శంకరమ్మ. పాతనగరంలోని చాలా గల్లీలు శంకరమ్మ పాటల పాదాలతో తడిసినవే. మనఫోక్ కళారూపాలు తెలియని అనేక నీడల జాడల సంకేత రహస్యం శంకరమ్మ, శంకరమ్మ పాటపాడితే దుఃఖించని ఆత్మ వుండదు. చనిపోయిన వాళ్ళుకూడా తమ గురించి ఆమె పాడే పాటలు విని దుః ఖిస్తారేమో? ఈ కళాకారిణి ఉనికే వొక గాయపడిన జ్ఞాపకం. ఎవరికైన ఏదైనా కష్ట మొచ్చిందని తెలిస్తే తన ఆనపకాయ బూర తడుముకుని, తీగని సవరించుకుని వాళ్ళ ఇంటికి గలమ ముందరుంటుంది శంకరమ్మ. శంకరమ్మ మన జీవితాలకి Counter culture ని ప్రతిపాదిస్తూంది, తనమాటల్లోనే;

"మాది బుడగ జంగాల కుటుంబం. మాది షాద్‌నగర్ దగ్గరి దేవుని పల్లె. మా కులపోళ్ళంతా కళాకారులు. నాకు తెలిసినంతవరకూ మా కుటుంబంలో ఎవరికీ కూడా ఈ విద్యలకు గురువు లేడు. మా పాటలన్నీ మేం ఉగ్గబట్టి నేర్చుకున్నవే. మా నాయన రంగోజి, గొప్ప వేషగాడు. ఆయనకు ఆడోళ్ళకు గూడా ఉండనంత తల వెంట్రకలుండేవని మా అమ్మ చంద్రమ్మ చెప్పేది. మా నాయన నేను చూడక ముందే చనిపోయినాడు. మా కతలన్నీ ఎవరో నేర్పినవి కావు. మా బతుకులో మేం తిరుగుతూన్న కుటుంబాల కతలే మా పాటలు. ప్రతికులానికి వొకకత నల్లుకుంటాం నా పాటలన్నీ ఏడుపుకతలే.

చాలా వరకు దుఃఖాలతో కూడుకున్నవే. లేదా యుద్ధాల కతలు. ఏ ఇంట్లోనయినా ఎవరైనా చచ్చిపోతే, నన్ను పిలుస్తారు. అక్కడికి పోయి, ఆ చచ్చిపోయిన మనిషి జీవితాన్ని కళాత్మకంగా చెబుతాను. మొత్తం ఆ కుటుంబ చరిత్రనంతా ఆ పాటలోకి......

## హైటెక్ సిటీలో 'కన్యాశుల్కం తెగ'!

***వార్త (ఆదివారం అనుబంధం) 3-1-1999 హైదరాబాదు.***

ఎర్రగడ్డ, జనవరి2(ప్రభాతవార్త): ఇరవై ఒకటో శతాబ్దానికి ఒక్క సంవత్సరానికి ముందు, హైటెక్ సిటీకి అల్లంత దూరంలో ఉంటూ, దారిద్ర్యపు బ్రతుకులీడుస్తూ వయసుకొచ్చిన పిల్లల పెళ్లిళ్ల విషయంలో తమకంటూ ఒక ప్రత్యేక పద్ధతులను పాటిస్తూ,


హైటెక్ సిటీలో 'కన్యాశుల్కం తెగ'!

కనుసైగలతో కంప్యూటర్‌లను నడుపిస్తున్న నవీన వరకట్న యువతకు సవాలు విసురుతున్నారు ఈ బడుగు జీవులు. ఆడపిల్ల పుట్టిందంటే 'అయ్యో ఆడపిల్లనా' అని సానుభూతి నిట్టూర్పులను విడిచే నేటి సమాజంలో, ఆడపిల్ల ఎంతటి స్థానానికి ఎదిగిన పెళ్ళి విషయం వచ్చే సరికి 'కట్నం' చట్రంలో ఇరుక్కోక తప్పటం లేదు. ఇటువంటి పరిస్థితులలో నాటి గురజాడ గారి 'కన్యాశుల్కా'న్ని తలపించే సంఘటనలు నేటి వరకట్న నవ వధువుల శ్మశాన కొలువులో చిరుదివ్వెగా బయటికి ప్రకాశిస్తున్న తీరు ఇలా ఉంది. వీరి కంటూ స్వస్థలం లేని నిరుపేదలైన 'బుడిగె జంగం' అను తెగకు

చెందిన దాదాపు ఇరవై కుటుంబాలు బోరబండ ప్రాంతంలోని అల్లాపూర్‌లో గుడిసెలను వేసుకొని జీవిస్తున్నారు. చేతిలో బుర్రలు పట్టుకొని వీధుల్లో భిక్షాటన చేసి పొట్ట పోసుకుంటున్న వీరి పెళ్ళిళ్ల ఆచారం, నేటి సమాజానికి భిన్నంగా ఉంది. పెళ్లీడుకొచ్చిన అమ్మాయి ఉందని తెలిస్తే వీరి కులానికి చెందిన పురుషుడి (యువకుడి) తల్లిదండ్రులు వీరిని సంప్రదిస్తారు. సదరు పిల్ల తండ్రి పిల్లకు ఇవ్వడానికి గాను "వోలీ" (కన్యాశుల్కం) కింద వెయ్యి నుండి మూడు వేల వరకు ఇవ్వమని అంటాడు. అప్పుడు మధ్యలో ఉన్న కులపెద్దల జోక్యంతో పిల్ల తండ్రి అడిగినంత కాకుండా కాస్త తగ్గించి పిల్లవాడి నుండి, అమ్మాయి తల్లిదండ్రులకు డబ్బును ఇప్పిస్తారు. అనంతరం పిల్లవాడే పెళ్లి ఖర్చు అంతా భరించి కులానికి నాలుగు బంతుల (పూటలు) భోజనం పెట్టాలి. పెళ్ళయిన తర్వాత ఒకవేళ అమ్మాయి ప్రవర్తన నచ్చకపోతే అబ్బాయి కులపెద్దల సమక్షంలో మళ్ళీ తల్లిదండ్రులకు అప్పగించవచ్చు. ఈ సమయంలో పెళ్ళి సమయాన ఇచ్చిన 'వోలీ' నుండి సగాన్ని పిల్ల తండ్రి వాపసు చేయాల్సి ఉంటుంది. ఒకవేళ అమ్మాయే తన ఇష్టానుసారంగా భర్తను వదలదల్చుకుంటే వరుడు ఇచ్చిన 'వోలీ'కి రెండింతలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ తతంగం ఏ మాత్రం వాదోపవాదాలు లేకుండా శాంతియుతంగా జరిగిపోతుంది. ఈరకంగా ఒక్కొక్కరు ఐదారు పెళ్ళిళ్ళను చేసుకోవచ్చు. భర్తలను వదిలిన - కొద్ది వధువు యొక్క రేటు తగ్గుతూ ఉంటుంది. ఇక్కడే నివాసముంటున్న సోమయ్య కుమారుడు కృష్ణయ్యకు ఇప్పటివరకు మూడు పెళ్ళిళ్ళు జరిగాయి. మొదటిది వికారాబాద్ నుండి తొమ్మిది వేలకు కొనితెచ్చి అనంతరం వదిలాడు. రెండవసారి సనత్‌నగర్ నుండి ఇరవై వేలకు కొని తెచ్చి ప్రవర్తన బాగాలేక విడాకులిచ్చాడు. మూడవసారి మియాపూర్ నుండి ఆరువేలకు కొనుగోలు చేసి తీసుకువచ్చినట్లు కృష్ణయ్య వివరించాడు. అదే విధంగా పోషమ్మ కుమారుడు రాములు కూడా మూడు పెళ్ళిళ్ళు చేసుకున్నాడు. మొదటి భార్యకు పద్దెనిమిది వేలు, రెండవ, మూడవ భార్యలకు పదహారు వేల రూపాయల చొప్పున కొని తెచ్చామని పోషమ్మ తెలిపింది.

మా కులంలో ఆడపిల్లలు ఎంత మంది పుడితే తల్లిదండ్రులు అంత సంతోషిస్తారని వీరంటున్నారు. ఈ తెగకు చెందిన వారు నగరంలోని బేగంపేట, ఇందిరాగాంధీపురం,

ఫలక్‌నుమా, మూసాపేట, హౌజింగ్ బోర్డు కాలనీ, జగద్గిరి గుట్ట, అల్లాపూర్‌లలో పూరి గుడిసెలను వేసుకొని జీవిస్తున్నారు.

## ముమ్మిడివరం అభివృద్ధికి కృషి చేస్తా.

*ఈనాడు **23-9-1998** తూర్పుగోదావరి జిల్లా*

ముమ్మిడివరం, సెప్టెంబరు 22 (న్యూస్‌టుడే): ముమ్మిడివరంలో అస్తవ్యస్తంగా ఉన్న రోడ్లు, డ్రెయిన్ల ఆధునీకరణకు ప్రత్యేక నిధులను కేటాయించి వాటి అభివృద్ధికి కృషి చేస్తానని ముమ్మిడివరం మార్కెట్ ఏరియాలో నూతనంగా నిర్మితమైన దేవాలయంలో కనకదుర్గ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించేందుకు విచ్చేసిన ఎం.ఎల్.ఎ. కు స్థానిక ప్రజలు తమ ఇబ్బందులు మొరపెట్టుకొగా ఎం.ఎల్.ఎ. స్పందించి పై విధంగా హామీ ఇచ్చారు. శ్రీకనకదుర్గమ్మ వారి ఆలయంలో సోమవారం ముమ్మిడివరం ఎం.ఎల్.ఎ. చెల్లి వివేకానంద వేద మంత్రోచ్చారణల మధ్య అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అనంతరం స్థానిక ప్రజలు పడుతున్న ఇబ్బందులపై చేసిన ఫిర్యాదులను పరిశీలించారు. బుడగజంగాలకు ఎస్.సి. కులధ్రువీకరణ పత్రాలను స్థానికంగా ఉన్న ఎం.ఆర్.ఒ.లు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని బుడగజంగాల సంఘం జిల్లా అధ్యక్షుడు మోటూరి రాము విజ్ఞప్తి చేయగా, దీనిపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఏడు, ఎనిమిది వార్డులలో రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్న దృష్ట్యా వెంటనే రోడ్లను ఆధునీకరించాలన్న ప్రజల కోరికకు స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో దేశం పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల ఆదినారాయణమూర్తి, నాయకులు దొమ్మేటి రామసుబ్రహ్మణ్యం, పి. విజయభాస్కరవర్మ, విళ్ళ వీరాస్వామినాయుడు, పెదపూడి కృష్ణారావు, నేర్లగంటి వీరన్న, నామాల మరిడియ్య ప్రభృతులు పాల్గొన్నారు.

## బుడగ జంగాలకు ఎస్.సి. గుర్తింపు.

*వార్త 25-4-1998*

హైదరాబాద్, ఏప్రిల్ 24(ప్రభాతవార్త): రాష్ట్రవ్యాప్తంగా బుడగ జంగాలను ఎస్.సి.లుగా గుర్తించి, ఈ మేరకు వారి పిల్లలకు ఎస్.సి. సర్టిఫికెట్లు జారీ చేయాలని అన్ని జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్నట్లు రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి కడియం శ్రీహరి ప్రకటించారు. ఈ మేరకు రాష్ట్ర అసెంబ్లీలో శుక్రవారం జీరో అవర్ సందర్భంగా కల్వకుర్తి శాసనసభ్యులు ఎడ్మకిష్టారెడ్డి లేవనెత్తిన ప్రశ్నలకు సమాధానమిచ్చారు.

## అభివృద్ధికి జన్మభూమి దోహదం:

*భన్వర్‌లాల్, ఈనాడు 5-1-1998*

సోమాజిగూడ, హైదరాబాదు, జనవరి 4(న్యూస్‌టుడే): జన్మభూమిలో స్వచ్ఛందంగా పాల్గొని సమాజ వికాసానికి తోడ్పడాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్



జన్మభూమిలో భాగంగా చింతలబస్తీలోని బుడగ జంగం కమ్యూనిటీ హాలులో ఏర్పాటు చేసిన ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న కలెక్టర్ భన్వర్‌లాల్ ప్రభృతులు

భన్వర్‌లాల్ అన్నారు. అయిదో విడత జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నాలుగవరోజైన ఆదివారం కలెక్టర్ నగరంలోని వివిధ నియోజక వర్గాలలో పర్యటించారు. చింతల్‌బస్తీలోని స్థానిక బుడగజంగం బస్తీ కమ్యూనిటీ హాలు వద్ద ఏర్పాటు చేసిన ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక మహిళలు కలెక్టరు భన్వర్‌లాల్‌కు సమస్యలు విన్నవించుకున్నారు. తమ బస్తీలో సులభ్ కాంప్లెక్స్ సౌకర్యం లేకపోవడంతో బుడగజంగం బస్తీ వాసులంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని శంకర్ అనే స్థానికుడు కలెక్టర్ దృష్టికి తెచ్చాడు. దీనికి కలెక్టర్ స్పందిస్తూ మీరంతా కలిసి పదిహేను శాతం నిధులు సమకూరిస్తే మిగతా ఎనభైఐదు శాతం నిధులను ప్రభుత్వం భరించి సులభ్ కాంప్లెక్స్ నిర్మిస్తుందని హామీ ఇచ్చారు. జన్మభూమిలో భాగంగా స్థానిక మహిళలకు కలెక్టర్ ఉచితంగా అక్షరజ్యోతి కిట్స్ అందజేశారు. కలెక్టరు వెంట జిల్లా రెవెన్యూ అధికారి డా॥ అశోక్, ఛీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ ఘనశ్యాంలాల్, ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నోడల్ అధికారి డా॥సుదర్శన్ సింగ్, తదితరులు జన్మభూమిలో పాల్గొన్నారు. అనంతరం డి.ఆర్.ఓ., సి.పి.ఒ., ఆసిఫ్‌నగర్ నియోజకవర్గం నోడల్ అధికారి తదితరులు సయ్యద్‌నగర్ ఫస్ట్‌లాన్సర్‌లలో ఏర్పాటైన జన్మభూమి కార్యక్రమంలో పాల్గొని గర్భిణీలకు ఆడపిల్లల సంరక్షణ పథకం లబ్దిదారులకు ఆర్థిక సహాయం, నిరక్షరాస్యులకు అక్షరజ్యోతి కిట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ఇక్కడ ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గత నాలుగు రోజులుగా స్థానికంగా నిర్వహిస్తున్న జన్మభూమి కార్యక్రమంలో పాల్గొంటున్న బి.జె.ఆర్. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణ, నలుగురు అధ్యాపకులు, నలభై మంది విద్యార్థులను అధికారులు, స్థానికులు అభినందించారు.

## బుడిగెజంగాల భూరి కళారూపం

***ఈనాడు (వరంగల్ జిల్లా అనుబంధం) 22-8-1997***

జంగం కథలు చెప్పే వారిని బుడిగెజంగాలని పిలుస్తారు. బుడిగె అనే వాయిద్యంతో కథలు చెపుతారు కాబట్టి వీరిని బుడిగె జంగాలు అని వ్యవహరిస్తారు. వీరు శైవసంబంధ

కథలు మాత్రమే చెపుతూ తిరుగుతుంటారు. దేశింగురాజు కథ, పలనాటి బాలచంద్రుడు, మైరావణ, సిరియాళ చరిత్ర, వామన విజయం, అంబరీషోపాఖ్యానం, ఉషాపరిణయం మొదలైనవి వీరు చెప్పే కథల్లో ప్రధానమైనవి. కథ చెబుతున్నప్పుడు తాంబురా, అందెలు ప్రధాన కథకుడు వాయిస్తూ ఉంటాడు. వంతగాళ్ళు బుడిగెలు వాయిస్తూ వంత పలుకుతారు.

శవయాత్రలో శంఖాన్ని ఊదుతూ, గంట వాయిస్తూ, శవం ముదుండి శ్మశానవాటిక వరకూ వెళ్ళి ఆ కార్యక్రమాన్ని పూర్తి చేస్తారు. జంగాల్లో అనేక తెగలవాళ్లున్నారు. కొంతమంది పులితోలు కట్టుకొని నృత్యం చేస్తారు. మరికొంత మంది వేషాలు వేస్తారు. ఈ బుడిగె జంగాలు ఆంధ్రప్రదేశ్‌లోని అనేక ప్రాంతాల్లో ఉన్నారు. వరంగల్ జిల్లాలో కూడా అనేకమంది ఉన్నారు. జిల్లాలోని సోమారం, కొడకండ్ల, ఏడునూతుల, చెన్నూరు, ఇల్లెంద, అమ్మాపురం, నారాయణపురం గ్రామాల్లో కడెం, పూర, కిన్నెర, బూతం ఇంటిపేర్లు గల బుడిగెజంగాలు అనేక మంది కనిపిస్తారు.

## ఇరవై యేళ్ళయినా 'పట్టాలు' రాని బుడ్గజంగం బస్తీ

***వార్త 12-11-1996 (హైదరాబాదు)***

అలియాబాద్, నవంబర్11 (ప్రభాతవార్త) : గత ఇరవై సంవత్సరాలుగా గుడిసెలు వేసుకొని జీవిస్తున్న తమకు ఇప్పటివరకు భూమి పట్టాలు రాలేదని జంగం మెట్ మునిసిపల్ డివిజన్‌లోని 'బుడ్గ జంగం బస్తీ' వాసులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 1975-76 ప్రాంతంలో తాము ఫలక్‌నుమా స్టేషన్ రోడ్‌లో సీలింగు భూమిలో గుడిసెలు వేసుకున్నామని వారు తెలిపారు. సంబంధిత అధికారులు తమకు పట్టాలు ఇవ్వాలని వారు కోరుతున్నారు.

## వర్గీకరణ తీర్మానం ఆమోదంపై హర్షం

*ఆంధ్రజ్యోతి 24-4-1996*

హైదరాబాద్, ఏప్రిల్ 3 (స్పాట్‌న్యూస్). షెడ్యూల్డు కులాల వర్గీకరణను సమర్థిస్తూ శాసన సభ బుధవారం ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించడం పట్ల ఆంధ్రప్రదేశ్ బుడ్గ జంగం సంక్షేమ సంఘం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేసింది. దశాబ్దాలపాటు షెడ్యూలు కులాలవారిని పలు రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయే తప్ప వారి సంక్షేమం కోసం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆ సంఘం నాయకులు టి.జె.జంగయ్య ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## కడుపునింపని కళాప్రదర్శనలు - ఆవేదనలో బుడగ జంగాలు

*ఈనాడు 29-12-1993 మహబూబ్‌నగర్*

ఖిల్లాగణపురం, డిసెంబరు 28 (న్యూస్‌టుడే) : తరతరాల సంస్కృతిని భావి తరాలకు అందిస్తూ పురాణగాథలను కళారూపాలలో ప్రదర్శిస్తూ జీవనం సాగించే జాతులలో బుడ్గజంగాలు చెప్పుకోదగినవారు. వీరు పౌరాణిక కధలను, జానపద గాథలను



యక్షగానాలుగా ప్రదర్శిస్తారు. ఆచారాన్నిబట్టి శైవ మతాన్ని అవలంబించే వీరు దేవయాని చరిత్ర, భక్త ప్రహ్లాద, చంద్రహాస, బాలనాగమ్మ, కాంభోజరాజు కధ, కనకతార, సతీఅనసూయ, సతీ సావిత్రి, సతీ తులసి వంటి పౌరాణిక, జానపద గాధలను కర్ణపేయంగా గానం చేస్తూ ఊరూరా తిరుగుతూ ప్రదర్శనలిస్తారు. కుటుంబులోని సభ్యులందరూ యక్షగానప్రదర్శనలో మంచి పరిజ్ఞానం కలిగి ఉండేలా శిక్షణ ఇచ్చి తయారు చేస్తారు. ప్రతి పదిహేను రోజులకోసారి మరో ఊరు చేరుకునే బుడగజంగాల వారు చాపలు అల్లుతూ కొద్దో, గొప్పో సంపాదిస్తారు. బుడిగె, తంబూర, అందెల వంటి వాద్య సాధనాలతో పాటు తబలా, హార్మోనియం, తాళాలు ఉపయోగిస్తూ మధురమైన కంఠం వినిపించే వారికి శాస్త్రజ్ఞానం లేకున్నా తరతరాలనుండి గాన మాధుర్యాన్ని సొంతం చేసుకొని కులాచారమైన యక్షగానాలు ప్రదర్శిస్తున్నారు. ప్రేక్షకుల సంఖ్యతో నిమిత్తం లేకుండా సుమారు 9 గంటలపాటు ప్రదర్శనలిచ్చే వీరు తమ బ్రతుకు దుర్భరమవుతుందని ఆందోళన చెందుతున్నారు. పెళ్ళిళ్ళ సందర్భంగా వచ్చే బంధువులకు, భోజనం కాకుండా పావుశేరు బియ్యం ఇచ్చే ఆచారం కల్గిన బుడగ జంగాలవారు, తమ ఆచార వ్యవహారాలలో ఎంతో బాధ్యతగా ఉంటారు. ఆచార వ్యవహారాలో వారికి శ్రద్ధ, పట్టుదల ఎక్కువ.

వైజ్ఞానికంగా అభివృద్ధి చెందిన నేటి సమాజంలో రేడియోలు, సినిమాలు, టీ.వీలు పల్లె పల్లెలో అవతరించడంతో బుడగ జంగాల ప్రదర్శనలకు ప్రజల ఆదరాభిమానాలు రోజురోజుకూ తగ్గిపోతున్నాయి. గతంలో వీరిచ్చే ప్రదర్శనలకు ప్రేక్షకులు తమ వంతు కర్తవ్యంగా ధన, వస్త్ర సహాయం చేసేవారు. ప్రదర్శనల అనంతరం వీరి పిల్లలు, స్త్రీలు ఇంటింటికి వెళ్ళి ఆహారం కొరకు భిక్షాటన చేసేవారు. వచ్చింది తింటూ కాలాన్ని గడిపే వీరికి నేడు సంఘంలో ప్రజాదరణ కొరవడి ఉపాధి లేక నరకయాతనలు అనుభవిస్తున్నారు. వృత్తి జీవనాన్నే ఆదర్శంగా తీసుకొని కాలం వెళ్ళబుచ్చుతున్న బుడగజంగాలకు ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయ సహకారాలు అందడం లేదు. దారిద్ర్య జీవితాన్ని అనుభవిస్తున్న నిరక్షరాస్యులైన కారణంగా తమ పిల్లలను సైతం తీర్చి దిద్దలేకపోతున్నామని వాపోతున్నారు. వీరికి స్వంత ఇళ్ళు, ఆస్తులు లేవు.

తాత్కాలికంగా గుడిసెలలోనే కాలం గడుపుతున్నారు. ప్రస్తుతం వీరిచ్చే ప్రదర్శనలకు ఆదరణ కొరవడిన కారణంగా పలు గ్రామాల్లో చాపలు అల్లుతూ వాటిని అమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారు. ఉదయాన లేచి మగవారు ఈతకమ్మలకోసం అడవంతా గాలించి కమ్మలు తీసుకొని వచ్చి స్త్రీలకు ఇస్తారు. స్త్రీలు, పిల్లలు, పెద్దలు అందరూ రెండు రోజులకు ఒక్కొక్కరు ఒక్కొక్క చాప చొప్పున అల్లుతారనీ తెలిపారు. రోజంతా కష్టించి పని చేసినా ఒక్క చాప పది నుండి 15 రూపాయల దాకా అమ్ముడు పోతాయని అన్నారు. చాపలను ఇతర దూర ప్రాంతాలకు వెళ్ళి అమ్ముతూ దుర్భరంగా జీవనం గబుపుతున్నామని అన్నారు. ప్రభుత్వం వీరికి నేటికి గృహ, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించడం లేదని ఆందోళన చెందుతున్నారు. తమ ఆర్థిక స్థితి మారటం లేదని అన్నారు. ఖిల్లాగణపురం, శాపురం, రుక్కన్నపల్లి, మానాజిపేట, వెంకట్రాంపల్లి, బలిజపల్లి తదితర గ్రామాల్లో బుడగ జంగాలు జీవిస్తున్నారు. వృత్తితో జీవనం దుర్భరమైనా వదలకుండా ప్రదర్శనలిచ్చే తమకు ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని వారు కోరుతున్నారు. బుడగ జంగాల పిల్లల విద్యాభివృద్ధికై హాస్టల్ వసతి, తమకు గృహ, ఆర్థిక సాయం కల్పించాలని కోరుతున్నారు. వారిలో యువకులు తమకు ఇతర వృత్తులలో శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి పొందే మార్గాలు చూపించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



ఖాలపల్లి గ్రామంలో బుడగ జంగాలకు ఇళ్లస్థలాలు పంపిణీ చేస్తున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మోహన్‌గౌడ్, పక్కన ఎమ్మార్వో కుతుబుద్దీన్

# రాష్ట్ర ఎస్టీ జాబితా సవరణకు బ్రేకు

***ఈనాడు 19-5-1992***

న్యూఢిల్లీ, మే 18 (న్యూస్‌టుడే) : నిర్దిష్ట కులాలను షెడ్యూల్డు తెగలకు (ఎస్.టి) సంబంధించి రాజ్యాంగ షెడ్యూలులో చేర్చాల్సిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిఫారసు చేస్తే తప్ప ఇలాంటి విషయాల్లో కేంద్రం తనంతట తాను నిర్ణయం తీసుకోజాలదని లోక్‌సభ పిటిషన్ల కమిటీ రూలింగ్ ఇచ్చింది. ఎం.పి. బండారు దత్తాత్రేయ గత ఏడాది డిసెంబరులో సభకు సమర్పించిన నాలుగు ధరఖాస్తులపై కమిటీ తన అభిప్రాయాలు వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదనలు అందనందువల్ల ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం తనంతట తానుగా జోక్యం చేసుకోవలసిన అవసరం లేదని అభిప్రాయపడింది.

దత్తాత్రేయ తన ధరఖాస్తులో నాలుగు కులాలను షెడ్యూల్డు తెగల్లో చేర్చాలని కోరారు. అవి. 1) పార్ధీపర్ధాన్ 2) **బుడగ జంగం** 3) వడ్డెర 4) కుర్న/కుర్మ గొల్ల కులాలు - ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించి 1950 సంవత్సరపు ఆదేశానికి అనుగుణంగా ఈ నాలుగు కులాలను ఎస్టీల జాబితాలో చేర్చాలని ఆయన సూచించారు.

షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలకు సంబంధించి ప్రస్తుత జాబితాల్లో ఏ కులాన్నయినా చేర్చడానికి అనుసరించాల్సిన నిర్దిష్ట నియమాలను కేంద్ర సంక్షేమ మంత్రిత్వశాఖ గత ఫిబ్రవరి 19 న ఈ కమిటీకి తెలియజేసింది. ఈ నియమాలకు సరితూగిన కొన్ని కులాలను సంబంధిత జాబితాల్లో చేర్చారు. అయితే పార్ధీ కులాన్ని ఏ ప్రాతిపదికపై ఆంధ్రప్రదేశ్‌లో ఒ.బి.సి.ల జాబితాలో చేర్చాలో కేంద్రానికి తెలియదు.

రాష్ట్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని 341, 3ఏ అధికరణ కింద సిఫారసు చేస్తేనే ఏ కులాన్నయినా ప్రస్తుత ఎస్సీ, ఎస్టీల జాబితాల్లోకి చేర్చడానికి వీలవుతుందని సంక్షేమశాఖ పేర్కొంది. ఎస్సీ, ఎస్టీ ల జాబితాలను సమగ్రంగా సవరించాలని తలపెట్టిన దృష్ట్యా ఈ విషయంలో ప్రతిపాదనలు చేయవలసిందిగా రాష్ట్ర ప్రభుత్వాలను, కేంద్రపాలిత ప్రాంతాల

పాలన యంత్రాలను కేంద్రం కోరింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా తన ప్రతిపాదనలు పంపినప్పటికి వడ్డెర, బుడగ జంగం కుర్మ / కుర్మ గొల్ల కులాలను రాష్ట్రంలో షెడ్యూల్డు తెగల (ఎస్టీ) జాబితాలో చేర్చాలని మాత్రం సిఫారసు చేయలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందాకే ఈ కులాలను ఎస్టీల జాబితాలో చేర్చే విషయాన్ని పరిశీలించ నున్నట్టు మంత్రిత్వశాఖ తెలిపింది.

షెడ్యూల్డు తెగలకు సంబంధించి 1950 వ సంవత్సరపు రాజ్యాంగ ఆదేశాన్ని ఎప్పటికప్పుడు సవరించినట్టు కమిటీ పేర్కొంది. దీని ప్రకారం పర్ధాన్ కులాన్ని ఆంధ్రప్రదేశ్‌లో ఎస్టీ జాబితాలో చేర్చారు. పార్ధీలకు ఒ.బి.సి.జాబితాలో స్థానం కల్పించారు. బుడగజంగం కులాన్ని బెడజంగం కులంతోపాటు షెడ్యూల్డు కులంగా గుర్తించారు.

బుడగజంగం కులాన్ని ఎస్టీ జాబితాలోకి మార్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎలాంటి ప్రతిపాదన చేయలేదు. అలాగే వడ్డెర, కుర్మ/కుర్మ గొల్ల కులాలను ఎస్సీ జాబితాలో చేర్చాలని కూడా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించలేదు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు అందాకే ఈ దరఖాస్తులను పరిశీలించాలన్న సంక్షేమ మంత్రిత్వశాఖ అభిప్రాయంతో కమిటీ ఏకీభవించింది.

## బతుకు దుర్భరమైన బుడగ జంగాలు

*ఆంధ్రభూమి* ***8-4-1992***

మాచారెడ్డి, ఏప్రిల్ 7 : (న్యూస్‌ప్లాష్) : అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలకు నోచ్చుకోక, అసలు ప్రభుత్వం గుర్తింపులేక కనీస ఆదనణ కరువై పొట్టకూటికోసం సంచార జీవనం సాగిస్తున్న 'బుడగ జంగాలు' దుర్భర జీవితాలు గడుపుతున్నారు. ప్రభుత్వాలు ఎన్ని మారినా ఈ బడుగు జీవులకు కనీస సౌకర్యాలు అందని పళ్ళయ్యాయి. దాదాపు నాలుగు వందల సంవత్సరాల క్రితం



## బుడగ జంగాల బతుకు దుర్భరం

సమాజానికి దూరంగా అనాగరికంగా జీవించే బుడగ జంగాలు ప్రస్తుతం ఆ పరిస్థితులు మారినా ఇంకా అనాగరికంగానే జీవిస్తున్నారు.

పూర్వకాలంలో బుడగలు, తంబుర వాయిస్తూ జానపద పాటలతో పల్లె ప్రాంతాల్లో పాటలు పాడి, భిక్షమెత్తుకొని పొట్టపోసుకునేవారే ఈ బుడగ జంగాలు. వీరు సమాజంలో మారిన పరిస్థితులకు అనుగుణంగా తమ సొంత జీవితాలకు స్వస్తిపలికి, జనజీవన స్రవంతిలో కలిసి జీవించాలనే కుతూహలంతోనే ఓవైపు కష్టపడి పనిచేస్తూ, మరోవైపు ప్రభుత్వం కల్పించే సదుపాయాలను పొంది దుర్భర జీవనం నుంచి గట్టెక్కాలని తహతహలాడారు. కాని వారి కులాన్ని ప్రభుత్వం ఆదరించటం లేదు. పూర్వం తొమ్మిది వందల సంవత్సరాల క్రితం బసవేశ్వరుని మతమైన వీరశైవాన్ని స్వీకరించిన వారిని 'జంగాలు' అని పిలిచేవారట. ఈ కాలంలో జంగాలకు పల్లె ప్రాంతాల్లోగల జమీందార్ల, ధనవంతుల ఆదరాభిమానాలు బాగా ఉండేవి. కాలక్రమేణా వీరు ఆర్థికంగా వెనుకబడి ఆస్తులు కోల్పోయి అంటరానివారుగా, సమాజానికి దూరంగా కొండ ప్రాంతాలలో దుర్భర జీవితం గడుపుతున్నారు. అప్పటినుంచి వారు 'బుడగ జంగాలు' అని పిలువబడుతూ ప్రభుత్వ గుర్తింపునకు నోచుకోక ఆటవిక జీవనం సాగిస్తున్నారు.

ప్రభుత్వం బుడగ జంగాలను షెడ్యూల్డు కులాల వారిగా గుర్తించింది. కాని కనీస సౌకర్యాలు కల్పించలేదని గ్రామీణ ప్రాంత బుడగ జంగాలు తెలిపారు. కుల

ధృవపత్రం అందక అనేక అవస్థలు పడుతున్నామని వారు వాపోయారు. కుల ధృవ పత్రాల కోసం మండల రెవిన్యూ కార్యాలయాలకు వెళితే వెనుకబడిన కులాల వారీగా సర్టిఫికెట్స్ ఇస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో తమ సంక్షేమం కోసం మంజూరయ్యే కనీస సౌకర్యాలు దూరమైపోతున్నాయని వారు తెలిపారు. అందని గుర్తింపు తమకెందుకని వారు వాపోతున్నారు. నానా కష్టాలు పడుతున్నామని వారు తెలిపారు. తమ పిల్లలను చదివించడంలేదని, ఒకవేళ చదివించినా ఎటువంటి ప్రయోజనం చేకూరక వ్యవసాయ కూలీలుగా మారారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పొద్దంతా చాపలు అల్లుకొని జీవనం సాగిస్తు రాత్రంతా భిక్షమెత్తి పొట్టపోసుకుంటున్నామని ఒక వృద్ధురాలు వాపోయింది. ఎంత భయంకర వ్యాధులు సోకినా ఆకుపసర్లె తమ వైద్య చికిత్సకు శ్రీరామరక్ష అని చెప్పింది. తమ పిల్లల జీవితం ఎంగిలి మెతుకులమయమేనని పలువురు స్త్రీలు వాపోయారు. అడుక్కుతినే బతుకు తమకు దేవుడందించిన శాపమని ఒక వృద్ధుడు తెలిపాడు. స్వతంత్ర గణతంత్ర దినోత్సవాల ఘనత మాకేం తెలుసు. ఏదో ఒక పండుగ అనుకుని అక్కడ పంచే గోలీలు, మిఠాయిలను అడుక్కోవటమేగాక కిందపడ్డవాటిని ఏరుకుని తింటామని పలువురు పురుషులు చెప్పారు. మనుషుల జాతికి చెందినవారమా కాదా అని అనిపిస్తుందన్నారు. తమకు కనీస సౌకర్యాలను కల్పించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## కులధృవీకరణలో జాప్యం తగదు.

*ఈనాడు* ***5-1-1992***

పిఠాపురం, జనవరి 4(న్యూస్‌టుడే) : తమ కులానికి చెందిన విద్యార్థులకు కుల సర్టిఫికెట్‌లు మంజూరులో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పిఠాపురం మండలం బుడగ జంగాల సంక్షేమ సంఘం అధ్యక్షుడు నిండుకొండ శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. తమను షెడ్యూల్ కులాల వారిగా గుర్తించారని, తూర్పు గోదావరి జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో కుల సర్టిఫికెట్‌లు ఇస్తున్నారని,అయితే కాకినాడ డివిజన్‌లోని

మండలాల్లో కుల సర్టిపికెట్‌ల మంజూరులో ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆయన తెలిపారు. సకాలంలో కులసర్టిఫికెట్ అందక నిండుకొండ నూకరాజు అనే విద్యార్థి విద్యాసంవత్సరాన్ని వృధాగా పోగొట్టుకున్నాడని ఆయన తెలిపారు. పిఠాపురం మండలంలోని బుడగ జంగాలకు తినడానికి తిండి, కట్టుకోవడానికి బట్ట, ఉండటానికి ఇల్లు లేక కటిక దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని ఆయన తెలిపారు. పిఠాపురం మండలంలోని బుడగ జంగాలకు చెందినవారికి ఎస్.సి. కులం సర్టిఫికెట్లు మంజూరు చేసి తమను హీనస్థితినుండి కాపాడవలసిందిగా ఆయన ఆ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

## బుడిగిజంగం బస్తీలో నల్లా ప్రారంభం



బుడిగిజంగం బస్తీలో నల్లాను ప్రారంభిస్తున్న అబ్దుల్ సత్తార్, ఇతర దేశం నాయకులు

ఆబిడ్స్, ఫిబ్రవరి 20 (ప్రభాతవార్త) లకు ఆదర్శంగా నిలవాలని అబ్దుల్ సత్తార్ పేర్కొ
వరసుర సహకారం వంటే ప్రజోపయోగ నను నారు. తదనంతరం ఎం.డి.నరేశ్ మాటాడుతూ

## బుడగ జంగాలకి 5 వయోజన విద్యా కేంద్రాలు

*ఈనాడు **8-8-1991** (హైదరాబాదు)*

బాగ్ అంబర్‌పేట్, ఆగస్టు 7 (న్యూస్ టుడే) : బలహీన వర్గాల్లో నెలకొన్న నిరక్షరాస్యతను నివారించడానికి హిందుస్థాన్ పెట్రోలియం సంస్థ స్వంత నిధులతో

జంట నగరాల్లో బుడగ జంగాల వారికోసం ప్రత్యేకంగా ఐదు వయోజన విద్యా కేంద్రాలను నెలకొల్పి అక్షరాస్యత సాధనకై కృషి చేస్తోంది. ఉస్మానియా విశ్వ విద్యాలయం వయోజన విద్యా విస్తరణ కేంద్రం ఆధ్వర్యంలో ఈ కేంద్రాలు నిర్వహిస్తూ, వీటి నిర్వహణకు అయ్యే మొత్తం ఖర్చును ఈ సంస్థ భరిస్తున్నట్లు వయోజన విద్యా విస్తరణ కేంద్రం సంయుక్త కార్యనిర్వహణాధికారి తెలిపారు. నగరంలో గల హబ్సిగూడ, సంతోష్‌నగర్, జిల్లెలగుడ, లెనిన్‌నగర్, మాదన్నపేట్, చంపాపేట్ ప్రాంతాల్లో బుడగ జంగాల వారి అక్షరాస్యతకై పెట్రోలియం సంస్థ వయోజన విద్యా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఈ కేంద్రాల్లో చదువుకోవడానికి, ప్రజలు ముందుకు రావడానికి పెట్రోలియం సంస్థ పలు సౌకర్యాలు కల్పించింది. చదువుకోవడానికి వచ్చేవారికి ఉచితంగా పుస్తకాలు, పలకలు, బలపాల కిట్స్‌తో పాటు వారిలో క్రీడాశక్తిని పెంపొందించడానికి ఆట పరికరాలను కూడ సంస్థ అందిస్తోంది. అత్యధిక శాతం నిరక్షరాస్యులుగా ఉన్న బుడగ జంగాలవారి సంక్షేమం కోసం సంస్థ స్వంత నిధులతో మహిళలకు కుట్టు, ఎంబ్రాయిడరీలలో శిక్షణనిచ్చే ఏర్పాట్లను కూడ చేస్తోందని విస్తరణాధికారి తెలిపారు.

## మట్టిలో మాణిక్యాలు 'బుడగ జంగాలు'

– శాంతా కృష్ణన్

*ఈనాడు 4-5-1991*

జమిస్తాన్‌పూర్, మే 3 (న్యూస్‌టుడే) : తమ జీవనశైలిలో ప్రాచీన కళా సంస్కృతులను ఇనుమడింప చేసుకొని మట్టిలో మాణిక్యాలుగా బతుకుతున్న బుడగజంగం కళాకారుల అభ్యున్నతికి ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకునేలా తాము తీవ్ర కృషి జరుపుతున్నామని ప్రముఖ విద్యావేత్త శాంతాకృష్ణన్ అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీలోని వయోజన విద్యా విస్తరణ కేంద్రంలో గతంలో డైరెక్టర్‌గా పనిచేసి, ప్రస్తుతం న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీలో విద్యావేత్తగా ఉన్న శాంతాకృష్ణన్ రాష్ట్రంలోని బుడగజంగాలు నివసించే ప్రాంతాలలో పర్యటించడానికి గాను ఏప్రిల్ 30వ తేదీన నగరానికి వచ్చారు. గత నాలుగు రోజులు ఆమె రాష్ట్ర




సాంఘిక సంక్షేమ అధికారులతో కలిసి బుడగ జంగంవారు నివసించే బోడుప్పల్ ప్రాంతంలో, మహబూబ్‌నగర్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని ప్రాంతాలలో ఆమె పర్యటించారు. ఆమె తిరిగి న్యూఢిల్లీ వెళ్లిపోతున్న సందర్భంలో 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వెనుకబడిపోతున్న ఈ జాతి ప్రజలకు ప్రభుత్వం ద్వారా అందవలసిన చేయూత విషయమై ప్రభుత్వ ఉన్నతాధికారులతో చర్చించినట్టు ఆమె చెప్పారు. నగరంలోని బోడుప్పల్‌లో నివాసముంటున్న అనేకమంది బుడగజంగం కళాకారులు ఆస్తిపాస్తులు లేక తమకు అబ్బిన అద్భుతమైన జానపద కళా సంస్కృతులను ప్రదర్శిస్తూ పాటలు పాడుతూ భికమెత్తుకుని జీవనం కొనసాగిస్తున్నారని ఆమె చెప్పారు. వ్యవసాయ పనులను తమకున్న కొద్దిపాటి భూమిలో చేసుకుంటున్నారని ఆమె చెప్పారు. వీరికి ప్రభుత్వం ఉద్దేశస్తున్న పలు సంక్షేమ పథకాలు తెలియచేయడం తమ పర్యటన ఉద్దేశమన్నారు. ఈ జాతి అంతరించిపోకుండా వారి కళా విలువలను కాపాడుతూ వ్యవసాయ వృత్తిలో వారికి సహాయాన్ని అందించి వారిలోని నిరక్షరాస్యతను, పేదరికాన్ని నిర్మూలించడానికి ప్రభుత్వం చేయవలసిన కృషి ఎంతో ఉన్నదని ఆమె చెప్పారు. ఇలాంటి దరిద్ర నారాయణుల కష్టార్జితాలే ధనవంతులకు మేడలుగా రూపొందుతున్నాయని ఆమె

అన్నారు. తమ పర్యటనలో హిందుస్తాన్ పెట్రోలియం సంస్థ ఉన్నతాధికారులు, సాంఘిక సంక్షేమశాఖ ఉన్నతాధికారులు పాల్గొన్నట్టు ఆమె చెప్పారు.

## మట్టిలో మాణిక్యాలు

*ఈనాడు* ***24-4-1991*** *హైదరాబాదు*

జమిస్తాన్‌పూర్, ఏప్రిల్ 23 (న్యూస్‌టుడే): బాబాసాహెబ్ అంబేద్కర్ ఉత్సవాలలో పాల్గొనేందుకు న్యూఢిల్లీ వెళ్ళిన బుడగ జంగం కళాకారులు సోమవారం నగరానికి తిరిగి వచ్చారు. ఉస్మానియా యూనివర్శిటీ 'నిరంతర విద్యా విస్తరణ కేంద్రం' ఆధ్వర్యంలో ఈ కళాకారులు శిక్షణపొందారు. హిందూస్తాన్ పెట్రోలియం సంస్థ ఆర్థిక సహాయంతో బోడుప్పల్ ప్రాంతాన్ని దత్తత తీసుకుని అక్కడ దీనంగా జీవనం గడువుతున్న 488 కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు విద్యా విస్తరణ కేంద్రం చర్యలు తీసుకుంది. ఈ కుటుంబాల వారి పిల్లలకు విద్యాసౌకర్యాలు కల్పించింది, వారిని కళాకారులుగా తీర్చిదిద్దింది. కళాకారులలో పదిమంది సభ్యుల బృందం అంబేద్కర్ శతజయంత్యుత్సవాల సందర్భంగా కొత్త ఢిల్లీలోని వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈనెల 14వ తేదీ నుంచి కొత్త ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో జరిగిన డాక్టర్ అంబేద్కర్ మేళాలో వీరు పాల్గొని పలు జానపద నృత్య కళారూపాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ప్రధాన మంత్రి చంద్రశేఖర్, సంక్షేమ శాఖ మంత్రి రామ్‌జీ లాల్ సుమన్ మొదలగు ప్రముఖులు హాజరయ్యారు. భిక్షమెత్తుకునే వీరిని వీధి కళాకారులు తీర్చిదిద్ది పురాతన కళాసంస్కృతులను పునరుజ్జీవింపచేస్తున్న హిందూస్థాన్ పెట్రోలియంను, ఉస్మానియా విశ్వవిద్యాలయ విద్యా విస్తరణ కేంద్రాన్ని, వీరికి శిక్షణను ఇచ్చిన శిక్షకులను ప్రధాన మంత్రి చంద్రశేఖర్ ప్రశంసించారు. వీరు దేశ రాజధాని అయిన న్యూఢిల్లీలోని అనేక ప్రాంతాల్లో ప్రదర్శనలు ఇచ్చారు. 20వ తేదీన అంబేద్కర్ జీవిత చరిత్ర, దళిత జనోద్ధరణకు ఆయన చేసిన సేవలను వివరిస్తూ శిక్షకుడు ఎన్.ఆర్.నరేందర్ దర్శకత్వంలో మ్యూజిక్ టీచర్ జి.వి.ఎమ్. ఆచారి సంగీత నిర్వహణలో ఈ 'బుడగ జంగం' కళాకారులు ఢిల్లీలోని అశోక్ రోడ్‌లోగల

ఆంధ్రప్రదేశ్ భవన్‌లోని అంబేద్కర్ ఆడిటోరియంలో జానపద నృత్య రూపకాన్ని, జానపద పాటలను ప్రదర్శించారు. భాష రాకపోయినప్పటికీ ఆసక్తితో ప్రేక్షకులు తమ కార్యక్రమాలను చూసి విశేషంగా ఆదరించారని నిర్వాహకులు తెలిపారు. పదిమంది కళాకారుల్లో చిన్న పిల్లలు సైతం ఉన్నారు.

## వృత్తికి ఆదరణలేని బుడ్గ జంగాలు

*ఆంధ్రభూమి **25-11-1990** ఆదివారం కర్నూలు జిల్లా*

బుడ్గజంగం కులాన్ని ప్రభుత్వం షెడ్యూల్డు కులాల లిస్టులో చేర్చినప్పటికీ కులం సర్టిఫికెట్లు జారీచేసే విషయంలో అధికారులు ఎన్నో ఇబ్బందులు కలిగిస్తున్నారని, మా



రాము కూడా సమాజంలో పాటి మానవులలో సమానంగా వుండాల్సిందే తమ ధ్యేయమని ప్రభుత్వం మా మొర ఆలకించాలని ఆయన అన్నారు,

కర్నూలు జిల్లాలో సుమారు రెండు వేల మందికి పైగా బుడ్గ జంగాలు

వి శ్రీరాములు అన్నారు.

ఈ విషయంపై అధికారులు తగిన పత్రములు జారీచేయాలని ఆయన కోరారు.

—నిరంజన్
న్యూస్ ఫ్లాష్, నంద్యాల

బాధలు అర్థం చేసుకుని తగిన విచారణ నిర్వహించి సులభంగా కులం సర్టిఫికెట్లు

జారీ చేయాలని కర్నూలు జిల్లా నంద్యాల తాలూకా బుడ్గ జంగం వెల్‌ఫేర్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంటు శ్రీవిభూది రాముడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఈ మేరకు సత్వర చర్యలు తీసుకోవడానికి నంద్యాల నియోజకవర్గం శాసనసభ సభ్యుడు వి. రామనాథరెడ్డికి, నంద్యాల పార్లమెంటు సభ్యుడు శ్రీ బొజ్జా వెంకట రెడ్డికి, కర్నూలు సోషియల్ వెల్‌ఫేర్ డిప్యూటీ డైరెక్టరుగార్లకు శ్రీ విభూది రాముడు విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు.

నంద్యాల యమ్ఆర్ఓ కోరిన విధంగా నంద్యాల పట్టణంలోని బుడ్గ జంగం కులానికి చెందిన కుటుంబాల వివరాలను పంపినట్టు ఆయన చెప్పారు.

విద్యార్థుల స్కాలర్‌షిప్పులు, హాస్టలువసతుల్లోగాని, విద్యారంగంలో గాని,కులం సర్టిఫికెట్ల కొరకు నంద్యాల మండల రెవిన్యూ కార్యాలయంలో ఎన్నిసార్లు మనవి చేసినా చట్టపరంగా జరగవలసిన న్యాయం జరగడంలేదనీ ముఖ్యంగా తమ బుడ్గ జంగం సంక్షేమం పట్ల అధికారులు అశ్రద్ధ వహిస్తున్నారని తెలిపారు.

రాష్ట్రంలో వేల కుటుంబాలు 'బుడ్గ జంగంవారు' వున్నారనీ కర్నూలు జిల్లాలో నంద్యాల, నందికొట్కూరు, బనగానపల్లె, కోయిలకుంట్ల తాలూకాల్లో పెద్ద సంఖ్యలో వున్నారని ఆయన పేర్కొన్నారు.

సమాజంలోని అట్టడుగు వర్గాల ఉద్ధరణకు కృషి సలుపుతున్నట్టు చెప్పుకునే ప్రభుత్వం తమ విషయంలో చిన్నచూపు చూస్తున్నదని శ్రీ రాముడు విలేకరుల ముందు వాపోయారు.

'దేవుడు వరమిచ్చినా పూజారి వరమియ్యడు', అన్నట్టు ప్రభుత్వం వరమిచ్చినా, అధికార్లు సరిగా తమ హక్కులను పరిరక్షించడంలో విఫలమౌతున్నారని ఆయన ఆరోపించారు.

జీవనోపాధి కొరకు తమ కుటుంబాల వారు కడుపు చేత పట్టుకొని గ్రామాలు, గ్రామ శివార్లు తిరుగుతూ బిక్షాటన చేసుకుంటూ రాత్రి వేళల్లో "సుద్దులు"(బుర్ర కథలు) చెప్పుకొంటూ కాలం వెళ్ళబుచ్చుతున్నారని ఆయన వివరించారు.

పూర్వం సుద్దులు 'వినడానికి జనం విపరీతంగా వచ్చి వినేవారనీ' కానీ కాలం మారుతున్నందున తాము చెప్పే సుద్దులపట్ల గ్రామీణ ప్రాంత ప్రజల ఆదరణ తగ్గిందనీ ఇప్పటికైనా ప్రభుత్వం తమ బుడ్గ జంగాలపై తగిన శ్రద్ధ తీసుకోవాలని శ్రీ రాముడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

తరతరాలనుండి బుడ్గ జంగంవారు ప్రభుత్వం దృష్టిలో నిరాధారణకు గురిఅయ్యారని, తమ వృత్తికి ఈనాడు తగిన ఆదరణ లేనందువల్ల తమ పిల్లలను చదివించుకొని వుద్యోగాలు సంపాదించి తాము కూడా సమాజంలో సాటి మానవులతో సమానంగా వుండాలన్నదే తమ ధ్యేయమని ప్రభుత్వం మా మొర ఆలకించాలని ఆయన అన్నారు.

బుడ్గ జంగం కులాన్ని గతంలో జిఓ నంబరు యఫ్ 35/87 తేది 3-2-87 యస్.సిలో చేర్చినట్లు ఈ మేరకు జివో వుందని ఈ విషయంపై అధికారులు తగిన శ్రద్ధ తీసుకుని మా కులస్థులకు సులభంగా కులం సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆయన కోరారు.

-నిరంజన్.
న్యూస్‌ఫ్లాష్, నంద్యాల

## ఈ జీవితాలు తెగిన గాలిపటాలు

*ఈనాడు 29-12-1989 (హైదరాబాదు)*

# దయనీయ స్థితిలో బుడగ జంగాలు

శామీర్‌పేట, డిసెంబర్ 28 (న్యూస్‌టుడే) : స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచి పోతున్న ఎటువంటి అభివృద్ధికి నోచుకోని బుడగ జంగాలు దయనీయ పరిస్థితులలో



జీవన సమరం సాగిస్తున్నారు. బతుకు దెరువు కోసం బుడగ జంగాల వారు గ్రామాల్లో సంచరిస్తూ యాచన చేస్తూ ఉంటారు. జానపద కళల్లో వీరికి ప్రత్యేక స్థానం ఉంది. వీరు చెప్పే కథలు జంగం కథలుగా పేరుపడి ప్రజల్లో ప్రసిద్ధి పొందాయి. జంగాలు తెగిన గాలిపటాల్లా ఊరూరా తిరుగుతూ యాచక వృత్తిపై ఆధారపడి ఏ పూటకాపూట బతుకును వెళ్ళదీస్తున్నారు. వీరు రాత్రిళ్లు గ్రామస్తులకు కథలు చెపుతూ పగటి పూట జంతువులను, పక్షులను వేటాడుతూ ఉంటారు. గ్రామాలలో తాత్కాలిక ప్రాతిపదికపై నివాసాలను ఏర్పాటు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. బుడగ జంగాల తెగలోని వారు

ఈనాటికి కన్యాశుల్కం దురాచారాన్ని పాటిస్తూనే ఉన్నారు. ఈ జాతి వారిలో ఏ యువకుడైనా పెళ్ళి చేసుకునే ముందు స్వయం కృషితో డబ్బు సంపాదించి, దానిని వధువు తల్లితండ్రులకు చెల్లించి, తమకు నచ్చిన కన్యను వివాహమాడతాడు. వీరికి తమ భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించుకొనేందుకు భాష ఉంది. అయితే భాషకు లిపి మాత్రం కరువైపోయింది. బుడగ జంగం మహిళలు చాపలు అల్లడంలో నైపుణ్యాన్ని కలిగి ఉంటారు. వీరు తమ కడుపు నింపుకునేందుకు భిక్షమెత్తుతూ ఉంటారు. యాచక వృత్తిని కొనసాగిస్తూ ఉంటారు. ఖాళీ సమయాల్లో ఈ తెగలోని మహిళలు చాపలు అల్లి, వాటిని గ్రామాల్లో తిరిగి అమ్మి, వచ్చిన డబ్బులతో గంజి కాచుకొంటారు.

గ్రామాల్లో రానురాను ఉపాధి అవకాశాలు కరువవడంతో తాము పట్టణాలకు వలస పోతున్నట్లు జంగాలు చెప్పారు. మారిన కాలానికి అనుగుణంగా తమ పాత వృత్తులకు స్వస్తి చెప్పి నూతన పంథాలో తమ జీవనాన్ని కొనసాగించేందుకు ప్రభుత్వం తమకు సహకరించడం లేదని వారు ఆరోపించారు.

తమ పిల్లలను పాఠశాలల్లో చేర్పించే సమయంలో అవసరమైన కుల ధ్రువీకరణ పత్రాలను పొందడంలో తాము అనేక ఇబ్బందులకు గురవుతున్నామని వారు వాపోయారు. కుల ధ్రువీకరణ పత్రాలను పొందడంలో అధికారులు వ్యవహరిస్తున్న నిరంకుశ వైఖరి కారణంగా తాము పడే అవస్థలు చెప్పనలవిగానివిగా ఉన్నాయని బుడగ జంగాల వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా ప్రభుత్వం తమ తెగవారి ఇబ్బందులను వాస్తవ దృష్టితో గమనించి తమకు న్యాయం చేకూర్చాలని వారు అభ్యర్థిస్తున్నారు.

## రిజర్వేషన్లను సమర్థిస్తూ బుడగజంగం సమావేశం

**ఉదయం *28-12-1989* (హైదరాబాదు)**

ఫలక్‌నుమా, డిసెంబర్ 27 (టెలిన్యూస్) : దేశంలోని షెడ్యూల్డు కులాలు, షెడ్యూల్డు తెగలు, వెనుకబడిన తరగతుల రిజర్వేషన్‌లను పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం

తీసుకున్న నిర్ణయాన్ని కొంతమంది విద్యార్థులు తప్పుగా అర్థం చేసుకొని ఆందోళనా కార్యక్రమాలు చేపట్టడం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర 'బుడగజంగం' సంఘం నేడొక ప్రకటనలో విచారం వ్యక్తం చేసింది.

మంగళవారం ఫలక్‌నుమాలోని జంగంమెట్‌లో ఉన్న స్థానిక సంఘం రిజర్వేషన్లకు మద్దతుగా ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు రాష్ట్ర బుడగ జంగం సంఘ నాయకులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా స్థానిక సంఘం ఉపాధ్యక్షుడు శ్రీ తూర్పాటి జంగయ్య మాట్లాడుతూ అనేక సంవత్సరాల నుండి హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలు సాంఘికంగా, ఆర్థికంగా వెనుకబడి ఉన్నారని; అలాంటి ప్రజలకు రిజర్వేషన్‌లు కొంత ఊరట కలిగిస్తున్నాయని; రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వేషన్లకు వ్యతిరేకంగా జరుగుతున్న కార్యకలాపాల వెనుక రాజకీయ శక్తుల అండదండలతో విద్యార్థులను పెడదారి పట్టిస్తూ లాభాలు పొందాలని చూస్తున్నవారి ఆటలను విద్యార్థిలోకం తిప్పికొట్టాలని, రోజు రోజుకు పెరిగిపోతున్న పేదరిక నిర్మూలనకు చేయూతనివ్వాలని కోరారు.

గతంలో ఉన్న రిజర్వేషన్లను మరో పదేళ్ళ పాటు పొడిగిస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సహేతుకమైనదని, దీనివల్ల ఎస్.సి, ఎస్.టి, బి.సి. ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని ఆ సంఘం అభిప్రాయపడింది. రిజర్వేషన్లను వ్యతిరేకిస్తున్న విద్యార్థులు మానవతా దృష్టితో ఆలోచించాలని, తమతోటి సహచరులు తమ స్థాయికి ఎదిగేందుకు తగినవిధంగా సహాయపడాలని రాష్ట్ర బుడగ జంగం సంఘం నాయకులు కోరారు.

దేశంలోని హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతులకు చెందిన ప్రజలకు రాజ్యాంగ పరంగా హక్కులు కల్పించి సమాజంలో అందరితోబాటు సమస్థితి కల్పించాలనే ఆశయంతోనే ఈ రిజర్వేషన్లు అమలుపరుస్తున్నారని, రిజర్వేషన్లు ఎందుకు కల్పించారనే

వాస్తవాన్ని యువకులు, రాజకీయవేత్తలు, విద్యార్థులు మర్చిపోయి ఆందోళనా కార్యక్రమాన్ని చేపట్టడం విచారకరమని వారు పేర్కొన్నారు. రిజర్వేషన్లు లేకుంటే హరిజన, గిరిజన, వెనుకబడిన తరగతుల ప్రజలు ఎట్టి పరిస్థితులలోను అభివృద్ధి సాధించలేరని వారు స్పష్టం చేశారు. రిజర్వేషన్‌లకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాన్ని అన్ని పక్షాల నాయకులు ఖండించాలని వారు కోరారు.

## బుడ్గ జంగాలను ఎస్.టి.లో చేర్చండి

*ఈనాడు 4-3-1989 హైదరాబాదు*

ఎల్.బి.నగర్, మార్చి 3 (న్యూస్‌టుడే) : రాష్ట్రంలో లక్షల సంఖ్యలో ఉన్న బుడ్గ జంగాలను గిరిజనులుగా గుర్తించి ఎస్.టి. ల జాబితాలో చేర్చలని మాదన్నపేట్‌కు చెందిన నిదానకవి నారాయణ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వాతంత్ర్యం సిద్ధించి నలభై ఏళ్ళు గడుస్తున్నప్పటికి సమాజపరంగా తమ కులానికి ఇప్పటికీ తగిన గుర్తింపు లేకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. ఆర్థికంగా, సాంఘికంగా, విద్యాపరంగా ఎంతో వెనకబడిఉన్న బుడ్గజంగాల సముద్ధరణకు ఏ ప్రభుత్వం గట్టిగా పూనుకోకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్త పరిచారు. ప్రభుత్వాలు మారినా మా పరిస్థితి మాత్రం మారలేదని ఆయన వ్యాఖ్యానించారు. తమ కులాన్ని షెడ్యూల్డు కులానికి బదులుగా షెడ్యూల్డు తెగలో చేర్చినట్లైతే బావుండేదని ఆయన అభిప్రాయపడ్డారు. బుడ్గ జంగాలు గతంలో ఎన్ని వేషాలు వేసినప్పటికీ అది పొట్టకూటికోసమేనని అన్నారు. వేసిన వేషాల ప్రకారం తమను రకరకాల పేర్లతో వ్యవహరిస్తారని ఆయన తెలిపారు. బుడ్గ జంగాల కులంలో నేటివరకు ఒక్క రాజకీయ నాయకుడు లేడని అంటూ ఎంతో నికృష్టమైన జీవితాలు సాగిస్తున్న బుడ్గజంగాల సముద్ధరణకై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

# బుడ్గజంగాల బడుగు బతుకులు

*ఈనాడు* ***22-2-1989*** *కర్నూలు*

కర్నూలు, ఫిబ్రవరి 21 న్యూస్‌టుడే : బుడ్గజంగాల కులానికి ప్రభుత్వం గుర్తింపులేక అట్టడుగు వర్గాలవారి సంక్షేమం కోసం అమలు అవుతున్న పథకాలకు నోచుకోక పొట్టకూటి కోసం సంచారజీవనం సాగిస్తున్న బుడ్గజంగాల దుర్భర జీవిత కథ ఇది.




దాదాపు నాలుగు వందల సంవత్సరాల క్రితం సమాజానికి దూరంగా అనాగరికులుగా జీవించే బుడ్గ జంగాలు, ప్రస్తుతం పరిస్థితులు మారినప్పటికీ ఇంకా అనాగరికంగానే జీవిస్తున్నారు. 'బుడగ' అంటే తంబూర చేతబూని జానపద పదాలతో పల్లె ప్రాంతాలలో పాటలు పాడుకుంటూ భిక్షమెత్తుకుని పొట్ట పోసుకుంటూండేవారు బుడ్గజంగాలు. క్రమంగా ప్రజల ఆదరణ తగ్గి అంటరానివారుగా, సమాజానికి దూరంగా గ్రామాల చివరలో దుర్భరంగా జీవించ సాగారు. కర్నూలుజిల్లాలో అనేక ప్రాంతాల్లో వీరు ఉన్నారు. ప్రభుత్వం తమను ఆదుకొని తగిన సదుపాయాలు అందించి తమ బడుగు బతుకులలో వెలుగు నింపాలని బుడ్గజంగాలు విజ్ఞప్తి చేశారు.

# BUDAGA JANGAMS : A NEGLECTED TRIBE

(Deccan Chronicle : 11-2-1989)
From Budha Murali

Sangareddy : Women with babes under the arms dextrously lacing mats, moving from house to house for arms may seem to be walking machines


Budaga Jangam women weaving mats

Budaga Jangams: a neglected tribe

From Budha Murali
Sangareddy: Women with babes under the arms dextrously lacing

in the family. Women are t
heads of the family and hold enti
responsibility.

producing mats. Questions may also arise that why should they beg, after all. Scratch their lives a little and you will have stark realities of real India or 'Bharath' as some economists prefer.

Families of this kind can be seen all over the State, with different names. In Sangareddy area of Medak District, there is one such tribe called 'Budaga Jangam' Most of the total 50 families of this tribe in the district live in Narsapur, Malkapur and Chandapur villages...............

## బుడగ జంగాల పట్ల ప్రభుత్వ బాధ్యత లేదా ?

*ఆంధ్రభూమి 8-2-1989 సంగారెడ్డి, (మెదక్ జిల్లా)*

*ఆంధ్రభూమి ప్రతినిధి*

సంగారెడ్డి, ఫిబ్రవరి 7 : భుజానికి కట్టుకున్న జోలెలో చిన్నపిల్లను ఉంచి రెండు చేతులతో చాపలను అల్లుతూ భిక్షమెత్తుకునేవారిని ప్రతివారు చూసే ఉంటారు. వీరిని నిశితంగా పరిశీలిస్తే వీరి జీవితంపట్ల ఆసక్తి కలగడం సహజం. ఏ వ్యక్తి అయినా ఒకసారి ఒకేపని చేయగలడు. కాని వీరు మాతృమూర్తిగా తమ బిడ్డలను ఓ వైపు లాలిస్తూనే మరోవైపు క్షుద్బాధ తీర్చుకోవడానికి భిక్షమెత్తుతుంటారు. బిక్షమెత్తేటప్పుడు వీరి చేతులు ఖాళీగా ఉండవు. చాపలను అల్లుతూ ఆ చేతులు తమ పని నెరవేరుస్తుంటాయి. బుడగ జంగం కులానికి చెందిన వీరి ప్రధానవృత్తి చాపలను అల్లడం. సంగారెడ్డిలో దాదాపు 50 కుటుంబాలు బుడగ జంగం వారివి ఉన్నాయి. నర్సాపూర్, మల్కాపూర్, చందాపూర్ గ్రామాలలో వీరు పెద్దసంఖ్యలోనే ఉన్నారు. స్త్రీలు, ముసలివాళ్ళు ఇంటివద్ద చాపలు అల్లితే, మగవాళ్ళు తమ కులవృత్తి అయిన వేటకు వెళతారు. వీరు 70 ఏళ్ళ నుంచి సంగారెడ్డిలో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవిస్తున్నారు. ఎన్నిసార్లు కోరినా పట్టా సర్టిఫికెట్లు ఇవ్వలేదని వీరు తెలిపారు. 70 ఏళ్ళ దుర్గయ్య తాను పుట్టింది ఇక్కడేనని నేను పుట్టినప్పటి నుంచి పరిస్థితులు ఇలాగే ఉన్నాయని వాపోయాడు. హరిజనుల అభ్యున్నతికోసమంటూ ప్రభుత్వం ఏవేవో పథకాలను ప్రకటిస్తుంది. అయితే అంతకంటే దయనీయమైన స్థితిలోఉన్న వీరి గురించి ఏమాత్రం పట్టించుకోక పోవడం దురదృష్టకరం. ప్రభుత్వం ఏదైనా ఆర్థిక సహాయం చేస్తే తాము చిన్న పండ్ల దుకాణాలను కాని, కిళ్ళీ కొట్టులను కాని పెట్టుకుంటామని వీరు తెలిపారు.

## బతుకులు భారమైన 'బుడ్గ జంగాలు'

*ఆంధ్రభూమి 5-9-1988 (నందికొట్కూరు - కర్నూలు జిల్లా) ఆంధ్రభూమి విలేకరి*

నందికొట్కూరు, సెప్టెంబరు 4: స్వరాజ్యం వచ్చి 40 ఏళ్లయినా వీరికి గుర్తింపు లేదు. వీరు ఇంకా చీకటి రాజ్యంలో మగ్గుతున్నారు. దయనీయ స్థితిలో జీవనం

వెళ్ళదీస్తున్న వీరినే 'బుడ్గ జంగాలు' అని ముద్దుగా పిలుస్తారు... ఈ ప్రాంతంలో కొత్త బిజినవేముల, నంద్యాల, కోవెలకుంట్ల, ఆత్మకూరు, నందికొట్కూరు, ఎమ్మిగనూరు తదితర గ్రామాల్లో వీరు అధిక సంఖ్యలో ఉన్నారు. బుడ్గ (డింకీ) పట్టుకొని కథలు చెప్పటం వలన వీరికి బుడ్గ జంగాలు అని పేరు వచ్చింది. వీరికి జానపద భిక్షుక గాయకుల్లో ప్రత్యేకమైన స్థానం ఉంది. వీరు చెప్పే కథలను 'జంగం కథలు' అంటారు. వీరు చెప్పే కథలలో ముఖ్యమైనవి బొబ్బిలికథ, ఆరెమారాఠీల కథ, కాంభోజరాజు కథ, బాలరాజు కథ, బాల నాగమ్మ కథ తదితరాలు ఉన్నాయి. ప్రధాన కథకుడు తాంబూర మీటుతుండగా ఇద్దరు లేక ఒక్కరు వంత పాడుతూ మధ్యమధ్యలోహాస్య ఛలోక్తులతో కథను రక్తికట్టిస్తారు ..... ప్రభుత్వం వీరిని యస్.సి.లుగా గుర్తించినా అధికారులు పెట్టే ఇబ్బందులకు గురై కులం సర్టిఫికెట్లు లేక విద్యార్థుల చదువులు ఆగిపోవటం, అంతో ఇంతో చదువుకున్న వారు నిరుద్యోగులుగా ఉండటం వల్ల వీరు దయనీయమైన బతుకు గడపవలసి వస్తున్నది.

ఈ కులంవారి స్థితిగతులను అర్థం చేసుకొని వీరికో మార్గం చూపిస్తే వీరు బాగుపడగలరని ఈ సంఘం నాయకులు ఆశిస్తున్నారు.



## ఆకలి కేకలే తాంబూరా రాగాలు

*ఉదయం 1987 కర్నూలు జిల్లా*

టెలిన్యూస్ వారి ఈపత్రికా వ్యాసంలో బుడ్గ జంగాల స్థితిగతులను, కులం సర్టిఫికెట్లు పొందటంలో వారు ఎదుర్కొంటున్న ఇబ్బందులను విశదపరిచారు. కర్నూలు జిల్లా నందికొట్కూరు, ఆత్మకూరు ప్రాంతాలలో బిజిన వేముల, మల్యాల, నెహ్రూనగర్,



ఆకలి కేకలే తంబురా రాగాలు

తెలియని ప్రభుత్వమె తెకుక పడిపోతున్నది. పెంచుతున్న తమ పిల్లలకు ఉద్యోగావకాశాలు
మండలాధికారుల దగ్గర ఈ కులం వారు కల్పించాలని బిజినవేముల, మల్యాల, నెహ్రూ
సంతకాలకు వెళితే మంచి శాఖాహారులైన జం నగర్, లక్ష్మాపురం, జూపాడుబంగ్లా గ్రామాల

లక్ష్మాపురం, జూపాడు బంగ్లా తదితర ప్రాంతాల్లో ఉన్న ఈ బుడ్గ జంగాలు తమపై ప్రభుత్వం ఆదరణ చూపించాలని, శాశ్వత గృహనిర్మాణ వసతులు కల్పించాలని విద్యా ఉద్యోగాది విషయాల్లో తమ కులానికి ప్రత్యేకంగా సహాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నట్లుగా పేర్కొన్నారు. డింకీ తంబూరాలతో బుడ్గ జంగం కథ చెబుతున్న ఇద్దరి ఫోటోను వేశారు.

## ఇంకా కన్యాశుల్కం

***ఈనాడు 5-10-1987 (నాంపల్లి - నల్గొండ జిల్లా)***

నాంపల్లి, అక్టోబరు 4 (న్యూస్‌టుడే) : మూఢనమ్మకాలకు, సాంఘిక దురాచారాలకు స్వస్తి పలకాలని ప్రభుత్వం చట్టాలు చేస్తున్నా వివాహ సమయంలో వధువుకు వరుని తరుపువారు చెల్లించే కన్యాశుల్క సాంప్రదాయం ఈనాటికీ పాటిస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. నాంపల్లి పరిసర ప్రాంతాల్లోని బుడిగె జంగాల జాతిలో కన్యాశుల్కం అమలులో ఉంది. ఈ జాతివారిలో ఏ యువకుడైనా రెండువేల రూపాయలు సంపాదించుకువచ్చి అమ్మాయి తల్లిదండ్రులకు ఇచ్చి ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవచ్చు. .... గత 30 ఏళ్ళుగా 116 రూ॥లు మాత్రమే కన్యాశుల్కంగా ఉండేది. మూడేళ్ళకింద రెండు వేల రూపాయలుగా కులపెద్దలు నిర్ణయించారు. వీరు ఎక్కడైనా నిబంధనలు అతిక్రమించినట్లు తెలిస్తే కులపెద్దలు పంచాయితీ జరిపి జరిమానా విధిస్తారు. జరిమానాగా వచ్చిన డబ్బుతో వారు విందు చేసుకుంటారు.

## బుడిగె జంగాలకు సమస్యల భారం

***ఈనాడు 14-5-1987 (దోమకొండ -నిజామాబాదు జిల్లా)***

దోమకొండ, మే 13 న్యూస్‌టుడే: దోమకొండ శివారులో నివసించే 50 కుటుంబాల 'బుడిగె జంగాలు' దుర్భర జీవితం గడుపుతున్నారు. 50 సంవత్సరాల క్రితం పొట్ట చేతబట్టుకొని ఇక్కడికి వచ్చిన తమకు ప్రభుత్వం ఏవిధమైన సదుపాయాలు కల్పించలేదని వారు తెలిపారు. గ్రామీణ శాశ్వత గృహనిర్మాణ పథకం కింద గతంలో ఇళ్ళు మంజూరైనప్పటికీ కుల ధృవీకరణ పత్రాలు లేకపోవటంతో ఆ సదుపాయం తమకు అందలేదని వారు అన్నారు. గతంలో రాష్ట్ర రవాణాశాఖ మంత్రి శ్రీ డి. సత్య నారాయణ వారికి కులధృవీకరణ పత్రాలు జారీచేయాల్సిందిగా ఎం.ఆర్.ఓను ఆదేశించినా అమలు జరుగలేదు. వెంటనే కులధృవీకరణ పత్రాలు జారీచేయాలని

కోరుతూ బుడిగె జంగాల కులానికి చెందిన వారితో దాదాపు 50 మంది బి.జె.పి కార్యకర్తలు స్థానిక ఎం.ఆర్.ఓ కార్యాలయం ఎదుట ప్రదర్శన జరిపారు. కులధృవీకరణ పత్రాలు లేకపోవటం వల్ల ప్రభుత్వం చేపడుతున్న అనేక సంక్షేమ కార్యక్రమాలు తమకు అందకుండా పోతున్నాయని ఆ కులస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

బుడిగె జంగం కులస్థులను రాష్ట్ర ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని బి.జె.పి జిల్లా.శాఖ ఉపాధ్యక్షుడు శ్రీ విభూతి శంకర్ ఒక ప్రకటనలో ఆరోపించారు.

## కంప్యూటర్ యుగంలో సంచార జీవనం

**ఉదయం 2-2-86 పిఠాపురం :** టెలిన్యూస్ పిఠాపురంవారు పరిశోధించి నాల్గు కాలమ్స్‌లో పూర్తిగా 5 ఫోటోలతో సహా ముద్రించిన ఈ పత్రికా వ్యాసంలో బుడ్గజంగాల పుట్టుపూర్వోత్తరాలు, ఆచార వ్యవహారాలు, దయనీయమైన బుడ్గ జంగాల జీవన పరిస్థితులు వివరించబడ్డాయి.

## పేద వీధి కళాకారులకు వెలసె ఓ కోవెల

**ఉదయం 9-12-1985 (హైదరాబాదు) :** బుడ్గ జంగం తదితర జానపద భిక్షుక గాయకులను జానపద కళాకారులుగా గుర్తించి రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్



మండలంలోని నీర్‌పేట గ్రామంలో శాశ్వత గృహనిర్మాణ పథకానికి ఉదయం పత్రికాధిపతి డా॥దాసరి నారాయణరావుగారు ప్రారంభోత్సవం చేసిన సందర్భంలో వచ్చిన వార్త ఇది.

రాష్ట్ర బుడ్గ జంగం నాయకుడు నిదానకవి వెంకటేశం మాట్లాడుతూ దేశాటన చేస్తూ వృత్తి కళను నమ్ముకొని జీవిస్తున్న కులాలవారిని ఆదుకోవాలని ప్రభుత్వానికి చేసిన విజ్ఞప్తిని ఈవార్తలో పేర్కొన్నారు.

## ముఖ్యమంత్రికి బుడ్గజంగం కుల ప్రతినిధుల వినతి

***ఆంధ్రభూమి 20-10-1985***

హైదరాబాద్, అక్టోబర్ **19 :** రాష్ట్ర బుడ్గ జంగం సంఘం ప్రతినిధులు ఇటీవల ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావును కలుసుకొని తమ సమస్యలను వివరిస్తూ ఒక వినతిపత్రాన్ని సమర్పించినట్లు ఉపకార్యదర్శి శ్రీ కె.దయానంద్ గురువారంనాడు ఒక ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం గుర్తించిన 59 షెడ్యూల్డు కులాల్లో ఒకటైన బుడ్గ జంగంకులస్థులకు కులం సర్టిఫికెట్లు జారీ చేయడంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండ చూడాలని; సోదర మాల మాదిగలకువలెనే దరఖాస్తు చేసిన వెంటనే సులభంగా కులధృవీకరణ పత్రాలు లభించే ఏర్పాటు చేయాలని వారు ముఖ్యమంత్రిని కోరారు. మండలాధికార్లు మాత్రమే ఈ సర్టిఫికెట్లు జారీచేయాలని, వెనుకబడిన జాతుల జాబితాలో మాదిరిగా షెడ్యూల్డు కులాల జాబితాల్లో కూడా గ్రూపు పద్ధతిని ప్రవేశ పెట్టాలని వారు కోరారు. ఇతర షెడ్యూల్డు కులాల మాదిరిగానే బుడ్గ జంగం కులస్థులకు దామాషా పద్ధతిలో పంచాయతి, సమితి, శాసనసభ వంటి రంగాలలో స్థానాలను కేటాయించాలని కూడా వారు విజ్ఞప్తి చేశారు.

## బుడ్గ జంగం కేంద్ర సంఘం విజ్ఞప్తి

*ఉదయం 20-10-1985*

హైదరాబాద్, అక్టోబర్ 19(టెలిన్యూస్) : బుడ్గ జంగం కులస్థుల్ని అన్ని రంగాల్లో అణిచి వేస్తున్నారని రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావుకు సమర్పించిన ఒక విజ్ఞాపన పత్రంలో బుడ్గ జంగం కేంద్ర సంఘం పేర్కొంది. 1950 కు ముందునుంచే ఈ కులం షెడ్యూల్డు కులాల పట్టికలో 'బేడ (బుడ్గ) జంగం' అని వరుస నెం. 4లో గుర్తించ బడింది. 1976లో వచ్చిన రాజపత్రం ప్రకారం ఈ కులస్థులు ఆంధ్రప్రాంతంలో కూడా ఉన్నట్లు నిర్ధారించారు. 'బేడ (బుడ్గ) జంగం' బ్రాకెట్ విడదీసి అక్షర క్రమం వరుస 9వ నెంబర్‌లో బుడ్గ జంగం, బేడ జంగంగా పొందుపరిచారు. బేడ జంగం వారి ఆచార వ్యవహారాలు, బుడ్గ జంగంవారి ఆచారవ్యవహారాలకు భిన్నంగా ఉంటాయి. ఈ రెండు కులాలు ప్రస్తుతం సీరియల్ నెంబర్ 9లోనే ఉన్నాయి. ఆంధ్రప్రాంతంవారి బేడ జంగం విషయంలో 1986వ సంవత్సరంలో జరిగిన అవకతవకల్ని నిరోధించడానికి 1984వ సంవత్సరంలో సాంఘిక సంక్షేమశాఖ 543 నెంబర్ మెమోను జారీ చేసింది. సీరియల్ నెంబర్ 9లో వున్న కులంవారికి కేవలం సబ్‌కలెక్టర్/ఆర్‌డిఓ మాత్రమే కులం సర్టిఫికెట్లు జారీచేయాలని ఆదేశించడంతో బేడ జంగం వారిలాగే బుడ్గ జంగంవారికి కూడ ఇబ్బందులు మొదలైనాయి. కులం సర్టిఫికెట్లను మండలాధికారి జారీ చేయాలని, షెడ్యూల్డు కులాల జాబితాలో కూడా గ్రూపు పద్ధతి ప్రవేశ పెట్టాలనీ బుడ్గ జంగం కేంద్ర సంఘం విజ్ఞప్తి చేసింది.

## ఏదేశమేగినా ఈ ఘోష ఆగదు
## ఏపీఠ మెక్కినా నీ పొట్ట నిండదు.

*ఉదయం 17-5-1985 నాగార్జునసాగర్*

బుడ్గ జంగాల జీవన పరిస్థితికి అద్దంపట్టే రెండు ఫోటోలతోపాటు వారి జీవన విధానాన్ని కూడ విలేకరి వివరించారు. నిడమనూరు తాలూకా, కొరియోని గూడెం

గ్రామానికి చెందిన ఈ కుటుంబాలను ఇందులో ఇంటర్వ్యూ చేశారు. బుర్ర కథలు వల్లిస్తూ భిక్షాటన చేయటం వీరి లక్ష్యమని ; వీరు చెప్పే బాలనాగమ్మ, కాంభోజరాజు కథ మొదలైనవి పేర్కొన్నారు. స్త్రీలు చాపలు అల్లుతారని, వీళ్ళలో కన్యాశుల్కం 300 రూ।ల నుంచి 1000రూ॥ల వరకు ఉందని, తమదీనమైన స్థితిని ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని వారు కోరినట్లు ఇందులో వివరించారు.

## గతుకుల బాటలో గాలివాటు బతుకులు

*ఈనాడు* ***16-2-1985*** *కాకినాడ*

కాకినాడ, డిశెంబర్ 16(న్యూస్‌టుడే) : తెగిన గాలిపటంలా ఊరూరూ తిరుగుతూ ఏపూటకాపూట పొట్టపోషించుకుంటూ కాలం వెళ్ళదీసే బుడ్గ జంగాల బతుకులు అతుకుల గతుకులతో నిండి ఉన్నాయి. రాష్ట్రంలో 59 షెడ్యూలు కులాల్లో వీరూ ఒకరైనప్పటికీ




వీరికి ప్రభుత్వ సహాయం సరిగ్గా అందటం లేదు. రాష్ట్రంలో ఈ కులస్థులు ఐదు, ఆరు లక్షలమంది ఉన్నట్లు అంచనా. వాస్తవానికి వీరిని షెడ్యూలు తెగలో గుర్తించటం న్యాయం. కాని ప్రభుత్వం షెడ్యూలు కులంగా గుర్తించింది. వీరు బుడగ అనే వాయిద్యాన్ని ఉపయోగించి కదలు చెప్పటం వల్ల వీరికి ప్రజల్లో 'బుడగ జంగాలు' అనిపేరు వచ్చి

అదే స్థిరపడింది. రాత్రుళ్ళు కథలు చెబుతూ పగలు జంతువులను, పక్షులను వేటాడుతారు. బుడగజంగాలు గుడిసెల్లో నివసిస్తుంటారు. ఈతచాపలు అల్లి అమ్ముతుంటారు. వీరిమధ్య తగాదాలు వస్తే కులపెద్ద సమక్షంలో పంచాయతులు పెడతారు. పెళ్ళిళ్ళలో ఇంకా కన్యాశుల్కమే రాజ్యమేలుతుంది. పెళ్లయిన తర్వాత పెళ్ళికొడుకు అత్తవారితో ఉండి పోవటాన్ని 'మ్యార' అంటారు.

బుడ్గ జంగాలకు ప్రత్యేకమైన భాష ఉన్నా దానికి లిపిలేదు. ఈ కులానికి హైదరాబాదు కేంద్రంగా ఒక సంఘం ఉంది. తూర్పు గోదావరి జిల్లాలో కూడ బుడగ జంగం సంక్షేమసంఘం ఉంది. పాతపద్ధతులు విడనాడి పురోగమించటానికి సంఘాధ్యక్షుడు కళ్యాణం మరిడయ్య విజ్ఞప్తి చేశారు.

## యాచక వృత్తి విడనాడాలి.

***ఈనాడు 21-11-1983 - సంగారెడ్డి***

సంగారెడ్డి నవంబర్ 20 (న్యూస్‌టుడే): యాచక వృత్తి విడనాడి కష్టించి గౌరవంగా బతకాలని నేడిక్కడ జరిగిన రాష్ట్ర బుడ్గ జంగం జిల్లా స్థాయి సమావేశంలో రాష్ట్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీ పి.యాదగిరి సూచించారు. దేహీయని యాచించడం హీనమని ప్రతిపౌరుడూ కష్టపడి బతకాలని ఆయన చెప్పారు. ప్రభుత్వం బుడ్గ జంగాలను షెడ్యూలు కులాల జాబితాలో చేర్చి ఎన్నో రాయతీలు కల్పించిందని చెబుతూ అజ్ఞానం, అవిద్య దారిద్ర్యంతో అల్లాడే ఈకులంవారు ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోవడంలేదని, వీరిలో ఎక్కువ మందికి తమ కులం షెడ్యూల్డు కులాల్లో చేర్చినట్టుకూడా తెలియదని ఆయన చెప్పారు. పట్టుదల, క్రమశిక్షణతో కృషి చేస్తే ఇతరుల యాచించే స్థితి వారికి తప్పుతుందని ఆయన తెలిపారు. ప్రభుత్వం విద్యాభ్యాసానికి వసతులు కల్పించిన దృష్ట్యా

తమ పిల్లలను పాలేర్లుగా, యాచకులుగా తయారు చేయకుండా పాఠశాలల్లో చేర్చాలని ఆయన సూచించారు. ఐక్యత, పరస్పర సహాయ సహకారాలను పెంపొందించుకొని అనాదిగా వస్తున్న తమ నికృష్ట జీవిత విధానాలను మెరుగుపరచుకోవాలని సంఘాధ్యక్షుడు శ్రీ గణేశ్ సింగ్ చెప్పారు. ప్రభుత్వం కల్పించిన రాయతీలను గ్రామాల్లోని ఈ కులాలవారికి తెలియజేసేందుకు తాలూకా, జిల్లా సంఘనాయకులు పాటుపడాలని ఆయన సూచించారు.

సమావేశానికి సంగారెడ్డి మున్సిపల్ అధ్యక్షుడు శ్రీ దుర్గయ్య అధ్యక్షత వహించారు. షెడ్యూల్డు కులాల జాబితాలో చేర్చిన యాభై తొమ్మిది కులాల వారు తమలోతాము కలహించుకోరాదని, అనాదిగా అన్యాయానికి గురైన అన్ని వర్గాల అభివృద్ధికి ఐక్యతతో తోడ్పడాలని మెదక్‌జిల్లా షెడ్యూల్డు కులాల సంక్షేమ సంఘం కార్యదర్శి శ్రీ నాగయ్య అన్నారు. రాష్ట్ర బుడ్గ జంగం సంఘం సలహాదారు శ్రీ నిదానకవి బాబూరావు, కార్యదర్శి ఎన్.ఆర్. వెంకటేశం తదితరులు ప్రసంగించారు.

## ఏళ్ళు గడిచినా బతుకులు మారని బుడిగ జంగాలు

న్యూస్‌లైన్
ఆత్మకూరు, మార్చి 23: స్వాతంత్ర్యం వచ్చి ఏళ్ళు గడిచినా పాలకుల అశ్రద్ధవల్లనే బుడుగ జంగాలల బతుకులు మారడంలేదని రాష్ట్ర బుడిగ జంగాల సంక్షేమసంఘం కన్వీనర్ దాశ్యరి వానరాసి రాజయ్య ప్రభుత్వాల తీరును విమర్శించారు. ఆత్మకూరు మండలం దుర్గంపేట గ్రామంలో శుక్రవారం జిల్లా బుడిగ జంగాల సంక్షేమసంఘం ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో బుడిగ జంగాలవారు ఉపాధి లేక అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం ఎలాంటి సంక్షేమపథకాలు చేపట్ట[illegible]దని ఆయన ఆరోపించారు. ప్రత్యేక [illegible] సౌకర్యం. వారి పిల్లల సౌకర్యంకోస విద్య,వైద్య సదుపాయాలు. రుణసౌకర్య కల్పించాలని కన్వీనర్ రాజయ్య ప్రభుత్వా కోరారు. ఈ సమావేశానికి జిల్లా ఎమ్మార్పీ...

### ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇప్పారవ లక్ష్మణ్




ఆత్మకూరు మండలం దుర్గంపేట గ్రామంలో బుడిగజంగాలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇప్పారవ లక్ష్మణ్ -న్యూస్‌లైన్ ఆత్మకూరు

ఆంధ్రభూమి
24-3-2001
ఆత్మకూరు
వరంగల్ జిల్లా

ఇందులో ప్రస్తావించబడిన పత్రికల వార్తల వివరాలు :

1. 'మా బుడ్గ జంగపోల్లకు చావు మధ్యనే బతుకు' - ఆంధ్రప్రభ 4-7-1999 - హైదరాబాదు.
2. హైటెక్ సిటీలో 'కన్యాశుల్కం తెగ!' - వార్త 3-1-1999 హైదరాబాదు
3. మమ్మిడివరం అభివృద్ధికి కృషిచేస్తా - ఈనాడు 23-9-1998 తూర్పుగోదావరి జిల్లా
4. బుడగ జంగాలకు ఎస్.సి. గుర్తింపు - వార్త 25-5-1998 హైదరాబాదు
5. అభివృద్ధికి జన్మభూమి దోహదం - ఈనాడు 5-1-1998 హైదరాబాదు
6. బుడగ జంగాల భూరి కళారూపం - ఈనాడు 22-8-1997 వరంగల్
7. ఇరవై యేళ్ళయినా 'పట్టాలు' రాని బుడ్గ జంగం బస్తీ - వార్త 12-11-1996 హైదరాబాదు.
8. వర్గీకరణ తీర్మానం ఆమోదంపై హర్షం - ఆంధ్ర జ్యోతి 24-4-1996 హైదరాబాదు
9. కడుపు నింపని కళా ప్రదర్శనలు - ఆవేదనలో బుడగ జంగాలు - ఈనాడు 29-12-1993 మహబూబ్‌నగర్
10. రాష్ట్ర ఎస్టీ జాబితా సవరణకు బ్రేకు - ఈనాడు 19-5-1992 న్యూఢిల్లీ
11. బతుకు దుర్భరమైన బుడగ జంగాలు - ఆంధ్రభూమి 8-4-1992 మాచారెడ్డి
12. కుల ధృవీకరణలో జాప్యంతగదు - ఈనాడు 5-1-1992 పిఠాపురం
13. బుడగ జంగాలకి 5వయోజన విద్యా కేంద్రాలు - ఈనాడు 8-8-1991 హైదరాబాదు.

14. మట్టిలో మాణిక్యాలు 'బుడగ జంగాలు' – ఈనాడు 4-5-1991 హైదరాబాదు

15. మట్టిలో మాణిక్యాలు – ఈనాడు 24-4-1991 హైదరాబాదు

16. వృత్తికి ఆదరణలేని బుడ్గ జంగాలు – ఆంధ్రభూమి 25-11-1990 కర్నూలు జిల్లా

17. ఈ జీవితాలు తెగిన గాలిపటాలు – దయనీయ స్థితిలో బుడగ జంగాలు – ఈనాడు 29-12-1989 హైదరాబాదు

18. రిజర్వేషన్లను సమర్థిస్తూ బుడగ జంగం సమావేశం – ఉదయం 28-12-1989 హైదరాబాదు

19. బుడ్గ జంగాలను ఎస్.టి.లో చేర్చండి – ఈనాడు 4-3-1989 ఎల్.బి.నగర్ హైదరాబాదు.

20. బుడగ జంగాల బడుగు బతుకులు – ఈనాడు 22-2-1989 కర్నూలు జిల్లా

21. Budaga Jangams : A Neglected Tribe - Deccan Chronicle 11-2-1989 Sangareddy Medak District

22. బుడగ జంగాల పట్ల ప్రభుత్వ బాధ్యత లేదా? ఆంధ్రభూమి 8-2-1989 సంగారెడ్డి మెదక్ జిల్లా

23. బతుకులు భారమైన 'బుడ్గ జంగాలు' – ఆంధ్రభూమి 5-9-1988 నందికొట్కూరు, కర్నూలు జిల్లా

24. ఆకలి కేకలే తంబూరా నాదాలు ఉదయం 1987 కర్నూలు జిల్లా

25. ఇంకా కన్యాశులం – ఈనాడు 5-10-1987 నాంపల్లి, నల్గొండ జిల్లా

26. బుడిగె జంగాలకు సమస్యల భారం – ఈనాడు 14-5-1987 దోమకొండ – నిజామాబాదు జిల్లా

27. కంప్యూటర్ యుగంలో సంచార జీవనం – ఉదయం 2–2–1986 పిఠాపురం, తూ.గో.జిల్లా.

28. పేదవీధి కళాకారులకు వెలసె ఓ కోవెల – ఉదయం 9–12–1985 లెనిన్ నగర్, రంగారెడ్డి జిల్లా

29. ముఖ్యమంత్రికి బుడ్గ జంగం కుల ప్రతినిధుల వినతి – ఆంధ్రభూమి 20–10–1985 హైదరాబాదు

30. బుడ్గ జంగం కేంద్ర సంఘం విజ్ఞప్తి – ఉదయం 20–10–1985 హైదరాబాదు.

31. ఏ దేశమేగినా ఈ ఘోష అగదు – ఏ పీఠమెక్కిన నీ పొట్ట నిండదు– ఉదయం 17–5–1985 నాగార్జున సాగర్

32. గతుకుల బాటలో గాలివాటు బతుకులు – ఈనాడు 16–2–1985 కాకినాడ

33. యాచక వృత్తి విడనాడాలి – ఈనాడు 21–11–1983 సంగారెడ్డి, మెదక్ జిల్లా

**ఈ గ్రంథంలో అచ్చుకాని కొన్ని దినపత్రికల్లో వచ్చిన వార్తల వివరాలు :**

34. వార్తాలు చేసే వలస జీవితాలు – వార్త 24–9–2001 నెల్లూరు

35. బుడిగ జంగాల సంక్షేమానికి పాటు పడాలి – ఈనాడు 26–3–2001 పరకాల, వరంగల్ జిల్లా

36. బుడగ జంగాల సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావిస్తా – శాయంపేట ఎమ్.ఎల్.ఎ. కొండా సురేఖ – వార్త 26–3–2001 రాజీపేట (పరకాల రూరల్) వరంగల్ జిల్లా

37. ఏళ్ళు గడిచినా బతుకులు మారని బుడిగ జంగాలు – ఆంధ్రభూమి 24–3–2001 ఆత్మకూరు, వరంగల్ జిల్లా

38. బుడిగ జంగాల సంక్షేమం పట్టని ప్రభుత్వం - వార్త 24-3-2001 ఆత్మకూరు
39. బుడగ జంగం బస్తీలో నల్ల ప్రారంభం - వార్త 21-2-2001 హైదరాబాదు
40. బుడిగ జంగాలకు ఇళ్ళ స్థలాలను అందజేస్తా - ఈనాడు 20-3-2001 కరీమాబాదు
41. అభివృద్ధికి నోచుకోక అలమటిస్తున్న బుడగ జంగాలు - వార్త 20-3-2001 కాశిబుగ్గ, వరంగల్
42. ఆత్మవిశ్వాసం తోనే బడుగు వర్గాల అభివృద్ధి - బుడ్గ జంగాల సభలో మంత్రి కడియం శ్రీహరి - ఈనాడు 13-11-2000 జనగామ, వరంగల్ జిల్లా
43. నిరక్షరాస్యత వల్లే బుడ్గ జంగాలకు గుర్తింపు లభించటం లేదు - ఈనాడు 15-10-2000 తూప్రాన్, మెదక్ జిల్లా
44. బుడ్గ జంగాల వేటకు బలవుతున్న 'ఉడుము' జాతి -వార్త 13-10-2000 కర్నూలు జిల్లా
45. విద్యతోనే సామాజిక అభివృద్ధి - వర్తమానం 25-9-2000 హైదరాబాదు
46. విద్యతోనే వికాసం - వార్త 25-9-2000 హైదరాబాదు
47. విద్యతోనే అభివృద్ధి సాధ్యం - విజేత 25-9-2000 హైదరాబాదు
48. 24న బుడ్గ జంగం రాష్ట్ర సంఘం ప్రతినిధుల సమావేశం - వార్త 19-9-2000 హైదరాబాదు
49. అట్టడుగు బతుకు నుంచి అభ్యుదయ పథంలోకి .... ఈనాడు 22-8-2000 కరప, తూ.గో.జిల్లా
50. బుడ్గ జంగం బస్తీ బాధితులను ఆదుకోవాలి.- వార్త 16-3-2000 హైదరాబాదు

51. షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెల దగ్ధం - ఈనాడు 15-3-2000హైదరాబాదు.
52. బుడగ జంగం బస్తీ గుడిసెలు బుగ్గిపాలు - వార్త 15-3-2000 హైదరాబాదు
53. రాతమారని బుడగ జంగాల బతుకులు - ఆంధ్రభూమి 8-12-1999 వరంగల్
54. బుడ్గ జంగాల సమస్యల పరిష్కారానికి కృషి - ఈనాడు 24-11-1999 చిన్నకోడూరు.
55. బుడగ జంగాలను ప్రభుత్వమే ఆదుకోవాలి - ఆంధ్రభూమి 25-10-1999 ముస్తాబాదు
56. రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి - విజేత 13-10-1999 హైదరాబాదు
57. బుడ్గ జంగాల సర్వేకు సహకరించండి - వార్త 11-10-1999 వరంగల్
58. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నింటిని బుడ్గజంగాలకు దక్కేలా చేస్తా - ఎమ్.ఎల్.ఎ. సబితా ఇంద్రారెడ్డి - ఆంధ్రభూమి 2-8-1999 శంకర్‌పల్లి, రంగారెడ్డి జిల్లా
59. 50 ఏళ్ళ స్వాతంత్ర్యంలో గుర్తింపులేని బుడగ జంగాలు - వార్త 20-4-1999 కర్నూలు జిల్లా
60. నేతలు మారినా తలరాతలు మారని బుడ్గ జంగాల బతుకులు - ఆంధ్రభూమి 26-8-1998 నందికొట్కూరు, కర్నూలు జిల్లా
61. అక్షర గోదావరి స్ఫూర్తి - డ్వాక్రా పథకంలో బుడగ జంగాలకు భుక్తి - ఈనాడు 24-8-1998 కరప, తూ.గో.జిల్లా
62. స్వతంత్ర స్వర్ణ భారతిలో శాపగ్రస్తులు బుడగ జంగాలు - వార్త 24-6-1998 కర్నూలు జిల్లా
63. బుడగ జంగాల జీవితాల్లో బీదరికపు జాడలు -ఈనాడు 18-6-1998 పగోజిల్లా

64. అట్టడుగు జనాలు - బుడగ జంగాలు - ఆంధ్రజ్యోతి 14-6-1998 ముమ్మిడి వరం
65. కలిసికట్టుగా అభివృద్ధికి పాటు పడదాం - ఈనాడు 8-6-1998 నందికొట్కూరు
66. బుడగ జంగాల సమస్యలు పరిష్కరించాలి - ఈనాడు *18-12-1998 గంగాధర*
67. బుడ్గ జంగం కాలనీలో పొంగిపోతున్న డ్రైనేజి - వార్త 28-1-1998 హైదరాబాదు
68. చింతల్ బస్తీ బుడ్గ జంగం కమ్యూనిటీ హాలులో ఆరోగ్య శిబిరం - ఈనాడు 5-1-1998 హైదరాబాదు
69. సంక్షేమ పథకాలు ద్వారా బుడగ జంగాలను ఆదుకోవాలి - ఈనాడు 12-11-1997 అమలాపురం, తూగోజిల్లా
70. జిల్లా దాటితే కులం మారుతుందా? ఆంధ్రజ్యోతి 2-11-1997 కర్నూలు జిల్లా
71. తోలు బొమ్మలాట మాని రికార్డు డాన్సులు చేస్తున్నాం - ఆంధ్రజ్యోతి 2-11-1997 కర్నూలు జిల్లా
72. సామాజిక గుర్తింపు కోసం బుడగ జంగాల ఆరాటం - వార్త 19-10-1997 యలమంచిలి, పగోజిల్లా
73. జానపద కళలను పరిరక్షించుకోవాలి - వార్త 25-6-1997 కర్నూలు జిల్లా
74. బుడగ జంగాలను ఎస్.టి. జాబితాలో చేర్చాలి - ఈనాడు 14-6-1997 ముమ్మిడి వరం
75. బుడ్గ జంగం సంక్షేమ సంఘం నూతన కార్యవర్గం - వార్త 29-1-1997 హైదరాబాదు

76. బుడగ జంగాల సమస్యలను పరిష్కరించండి - ఈనాడు 10-1-1997 ముమ్మిడివరం.

77. బుడ్గ జంగాలకు రక్షణ కల్పించాలి - వార్త 8-6-1996 హైదరాబాదు

78. బుడ్గ జంగం బస్తీలో దుశ్శాసన పర్వం - ఈనాడు 3-6-1996 హైదరాబాదు

79. బుడగ జంగాలకు ప్రత్యేక సదుపాయాలు ఇవ్వాలి - ఈనాడు 10-5-1996 ముమ్మిడివరం

80. బుడగ జంగాల దరిచేరని పథకాలు - వార్త 22-5-1996 కరీంనగర్

81. బుడ్గ జంగాల వాడలో అక్షర జ్యోతి - ఈనాడు17-2-1996 కరీంనగర్

82. జానపద వృత్తి కళాకారులకు గుర్తింపు ఇవ్వాలి - ఆంధ్రప్రభ 20-12-1995 హైదరాబాదు

83. కులధృవీకరణ పత్రాల జారీలో జాప్యం - ఈనాడు 26-6-1994 మహబూబ్ నగర్

84. బతుకు వెతల్లో బుడ్గ జంగాలు - ఈనాడు 5-6-1994 మహబూబ్‌నగర్

85. బుడగ జంగాల సమస్యలు పరిష్కరించండి. ఈనాడు 14-7-1993 ఉప్పలగుప్తం

86. వెలుగు చూపని పథకాలు - కాలే కడుపుల బతుకులు - దుర్భర స్థితిలో బుడగ జంగాలు - ఈనాడు 17-6-1992 హైదరాబాదు

87. బుడ్గ జంగాలకు కమ్యూనిటీ హాలు ప్రారంభం - ఆంధ్రజ్యోతి 16-5-1992 బోడుప్పల్, హైదరాబాదు

88. మేమూ మనుషులమే! - ఆంధ్రప్రభ 8-4-1992 హైదరాబాదు

89. వేటనే ప్రధాన వృత్తి గా చేసుకున్న బుడగ జంగాల 'ఉడుం పట్టు' జారుతోంది – వార్త 10-2-1992 కర్నూలు జిల్లా

90. కళముందు పదవులు తక్కువే – ఉదయం 22-3-1992 హైదరాబాదు

91. సంస్కృతికి వారసులు బుడగ జంగాలు – ఉదయం 20-2-1992 మహబూబ్ నగర్

92. కులధృవీకరణలో జాప్యం తగదు – ఈనాడు 5-1-1992 తూర్పుగోదావరి జిల్లా

93. బుడ్గ జంగం సంక్షేమ సంఘం ఎన్నికలు – ఈనాడు 13-2-1990 జంగంమెట్టు, హైదరాబాదు

94. బజారున పడ్డ బుడ్గ జంగాలు – ఈనాడు 21-1-1990 రంగారెడ్డి జిల్లా

95. బుడ్గ జంగాల బతుకు దుర్భరం – ఈనాడు 17-12-1989 మెదక్

96. గుండెల్లో విలాపాగ్నులు – కళ్ళల్లో విషాదాశ్రువులు – ఉదయం 25-10-1989 హైదరాబాదు

97. కళానగర్ బుడ్గ జంగం హరిజనుల గతి ఇంతేనా? ఉదయం 9-10-1989 అంబర్‌పేట, రంగారెడ్డి జిల్లా

98. బుడ్గ జంగాలపై జాలి చూపండి. – ఉదయం 18-7-1989 హైదరాబాదు

99. బుడ్గ జంగం కాలనీలో బోలెడన్ని సమస్యలు – ఉదయం 18-7-1989 హైదరాబాదు

100. గుర్తింపు కరవైన బుడగ జంగాలు – ఈనాడు 23-6-1989 హైదరాబాదు

101. భుక్తి గడవని బుడగ జంగాలు - ఈనాడు 3-5-1989 తొర్రూరు, వరంగల్ జిల్లా

102. బుడగ జంగాల దీనగాథ - ఈనాడు - 27-1-1987సామర్లకోట

103. బుడ్గ జంగం కళాకారులకు గృహసముదాయం - ఉదయం 29-10-1987

104. కోనసీమ బుడగ జంగాల దీనావస్థ- ఈనాడు - 10-2-1987 అమలాపురం తూగోజిల్లా

105. బుడ్గ జంగం సమావేశాలు - ఆంధ్రజ్యోతి 153-1986 చౌటుప్పల్ నల్గొండ జిల్లా

106. బుడ్గ జంగాల ఇళ్ళ స్థలాల పట్టాల పంపిణి - ఈనాడు 10-2-1986 బషీరాబాదు, రంగారెడ్డి జిల్లా.

సారూ! బడికి వెళ్లాలా... భిక్షాటనకు పోవాలా!

10-1-2002

నోడల్ బృందాన్ని ప్రశ్నించిన బుడగజంగాల పిల్లలు



వందిరెట్కూరులో జరిగిన జన్మభూమి గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న బుడగజంగాలు.

జన్మభూమి ప్రజలకు వరం లాంటిది

★ ✻ ★

# 7. ఆంధ్రప్రదేశ్ బుడ్గజంగం సంఘం చరిత్ర



బుడ్గజంగం సంఘ భవనం కుర్మాగుడా (సైదాబాదు), హైదరాబాదు.



బుడ్గ జంగం సంమ భవనం, జంగంమెట్, హైదరాబాదు
ప్రస్తుత రాష్ట్ర సంఘ కార్యాలయం.

# 7. ఆంధ్రప్రదేశ్ బుడ్గ జంగం సంఘం చరిత్ర

పూర్వకాలం నుంచి బుడ్గ జంగాలు తందానా కథలు చెబుతూ పొట్ట పోసుకుంటున్నారు. జంగాల్లో అనేక ఉపకులాలు ఏర్పడినందున బుడగలు (గుమ్మెటలు) పట్టుకుని తందానాకథలు చెప్పేవారికి 'బుడ్గజంగాలు' అనేపేరు వచ్చింది. అలాగే మాలజంగాలు, బేడజంగాలు మొదలైన జంగం ఉపకులాలు రకరకాల నేపథ్యంలో ఏర్పడ్డాయి. బుడ్గ జంగాలు చెప్పేకథలు 'జంగంకథలు' లేక 'జంగాలకథలు'గా జనవ్యవహారంలో పేరుపడ్డాయి. రాయలసీమలో ఈ కథలను 'సుద్దులు' అని అంటారు. ఆ ప్రాంతంలో బుడ్గ జంగాలను 'సుద్దులోళ్ళు'అని కూడ అంటారు. తెలంగాణాలో కొందరు 'శారదకథలు' అని పిలుస్తారు. బుడ్గ జంగాలు కథలు చెప్పటమే ప్రధానవృత్తిగా కొనసాగించినా; ఎలుకలు, ఉడతలు, ఉడుములు, ముంగీసలు మొదలైన జంతువులను వేటాడటం; ఈత చాపలు అల్లటం వీరి ఉపవృత్తులు. కథలు చెబుతూ, భిక్షాటనం చేస్తూ గ్రామాల్లో జీవించే ఈ కులస్థులు కాలానుగుణంగా మెలమెల్లగా పట్టణ ప్రాంతాలకు, నగరాలకు చేరుకోవటం ప్రారంభించారు. ఈ శతాబ్ది ప్రారంభంలోనే ఈ విధంగా వచ్చి హైదరాబాదులో సైదాబాదు (కుర్మాగుడా), జంగంమెట్టు, రాజ్‌ధార్ ఖాన్‌పేట్ (గుప్తానగర్-మల్లెపల్లి), మొహమ్మద్ గుడా, మాదన్నపేట, బండ్లగుడా, సాహెబ్ నగర్‌మొదలైన ప్రాంతాల్లో నివాసాలు ఏర్పరచుకున్నారు.

స్వాతంత్ర్యం వచ్చాకా సమసమాజం ఏర్పడటం కోసం అట్టడుగు వర్గాలకు, బలహీన వర్గాలకు, వెనకబడిన వర్గాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు కల్పించి, అమలు పరిచింది. ఆయా కులాల, తెగల వెనకబాటు తనం ఆధారంగా బి.సి., యస్.సి, యస్.టి. లుగా వర్గీకరించి తదనుగుణంగా జనాభా ప్రాతిపదికమీద, ప్రభుత్వం ఆ

కులాలవారికి ప్రయోజనాలను నిర్దేశించింది. రాజ్యాంగ బద్ధంగా సంక్రమించిన రాయితీలను వినియోగించుకుని అభివృద్ధిలోకి రావాలని ఆయా కులాలవాళ్ళు, తెగలవాళ్ళు చైతన్యంతో ముందుకు రాసాగారు. కులసంఘాలను ఏర్పాటు చేసుకోవటం - తద్వారా రిజర్వేషన్ల ప్రయోజనాలను గురించి కులస్థుల్లో అవగాహన కలిగించటం, ఆ రాయితీలను ఉపయోగించుకోవటానికి సంఘం ద్వారా కార్యక్రమాలు రూపొందించి అమలు పరచటం చేయసాగారు. విద్య, ఉద్యోగరంగాల్లో తమ కులంవారు అభివృద్ధి సాధించటానికి, రుణాలను పొంది వ్యాపారాల్లో ముందుకు వెళ్ళటానికి, భూమి లేని పేదలు ఉచిత భూములు పొందటానికి - కులసంఘాలు పాటుబడటం కార్యక్రమంగా పెట్టుకున్నాయి.

చదువులేక అజ్ఞానంలో కొట్టుమిట్టాడే బుడ్గ జంగాలకు, దరిద్రంతో సతమతమయ్యే బుడ్గ జంగాలకు, ఆదిమానవుని నాటి కులాచారాలతో మూఢనమ్మకాల గాఢాంధకారంలో మునిగి ఉన్న బుడ్గ జంగాలకు - 'సంఘం' పెట్టుకోవటమనే అవగాహన కలగటానికి చాలా సంవత్సరాలు పట్టింది. సమాజంలో భాగంగా కాక, సమాజానికి దూరంగా జీవించటం వల్ల సమాజాభివృద్ధి కార్యక్రమాలు తమకు కావేమో అనే తప్పుడు అవగాహన వల్ల, అభివృద్ధికి దూరంగా ఉండిపోయారు. 'సంఘాల ద్వారా అభివృద్ధి చెందవచ్చు' అనే స్పృహ వచ్చేసరికి చాలా ఆలస్యం అయిపోయింది.

రంగారెడ్డి జిల్లా శంషాబాదులో శైవులకు సారంగమఠం ఉండేది. 1930 తర్వాత ఈ మఠానికి నీలకంఠస్వామి అధిపతిగా ఉండేవారు. వీరు జంగం ఉపకులాలైన బుడ్గ జంగం, మాలజంగం, బేడజంగం మొదలైన నిమ్న కులాలకు గురువులు, పురోహితులు. ఈ. కులాలవారి జననమరణ వివాహాది సందర్భాల్లో పౌరోహిత్యం చేసేవారు. ఈ నిమ్నకులాల వద్ద వండిన పదార్థాలు కాకుండా - బియ్యం, పప్పు, చింతపండు, మిరపకాయలు మొదలైన వంట సామగ్రిని స్వీకరించేవారు. ఈ వండని సామగ్రిని తీసుకోవటాన్ని 'సాహిత్యం' అనేవారు. ఇంతేకాకుండా సంవత్సరానికోసారి నీలకంఠస్వామి గారు తమ మఠం పరిధిలోని జిల్లాల్లో పర్యటించి, బుడ్గ జంగాల వద్ద జోలెకు రూపాయి వంతున గురుదక్షిణ స్వీకరించేవారు.

1940 ప్రాంతాల్లో హైదరాబాదులోని సైదాబాదు (కుర్మాగుడా) బుడ్గ జంగం వాడలో తూర్పాటి శివయ్యగారు కులపెద్దగా ఉండేవారు. ఆయన బడిలో చదువుకోలేక పోయినా తెలుగు చదువు నేర్చుకున్నాడు. కొన్ని సంస్కృత శ్లోకాలు నేర్చుకున్నాడు. అప్పటికి కులంలో ఆయనే విద్యావంతుడు. నీలకంఠస్వామి గురుదక్షిణకు వచ్చినప్పుడు శివయ్యగారు వారికి శుశ్రూష చేసేవారు. హైదరాబాదులోని ఆయా ప్రాంతాల్లో నివసించే బుడ్గ జంగాల వద్దకు గురువుగారిని తీసుకెళ్ళి, గురుదక్షిణ ఇప్పించేవారు. ఈ పరిచయంతో కులాభివృద్ధి కోసం చేపట్టవలసిన కొన్ని కార్యక్రమాలను నీలకంఠస్వామి శివయ్యగారికి వివరించారు. కులాచారాల్లో కొనసాగే మూఢనమ్మకాలను, కాలానుగుణంగాలేని కొన్ని ఆచారాలను మార్చుకోవాలని నీలకంఠస్వామి చెప్పారు. వారి ఆదేశంతో శివయ్యగారు 1950 ప్రాంతంలో సైదాబాదు(కుర్మగుడా)లో చిన్నగా ఒక కులసంఘాన్ని ప్రారంభిచారు. తద్వారా పురుడు, పెళ్ళి, చావు, పంచాయతులు మొదలైన సందర్భాల్లో కల్లుసారాలు తాగే ఆచారాన్ని తొలగించటానికి ప్రయత్నించారు. పంచాయతుల్లో వృధాగా డబ్బు నష్టపోకుండా కట్టడి చేశారు. పిల్లల్ని చదివించుకోవాలని ప్రచారం చేశారు. ఈ విధంగా బుడ్గ జంగాల చరిత్రలో మొదటిసారిగా కులసంఘం ప్రారంభమయింది. కాలాను గుణమైన మార్పులకోసం ప్రచారం చేయటమే కులాభివృద్ధికి నాంది పలికింది.

మొదటి తరంలో తూర్పాటి శివయ్యగారితోపాటు సైదాబాదు వాస్తవ్యులు కడమంచి ఎల్లయ్యగారు కూడ కులాభివృద్ధి కార్యక్రమాల్లో పాలుపంచుకోవటానికి ముందుకు వచ్చారు. ఇంకా కడమంచి మదారు, కడమంచి పెద్ద ఎల్లయ్య, మోతె నారాయణ, సిరిగిరి యాదగిరి, తూర్పాటి స్వామి మొదలైనవారు కార్యకర్తలుగా ఎదిగారు.

తర్వాత కాలంలో నిదానకవి బాబూరావుగారు పాల్గొనటంతో ఒక కొత్త చైతన్యం వచ్చింది. అప్పుడున్న కార్యకర్తల్లో బాబూరావు గారే విద్యావంతుడు. ఉత్సాహంతో ప్రణాళికలు రూపొందించి పనిచేశారు. తూర్పాటి శివయ్యగారు, కడమంచి ఎల్లయ్యగారు, నిదానకవి బాబూరావుగారు, వాంద్రాసి సోమయ్యగారు, పైన పేర్కొన్న కార్యకర్తలతో కలిసి నూతన ఉత్సాహంతో కులాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఇలా కొంత కాలం జరిగింది.

కొంతకాలమయ్యే సరికి సైదాబాదు (కుర్మాగుడా)కే పరిమితమైన కులసంఘం కార్యక్రమాలు ఇతర బస్తీలకు విస్తరించాలని వీరు ఒక నిర్ణయానికి వచ్చి, ఒక కేంద్ర సంఘాన్ని స్థాపించారు. రాజ్‌ధార్‌ఖాన్‌పేట్ (గుప్పానగర్) వాస్తవ్యులు గుప్పా గణేశ్ (గణేశ్‌సింగ్) గారు వచ్చి చేరారు. గుప్పా గణేశ్‌గారు అధ్యక్షులు, కడమంచి ఎల్లయ్యగారు ఉపాధ్యక్షులు, నిదానకవి బాబూరావు గారు ప్రధాన కార్యదర్శి, వాడ్రాసి సోమయ్యగారు, మోతె నారాయణగారు, మాదెన యాదగిరి గారు, సిరిగిరి యాదగిరిగారు, తూర్పాటి స్వామి గారు తదితరులు ఇతర కార్యవర్గ సభ్యులుగా ఉన్నారు. జంగంమెట్టు నుంచి రేవెల్లె శంకరయ్యగారు, ఇతర బస్తీలనుంచి కొందరు ప్రముఖుల్ని మెంబర్లుగా నియమించుకుని సంఘం కార్యక్రమాలు ప్రారంభించారు. 1960 ప్రాంతాల్లో నుంచి తొమ్మిది పదేళ్ళు మెల్లమెల్లగా పనిచేస్తూ ఈ కేంద్రసంఘం తన ఉనికిని కాపాడుకుంది. 1969-70 సంవత్సరాల్లో రాజకీయ నాయకులను కలిసి తమ కులాభివృద్ధి కోసం చర్యలు తీసుకోవటానికి ప్రయత్నాలు చేశారు.

## ఢిల్లీయాత్ర

బుడ్గ జంగం కులానికి తమలో తాము మాట్లాడుకోవటానికి దాదాపు 300 పదాలు కలిగిన ఒక అసమగ్రమైన భాష ఉండటం, వేట సంప్రదాయ ఉపవృత్తిగా ఉండటం, గ్రామాలకు చివరలో దూరంగా నివసించటం, గ్రామ ప్రజలతో సహజీవనం చేయకపోవటం - మొదలైన గిరిజన లక్షణాలు ఈ కులానికి ఉండటం వల్ల, బుడ్గ జంగం కులాన్ని షెడ్యూల్డు తెగల్లో చేర్పించాలని కేంద్ర సంఘం నాయకులు ఢిల్లీ యాత్రకు సంకల్పించారు. అప్పటి ప్రధాన మంత్రి *శ్రీమతి* ఇందిరాగాంధీ గారిని కలిసి బుడ్గ జంగాల దీనమైన జీవన విధానాన్ని వివరించి, ప్రభుత్వ సహాయం కోరుతూ అభ్యర్థన పత్రాన్ని సమర్పించాలని నిర్ణయించుకున్నారు. ముఖ్యంగా ప్రధానమంత్రి గారికి చూపటానికి బుడ్గ జంగాల జీవన విధానాన్ని తెలియజేసే ఫోటోలతో ఒక ఆల్బమ్ తయారు చేశారు. హోటళ్ళ వద్ద, బస్సుడిపోలవద్ద, ఇంటింటా భిక్షమడుగుతూ పొట్టపోసుకునే దయనీయమైన దృశ్యాలు ; బుడ్గ జంగాలు కథలు చెప్పటం, జీవనోపాధికి

ఇతర వృత్తులు ప్రదర్శించటం, రకరకాల వేటలు చేయటం, చాపలల్లటం మొదలైన జీవనశైలికి సంబంధించిన ఫొటోలు సేకరించి - బుడ్గ జంగాల జీవన విధానానికి అద్దంపట్టే ఒక ఆల్బమ్ ను తీసుకుని ప్రధానమంత్రి గారిని కలవటానికి ఢిల్లీ వెళ్ళారు. ఢిల్లీలో ఈ బృందానికి అప్పటి యం.పి.లయిన శ్రీమతి సంగెం లక్ష్మీబాయి, డా॥ జి.యస్.మేల్కోటే మొదలైన నాయకులు సహాయం చేశారు.

ఢిల్లీకి వెళ్ళిన బృందంలో అధ్యక్షుడు గుప్పగణేశ్ గారు, ఉపాధ్యక్షుడు కడమంచి ఎల్లయ్యగారు, ప్రధాన కార్యదర్శి నిదానకవి బాబూరావుగారు, ఇతర కార్యవర్గ సభ్యులు వాడ్రాసి సోమయ్య, మోతె నారాయణ, మాదెన యాదగిరి, సిరిగిరి యాదగిరి, కడమంచి ఈశ్వర్ మరియు సంఘం వ్యవస్థాపకులు తూర్పాటి శివయ్యగార్లు ఉన్నారు.

కేంద్ర సంఘం బృందం ఢిల్లీలో ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ గారిని కలిసి, ఫోటో ఆల్బమ్ ద్వారా బుడ్గ జంగాల కులం అన్ని కులాలకంటే ఎంత అట్టడుగున పడివుందో వివరించి, ఆమె సానుభూతిని పొందటంలో విజయం సాధించారు. అయితే కులాన్ని యస్.టి.గా మార్చటం అప్పట్లో కుదరకపోయినా ఆమె ముఖ్యమంత్రి గారికి లెటర్ రాస్తూ, బుడ్గ జంగాల అభివృద్ధికి సహాయం అందించవలసిందిగా కోరారు.

అప్పటి రాష్ట్రముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి గారిని ప్రధాన మంత్రి రాసిచ్చిన లెటర్‌తో వెళ్ళి కేంద్ర సంఘం నాయకులు కలిశారు. మలక్‌పేట ఎమ్.ఎల్.ఎ. శ్రీమతి సరోజినీ పుల్లారెడ్డిగారు ఎంతో శ్రద్ధ తీసుకుని ముఖ్యమంత్రిగారితో వీరికేదైనా ప్రత్యేక సహాయం అందించాలని పట్టుపట్టారు. శ్రీ బ్రహ్మానందరెడ్డిగారు కుల సమస్యలన్నీ విని, ప్రభుత్వ రాయితీలు అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.

ప్రధానమంత్రిని, ముఖ్యమంత్రిని, ఇతర మంత్రులను, ఎమ్.పిలను, ఎమ్.ఎల్.ఎ లను కలిసి కులసమస్యల్ని చర్చించాకా సంఘం నాయకుల్లో ఆత్మ విశ్వాసం పొంగింది. ఉత్సాహంతో కులాభివృద్ధి కార్యక్రమాలను ముమ్మరం చేశారు. **జూన్ 1971లో కేంద్ర సంఘాన్ని హైదరాబాదులోని రిజిస్ట్రార్ జనరల్ ఆఫీసులో రిజిస్టర్ చేయించారు.** పిల్లల్ని చదివించటం, భిక్షాటనమాని ఇతర చిన్న చిన్న వృత్తులవైపు మళ్ళటం, దురాచారాలైన

కులాచారాలను మానేస్తూ, ఆధునిక దృక్పథాన్ని అలవరచుకోవటం ప్రారంభమయింది. మెలమెల్లగా కొత్త బస్తీల (Localities)కు కులాభివృద్ధి కార్యక్రమాలు అందుతూ, ప్రాంతీయ సంఘాలు ఏర్పడసాగాయి.

## రాష్ట్రసంఘ భవన నిర్మాణం

సైదాబాదు (కుర్మాగుడా)లో సంఘం కోసం 300గజాల ప్లాటును సంపాదించారు. ఇది మోతె నారాయణగారి ఇంటికి ఆనుకుని ఉన్నది. 150 గజాల రెండు ఉచిత ప్లాట్ల భూమి ఇది. దీన్ని ఎవరూ ఆక్రమించుకోకుండా సంఘ సభ్యులు శ్రద్ధ తీసుకున్నారు. ముఖ్యంగా మోతె నారాయణగారు కాపాడారు. ఈ ప్లాటు మీద సంఘభవనం నిర్మించాలని కార్యవర్గం నిర్ణయం తీసుకుంది. దాతలు ఒక్కొక్కరు నిర్మాణంలో ఒక్కొక్క ఐటం ఖర్చులు భరించాలని నిర్ణయించుకొని, అలాగే విరాళాలు సేకరించారు. ఆ బస్తీ వాళ్ళే కాక ఇతర బస్తీల్లో ఉన్న ప్రముఖులు తమకు తోచిన విరాళాలు అందించారు.

ఈ భవన నిర్మాణం రెండు దశల్లో పూర్తయింది. మొదటిదశ (1975-80)లో కడమంచి ఎల్లయ్యగారు అందరికంటే ఎక్కువగా శ్రమించారు. ఆయనకు ఇటుక బట్టీల వ్యాపారం ఉండటం వల్ల కట్టడానికయ్యే ఇటుకంతా ఇచ్చారు. అంతేకాకుండా తమ మిత్రుల వద్ద, తెలిసినవారి వద్ద విరాళాలు సేకరించి ఇచ్చారు. రెండు హాళ్ళు, ఒక రూము ఇటుక కట్టుడు అయిన తర్వాత పని ఆగిపోయింది.

కొన్ని సంవత్సరాల తర్వాత రెండవ దశ ప్రారంభమయింది. ఈ దశలో నిదానకవి బాబూరావుగారు ముందుకు వచ్చి, తిరిగి కొందరి దగ్గర విరాళాలు సేకరించి, తాను కొంత ఖర్చుపెట్టి, నిలబడి నిర్మాణ కార్యక్రమమంతా పూర్తి చేయించి, సంఘ భవనాన్ని వినియోగంలోకి తెచ్చారు.

## జంగంమెట్టు సంఘం కార్యక్రమాలు

సైదాబాదులో తూర్పాటి శివయ్యగారు సంఘస్థాపన చేసినప్పటి నుంచి ఆ సంఘానికి సమాంతరంగా జంగంమెట్టు సంఘం కూడ పనిచేస్తూనే వచ్చింది. ఇక్కడి

మొదటి తరంలో శ్రీయుతులు కడమంచి బాబయ్య, కడమంచి పోచయ్య, రేవెల్లె శంకరయ్య, కప్పెరి ఇస్తారి మొదలైనవారు పనిచేశారు. ఆ తర్వాత నిదానకవి వెంకయ్య, నిదానకవి యాదయ్య అధ్యక్షులుగా ఉండి తదితరులుతో కలిసి సంఘకార్యక్రమాలను నడిపించారు. వీరి తర్వాత తరంలో యువక్షులు చైతన్యంతో ముందుకు వచ్చారు. కడమంచి చంద్రయ్య, కడమంచి ఎల్లయ్య, ఎన్.ఆర్.వెంకటేశం, తూర్పాటి జంగయ్య, కడమంచి జంగయ్య, కడమంచి రాంచందర్, తూర్పాటి నరసింహ, పస్తం అడవయ్య ఇంకా చాలామంది యువకులు ఉప్పెనలా ముందుకు వచ్చారు. టీం వర్కుతో బస్తీలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. పాత ఆచారాల మీద తిరుగుబాటు, పిల్లల్ని చదివించటం, ప్రభుత్వ రాయితీలు వినియోగించుకోవటం మొదలైన అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా కొనసాగాయి. ఆ తర్వాత కేంద్ర సంఘం మీదికి దృష్టి సారించారు.

అప్పటికి కేంద్ర సంఘం స్తబ్దుగా ఉంది. 'ఎవరికి వారే యమునాతీరే' అన్నట్టున్న కేంద్ర సంఘం నాయకుల్ని ఒక వేదిక మీదికి తేవాలని జంగంమెట్ స్థానిక సంఘం యువకులు భావించారు. ఈ ప్రయత్నంలో వారిని విడివిడిగా కలిసి మాట్లాడారు. ఒక చోట చేర్చి మాట్లాడారు. మళ్ళీ కేంద్ర సంఘం యాక్టివ్‌గా పనిచేయటానికి ప్రయత్నించాలని కోరారు. దీనికి అందరూ సమ్మతించారు. జంగంమెట్టు స్థానిక సంఘం అభిప్రాయాలను గుప్పగణేశ్‌గారు, సైదాబాదు కడమంచి ఎల్లయ్యగారు బాగా ప్రోత్సహించారు. హైదరాబాదులో అప్పటికి ఉన్న ఐదారు స్థానిక సంఘాల స్థానంలో ఇరవై స్థానిక సంఘాలు ఏర్పడ్డాయి. ఈ కొత్త సంఘాలు స్థాపించటంలో గుప్పగణేశ్‌గారు, ఎన్.ఆర్. వెంకటేశం గారు బాగా చొరవ తీసుకుని అందర్నీ కలుపుకుపోయారు.

జూలై 1977 కేంద్ర సంఘం ఎన్నికలు జరిగినా, రెండుమూడేళ్ళు స్థానిక సంఘాలు తమ తమ పరిధుల్లో కార్యక్రమాలు చేస్తూ వచ్చాయి. 1977లో వరంగల్ లో జిల్లా సభలు జరిగాయి. హైదరాబాదు నుంచి వెళ్ళి పాల్గొన్నారు. కేంద్రసంఘంలో సమన్వయం దెబ్బతిని, కార్యక్రమాల ఉనికి కరువై నామమాత్రంగా ఉండిపోయింది. ఆ సమయంలో స్థానిక సంఘాలు మాత్రం చురుకుగా ఉన్నాయి.

## 1983 లో నూతన చైతన్యం

1983లో కొత్తగా ఒక ఉత్సాహకెరటం పొంగులెత్తింది. బాపూజీనగర్ (సికిందరాబాదు) వాస్తవ్యులు సిరిగిరి రామయ్యగారు వచ్చి కార్యకర్తల్ని తట్టి లేపారు. రామయ్య గారితో పస్తం యాదగిరిగారు, ఆనరాశి రాములు గారు కలిసి, భోలక్‌పూర్‌లో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. అప్పటికే చైతన్యంతో పనిచేస్తున్న జంగంమెట్ స్థానిక సంఘం నుంచి ఎన్.ఆర్.వెంకటేశం, టి.జె.జంగయ్యగార్లు వెళ్ళి పాల్గొన్నారు. అందరూ కలిసి ఆ సమావేశంలో కులాభివృద్ధి ప్రచార కార్యక్రమాలు ప్రారంభిద్దామని, ఈ సారి జిల్లాలకు విస్తరిద్దామని నిర్ణయం తీసుకోవటం జరిగింది. వెంటనే మెదక్ జిల్లాలో పర్యటిద్దామని నిర్ణయం తీసుకోగా, ఆనరాశి రాములుగారు ఆర్థికంగా సహకరించటానికి ముందుకు వచ్చారు. దాంతో కేంద్ర సంఘం బృందం బుల్కపురం, మహారాజ్‌పేట్, కంది, సంగారెడ్డి, ముత్తంగి, సదాశివపేట, జహీరాబాదు మొదలైన ప్రాంతాలు తిరిగి, అక్కడ స్థానిక సంఘాలు ఏర్పాటు చేయటం జరిగింది. హైదరాబాదు, రంగారెడ్డి, మెదక్‌జిల్లాలను కలుపుకుని 20-11-1983లో సంగారెడ్డిలో పెద్దయెత్తున బుడ్గ జంగాల బహిరంగ సభను నిర్వహించటం జరిగింది.

## ముఖ్యమంత్రి శ్రీ టి. అంజయ్యగారి ప్రోత్సాహం

శ్రీ టి. అంజయ్యగారు కార్మికమంత్రిగా ఉన్నప్పటి నుంచి బుడ్గ జంగాల అభివృద్ధికి తమ సహాయాన్ని అందించారు. రాజ్‌ధార్‌ఖాన్‌పేట్ (గుప్పానగర్), జంగమ్మెట్, సైదాబాద్ (కుర్మాగుడా), మెహమ్మద్‌గుడా ప్రాంతాల్లో నిర్వహించిన బుడ్గ జంగం సభల్లో పాల్గొని ధైర్యమిచ్చి, ఎంతో చైతన్యం కలిగించారు. అంతేగాకా వారు ముఖ్యమంత్రిగా ఉన్నకాలంలో కూడా, ఇళ్ళ స్థలాలు లేని బుడ్గ జంగాల కోసం జంగంమెట్టులో, రాజ్‌ధార్‌ఖాన్ పేట్‌లో స్థానిక సంఘాలు చేపట్టిన కార్యక్రమాల సందర్భంగా వారు అనుకూలంగా స్పందించి ఇళ్ళస్థలాలను ఇప్పించారు.

ఖైరతాబాద్ ఎమ్.ఎల్.ఎ. శ్రీ.పి. జనర్ధన్ రెడ్డి గారు తమ నియోజక వర్గంలోని రాయదుర్గం గ్రామంలో 'బుడ్గజంగాల కమ్యూనిటీహాలు' కట్టించారు. 27-11-1985 లో జరిగిన సభలో అప్పుడు కేంద్ర కార్మిక మంత్రిగా ఉన్న శ్రీ టి. అంజయ్యగారు తమ

చేతుల మీదుగా కమ్యూనిటీ హాలును ప్రారంభించారు. ఆ సభలో స్థానిక ఎమ్.ఎల్.ఎ. మంత్రి శ్రీ ఇంద్రారెడ్డి *గారు* కూడా పాల్గొన్నారు.

1976లో హైదరాబాదులో జరిగిన బుడ్గ జంగం సభల్లో అప్పటి ఆరోగ్యశాఖా మంత్రి శ్రీరాచమల్లుగారు, దేవాదాయ శాఖామంత్రి శ్రీ వీరమాచనేని వెంకటనారాయణ గారు పాల్గొన్నారు. 1977లో జరిగిన సభల్లో అప్పటి హోంశాఖమంత్రి శ్రీ ప్రభాకర్ రెడ్డిగారు పాల్గోన్నారు.

## శ్రీమతి జమలాపురం రాజ్యలక్ష్మిగారి కృషి

ఆ రోజుల్లో కాంగ్రెసు పార్టీలో ఉండి అనేక సాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తున్న శ్రీమతి జమలాపురం రాజ్యలక్ష్మిగారు 1975 నుంచి 1985 వరకు పది సంవత్సరాలు కేంద్ర సంఘానికి సలహాదారులుగా ఉన్నారు. ఈ సమయంలో వారు బుడ్గ జంగాల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారు. జంగంమెట్‌లో ఇళ్ళ స్థలాలను పొందటంలో, రాజధార్‌ఖాన్‌పేట్‌లో ఇళ్ళస్థలాలను పొందటంలో ఎన్నో ఒడుదుడుకులు వచ్చినా నిరంతరం శ్రమించి, విజయాన్ని కలిగించారు. ఆయా సందర్భాల్లో ముఖ్యమంత్రులు *శ్రీ జలగం వెంగళరావు గారితో, శ్రీ మర్రి చెన్నారెడ్డి గారితో, శ్రీ టి. అంజయ్యగారితో* బుడ్గ జంగాల అభివృద్ధి కోసం పనులు చేయించారు. ఎమ్.ఎల్.ఎ.లు, ఎమ్.పి.లు మంత్రులు బుడ్గ జంగం సంక్షేమ కార్యక్రమాల్లో చేయూత నిచ్చేలా కృషి చేశారు.

## త్రివిధ కార్యాచరణ

ఆంధ్రప్రదేశ్ బుడ్గ జంగం సంఘం ముఖ్యంగా మూడురకాలైన కార్యక్రమాలతో ముందుకు వెళుతుంది. *1. పర్యటనలు - ప్రచారాలు, 2. గ్రంథ ప్రచురణ 3.* అధికారులతో ముఖాముఖి.

**1. పర్యటనలు – ప్రచారాలు :** బుడ్గ జంగాల్లో విద్యలేకపోవటం వల్ల అజ్ఞానాంధ కారంలో ఉన్నారు. ఇతర కులాలు అభివృద్ధిని సాధించినప్పటికీ, బుడ్గ జంగాలు మాత్రం అన్ని కులాలకంటే అట్టడుగున ఉన్నారు. భిక్షాటన చేయటం, కూలీ నాలీ చేసుకుని

బతకటం తప్పు, ఉద్యోగరంగంలో-వ్యాపార రంగంలో ఎవరూలేరు. ఇంతవరకు కులంలో ఎవరు ఒక సర్పంచుగా లేరంటే, రాజకీయంగా ఎంత వెనకబడి ఉన్నారో అర్థమౌతుంది. ప్రభుత్వ రిజర్వేషన్ల విషయం గురించి వీరికి అంతగా తెలియదు. షెడ్యూల్డు కులాలకోసం రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల సంగతి తెలియదు. అందుకే ఇంతవరకు ఆ కార్యక్రమాలను ఉపయోగించుకోలేక సమాజంలో అందరికంటే ఎంతో వెనకబడి ఉన్నారు. అందువల్ల రాష్ట్ర సంఘం కార్యకర్తలు తాలూకాలు జిల్లాలు పర్యటించి; సభలూ సమావేశాలు నిర్వహించి; ప్రభుత్వ రాయితీలు, ప్రయోజనాల గురించి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల తీరుతెన్నుల గురించి కులస్థుల్లో అవగాహన కలిగించటానికి 'పర్యటనలు - ప్రచారాలు' కార్యక్రమాన్ని ఎన్నుకోవటం జరిగింది. తద్వారా కులాభివృద్ధి సాధించటమే రాష్ట్ర సంఘం ఆశయం.

**2. గ్రంథ ముద్రణ :** బుడ్గ జంగాల సాధకబాధకాలు, వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యలు, వాళ్ళ వెనకబాటుతనం, వాళ్ళ అవసరాలూ అభ్యర్ధనలు మొదలైన అన్ని విషయాలు ఇటు ప్రజల దృష్టికి, అటు ప్రభుత్వం దృష్టికి తేవటానికి గ్రంథ ముద్రణ అవసరమని భావించటం జరిగింది. కరపత్రాలు, గ్రంథాల ద్వారా బుడ్గ జంగాల జీవన పరిస్థితులను అధికారుల దృష్టికి కూడా తేవటానికి వీలు కలుగుతుంది. బుడ్గ జంగాల్లో కూడ ఒక అవగాహన కలిగించటానికి, మార్గ నిర్దేశం చేయటానికి, చైతన్యం తీసుకు రావటానికి వీలు కలుగుతుంది. ఈ కృషితో రానున్న తరాలైనా బాగుపడి - 'సమాజంలో మేము కూడ భాగమే' అనే అచంచల విశ్వాసంతో జీవించటానికి మార్గం ఏర్పడుతుంది. క్రమంగా అన్ని రంగాల్లో బుడ్గ జంగాలు కూడ కాలుమోపి, సర్వాంగీణ వికాసం వైపు నడవటానికి ప్రయత్నం చేస్తారు. ఈ ఉద్దేశాలతో ఇంతవరకూ కొన్ని కరపత్రాలు అచ్చుచేసి రాష్ట్రమంతటా పంపటం జరిగింది. ఈ క్రింద పేర్కొంటున్న పుస్తకాలను ప్రచురించటం జరిగింది.

**(1) బుడ్గ జంగం వాణి -1 :** 1984లో ఈ సంచిక ప్రచురించబడింది. 24 పేజీలతో పాటలు, వ్యాసాలు తదితర అంశాలతో ఉన్న ఈ పుస్తకానికి నిదానకవి బాబూరావుగారు గౌరవ సంపాదకులుకాగా, ఎన్.ఆర్. వెంకటేశంగారు ప్రధాన సంపాదకుడు, కడమంచి దయానంద్‌గారు సంపాదకుడుగా వ్యవహరించారు.

(2) బుడ్గ జంగంవాణి – ప్రత్యేక సంచిక :– ఇది ఏప్రిల్ 1989లో ప్రచురింపబడింది. సంపాదక వర్గంలో గౌరవ సంపాదకుడుగా నిదానకవి బాబూరావుగారు, సంపాదకుడుగా ఎన్.ఆర్.వెంకటేశం గారు, ఆర్టిస్ట్ మరియు ఉప సంపాదకుడుగా కడమంచి దయానంద్‌గారు ఉన్నారు. ఇది 100 పేజీల పుస్తకం. అప్పటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్.టి.రామారావు గారు, ఇతర మంత్రులు, ప్రతిపక్షనాయకులు శ్రీ ఎం. బాగారెడ్డిగారు, ఇతర పార్టీల నాయకులు శ్రీ జయపాల్‌రెడ్డిగారు, శ్రీ ఏ.నరేంద్రగారు మొదలైన నాయకుల సందేశాలతో, పాటలు, వ్యాసాలు, ఫొటోలతో, రిపోర్టులతో వెలువడింది.

**3. బుడ్గ జంగాలు (భాషా సాహిత్య సాంస్కృతికాంశాల పరిశీలన) :** ఇది పిహెచ్.డి. పరిశోధనాగ్రంథం. ఉస్మానియా విశ్వవిద్యాలయం ఈ గ్రంథానికి 1992లో పిహెచ్.డి. పట్టా ప్రదానం చేసింది. ఇది 1995లో ప్రచురింపబడింది. గ్రంథ రచయిత డా॥ఎన్.ఆర్. వెంకటేశం. ఇందులో 480 పుటలున్నాయి. బుడ్గ జంగాల గురించి సమగ్రంగా ఉన్న గ్రంథం. ఈ పుస్తకానికి సంబంధించిన వివరాలను 'గ్రంథాల్లో బుడ్గ జంగాల ప్రస్తావన' అనే చాప్టర్‌లో చూడవచ్చు.

**3. అధికారులతో ముఖాముఖి :** ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంఘం నాయకులు ఎమ్.ఆర్.ఓ., ఆర్.డి.ఓ., కలెక్టర్, కమీషనర్, కార్యదర్శి, మంత్రి, ముఖ్యమంత్రి గార్లతో, ఆ యా శాఖల అధికారులతో కలిసి బుడ్గ జంగాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి లెటర్ల ద్వారా, ముఖాముఖిగా వివరిస్తారు. అధికారులకు సమస్యలపట్ల అవగాహన కలిగించి, పరిష్కార మార్గాలను అన్వేషిస్తారు. అధికారులు తగిన చర్యలు తీసుకునేలా పాటుబడతారు.

ఈ విధంగా త్రివిధ కార్యాచరణతో రాష్ట్రసంఘం పనిచేస్తూ ఉంది. ఈ పని విధానం వల్ల ఆశించినట్లుగానే ఇటు కులస్థుల్లో చైతన్యం కనిపిస్తుంది. ప్రజల్లో, ప్రభుత్వాధికారుల్లో అవగాహన కలగటం వల్ల హీనస్థితి నుంచి బుడ్గ జంగాలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. అభివృద్ధి కార్యక్రమాలు వారికి అర్థమవుతున్నాయి. ప్రభుత్వ కార్యక్రమాలను ఉపయోగించుకుని పైకి రావాలనే ప్రయత్నంలో ముందుకు సాగుతున్నారు.

## పర్యటనలు - ప్రచారాలు

20-11-1983న సంగారెడ్డిలో మూడు జిల్లాల మహాసభను నిర్వహించిన (వివరాలు 'పత్రికల్లో బుడ్గ జంగాల ప్రస్తావన'లో చూడవచ్చు) తర్వాత చేపట్టిన కార్యక్రమాలను ఈ కింద వరుసగా ఇస్తున్నాను.

1983 నుంచి 2001దాకా దాదాపు 18 సంవత్సరాలుగా రాష్ట్రమంతా ఉద్ధృతంగా ప్రచార కార్యక్రమాలు కొనసాగాయి. రాష్ట్ర సంఘం కృషి ఫలితంగా ఇప్పుడిప్పుడే బుడ్గ జంగాల చీకటి బతుకుల్లో వెలుగు రేకలు ప్రసరిస్తున్నాయి.

ఈ 18 సంవత్సరాల కాలంలో రాష్ట్ర సంఘం విస్తృతంగా నిర్వహించిన పర్యటనలు- సభలు- సమావేశాలు కార్యక్రమాల్లో కొన్నింటిని ఇక్కడ పరిచయం చేయటం జరుగుతున్నది. ఇక్కడ రాయకుండా మిగిలిపోయిన విషయాలే ఎక్కువగా ఉన్నాయి.

పర్యటనలు -ప్రచార కార్యక్రమాల్లో ఎక్కువగా పస్తం యాదగిరిగారు, ఎన్.ఆర్, వెంకటేశం గారు పాల్గొనటం జరిగింది. రాష్ట్ర సంఘానికి పస్తం యాదగిరి గారు కొన్ని సంవత్సరాలు ప్రధాన కార్యదర్శిగా, ఆ తర్వాత ఇప్పుడు అధ్యక్షులుగా పనిచేస్తున్నారు. ఎన్.ఆర్. వెంకటేశం గారు ఆర్గనైజింగ్ సెక్రటరీగా, ఉపాధ్యక్షులుగా పనిచేసి, ఇప్పుడు ప్రధానకార్యదర్శిగా పనిచేస్తున్నారు. అందువల్ల వీళ్ళ ఇన్వాల్వ్‌మెంట్ ఎక్కువగా ఉంది. వీళ్ళకు అండదండలుగా ఉన్నవారు కీ.శే. గుప్ప గణేశ్ సింగ్, కీ.శే. కడమంచి ఎల్లయ్య, నిదానకవి బాబూరావు, అనరాశి రాములు, తూర్పాటి జగదీశ్వర్, తూర్పాటి జంగయ్య గార్లు. వీరు కూడ అప్పుడప్పుడు ఫీల్డ్‌వర్క్‌లో పాల్గొన్నారు.

ఇక 'పర్యటనలు-ప్రచారాలు' వివరాలను వరుసగా చదవండి.

## శ్రీశైలంలో బుడ్గ జంగం వాణి ఆవిష్కరణ :

1983 డిసెంబర్ చివరి రోజున "బుడ్గ జంగం వాణి" తొలి బులెటిన్ ఆవిష్కరణకు 50 మందికి పైగా కార్యకర్తలతో శ్రీశైలం వెళ్ళటం జరిగింది. మరునాడు 1984 సం॥ తొలిదినాన శ్రీశైలం దేవస్థాన కమీషనరు గారైన శ్రీ సూర్యనారాయణ రాజుగారు "బుడ్గ జంగం వాణి" తొలి సంచికను ఆవిష్కరించారు. అంతకుముందు మల్లికార్జున భ్రమరాంబికాదేవి ఆలయాల్లో ప్రతికకు 'అర్చన' చేయించటం జరిగింది. సంఘం విన్నపాన్ని మన్నించి, ప్రత్యేకంగా ఒక బస్సును కేటాయించి, ఈ కార్యకర్తల యాత్ర విజయవంతం అయ్యేలా చూసిన హైదరాబాదు. ఆర్.టి.సి సిటీ బస్ డిపో (అప్పటి) మేనేజర్ శ్రీ రెడ్డిగారు అభినందనీయులు. జంటనగరాలలోని అనేక బస్తీల నుంచి వచ్చిన కార్యకర్తలు చూపిన ఉత్సాహం, శ్రద్ధ సంఘానికి ఒక ఊపును, చైతన్యాన్ని కలిగించిందనటంలో సందేహంలేదు.

## మహబూబ్‌నగర్ జిల్లా పర్యటన :

1984 జనవరి మొదటి వారంలో సిరిగిరి రాములు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం గార్లు మహబూబ్‌నగర్ జిల్లాలోని కల్వకుర్తి, అచ్చంపేట, గువ్వలోనిపల్లె, డిండి మొదలైన ప్రాంతాలు తిరగటం జరిగింది. ఈ పర్యటనలో కొండపల్లి రామయ్య (కల్వకుర్తి), కప్పెరి శ్రీరాములు (గువ్వలోనిపల్లె), రేవెల్లె కిష్టప్ప (అచ్చంపేట్)గార్లు కార్యకర్తలుగా ముందుకు వచ్చారు.

## వరంగల్ జిల్లా పర్యటన :

జనవరి రెండవ వారంలో ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి దయానంద్‌గార్లు. వరంగల్ జిల్లాలో విస్తృతంగా పర్యటించి కుల ప్రచారం చేయటం జరిగింది. వరంగల్ 'దాట్ల', రేపూని, కుమ్మరిగుంట్ల, ఖమ్మం, గంధశ్రీ మొదలైన ప్రాంతాలు పర్యటించారు. కులాభివృద్ధికోసం అందరూ పాటుపడాలని ప్రచారం సాగించారు.

## కల్వకుర్తి సభ :


బుడ్గ జంగం సంఘం సదస్సు
తా॥ కల్వకుర్తి. జిల్లా మహబూబ్‌నగర్.

ఆహ్వానము

తేది 30-1-1984 సోమవారం ఉదయం 11-00 గంటలకు కల్వకుర్తి తాలూకా స్థాయి బుడ్గ జంగం సదస్సు శారదా టాకీసు (కల్వకుర్తి) లో ఏర్పాటు చేయనైనది. ఈ సదస్సులో మన బుడ్గ జంగం కులం సాధక-బాధకాలను చర్చించి. భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించబడతాయి

ముఖ్యఅతిథిగా : శ్రీ యద్మ కిష్టారెడ్డి (సర్పంచ్. కల్వకుర్తి) గారు పాల్గొంటారు.

సదస్సులో ఈ క్రింది బుడ్గ జంగం కేంద్ర సంఘం నాయకులు పాల్గొంటారు.

1) శ్రీ సిరాసవి బాబూరావు, బి.ఎస్‌సి. [సంపాదకులు]
2) శ్రీ గుప్ప గణేష్‌సింగ్. [అధ్యక్షులు]
3) శ్రీ కిరమంచి ఎల్లయ్య. [ఉపాధ్యక్షులు]
4) శ్రీ నిజగిరి రాములు. [ఉపాధ్యక్షులు]
5) శ్రీ పస్తం యాదగిరి. బి.ఏ, ఎల్ఎల్ బి. [ప్రధానకార్యదర్శి]
6) శ్రీ సిరాసవి వెంకటేశం. ఎం ఏ(లాంగ్). ఎం.ఫిల్. [ఆర్గనైజింగ్ సెక్రటరీ]
7) శ్రీ కిరమంచి దయానంద్ బి.ఏ. [ఆర్గనైజింగ్ సెక్రటరీ]

మరియు ఇతర నాయకులు పాల్గొంటారు

కావున మీరెల్లరు సకాలములో విచ్చేసి మన సదస్సును విజయవంతం చేయగలరని ప్రార్థన.

ఇట్లు
తా॥ బుడ్గ జంగం సంఘం ఆహ్వాన సంఘం సభ్యులు.

1984 జనవరి 30వ తేదీన కల్వకుర్తి శారదా టాకీసులో బ్రహ్మాండమైన సభ జరిగింది. మహబూబ్‌నగర్, అచ్చంపేట, కల్వకుర్తి, దేవరకొండ, జడ్చర్ల, నాగర్ కర్నూలు మొదలైన తాలూకాల్లో నుంచి 50కి పైగా గ్రామాల బుడ్గ జంగాలు ఈ సభలో పాల్గొన్నారు. సభకు ముఖ్య అతిథిగా కుల్వకుర్తి సర్పంచ్ శ్రీ యద్మ కిష్టారెడ్డిగారు వచ్చారు. వారి సహాయ సహకారాలవల్లే ఈ సభ విజయవంతమైంది. జంటనగరాల కార్యకర్తలతో కేంద్ర సంఘం పెద్దలతో సభ ఉత్సాహంగా జరిగింది.

## మెదక్ జిల్లాలో పర్యటన :

ఫిబ్రవరి రెండవ వారంలో పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశంగార్లు సంగారెడ్డి, జహీరాబాద్, బిలాల్‌పూర్, సదాశివపేటలలో సంఘ ప్రచారాలు చేసి – అక్కడ స్థానిక సంఘాలు ఏర్పాటు చేయటం జరిగింది.

## నల్గొండ - వరంగల్ జిల్లాల్లో పర్యటన :

మార్చి మూడవ వారంలో పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశంగార్లు ఆలేరు, జనగామ, బచ్చన్నపేట, కొలనుపాక, ఘనాపురం, నెమలికొండ ప్రాంతాలు పర్యటించి ప్రచారాలు సాగించారు. సంఘాలు ఏర్పాటు చేశారు.

## మెదక్ - నిజామాబాద్ జిల్లాల్లో పర్యటన :

ఏప్రిల్ 3వ వారంలో సిరిగిరి రాములు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం కప్పెర గండయ్య (సంగారెడ్డ) గార్లు జోగిపేట, అల్లాదుర్గం, నారాయణ్‌ఖేడ్, పిట్లం, ఎల్లారెడ్డి, కామారెడ్డి మొదలై ప్రాంతాలు పర్యటించి సంఘ ప్రచారాలు చేశారు.

1984 జూన్ మొదటి వారంలో ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి రాంచందర్ గార్లు మరోసారి కల్వకుర్తి, అచ్చంపేట, డిండీ లేగాక కొత్తగా మన్ననూరు, గోనకొల్లు, దేవరకొండ, దర్వేజ్‌పురం, నల్గొండ, మున్నగు ప్రాంతాలు పర్యటించారు. అనేక సభల్లో పాల్గొన్నారు. అనేక సంఘాల్ని స్థాపించారు. ఈ పర్యటనకు శ్రీనిదానకవి బాబూరావుగారు ఆర్థిక సహాయం చేశారు.

## సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగారికి వినతి పత్రం :

జూలై రెండవ వారంలో కేంద్ర సంఘం ప్రతినిధి బృందం సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిణి శ్రీమతి ప్రతిభా భారతిగారిని కలిసి కుల సమస్యలను వారి దృష్టికి తెస్తూ ఒక వినతి పత్రం సమర్పించటం జరిగింది.

## మహబూబ్‌నగర్ - వరంగల్ జిలాల్లో :

జూలై నెల 3వ వారంలో పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశంగార్లు మహబూబ్ నగర్, పెబ్బేరు, అచ్చంపేట్, పిరట్‌వానిపల్లె మొదలైన ప్రాంతాలు పర్యటించారు. ఇంతేగాక జూలై ఆఖరు వారంలో పై ఇద్దరు వరంగల్ వెళ్ళి అక్కడ సంఘం ఎన్నికలు నిర్వహించి వచ్చారు.

## శాబ్దిపూర్ (కామారెడ్డి - నిజామాబాదు జిల్లా) సభ:

1984 డిసెంబర్ 23వ తేదీన శాబ్దిపూర్ కామారెడ్డి డివిజన్‌లో బుద్ధ జంగాల సభ జరిగింది. చుట్టుపట్ల తాలూకాల నుంచి ఎంతోమంది బుద్ధ జంగాలు వచ్చారు. ఈ సభను నిర్వహించటానికి తూర్పాటి నారాయణ బాగా శ్రమించారు. ఈ సభ అయిపోయాక నిజామాబాదు జిల్లా, దాని పరిసర గ్రామాల్లోని బుద్ధ జంగాలను కలుసుకొని ప్రచారం చేయటం జరిగింది. ఈ పర్యటనలో సిరిగిరి రాములు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి దయానంద్, కడమంచి యాదగిరి (అచ్చయ్యనగర్), తూర్పాటి జంగయ్య, పర్తం సీతారాములు, పస్తం అదవయ్య తదితరులు పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో :

1985 జనవరి రెండవ వారంలో సిరిగిరి రాములు, పస్తం యాదగిరి, కడమంచి యాదగిరి, కప్పెర గండయ్య (సంగారెడ్డి) గార్లు మెదక్ జిల్లాలోని జోగిపేట, అల్లాదుర్గం, దౌల్తాబాదు మొదలైన ప్రాంతాలు పర్యటించి అనేక సంఘాలు స్థాపించారు.

1985 జనవరి 3వ వారంలో పస్తం యాదగిరి, కడమంచి యాదగిరిగార్లు మెదక్ జిల్లాలోని అల్లాదుర్గం, జహీరాబాద్, ముచ్చర్ల, కొండాపురం, సదాశివపేట్ మొదలగు ప్రాంతాలు పర్యటించి సంఘ ప్రచారాలు నిర్వహించారు.

## అచ్చంపేట (మహబూబ్‌నగర్ జిల్లా) సభ :

1985 జనవరి 27వ తేదీన అచ్చంపేటలో జిల్లాస్థాయి సభ జరిగింది. అనేక తాలూకాల్లోని బుద్ధ జంగాలు ఈ సభకు హాజరయ్యారు. ఈ సభకు స్థానిక సర్పంచ్ శ్రీ సుదర్శన్‌గారు ముఖ్య అతిథిగా వచ్చారు. తదితర స్థానిక పెద్దలుగుడా సభలో పాల్గొన్నారు. రాష్ట్ర సంఘం అధ్యక్షులైన నిదానకవి బాబూరావుగారు అధ్యక్షత వహించారు. ఈ సభ జయప్రదం కావటానికి ముఖ్య కారకులు రేవెల్లె కిష్టప్ప మరియు విభూతి రామదాసుగార్లు.

## మహబూబ్‌నగర్ జిల్లా బుడ్గ జంగం సంఘం సభ

తేది 27-1-1985 ఆదివారం రోజున ఉదయం 11 గంటలకు మహబూబ్ నగర్ జిల్లా బుడ్గ జంగం సంఘం సభను అప్పంపేటలో ఏర్పాటు చేయనైనది. ఈ సభకు శ్రీ బి. సుదర్శన్ సర్పంచ్ (అప్పంపేట) గారు అధ్యక్షత వహించటానికి దయతో అంగీకరించారు.

ముఖ్య అతిథిగా శ్రీ వి. తులసీరాం M.P. గారు పాల్గొంటున్నారు.
శ్రీ కె. శ్రీరాములు సమితి ప్రెసిడెంటు గారు
శ్రీ రాజగోపాల్ మార్కెట్ కమేటి చేర్మెన్ గారు
శ్రీ సత్యనారాయణ సింగ్ మాజీ సర్పంచ్ గారు
శ్రీ నిరంజన్ రెడ్డి సర్పంచ్ పెనిమెల్ల గారు
కూడ ఉపన్యసిస్తారు.

తెలంగాణా బుడ్గ జంగం రాష్ట్ర సంఘ సభ్యులు శ్రీ గువ్వ గణేశ్ సింగ్ (సలహాదారులు), శ్రీ కడమంచి ఎల్లయ్య (సలహాదారులు), శ్రీ నిదానకవి బాబురావు (అధ్యక్షులు), శ్రీ నిదానకవి వెంకటేశం ఎం.ఎ., ఎం.ఫిల్., శ్రీ తూర్పాటి జగదీశ్వర్, కడమంచి ఎల్లయ్య-జంగమెట్ (ఉపాధ్యక్షులు), శ్రీ పస్తం యాదగిరి బి.ఎ., ఎల్.ఎల్.బి. (ప్రధాన కార్యదర్శి), శ్రీ కడమంచి దయానంద్ B.A. (ఉప కార్యదర్శి), శ్రీ కడమంచి యాదగిరి, నిదానకవి ఓం ప్రకాశ్ (సహాయ కార్యదర్శులు), తూర్పాటి జంగయ్య, శ్రీ కడమంచి ఈశ్వర్, శ్రీ కల్లెం బాబురావు (ఆర్గనైజింగ్ సెక్రటరీలు), శ్రీ అనరాసి రాములు (కోశాధికారి) మరియు సిరిగిరి రాములు [పంచాయతీ సమితి చైర్మన్] గార్లు పాల్గొంటారు.

## నల్గొండ జిల్లాలో :

మే నెల 2వ వారంలో కడమంచి ఎల్లయ్య (సైదాబాద్), పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, అనరాసి రాములుగార్లు కలిసి పల్లివాడ (రామన్నపేట తా॥ నల్లగొండ జిల్లా) వెళ్ళటం జరిగింది. అక్కడ సభలో పాల్గొని కులాభివృద్ధి గురించి ప్రచారాలు నిర్వహించారు.

## మెదక్ సభ :

1985 జూన్ 15, 16, 17 తేదీల్లో పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశంగార్లు మెదక్ జిల్లాలోని యూసుఫ్‌పేట, హవేలి ఘనాపురం, ముత్తాయిపల్లె, రామాపల్లి మొదలైన ప్రాంతాల్లో బుడ్గ జంగాల్ని సమాయత్తపరిచి సంఘాలు ఏర్పాటు చేయటం జరిగింది.

# ఆహ్వానము

## మెదక్ జిల్లా బుడ్గ జంగం సంఘం మహాసభ

మిత్రులారా !

తేది **30-6-1985** ఆదివారంరోజున ఉదయం **10** గంటలకు మెదక్ జిల్లా బుడ్గ జంగం సంఘం మహాసభను మెదక్ చిల్డ్రన్స్‌పార్కులో ఏర్పాటు చేయనైనది.

-: ఈ సభలో పాల్గొను ఆహ్వానితులు :-

గౌ॥ శ్రీ పి. నారాయణరెడ్డి (అధ్యక్షులు పంచాయతి సమితి మెదకు గారు)
అధ్యక్షత వహించటానికి దయతో అంగీకరించారు

శ్రీ యం. యస్. లక్ష్మినారాయణ (మున్సిపల్ చేర్మెన్ మెదకు గారు)

శ్రీ టి. చంద్రపాల్ (మున్సిపల్ వైస్ చేర్మెన్ మెదకు గారు)

శ్రీ సి. యస్. వి. డాక్టర్ ప్రసాద్ గారు

శ్రీ కొర్విపల్లి నర్సింగరావు గారు

శ్రీ ఎముల చిలుకయ్య (గంగపుత్ర సంఘం అధ్యక్షులు మెదకు.) గార్లు ఉపన్యసిస్తారు.

తెలంగాణా బుడ్గ జంగం రాష్ట్ర సంఘ సభ్యులు శ్రీ కడమంచి ఎల్లయ్య (సంఘాదారులు) శ్రీ నిదానకవి బాబురావు [illegible]. (అధ్యక్షులు) శ్రీ నిదానకవి వెంకటేశం యం. ఎ. యం. ఫిల్ (ఉపాధ్యక్షులు) శ్రీ సిరిగిరి రామయ్య (పంచాయితి కమిటిచైర్మన్) శ్రీ పస్తం యాదగిరి బి.ఎ., ఎల్ ఎల్ బి. (ప్రధానకార్యదర్శి) శ్రీ కడమంచి దయానంద్ బి.ఎ. (ఉపకార్యదర్శి) శ్రీ వానరాశి రాములు (కోశాధికారి) శ్రీ తూర్పాటి జంగయ్య (ఆర్గనైజింగ్ సెక్రటరి) గార్లు పాల్గొంటారు

జూన్ 30వ తేదీన మెదక్ పట్టణంలోని చిల్డ్రన్స్ పార్కులో బుడ్గ జంగం రాష్ట్ర సంఘం వార్షిక సభలు నిర్వహించటం జరిగింది. ఆ సభకు మెదక్ మున్సిపాలిటీ ఉపాధ్యక్షులైన శ్రీ లక్ష్మీనారాయణగారు మరియు తదితర పెద్దలు హాజరయినారు. సభకు మెదక్ జిల్లాలోని అనేక ప్రాంతాలనుంచే కాక, ఆర్మూరు, కామారెడ్డి మొదలైన ఇతర ప్రాంతాల నుంచి కూడా బుడ్గ జంగాలు వేల సంఖ్యలో వచ్చారు.

## మహబూబ్‌నగర్ జిల్లాలో మరోసారి :

1985 జూలై 17 నుంచి 21 వరకు పస్తం యాదగిరి, కడమంచి దయానంద్ గార్లు మహబూబ్‌నగర్ జిల్లాలో విస్తృతంగా పర్యటించారు. బుడ్గ జంగాలకు "కులం సర్టిఫికేట్లు" విషయంలో అధికార్లు ఇబ్బందులు కలిగిస్తున్నారని తెలిసినందున మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ శ్రీ శుభ్రేందు భట్టాచార్య ఐ.ఎ.ఎస్.గారిని కలిసి బుడ్గ జంగాల బాధలు చెప్పారు వారు "కులం సర్టిఫికేట్లు" జారీ చేయటంలో ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడగలనని హామీ యిచ్చారు. ఆ తర్వాత పెద్ద కొత్తపల్లి, అచ్చంపేట, ఉప్పునుంతల, పిరట్‌వానిపల్లె, గువ్వలోనిపల్లె, కార్వాముల, కొల్లాపూర్, నాగర్ కర్నూలు, నాగులపల్లి మొదలైన ప్రాంతాలు పర్యటించి, బుడ్గ జంగాలకు సంఘం విషయాలు తెలియపరిచారు. పైన తెలిపిన గ్రామాలలో 5 రోజులు దాదాపు 700 కిలోమీటర్లు మోటారు సైకిలుపై పర్యటన చేయటం జరిగింది.

## గౌ॥ ముఖ్యమంత్రిగారికి వినతి పత్ర సమర్పణ :

1985 అక్టోబర్ లో బుడ్గ జంగం రాష్ట్ర సంఘం ప్రతినిధి బృందం గౌ॥ నందమూరి తారక రామారావుగారిని కలుసుకుని బుడ్గ జంగాలకు వున్న సమస్యలు విన్నవించి "వినతిపత్రం" సమర్పించటం జరిగింది. (దాని పూర్తి పాఠం ఈ గ్రంథంలో రిప్రజెంటేషన్స్" చాప్టర్‌లో ఇచ్చాను) ఈ సందర్భంలో గౌ॥ మంత్రివర్యులు- శ్రీ నల్లపురెడ్డి శ్రీనివాసులురెడ్డిగారిని, శాసనసభ ప్రతిపక్ష నాయకులు శ్రీ ఎం. బాగారెడ్డిగారిని, జనతపార్టీ నాయకులు శ్రీ జయపాల్‌రెడ్డిగారిని, సిపిఐ ప్రధానకార్యదర్శి శ్రీ చంద్ర రాజేశ్వరరావుగారిని, సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శి శ్రీ శంకరన్‌గారిని, అనేక శాసన సభ్యుల్ని, వివిధ పక్షాల నాయకుల్ని కలిసి, సమస్యలు వివరించి వినతిపత్రాలు ఇవ్వటం జరిగింది.

## బుడ్గ జంగాల కమ్యూనిటీ హాలు ప్రారంభం :

1985 నవంబర్ 27వ తేదీన రంగారెడ్డి జిల్లా రాయ్‌దుర్గ్ (దర్గ) గ్రామంలో **"బుడ్గ జంగం కమ్యూనిటీ హాల్"** ప్రారంభోత్సవం జరిగింది. రాష్ట్ర సంఘం ప్రతినిధులుగా సిరిగిరి రాములు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి దయానంద్, ఆనరాసి రాములు, గడ్డం చంద్రయ్యగార్లు పాల్గొన్నారు. అప్పటి కేంద్ర కార్మికశాఖ మంత్రి శ్రీ టంగుటూరి అంజయ్యగారు "కమ్యూనిటీ హాల్"ను అక్కడి బుడ్గ జంగాలకు అంకితం చేయగా, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ ఇంద్రారెడ్డిగారు సభాధ్యక్షత వహించారు.

స్థానిక ఎమ్మెల్యే అయిన శ్రీ పి. జనార్ధన్‌రెడ్డిగారు కార్యక్రమాల్ని నిర్వహించారు. జిల్లా కలెక్టరు శ్రీ సుధీర్ ఐ.ఎ.ఎస్. గారు కూడా సభలో పాల్గొన్నారు. కేంద్ర కార్మిక శాఖ మంత్రి శ్రీ టంగుటూరి అంజయ్యగారికి, రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి శ్రీఇంద్రారెడ్డి గారికి, ఎమ్మెల్యే శ్రీ పి. జనార్ధన్‌రెడ్డిగారికి, కలెక్టర్ శ్రీ సుధీర్ ఐ.ఎ.ఎస్. గారికి రాష్ట్ర సంఘం తరపున సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు సమర్పించటం జరిగింది.

## నిజామాబాదు జిల్లాలో సభలు :

1985 నవంబర్ 30 నుంచి డిసెంబర్ 4వ తేదీవరకు ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి దయానందర్‌గార్లు నిజామాబాద్ జిల్లాలో పర్యటించారు. నిజామాబాద్, బోధన్, కామారెడ్డి, తదితర ప్రాంతాల్లో బుడ్గ జంగాల్ని కలిసి సమావేశాలు సభలు నిర్వహించారు. జిల్లా కలెక్టర్ శ్రీమతి ఆశామూర్తి ఐ.ఎ.ఎస్.గారిని, జాయింట్ కలెక్టర్, శ్రీ మహంత ఐ.ఎ.ఎస్. గారిని, సబ్‌కలెక్టర్ బోధన్ శ్రీ రామచంద్రరావు ఐ.ఎ.ఎస్.గారిని, ఆయా ఆర్.డి.ఓలను, యం.ఆర్.ఓలను కలసి కులస్థులకున్న సమస్యల్ని విన్నవించి వినతి పత్రాలు సమర్పించారు. కామారెడ్డి డివిజన్‌లోని పలు గ్రామాలను ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి దయానంద్ మరియు తూర్పాటి నారాయణ గార్లు సైకిలుపై ప్రయాణం చేసి ప్రచారం సాగించారు.

1986 మార్చి నెలలో కడమంచి దయానంద్‌గారు నిజామాబాదు జిల్లాలోని కామారెడ్డి యం.ఆర్.ఓ, ఆర్.డి.ఓ గార్లను కలిశారు.

## తూర్పు గోదావరి జిల్లాలో సభలు :

1986లో జూలై చివరి వారం నుంచి ఆగస్టు మొదటి వారంవరకు పస్తం యాదగిరి, తూర్పాటి నర్సిహ్మా, పర్తం నాగభూషణం (ఉప్పల్)గార్లు తూర్పు గోధ్ావరి జిల్లాల్లో రాజమండ్రి, కండ్రిగ, అమలాపురం, రాజోలు, కందరాడ, కాట్రావులపల్లి తదితర ప్రాంతాలు పర్యటించి, సభల్లో సమావేశాల్లో పాల్గొన్నారు. కులం సర్టిఫికేట్లు పొందటంలో కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించుటకుగాను సంబంధిత ఎం.ఆర్.ఓ., ఆర్.డి.ఓ. తదితర గ్రామాధికారులతో కలిసి స్థితిగతులు వివరించారు.

## నిజామాబాదు జిల్లాలో :

1987లో జవనరి మూడవ వారంలో పస్తం యాదగిరి, కడమంచి దయానంద్ గార్లు నిజామాబాదు జిల్లాలో కామారెడ్డి డివిజన్‌లోని అనేక సంఘాల సభ్యులను కలిసి కులం సర్టిఫికేట్లు పొందటంలో ఎదురౌతున్న ఇబ్బందులను తెలుసుకొని సంబంధిత అధికారులతో చర్చించారు.

## కర్నూలు జిల్లాలో సభలు :

1987 జూన్ మొదటి వారంలో ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి దయానంద్ గార్లు రాయలసీమలో ప్రచారానికి వెళ్ళారు. ఈ పర్యటనలో వీరు నందికొట్కూరు, మల్యాల, కొత్త బిజినవేముల మున్నగు ప్రాంతాల్లో సభలూ సమావేశాలు నిర్వహించి అనేక గ్రామాల్లోంచి వచ్చిన బుడ్గ జంగాల్ని కలుసుకున్నారు. తర్వాత నంద్యాల పర్యటించారు. నంద్యాలలో సబ్‌కలెక్టర్ శ్రీ లక్ష్మయ్యగారిని కలిసి స్థానిక సంఘ సమస్యల్ని గురించి వివరించారు.

## మహబూబ్‌నగర్ జిల్లాల్లో పర్యటన :

జూన్ నెలలోనే ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరిగార్లు మహబూబ్‌నగర్‌లోని డిండి, గువ్వలోనిపల్లె, పిరట్‌వానిపల్లి, అచ్చంపేట, కొండనాగుల తదితర సంప సభ్యుల్ని కలిసి వారి సమస్యల్ని తీర్చటానికి కృషి చేశారు.

## మళ్ళీ మహబూబ్‌నగర్‌లో :

ఆగస్టు నెల చివరి వారంలో ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరిగార్లు మహబూబ్‌నగర్ జిల్లాలోని అచ్చంపేట్, చాకలిపల్లి, పెబ్బేరు మొదలైన ప్రాంతాల్లోని కులస్థుల సమస్యల పరిష్కారం నిమిత్తం సంబంధిత అధికారులతో కలిశారు.

## కర్నూలు జిల్లాలో సభలు :

సెప్టెంబర్ మొదటి వారంలో ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరిగార్లు కర్నూలు జిల్లాలో మరోసారి పర్యటించారు. నందికొట్కూరు, లక్ష్మాపురం, బన్నూరు బంగ్లా, ఎర్రగూడూరు, బానకచెర్ల, ఆత్మకూరు, నంద్యాల మున్నగు ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించారు.

## తూర్పు గోదావరి జిల్లాలో :

సెప్టెంబర్ నెలలోనే రెండవ వారంలో ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరిగార్లు తూర్పు గోదావరి జిల్లాలో నాల్గు రోజులు పర్యటించి రాజమండ్రి, అమలాపురం, కండ్రిగ, కాట్రావులపల్లి, సామర్లకోట, పెద్దాపురం, జగ్గంపేట తదితరచోట్ల అనేక సంఘ సమావేశాల్లో పాల్గొన్నారు. ఈ పర్యటన ముగించుకుని వచ్చాక పస్తం యాదగిరిగారు తిరిగి తూర్పు గోదావరి జిల్లాలో కాకినాడ, పిఠాపురం, భోగాపురం, నర్సింగాపురం, బి. కొత్తూరు, కందరాడ మున్నగు ప్రాంతాలు వెళ్ళి వచ్చారు.

## నిజామాబాదు, మహబూబ్‌నగర్ జిల్లాల్లో :

అక్టోబర్ నెల రెండవవారంలో ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరిగార్లు కామారెడ్డి, ఆర్మూరు పట్నాల్లో ఏర్పాటు చేసిన సంఘ సమావేశాల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత ఇదే నెల రెండవ వారంలో రాచూటి పరంధాములుగారు మహబూబ్‌నగర్ జిల్లా బూత్‌పూర్‌లో ఏర్పాటుచేసిన సభలో పాల్గొని ప్రసంగించారు. ఈ సభలో మహబూబ్‌నగర్ డివిజన్‌లోని అన్ని మండలాల నుంచి వచ్చిన బుడ్గ జంగాలు పాల్గొన్నారు. ఆయా గ్రామాధికారులు కూడ పాల్గొన్నారు.

## మెదక్ జిల్లాలో :

1987 డిసెంబర్ మొదటి వారంలో పస్తం యాదగిరి గారు మెదక్ జిల్లా - జహీరాబాద్‌లో పర్యటించి అక్కడ బుడ్గ జంగాలు కులం సర్టిఫికేట్లు పొందటంలో ఎదుర్కొంటున్న యిబ్బందుల గురించి సంబంధిత అధికారులతో కలసి మాట్లాడి, ఆ సమస్యను పరిష్కరించారు.

## వరంగల్ జిల్లాలో :

1988 మార్చి రెండవ వారంలో పస్తం యాదగిరి, కడమంచి దయానంద్‌గార్లు అప్పటి దేవాదాయ శాఖా మంత్రి శ్రీ యతిరాజారావుగారితో కలిసి వరంగల్ జిల్లాలోని వివిధ ప్రాంతాల బుడగ జంగాలు కులం సర్టిఫికేట్లు పొందడంలో ఎదురవున్న ఇబ్బందుల గురించి వివరించి, సమస్యను పరిష్కరించటం జరిగింది.

## మహబూబ్‌నగర్ జిల్లాలో :

1988 ఏప్రిల్ మాసంలో పస్తం యాదగిరి గారు మహబూబ్‌నగర్ జిల్లాలోని జొన్నల బొగడ మరియు చాకలిపల్లి గ్రామాల్లోని బుడ్గ జంగాలపై జరిపిన రాజకీయ కక్షల గురించి కలెక్టరుగారికి వినతి పత్రం సమర్పించారు.

1988 జూలై 20 నుండి 22 వరకు పస్తం యాదగిరిగారు, కళ్యాణం పెద్ద మారన్న, విభూతి రామదాసు మరియు కప్పెర సాయిలు గార్లతో కలసి మహబూబ్‌నగర్ జిల్లా - నాగర్ కర్నూలు డివిజన్‌లోని అచ్చంపేట, అమ్రాబాద్, ఉప్పునుంతల, పెద్ద కొత్తపల్లి మండలాల్లోని అనేక గ్రామాల్లో పర్యటించి బుడ్గ జంగాలను రెవెన్యూ అధికారులు పెట్టిన యిబ్బందుల గురించి వివరిస్తూ కలెక్టరుగారికి, డి.ఆర్.ఓ. గారికి వినతి పత్రాలు సమర్పించారు.

## వరంగల్ జిల్లాలో :

1988 అగష్టు 24, 25, 26 తేదీలలో ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరి, కడమంచి దయానంద్‌గార్లు వరంగల్ జిల్లా - తొర్రూర్ మండలం లో సభలు ఏర్పాటు చేసి గ్రామాల వారీగా, మండలాల వారీగా సంఘాలు ఏర్పాటు చేయటం జరిగింది. అంతే కాకుండా మహబూబాబాద్ ఆర్.డి.ఓ. గారిని కలసి ఆ డివిజన్ పరిధిలోని జంగాలు కులం సర్టిఫికేట్లు, ఇతర రాయితీలు పొందటం ఎదురవున్న ఇబ్బందులను వారి దృష్టికి తెచ్చి వాటిని పరిష్కరించటానికి కృషి చేశారు.

1988 సెప్టెంబరు 10, 11 తేదీల్లో వరంగల్ జిల్లా - తొర్రూర్ మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో పర్యటించి బుడ్గ జంగాల సామాజిక, ఆర్థిక స్థితిగతుల గురించి తెలుసుకొని సంఘ స్థాపన ఆవశ్యకత, దాని వలన కలిగే ప్రయోజనాల గురించి వారికి వివరించి, తొర్రూరులో బుడ్గ జంగాలు కులం సర్టిఫికేట్లు పొందటంలో ఎదురవుతున్న విషయమై అప్పటి జిల్లా మంత్రి యతిరాజారావుగారి సమక్షంలో కలెక్టర్ ఎ. చెంగప్ప గారికి మెమోరాండం ద్వారా ఆచార వ్యవహారాలు మరియు మెమో నెం. 543లో పొందు పరచిన అంశాల గురించి సవివరంగా విన్నవించటం జరిగింది. తత్ఫలితంగా పైన పేర్కొన్న ప్రాంతాల్లో వివిధ తరగతులలో చదువుతున్న విద్యార్థులకు కులం సర్టిఫికేట్లు జారీ చేయటం జరిగింది.

## నిజామాబాదు జిల్లాలో :

1988 సెప్టెంబరు 14 నుంచి 18వ తేదీ వరకు ఎన్.ఆర్. వెంకటేశ్వం, పస్తం యాదగిరి, కడమంచి దయానంద్ గార్లు నిజామాబాద్ జిల్లా - ఆర్మూరు, శ్రీరాంసాగర్, రాజారాం నగర్ తదితర ప్రాంతాలలో పర్యటించి సభలు నిర్వహించి, సంఘ స్థాపన - వాటి వలన ప్రయోజనాల గురించి అక్కడి జంగాలకు వివరించటం జరిగింది. ఆ తర్వాత ఆర్మూరు ఎం.ఆర్.ఓ., నిజామాబాదు ఆర్.డి.ఓలను కలసి బుడ్గ జంగాల ఆచార వ్యవహారాల గురించి, జంగాల నాలుగు ఉపకులాల గురించి విశదీకరించి, కులం సర్టిఫికేట్లు జారీ చేయటంలో జాప్యం చేయకూడదని కోరటం జరిగింది.

1988 అక్టోబర్ మాసంలో బోధన్ అసిస్టెంట్ కలెక్టరుగారికి సమర్పించిన మెమో విషయమై తదుపరి చర్య గురించి నవంబర్‌లో అప్పటి జుక్కల్ ఎం.ఎల్.ఏ. శ్రీ బి. పండరీ, పిట్లం సర్పంచ్ శ్రీ దత్తారెడ్డిగార్లతో పస్తం యాదగిరి గారు కలసి బుడ్గ జంగాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించి తగిన సహాయ సహకారాలు అందించ వలసిందిగా కోరటం జరిగింది.

1989 - మార్చి 31 నుంచి ఏప్రిల్ 2 వరకు పస్తం యాదగిరి గారు నిజామాబాద్ జిల్లా - బోధన్ డివిజన్‌లోని పిట్లం, జుక్కల్ మండలాల్లోని కొన్ని గ్రామాలలో పర్యటించి సభలు - సమావేశాలు నిర్వహించి పిట్లంలో అసిస్టెంటు కలెక్టరు గారు జరిపిన ఎంక్వయిరీలో పాల్గొని మన బుడ్గ జంగాలకు సర్టిఫికేట్లు జారీ చేయించటం జరిగింది.

## తూర్పు గోదావరి జిల్లాలో :

1989 జూలై 5 నుంచి ?వరకు పస్తం యాదగిరి, ఆనరాశి రాములుగార్లు తూర్పు గోదావరి జిల్లా - కాకినాడ, పెద్దాపురం, అమలాపురం, రాజమండ్రి డివిజన్లలోని అనేక గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి సభలు - సమావేశాలు నిర్వహించి అక్కడ బుడ్గజంగాలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి జిల్లా కలెక్టరు, జిల్లాలోని డి.ఆర్.ఓలకు అందరికి వినతి పత్రాలు సమర్పించటం జరిగింది.

## మహబూబ్‌నగర్ జిల్లాలో :

1990 ఏప్రిల్ మూడవ వారంలో ఎన్.ఆర్. వెంకటేశం గారు మహబూబ్‌నగర్ జిల్లా – ఖిలాఘణాపూర్, షాపూర్, పెబ్బేరు, గద్వాల డివిజనులోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి సభలు – సమావేశాలు నిర్వహించి, సమస్యల గురించి సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకోవలసినదిగా కోరటం జరిగింది.

## మెదక్ జిల్లాలో :

1990 మే నెల రెండవ వారంలో ఎన్.ఆర్. వెంటేశం, తూర్పాటి జంగయ్య గార్లు మెదక్ జిల్లా – రామచంద్రాపురం, సదాశివ పేట మరియు బిలాల్ పూర్ ప్రాంతాల్లో పర్యటించి, సభలు – సమావేశాలు నిర్వహించి, సంఘ స్థాపన – అవశ్యకత, దాని వలన ప్రయోజనాల గురించి తెలియజేయటం జరిగింది.

## వరంగల్ జిల్లాలో :

1991 ఫిబ్రవరి రెండవ వారంలో పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం గార్లు వరంగల్ జిల్లా – దేశాయిపేట, కాజీపేట, హన్మకొండ మొదలగు ప్రాంతాల్లో వున్న బుడ్గ జంగాలు సర్టిఫికేట్లు విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించటానికి ప్రయత్నం చేయటం జరిగింది.

## మహబూబ్‌నగర్ జిల్లాలో :

1991 మే నెల 11, 12 తేదీలలో ఎన్.ఆర్. వెంకటేశం, తూర్పాటి జంగయ్య గార్లు మహబూబ్‌నగర్ జిల్లాలో అనేక ప్రాంతాల్లో పర్యటించి సభలు – సమావేశాలు నిర్వహించి మన జంగాలు, పాత ఆచారాలను విడనాడి ముఖ్యంగా పంచాయితీలు మాని, పిల్లలను చదివించి గౌరవ ప్రదమైన జీవితం గడపాలని ఉద్బోధించటం జరిగింది.

## తూర్పు గోదావరి జిల్లాలో :

1991 జూలై మొదటి వారంలో పస్తం యాదగిరి గారు తూర్పు గోదావరి జిల్లా - రాజమండ్రి, రావుల పాలెం, పల్లిపాలెం, కండ్రిగ తదితర ప్రాంతాల్లో పర్యటించి అక్కడ మన కులస్తుల అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. 1989 జూలై మాసంలో పర్యటించి జిల్లా కలెక్టరు, ఆర్.డి.ఓ గార్లకు ఇచ్చిన వినతి పత్రాల ఆధారంగా స్థానిక ఎం.ఎల్.ఎ సహకారంతో రావులపాలెంలో వున్న పదిమంది బుడ్గ జంగాలకు ఇండ్ల స్థలాలు ఇవ్వటం జరిగింది.

## వరంగల్ జిల్లాలో :

1991 జూలై రెండవ వారములో ఎన్.ఆర్. వెంకటేశం, పస్తం యాదగిరి గార్లు వరంగల్ జిల్లా - స్టేషన్ ఘన్‌పూర్, నెమలి కొండ, వరంగల్ మొదలగు ప్రాంతాల్లో పర్యటించి సభలు - సమావేశములు నిర్వహించి యం.ఆర్.ఓ, ఆర్.డి.ఓ మరియు కలెక్టరును కలసి పైన పేర్కొన్న ప్రాంతాల్లో మన జంగాలు సర్టిఫికేట్ల విషయంలో ఎదుర్కొంటున్న యిబ్బందులను పరిష్కరింప చేయడానికి ప్రయత్నం చేయటం జరిగింది.

1991 డిసెంబర్ 2వ తేది ఎన్.ఆర్. వెంకటేశం, తూర్పాటి జంగయ్య గార్లు రంగారెడ్డి జిల్లా గుడి మల్లాపూర్‌లో పర్యటించి అక్కడ మన జంగాల స్థితిగతులు గూర్చి మరియు ఇప్పటివరకు జరిగిన అభివృద్ధి కార్యక్రమాల గురించి సమీక్షించి, భవిష్యత్ కార్యక్రమాల గురించి సలహాలు సూచనలు ఇవ్వటం జరిగింది.

## 1991లో రాష్ట్ర సంఘం నూతన కార్యవర్గం :

సైదాబాద్ (కుర్మాగుడా)లోని రాష్ట్ర సంఘభవనంలో 1991 డిసెంబర్ 21, 22 తేదీల్లో సభలు జరిగాయి. ఈ సభలకు 21 జిల్లాల నుంచి ప్రతినిధులు వచ్చారు. 21వ తేదీన అంతవరకు జరిగిన కార్యక్రమాల సమీక్ష, 22వ తేదీన ఎన్నికలు నిర్వహించ బడ్డాయి. ఈ ఎన్నికల్లో కడమంచి ఎల్లయ్య, నిదానకవి బాబూరావుగార్లు సలహాదారులుగా

అనరాశి రాములు (రంగారెడ్డి)గారు కన్వీనర్‌గా, పస్తం యాదగిరి (హైదరాబాదు)గారు అధ్యక్షులుగా, తూర్పాటి జగదీశ్వర్ (రంగారెడ్డి), చెన్నూరి రాంచందర్ (కరీంనగర్)గార్లు ఉపాధ్యక్షులుగా, డా॥ ఎన్.ఆర్. వెంకటేశం (హైదరాబాదు)గారు ప్రధాన కార్యదర్శిగా, కడమంచి దయానందర్ (హైదరాబాదు)గారు సంయుక్త కార్యదర్శిగా, కిన్నెర పాండు (వరంగల్), విభూతి (జి.) సాయిలు (నిజామాబాదు) గార్లు సహాయకార్యదర్శులుగా, తూర్పాటి (టి.జె.) జంగయ్య (హైదరాబాదు)గారు కోశాధికారిగా ఎన్నికయ్యారు.

## జిల్లా సభ్యులుగా ఈ కింది వారు ఎన్నికయ్యారు :

1. పస్తం రామస్వామి (బ్రహ్మాండ్లపల్లి - నల్గొండ జిల్లా)
2. కప్పెరి పెంటయ్య (న్యూగంజి - మహబూబ్‌నగర్ జిల్లా)
3. కొమారి బిచ్చయ్య (జహీరాబాదు - మెదక్ జిల్లా)
4. పర్తం లక్ష్మన్న (తలమడుగు - ఆదిలాబాద్ జిల్లా)
5. ఇప్ప వీరస్వామి (న్యూ పాల్వంచ - ఖమ్మం జిల్లా)
6. పస్తం ఎల్లప్ప (నంద్యాల - కర్నూలు జిల్లా)
7. యడవల్లి వెంకట రమణ (పొద్దుటూరు - కడప జిల్లా)
8. మోతె మస్తానయ్య (పాపంపేట - అనంతపూర్)
9. దుడ్డు అప్పారావు (నీలమ్మ కోనేరు - శ్రీకాకుళం)
10. పచ్చగంతల గౌరీశ్వరరావు (బియ్యాల పేట - విజయనగరం జిల్లా)
11. మోతె పైడప్పడు (ఆనందపురం - విశాఖ జిల్లా)
12. నిండుకొండ సింహాచలం (భోగాపురం - తూర్పు గోదావరి జిల్లా)
13. సి.హెచ్. కోటయ్య (పినకడియం - పశ్చిమ గోదావరి జిల్లా)
14. వనం నాగేశ్వరరావు (గన్నవరం - కృష్ణా జిల్లా)

15. పస్తం వెంకటేశ్వర్లు (గురజాల - గుంటూరు జిల్లా)

16. ఇప్ప గరుమూర్తి (ప్రకాశం జిల్లా)

(హైదరాబాదు, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, నిజామాబాదు జిల్లాలకు క్యాబినెట్‌లో ప్రాతినిధ్యమున్నందువల్ల జిల్లా సభ్యులను ప్రత్యేకంగా తీసుకోలేదు.)

## 1992, 1993 కార్యక్రమాలు :

ఈ రెండేళ్ళలో హైదరాబాదు నగరంలోని ఆయా బస్తీల్లో నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేయటం జరిగింది. హైదరాబాదులోని ఉప్పుగూడలో సభ జరిగింది. అక్కడ వాంద్రాసి అంజయ్యగారు అధ్యక్షుడుగా నూతన కార్యవర్గం ఏర్పడింది. అలాగే కరీంనగర్ కోరుట్లలో, మెట్‌పల్లిలో నూతన కార్యవర్గాలు వచ్చాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో నారాయణపేట డివిజన్‌లో మద్దూరు, కోస్గీ మొదలైన మండలాల్లో కొత్త కార్యవర్గాలు రూపుదిద్దుకున్నాయి.

## వినాయక్‌నగర్‌లో సభ :

20-8-1994నాడు వినాయక్‌నగర్‌లో జరిగిన సభలో రాష్ట్ర అధ్యక్షులు, కార్యదర్శులు పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం గార్లు పాల్గొన్నారు. ఇళ్ళ నివేశన స్థలాల పట్టాల పంపిణీ, రుణాలు పొందెందుకు కారవాయి ప్రారంభం చేయటమేగాక, ఎంతో పోరాడి బుడ్గ జంగాలకు ఇళ్ళపట్టాలు రావటానికి కృషి చేసిన స్థానిక సంఘాధ్యక్షుడు మోటం మల్లయ్యగారిని ఈ సభలో సన్మానించటం జరిగింది.

## కర్నూలు జిల్లాలో :

పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం గార్లు నవంబర్ 1994లో కర్నూలు జిల్లాలో పర్యటించారు. మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆదోని, కర్నూలు ప్రాంతాల్లో సభలు, సమావేశాల్లో పాల్గొని కులస్థుల్లో చైతన్యం తెచ్చారు.

## 1995లో :

హైదరాబాదు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్లకు కుల సమస్యల మీద మెమోరాండం ఇవ్వటం, ఆయా మండలాల్లో పర్యటించి, కులస్థుల సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించటానికి కృషి చేయటం, చేయవలసిన కార్యక్రమాల గురించి అవగాహన కలిగించటం మొదలైన కార్యక్రమాలు నిర్వహించటం జరిగింది.

## 1996లో :



మహబూబ్ నగర్ జిల్లా
బుడ్గ జంగం సంక్షేమ సంఘము

కార్యకర్తల సదస్సు

తేది 3-11-1996 [illegible] 10 [illegible]

[illegible]

శ్రీ గౌ॥ డా॥ N. R. వెంకటేశం Ph. D.

శ్రీ గౌ॥ పస్తం యాదగిరి B. A., LL. B.

రాష్ట్ర బుడ్గ జంగం సంఘం అధ్యక్షులుగారు

ముఖ్య అతిథులుగా పాల్గొంటారు

[illegible]

మహబూబ్ నగర్ జిల్లా
బుడ్గ జంగం సంక్షేమ
సంఘం మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్‌లో వచ్చిన కులసమస్యలను తీర్చటానికి ఈ సంవత్సరం ఐదారు సార్లు టౌన్‌లో మీటింగులు ఏర్పాటు చేయవలసి వచ్చింది. జూన్ నుంచి డిసెంబర్ దాకా ప్రతినెలా సభలూ, సమావేశాలు చేయవలసి వచ్చింది. అధికారులతో కలిసి సమస్యలు పరిష్కరించటం జరిగింది. ఈ కార్యక్రమాల్లో క్యాబినెట్ సభ్యులందరూ తరుచుగా పాల్గొన్నారు.

## గురజాల సభ :

17-11-1996లో గురజాలలో జిల్లాస్థాయి సభ ఏర్పాటు చేయటం జరిగింది. దుర్గి, ఈపూరు, బెల్లంకొండ, తాళ్ళూరు, మాచెర్ల, పిడుగురాళ్ళ, తాడికొండ, తెనాలి మొదలైన మండలాల నుంచి వేలాది బుడ్గ జంగాలు ఈ సభలో పాల్గొన్నారు. రాష్ట్ర సంఘ అధ్యక్షులు, కార్యదర్శులు పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశంగార్లు ఈ సభను నిర్వహించారు.

## జస్టీస్ పి. రామచంద్రరాజు కమీషన్ :

షెడ్యూల్డు కులాల్లో గ్రూపులు చేయటానికి ఏర్పడిన జస్టిస్ పి. రామచంద్రరాజు కమీషన్ ముందు రాష్ట్ర సంఘ ప్రతినిధులు హాజరై తమ దృక్పథాన్ని, తమ కుల పరిస్థితిని, వివరాలను అందజేయటం జరిగింది. 28-11-1996, 12-11-1997, 25-2-1997 తేదీల్లో కమీషన్ ముందు సంఘ సభ్యులు హాజరయ్యారు. నిదానకవి బాబూరావు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, కడమంచి దయానంద్‌గార్లు ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ విషయంలో పస్తం యాదగిరి, కడమంచి దయానంద్ గార్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు.

## 1997లో ఖమ్మం పర్యటన :

అధ్యక్షులు పస్తం యాదగిరి, సంయుక్త కార్యదర్శి కడమంచి దయానంద్‌గారు, సహాయకార్యదర్శి నరికూటి వెంకన్నగారు జూలై 3, 4 తేదీల్లో ఖమ్మంలో పర్యటించారు. పెనుబల్లి మండలం దాని చుట్టుపట్ల ఉన్న మండలాల బుడ్గ జంగాలతో సమావేశ మయ్యారు. వాళ్ళు ఎదుర్కొంటున్న సమస్యల్ని స్థానిక ఎం.ఎల్.ఎ బోడపూడి వెంకటేశ్వర రావు గారి ద్వారా ఆర్.డి.ఓ, కలెక్టరుగార్ల దృష్టికి తెచ్చారు.

## ముఖ్యమంత్రిగారికి మెమోరాండం సమర్పణ :

తేది : 15-11-1997 నాడు హైదరాబాదు, రంగారెడ్డి తదితర జిల్లాల్లో కులస్థులు

ఎదుర్కొంటున్న సమస్యల్ని పరిష్కరించాలని, ఎస్సీల్లో ఎంతో వెనకబడి ఉన్న బుడ్గ జంగాలకు ప్రత్యేక రాయితీలు ప్రకటించాలని రాష్ట్ర సంఘ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి *శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి* రెవెన్యూ మంత్రి *శ్రీ దేవేందర్ గౌడ్ గారికి*, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి *శ్రీ కడియం శ్రీహరిగారికి* మెమోరాండం సమర్పించారు.

## National Commission for S.C and S.T కి లెటర్ :

షెడ్యూల్డు కులాల వర్గీకరణపై అభిప్రాయాలను పంపవలసిందిగా జాతీయ షెడ్యూల్డు కులాల, షెడ్యూల్డు తెగల కమీషన్ పత్రికా ప్రకటన ఇచ్చింది. దానికి స్పందించి రాష్ట్ర సంఘం షెడ్యూల్డు కులాల్లో తప్పకుండా ఎ, బి, సి, డిల వర్గీకరణ కావాలని 8-7-1998నాడు ఫ్యాక్స్‌ద్వారా అభిప్రాయాన్ని పంపింది.

## మహబూబ్‌నగర్‌లో సమస్యల పరిష్కారం :

1998 మార్చి నెలలో కుల సమస్యల మీద కలెక్టరు శ్రీ అనంతరాముగారికి, జాయింట్ కల్టెకర్ శ్రీ కె. ప్రభాకర్‌రెడ్డిగారికి, ఆర్.డి.ఓ శ్రీ నాయక్‌గారికి మెమోరండంలు సమర్పించి, సమస్యలు వివరించటం జరిగింది. హన్‌వాడ, బూత్‌పూర్, జడ్చర్ల, దేవర కద్ర మండలాల్లో తిరిగి కులస్థుల సమస్యలు తెలుసుకుని సూచనలు ఇవ్వటం జరిగింది. ఆయా ఎం.ఆర్.ఓను కలవడం జరిగింది. ఈ పర్యటనలో పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, తూర్పాటి జగదీశ్వర్, కప్పెరి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు. ఈ పరంపరలో మహబూబ్‌నగర్‌లో 8-4-1998, 23-5-1998, 12-7-1998, 13-6-1999, 27-6-1999 తేదీల్లో బుడ్గ జంగాల సమావేశాలు ఏర్పాటు చేయటం జరిగింది.

## 1999లో ఖమ్మం మహా సభలు :

29-8-1999 నాడు న్యూ పాల్వంచలో ఖమ్మం జిల్లా మహాసభలు పెద్ద ఎత్తున జరిగాయి. ఖమ్మం, కొత్తగూడెం, బూర్గంపహాడ్ రెవెన్యూ డివిజన్లలోని కారేపల్లి, మధిర, కల్లూరు, మణుగూరు, ఇల్లందు, బోనకల్లు, బయ్యారం, గార్ల, అశ్వపురం, తల్లాడ,

# ఆహ్వానము

## ఖమ్మం జిల్లా బుడ్గ జంగం సంక్షేమ సంఘం మహాసభలు

తేదీలు : ~~21, 22~~ 28,29 ఆగష్టు 1999 శని, ఆదివారాలు ఉదయం 10 గంటలకు
K.D.P.S కాలని, విద్యుత్ కళాభారతి ఆడిటోరియం, న్యూ పాల్వంచలో జరుగుతాయి

---

స్వాతంత్ర్యం వచ్చి ఇన్నేళ్ళైనా అన్నికులాల కంటే మనకులం ఎంతో వెనకబడిపోయింది. మన పిల్లల్ని చదివించుకోలేకపోయాం. యువకులకు ఉద్యోగావకాశాలు లేవు. కూడు, గూడు, గుడ్డలకే కనాకష్టమైపోయింది. హీనంగా బతుకుతున్నాం. దీనంగా గడుపుతున్నాం. మన పరిస్థితిని అర్థంచేసుకొని ప్రగతి పథంలో అడుగుపెట్టవలసి ఉన్నది. కులాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి తద్వారా మనం అభివృద్ధిలోకి రావటానికి కులస్థులలో చైతన్యం తేవటానికి ఈ మహాసభలు నిర్వహిస్తున్నాం. కులస్థులందరికి ఇదే మా ఆహ్వానం. అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయగలరని ప్రార్థన.

ఈ మహాసభల్లో స్థానిక నాయకులతోపాటు ఈ క్రింది రాష్ట్ర బుడ్గ జంగం సంక్షేమ సంఘం నాయకులు పాల్గొంటారు.

శ్రీ నిదానకవి బాబురావు (అడ్వైజర్)
శ్రీ పస్తం యాదగిరి B.A., L.L.B. (అధ్యక్షులు)
డా॥ N.R. వెంకటేశం M.A., M.Phil. Ph D. (ప్రధాన కార్యదర్శి)
శ్రీ నరికూటి వెంకన్న

శ్రీ ఆనరాశి రాములు (కన్వీనర్)
శ్రీ తూర్పాటి జగదీశ్వర్ (ఉపాధ్యక్షులు)
శ్రీ కె. దయానంద్ B.A. (సంయుక్త కార్యదర్శి)
శ్రీ తూర్పాటి జంగయ్య

---

భద్రాచలం మొదలైన ఎన్నో మండలాల నుంచి వేలాది బుడ్గ జంగాలు ఈ సభకు లారీలు కట్టుకుని వచ్చారు. వరంగల్ జిల్లాలోని తొర్రూరు, దాట్ల, గణాపూర్ మొదలైన ప్రాంతాల నుంచి కూడ కులస్థులు హాజరయ్యారు. బుడ్గ జంగాల కులాభివృద్ధికోసం ఈ సభలో నిర్ణయాలు తీసుకోవటం జరిగింది. ఉత్సాహంతో ఉరకలు వేశారు జనం. నిదానకవి బాబూరావు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, తూర్పాటి జగదీశ్వర్ ఈ సభను నిర్వహించారు. ముఖ్యంగా జిల్లా సంఘం అధ్యక్షులు కళ్యాణం కృష్ణ, ప్రధాన కార్యదర్శి ఇప్ప వీరస్వామి గార్ల కృషి వల్ల ఈ సభ విజయవంతమైంది.

## గుప్ప గణేశ్ ప్రథమ వర్ధంతి సభ :

రాష్ట్ర సంఘం పూర్వాధ్యక్షులు కీ.శే. గుప్ప గణేశ్ (సింగ్) గారి ప్రథమ వర్ధంతి సభ 23-11-1999 నాడు రాజ్‌ధార్‌ఖాన్‌పేట-గుప్పానగర్ (హైదరాబాదు)లో జరిగింది. రాష్ట్ర సంఘం ప్రోత్సహంతో ఆయన కుమారులు నిరంజన్ సోదరులు ఈ సభను ఏర్పాటు చేశారు. ఈ సభకు స్థానిక ఎం.ఎల్.ఏ. శ్రీ బద్దంబాల్‌రెడ్డిగారు అధ్యక్షత వహించారు. రాష్ట్ర సంఘం క్యాబినెట్ సభ్యులు ఇందులో పాలుపంచుకున్నారు. డా॥ ఎన్.ఆర్. వెంకటేశం రచించి, కీ.శే. గుప్ప గణేశ్‌సింగ్‌గారికి అంకితం చేసిన 'నిజాలూ - నిర్వచనాలూ అనే కవితోక్తుల పుస్తకాన్ని బద్దంబాల్‌రెడ్డిగారు ఆవిష్కరించారు. తర్వాత కవికి, రాష్ట్ర సంఘం క్యాబినెట్ సభ్యులకు, ఇతర కుల ప్రముఖులకు సన్మానం జరిగింది. కులాభివృద్ధిలో తమ వంతు కృషి చేస్తున్న జంగంమెట్టు యువకార్యకర్త సిరువాటి శ్రీనివాస్‌ను కూడ ఈ సందర్భంగా సన్మానించారు.

## 2000లో మెదక్ పర్యటన :

26-7-2000 నాడు నిదానకవి బాబూరావు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, తూర్పాటి జగదీశ్వర్, తూర్పాటి జంగయ్య గార్లు మెదక్ జిల్లాలోని నర్సాపూర్, మెదక్, సంగారెడ్డి మండలాల్లో అనేక గ్రామాల్లో సమావేశాలు జరిపారు. కారులో వెళ్ళి తుఫాను పర్యటన చేశారు. మెదక్‌లో ఆర్.డి.ఓగారిని, సంగారెడ్డిలో కలెక్టరుగారిని కలిసి కుల సమస్యల మీద మెమోరాండంలు సమర్పించారు.

19-1-2001వ తేదీన నర్సాపూర్‌లో జరిగిన సభలో పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశంగార్లు పాల్గొన్నారు. ఆ ప్రాంతంలో జరిగిన పెద్ద సభ ఇది. చుట్టుపట్ల మండలాల్లో నుంచి అనేక గ్రామాల బుడ్గ జంగాలు ఈ సభకు వచ్చారు.

## బండ్లగుడాలో కార్యకర్తల సభ :

హైదరాబాదులోని జి.ఎస్.ఐ. బండ్లగుడాలో 24-9-2000నాడు బ్రహ్మాండమైన

సభ జరిగింది. ఈ సభకు హైదరాబాదు, రంగారెడ్డి, నల్గొండ, మెదక్ జిల్లాల్లోని ఆ యా మండలాల కార్యకర్తలు హాజరయ్యారు. ఇంతవరకు కులాభివృద్ధి కార్యక్రమాలను ఈ సభలో ఒకసారి సమీక్షించుకుని, ఇకముందు చేయవలసిన కార్యక్రమాలను రూపొందించుకోవటం జరిగింది. మండల, జిల్లా సంఘాలు నూతన కార్యవర్గాలను ఏర్పాటు చేసుకుని రాష్ట్ర సంఘం ఎన్నికలు జరపాలని నిర్ణయం తీసుకోవటం జరిగింది. ఈ సభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సర్పంచు శ్రీ విఠల్‌రెడ్డిగారు రాష్ట్ర సంఘానికి 1000 చ॥ గజాల భూమిని ఇప్పిస్తానని వాగ్దానం చేశారు.

## మెదక్ జిల్లాలోని తుప్రాన్‌లో సభ :

పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, వాండ్రాసి లాలయ్యగార్లు 12-10-2000 తేదీన తూప్రాన్‌లో సభను నిర్వహించారు. జిన్నారం, అత్‌నూర, కౌడిపల్లి, నర్సాపూర్, వెల్దుర్తి, జోగిపేట, శివంపేట, మెదక్, కొల్చారం, పాపన్నపేట, చేగుంట, అల్లాదుర్గం, రామాయంపేట మొదలైన మండలాల నుంచి వేలాది మంది బుడ్గ జంగాలు ఈ సభకు వచ్చారు. ఈ సభలో తుప్రాన్ ఎం.ఆర్.ఓ.గారు పాల్గొని బుడ్గ జంగాలకు కులధ్రువీకరణ పత్రాలు జారీ చేయటంలో ఆలస్యం కాకుండా చూస్తానని హామీ ఇచ్చారు. తర్వాత చిత్తారి రామస్వామిగారి అధ్యక్షతన నూతన కార్యవర్గం ఏర్పడింది.

## కర్నూలు జిల్లాలో పర్యటన :

పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశంగార్లు 28-10-2000 నుంచి 30-12-2000 వరకు కర్నూలు జిల్లాలోని ప్రాంతాల్లో పర్యటించారు. నందికొట్కూరు, నెహ్రూ నగర్, బిజినవేముల, మల్యాల మొదలైన ప్రాంతాలలో ఏర్పాటు చేసిన చిన్న చిన్న సభల్లో పాల్గొన్నారు. సిరువాటి అలేకం, సిరువాటి లక్ష్మయ్య, కొమారి బిచ్చాలు తదితరులు ఈ కార్యక్రమాలను రూపొందించారు. ఆ తర్వాత కర్నూలులో కలెక్టరు, జాయింట్ కలెక్టరు, ఇ.డి., డి.డి. సోషల్ వెల్ఫేర్ గార్లను కలసి సమస్యల గురించి చర్చించి, మెమోరాండంలు సమర్పించటం జరిగింది.

## వరంగల్‌లో ... :

5-11-2000నాడు వరంగల్‌లో తిరిగి, ఎన్మామ్లా, చింతల్ బస్తీ, ఖాజీపేట, శంభునిపేట, రఘునాథపల్లి మొదలైన ప్రాంతాల బుడ్గ జంగాలతో రాష్ట్ర సంఘం సభ్యులు సమావేశం కావటం జరిగింది.

## జనగామ సభ :

వరంగల్ జిల్లా బుడిగజంగాల సంక్షేమ సంఘం, జనగామ

ఆహ్వానము

దివి 12-11 2000 ఆదివారం ఉదయం 11.30ని.లకు

జనగామ పట్టణంలో

బుడిగ జంగాల కాలని ప్రారంభోత్సవము

మరియు 12-30 ని.లకు క్రిస్టవ్ కాలేజి గ్రౌండ్‌లో

<u>బహిరంగ సభ</u>

| | |
|---|---|
| ప్రారంభకులు . | గౌ॥ శ్రీ కడియం శ్రీహరిగారు<br>ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మాత్యులు |
| ముఖ్యఅథితులు : | గౌ॥ శ్రీ బి. వెంకటేశ్వర్లుగారు<br>పార్లమెంటు సభ్యులు, వరంగల్ |
| | గౌ॥ శ్రీ యన్. సుధాకర్‌రావు గారు<br>శాసనసభ్యులు, చెన్నూరు |
| | గౌ॥ శ్రీ యం. ధర్మారావు గారు<br>శాసనసభ్యులు, హన్మకొండ |
| | గౌ॥ శ్రీ యన్. రాజలింగం గారు<br>శాసనసభ్యులు చేర్యాల |
| అథితులు: | గౌ॥ శ్రీ ఏ. కరుణాకర్ రాజు గారు<br>ఛైర్-పర్సన్ నగరపంచాయతి,జనగామ |

వరంగల్ జిల్లాలోని జనగామాలో 12-11-2000 నాడు క్రిస్టన్ కాలేజిగ్రౌండ్‌లో మహాసభ నిర్వహించటం జరిగింది. ఈ సభకు మంత్రివర్యులు శ్రీ కడియం శ్రీహరిగారు ముఖ్య అతిథిగా విచ్చేశారు. వరంగల్ ఎం.పి. శ్రీ బి. వెంకటేశ్వర్లుగారు, చెన్నూరు

శాసన సభ్యులు శ్రీ ఎన్. సుధాకరరావుగారు, హనుమకొండ శాసన సభ్యులు శ్రీ ఎం. ధర్మారావుగారు, చేర్యాల శాసన సభ్యులు శ్రీ ఎన్. రాజలింగంగారు, తదితర స్థానిక నాయకులు పాల్గొన్నారు. ఈ సభ నిర్వహణలో స్థానిక ప్రెసిడెంటు చింతల మల్లేశంగారు, ప్రధాన కార్యదర్శి సిరిగిరి (కత్తి) నర్సయ్యగారు, వాంగ్రాసి లాలయ్యగారు మొదలైన సంఘ సభ్యులు రాత్రి పగలు శ్రమించారు. రాష్ట్ర సంఘం నుంచి నిదానకవి బాబూరావు, అనరాసి రాములు, పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, తూర్పాటి జగదీశ్వర్, వరంగల్ నుంచి తూర్పాటి సారయ్యగార్లు ఈ సభలో పాల్గొన్నారు. ఈ సభకు వరంగల్, కరీంనగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల నుంచి బుడ్గ జంగాలు అధిక సంఖ్యలో కదలి వచ్చారు.

## రాష్ట్ర సంఘ భవనానికి స్థలం కోసం :

రాష్ట్ర సంఘ భవనం నిర్మించుకోవటానికై స్థలం కోసం రంగారెడ్డి జిల్లా కలెక్టరు గారికి 25-11-2000 వ తేదీన అభ్యర్థన పత్రాన్ని సమర్పించటం జరిగింది. భవిష్యత్తులో బుడ్గ జంగాల విద్యార్థుల కోసం వసతి గృహం తదితరాలు ఏర్పాటు చేయటానికి వీలుగా ఈ ప్రయత్నం ప్రారంభమయింది.

## శంకరపల్లి సభ :

రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లిలోని ఎ-1 ఫంక్షన్‌హాలులో 15-12-2000 నాడు ఒక పెద్ద సభ ఏర్పాటు చేయటం జరిగింది. ఈ సభకు స్థానిక ఎం.ఎల్.ఎ **శ్రీమతి సబితా ఇంద్రారెడ్డిగారు** ముఖ్య అతిథిగా వేంచేశారు. స్థానిక కాంగ్రెసు నాయకులు, మండలాధ్యక్షులు, సర్పంచులు, గ్రామాధికారులు పాల్గొన్న ఈ సభలో దాదాపు 8, 9 మండలాల నుంచి బుడ్గ జంగాలు వేల సంఖ్యలో వచ్చారు. బుడ్గ జంగాలకు ఒక ఎమ్మెల్యే కూడ లేరు అన్నదానికి స్పందిస్తూ శ్రీమతి సబితా ఇంద్రారెడ్డి గారు "నన్నే మీ బుడ్గ జంగం ఎమ్మెల్యే అనుకోండి. ప్రభుత్వ సహాయ కార్యక్రమాలన్నీ మీకు అందేలా చూస్తాను. అవసరమైతే మీ సమస్యల్ని అసెంబ్లీలో లేవదీస్తాను" అని హామీ ఇచ్చారు.

చేవెళ్ల డివిజన్ బుడ్గజంగం సంక్షేమ సంఘం

ఆహ్వానము

తేది 15-12-2000 శుక్రవారం
ఉదయం 11-30 ని॥లకు

శంకరపల్లి A-1 ఫంక్షన్‌హాల్‌లో జరుగును

—:కార్యక్రమం:—

సభాధ్యక్షులు:— పస్తం యాదగిరి B.A.,LLB.
రాష్ట్ర బుడ్గజంగం సంక్షేమ సంఘం అధ్యక్షులు
ముఖ్య అతిథి:— శ్రీమతి సబిత ఇంద్రారెడ్డి MLA చేవెళ్ళ

—:ప్రత్యేక అతిథులు:—

శ్రీ రాములు గారు చేవెళ్ళ డివిజనల్ RDO
P. సామ్యుయేల్ గారు శంకర్‌పల్లి మండల్ MRO
CH. మల్లారెడ్డి గారు ZPTC
Y. ప్రకాశ్ గారు గ్రామ సర్పంచ్ [శంకర్‌పల్లి]
V. సత్యనారాయణ మాజీ మండల అధ్యక్షుడు (శంకర్‌పల్లి]
D. వెంకట్‌రెడ్డి గారు మాజీ మండల ఉపాధ్యక్షులు ,,
S. ఆత్మలింగం గారు ఉప సర్పంచ్ [శంకర్‌పల్లి]
కాశెట్టి వెంటయ్య గారు శంకర్‌పల్లి
N.R. వెంకటేశం రాష్ట్ర బుడ్గజంగం ప్రధాన కార్యదర్శి

రాష్ట్ర సంఘం క్యాబినెట్ సభ్యులు పాల్గొన్న ఈ సభను అల్లం మల్లేశ్, కడమంచి మల్లయ్య ఇతర స్థానిక సంఘ సభ్యులు వ్యయ ప్రయాసల కోర్చి విజయవంతంగా నిర్వహించారు.

## శ్రీకాకుళం పర్యటన :

పస్తం యాదగిరి, ఎన్.ఆర్. వెంకటేశం, ప్యార్ల పుల్లారావుగార్లు 2001 మే నెలలో 28, 29, 30, 31 తేదీల్లో శ్రీకాకుళంలో పర్యటించారు. శ్రీకాకుళం పట్నంలో నీలమ్మ కోనేరు బుడ్గజంగాల గూడెంలో సభ జరిగింది. ఈ సభకు అనేక మండలాల వాళ్ళు వచ్చారు. మిగతా జిల్లాలవారి కంటే ఎతో వెనకబడి ఉన్నారు. వాళ్ళ సమస్యలన్నీ క్రోడీకరించి మెమోరాండంలు తయారు చేసి జిల్లా కలెక్టరుగారికి, ఆర్.డి.ఓ గారికి, ఇతర సంబంధిత అధికారులకు సమర్పించి, సమస్యల గురించి వివరించటం జరిగింది.

## బెంగుళూరులో బుడ్గ జంగాల సభ :

కర్నాటక రాష్ట్ర బుడ్గ జంగం సంక్షేమ సంఘం అధ్యక్షులు వై. కృష్ణప్ప, ప్రధాన కార్యదర్శి వి. శ్రీనివాస్‌గార్ల ఆహ్వానం మీద డా॥ ఎన్.ఆర్. వెంకటేశం 12-8-2001న జరిగిన ఈ సభలో పాల్గొని ప్రసంగించారు. బీదర్, చించోలి, రాయచూరు, గంగావతి, హాస్పేట్, చిత్రదుర్గా, కోలారు, బీజాపూర్, గుల్బర్గా మొదలైన పలు ప్రాంతాల నుంచి వచ్చిన బుడ్గ జంగాలను ఇందులో కలుసుకోవటం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి దాదాపు 100 సంవత్సరాల క్రితం జీవనోపాధికోసం వెళ్ళి వీళ్ళంతా కర్నాటకలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇంట్లో తెలుగు, బయటివారితో కన్నడంలో మాట్లాడుతారు. రెండు భాషల్లో సందర్భాన్ని బట్టి కథలు చెప్పగలరు.

## బుడ్గ జంగాల కమ్యూనిటీ హాలు ప్రారంభం :



శ్రీరస్తు ఆహ్వానము శుభమస్తు

స్వస్తిశ్రీ చాంద్రమాన వృష నామ సం॥ర శ్రావణ శు॥ చవితి
బుధవారం తేది 22-8-2001 రోజున ఉదయం గం॥ 8-10 ని॥లకు

నూతన ప్రారంభము
బుడగ జంగం కమ్యూనిటి హాల్

ప్రారంభకులు & స్థాపకులు ;
శ్రీ జి. సాయన్న MLA గారు
కంటోన్మెంటు

కార్యస్థలం :
4వ వార్డు, వినాయక నగర్,
నేరేడ్‌మెట్, సికింద్రాబాద్.

కావున అన్ని ప్రాంతాల బుడగ జంగాలు అందరూ తప్పనిసరిగా విచ్చేసి ఈ కార్యక్రమమును జయప్రదము చేయగలరని మా మనవి.

ఇట్లు
బుడగ జంగ సంఘం
ఇంటి నెం. 29-1122, వినాయక నగర్
మల్కాజ్‌గిరి మండలం.

రంగారెడ్డి జిల్లాలోని వినాయక నగర్‌లో ప్రభుత్వం 'బుడ్గ జంగాల కమ్యూనిటీ హాలు' కట్టించింది. వినాయక చవితి 22-8-2001నాడు దీనిని ప్రారంభించటం విశేషం. స్థానిక ఎమ్మెల్యే శ్రీ సాయన్నగారు, ఎం.పి. శ్రీ రాజయ్యగారు బుడ్గ జంగాల మీద ఉన్న శ్రద్ధతో ఈ కమ్యూనిటీ హాలు కోసం కృషి చేశారు. ఈ సభలో రాష్ట్ర సంఘం క్యాబినెట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

1983 నుంచి ఉధృతమైన ప్రచారం జరిగింది. ఈ "పర్యటనలు - ప్రచారాల" వల్ల బుడ్గ జంగాలు ఇప్పుడిప్పుడే మేల్కొంటున్నారు. అర్థంలేని పాత ఆచారాలు విడనాడి - పంచాయతుల్లో వేలకువేలు మునగటం మానివేసి, పిల్లన్ని చదివించటం వైపు దృష్టి సారిస్తున్నారు. సొంత గూడు కోసం, పిల్లల భవిష్యత్తు కోసం బుడ్గ జంగాలు మారాలి. ఎంతగానో అభివృద్ధి చెందుతున్న ఇతర కులాల వారిని చూసైనా వీళ్ళు మారాలి.

ఈ విధంగా కులాభివృద్ధిని కోరుతున్న ఎంతో మంది కార్యకర్తలు రాష్ట్ర సంఘం నిర్వహించిన ప్రచార పర్యటనల్లో ఇతోధికంగా సహకరించి, కార్యక్రమాల్ని విజయవంతం చేసినందుకువారికి, రాష్ట్ర సంఘం ధన్యవాదాలు తెలుపుతున్నది. బుడ్గ జంగం కార్యకర్తలు ఇకముందు కూడా ఉత్సాహంతో 'పర్యటనలు - ప్రచారాలు' నిర్వహించి తమవంతు కర్తవ్యాన్ని నెరవేర్చగలరని మనస్ఫూర్తిగా ఆశిద్దాం.

★ ※ ★

# బుడ్గ జంగాల సభల్లోని దృశ్యాలు



12-11-2000న వరంగల్ జిల్లా జనగామలో జరిగిన మహాసభలో వేదికమీద అప్పటి విద్యాశాఖ మంత్రివర్యులు శ్రీ కడియం శ్రీహరిగారు, చెన్నూర్ ఎమ్మెల్యే శ్రీ సుధాకర్‌రావు గారు, హన్మకొండ ఎమ్మెల్యే శ్రీ ఎం. ధర్మరావుగారు తదితరులు, ఉపన్యసిస్తున్న రాష్ట్ర సంఘం సలహాదారులు నిదానకవి బాబూరావుగారు.



1993లో సైదాబాదులో జరిగిన సభలో అప్పటి విద్యాశాఖమంత్రివర్యులు శ్రీ పి.వి. రంగారావుగారిని సన్మానిస్తున్న రాష్ట్ర సంఘం సలహాదారులు నిదానకవి బాబూరావుగారు.

# 2000 సం॥లో హైదరాబాదులో జరిగిన సభల దృశ్యాలు




ప్రసంగిస్తున్న ముఖ్య అతిథి శ్రీ కె. విఠల్ రెడ్డిగారు.
మన్సూరాబాదు, ఎల్.బి.నగర్, రంగారెడ్డి జిల్లా




ప్రసంగిస్తున్న ముఖ్యఅతిథి తూర్పాటి సారయ్యగారు అప్పటి హనుమకొండ
జెడ్.పి.టి.సి సభ్యులు.

# 2000 సం॥లో హైదరాబాదులో జరిగిన సభల దృశ్యాలు




ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం కన్వీనర్ ఆనరాశి రాములుగారు.




ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం అధ్యక్షులు పస్తం యాదగిరిగారు.

# 2000 సం॥లో హైదరాబాదులో జరిగిన సభల దృశ్యాలు




ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు తూర్పాటి జగదీశ్వర్‌గారు.




ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం సంయుక్త కార్యదర్శి కడమంచి దయానంద్‌గారు.

# 2000 సం॥లో హైదరాబాదులో జరిగిన సభల దృశ్యాలు




ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం కోశాధికారి తూర్పాటి జంగయ్యగారు.



సభలో పాల్గొన్న ఆయా సంఘాల అధ్యక్షకార్యదర్శులు.

# 1991 లో హైదరాబాదులో జరిగిన మహాసభల దృశ్యాలు




సన్మానింపబడుతున్న అప్పటి రాష్ట్ర సంఘం సలహాదారులు
కీ.శే. కదమంచి ఎల్లయ్యగారు.




ప్రసంగిస్తున్న అప్పటి పంచాయతీ కమిటీ ఛైర్మన్ కీ.శే. సిరిగిరి రామయ్యగారు.

# 1991లో హైదరాబాదులో జరిగిన మహాసభల దృశ్యాలు




ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం సహాయకార్యదర్శి కిన్నెర పాండుగారు (వరంగల్ జిల్లా).




ప్రసంగిస్తున్న రాష్ట్ర సంఘం సహాయకార్యదర్శి విభూతి (జి) సాయిలుగారు (నిజామాబాదు జిల్లా).

# బుడ్గ జంగాల సభల్లోని దృశ్యాలు



రాష్ట్రసంఘం పూర్వ అధ్యక్షులు గుప్ప గణేశ్‌గారి ప్రథమ వర్ధంతి సభ(23-11-99). 'నిజాలూ -నిర్వచనాలూ' గ్రంథాన్ని గుప్ప గణేశ్ గారికి అంకితమిచ్చిన సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే, ముఖ్యఅతిథి శ్రీ బద్దంబాల్‌రెడ్డిగారు కవి డా॥ ఎన్.ఆర్. వెంకటేశంగారిని సన్మానిస్తున్న దృశ్యం. ప్రక్కనే రాష్ట్ర సంఘం ఉపాధ్యక్షులు తూర్పాటి జగదీశ్వర్‌గారు.



రాష్ట్ర సంఘం నాయకులతో తూర్పుగోదావరి జిల్లా నాయకులు (12-2-1986). కూర్చునవారు కుడినుంచి : ఆనరాశి రాములు, ఎన్.ఆర్. వెంకటేశం, నిదానకవి బాబూరావు, పస్తం యాదగిరి, కడమంచి యాదగిరి. నిలుచున్నవారు కుడినుంచి : మోటూరి రాము, నిండుగొండ సింహాచలం, కళ్యాణం మరిడియ్య, పంచాది ఎర్రన్న, ప్యార్ల పల్లారావు తదితరులు.

# 8. జిల్లాల్లోని బుడ్గజంగం సంఘాల వివరాలు

## ఆంధ్రప్రదేశ్



# 8.జిల్లాల్లోని బుద్ధ జంగం సంఘాల వివరాలు

ఇందులో ఆయా జిల్లాల్లోని సంఘాల వివరాలు ఇవ్వటం జరిగింది. జిల్లాల్లో మొదట్నుంచి కృషి చేస్తున్నవారిని, ఆయా మండలాల్లో కులాభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన వారిని ఇక్కడ పేర్కొనటం జరిగింది. సమాచారం అందని కారణంగా ఇంకా కొందరిని ఇక్కడ స్మరించక పోయి ఉండవచ్చు. అంత మాత్రాన నిరుత్సాహపడ వద్దని మనవి. వ్యక్తుల కంటే కూడా సామూహిక శక్తులే సంఘ ప్రచార కార్యక్రమాలను దిగ్విజయం చేశాయి. ప్రజాస్వామ్యంలో ఒక్కరు చేసినా ఆ పేరు అందరికీ వస్తుంది. సంఘానికే ఆ గౌరవం మిగులుతుంది. వ్యక్తి చేసినా, సామూహిక శక్తి చేసినా అట్టడుగున ఉన్న బుద్ధ జంగాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించటమనేదే లక్ష్యం. ఇలాంటి రిపోర్టుల వల్ల కృషి చేసిన వారికి ఉత్సాహం కలిగితే, చేయదలచిన వారిలో ప్రోత్సాహం పొంగులెత్తుతుంది.

ఇందులో అన్ని జిల్లా సంఘాల వివరాలు సమగ్రంగా లేవు. ఆయా జిల్లాల్లోని అన్ని మండల సంఘాల వివరాలు కూడ లేవు. అందినంత వరకు సమాచారాన్ని ఇందులో పొందుపరిచాను. ఇది ఒక ప్రయత్నం మాత్రమే. ముందు ముందు ఇంత విస్తృతమైన ప్రాతిపదికతో పనిచేయటానికి ఇదొక సూచిక. రానున్న కాలంలో సమగ్రమైన సమాచారాన్ని రూపొందించటానికి ఇదొక ప్రణాళిక.

భవిష్యత్తులో ప్రతి గ్రామ సంఘాల సమాచారం ఆ మండలసంఘంలో, అన్ని మండలాల సమాచారం ఆ జిల్లా సంఘంలో, అన్ని జిల్లాల సమాచారం రాష్ట్ర సంఘంలో భద్రపరచబడాలి. ఇదంతా మన కులాభివృద్ధి ప్రణాళికలను, కార్యక్రమాలను రూపొందించటానికీ, మన స్థితిగతులను అంచనా వేసుకోవటానికీ, కొత్త మార్గాలను అన్వేషించటానికీ ఎంతో దోహదం చేస్తుంది. కాబట్టి బుద్ధ జంగం కార్యకర్తలందరూ ఇందుకు అనుగుణంగా కృషి చేయటానికి ప్రాధాన్యం ఇవ్వాలి.

ఇందులో పేర్కొన్న జిల్లాల వరుస క్రమం

1. హైదరాబాదు
2. రంగారెడ్డి
3. మహబూబ్‌నగర్
4. నల్గొండ
5. మెదక్
6. వరంగల్
7. కరీంనగర్
8. ఖమ్మం
9. నిజామాబాదు
10. ఆదిలాబాదు
11. తూర్పుగోదావరి
12. పశ్చిమగోదావరి
13. విశాఖ పట్నం
14. విజయనగరం
15. శ్రీకాకుళం
16. కృష్ణా
17. గుంటూరు
18. ప్రకాశం
19. నెల్లూరు
20. అనంతపురం
21. కర్నూలు
22. కడప
23. చిత్తూరు.

# హైదరాబాదు జిల్లా



ఇప్పుడు రాష్ట్రంలోని *23* జిల్లాలకు,కర్నాటక, మహారాష్ట్రలకు వ్యాపించిన కులాభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభమయిన చోటు హైదరాబాదు. విస్తృతంగా ప్రవహిస్తున్న కులాభివృద్ధి కార్యక్రమాలనే గోదావరికి జన్మస్థలమైన త్ర్యంబకం హైదరాబాదు. చిమ్మచీకట్లో దారీతెన్నూ తెలియని బుడ్గజంగాలకు వెలుగు కిరణాలను వెదజల్లిన చోటు హైదరాబాదు. *1950* లో చిన్నగా సంఘ స్ఫూర్తికి ఇక్కడ అంకురార్పణ జరిగింది. మొదటి తరం నాయకులు సంఘ కార్యక్రమాలను హైదరాబాదు నగర పరిధిలోనే చేశారు. రెండవ తరం నాయకులు, హైదరాబాదు నుంచే కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా వ్యాపింప చేశారు. ఇప్పుడు మూడవ తరం నాయకులు ప్రవేశించనున్న సంధి దశ ఇది. సోదర కులాలు కొన్ని ఎంత అభివృద్ధిని సాధించాయో చూస్తే, బుడ్గ జంగాల పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్నట్టుగా ఉంది. చేయవలసింది ఇంకా చాలా ఉంది.

రాజధాని నగరమైన హైదరాబాదులోని బుడ్గజంగాలు ఇతర జిల్లాల వారికంటే సహజంగానే గుడ్డిలో మెల్ల లాంటి అభివృద్ధిలో ఉన్నారు. ఆ మాత్రమైనా ముందు నడుస్తూ, అట్టడుగున ఉన్న జిల్లాల బుడ్గ జంగాలకు స్ఫూర్తిని కలిగిస్తున్నారు.

ఒక్క సంఘంగా ప్రారంభమై, *1977* లో పదిహేను ప్రాంతీయ సంఘాలుగా ఎదిగినా, ఇప్పుడు కార్యక్రమాలు హైదరాబాదులో దాదాపు *30* ప్రాంతీయ సంఘాలకు విస్తరించాయి. హైదరాబాదు చుట్టూ రంగారెడ్డి జిల్లా వ్యాపించి ఉండటం వల్ల, హైదరాబాదుకు అనుకుని ఉన్న రంగారెడ్డి జిల్లా ప్రాంతాల్లోని బుడ్గ జంగం సంఘాలూ, నగరంలోని సంఘాలూ కలిసే పని చేస్తున్నాయి. సంబంధబాంధవ్యాలు, సంఘ కార్యక్రమాలు ఈ రెండు జిల్లాల మధ్య బాగా కొనసాగుతున్నాయి. వాటిలో కొన్ని సంఘాలకు సంబంధించిన వివరాలను ఇక్కడ ఇస్తున్నాను.

**జంగంమెట్ స్థానిక సంఘం (రిజి.నెం. 1527/83) :**

అధ్యక్షుడు డా॥ ఎన్.ఆర్. వెంకటేశం, ఉపాధ్యక్షులు నిదానకవి దశరథ, విబూది ఇస్తారి, ప్రధాన కార్యదర్శి కడమంచి ఎల్లయ్య, సహాయ కార్యదర్శి కప్పెరి నర్సింగ్‌రావు, కోశాధికారి సదుల యాదగిరి, ఉప కోశాధికారి రేవెల్లె శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీలు నిదానకవి శంకర్,తూర్పాటి కృష్ణ, కప్పెరి రవి, కప్పెరి మధు, కుల పంచాయతి కమిటీ చైర్మన్ తూర్పాటి జంగయ్య, డిప్యూటీ చైర్మన్ కల్లెం జంగయ్య.

**రాజధార్ ఖాన్ పేట్ - గుప్పా నగర్ సంఘం :**

సలహాదారు సంకుమల్లయ్య, అధ్యక్షుడు కడమంచి ముత్తయ్య, ఉపాధ్యక్షులు : వాంద్రాసి ఈశ్వర్, చిత్తారి శంకర్; కార్యదర్శి సంకు నర్సింహ, సహాయ కార్యదర్శులు; వాంద్రాసి దయానంద్, వాంద్రాసి నర్సింహం, కోశాధికార్లు : సంకు పొట్టయ్య, వాంద్రాసి నర్సింహ, సభ్యులు : కడమంచి ఉదయ్ శంకర్, కడమంచి సాయిలు, అల్లం యాదగిరి, కడమంచి నర్సింగ్‌రావు, సిరిగిరి నర్సింహ, సంకు వీరయ్య.

**మొహమ్మద్ గుడా (సికిందరాబాదు) సంఘం :**

సలహాదారులు: పస్తం యాదగిరి, ఆనరాశి రాములు, పస్తం సోమయ్య, తూర్పాటి చిన్న పోచయ్య, అధ్యక్షుడు కప్పెరి సీతారాములు, ఉపాధ్యక్షుడు బైల్పాటి లక్ష్మణ్, మోటం పెద్ద ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి పస్తం జనార్దన్, సహాయ కార్యదర్శులు పస్తం శంకర్, తూర్పాటి నర్సింహ, కోశాధికారి పస్తం ప్రభాకర్, కార్యవర్గ సభ్యులు : తూర్పాటి లక్ష్మణ్, తూర్పాటి వెంకటేశ్, పస్తం యాదయ్య, పస్తం సాయిలు, కప్పెరి తిరుపతయ్య, తూర్పాటి పోచయ్య, పస్తం ముత్తయ్య, రాసునూరి నర్సింహ, పస్తం సోమయ్య, తూర్పాటి చిన్న పోచయ్య, తూర్పాటి పెద్ద పోచయ్య, చౌటుప్పల పస్తం యాదగిరి.

**అంబర్ నగర్ (అడిక్‌మెట్) సంఘం :**

సలహాదారుడు కప్పెరి ఎల్లయ్య, అధ్యక్షుడు తూర్పాటి సుదర్శన్, కార్యదర్శి తూర్పాటి ఆనందకుమార్, సహాయ కార్యదర్శులు కప్పెరి కృష్ణ, కప్పెరి వేణు గోపాల్, క్రోశాధికారి తూర్పాటి జగదీశ్వర్, కార్యవర్గ సభ్యులు :బాజె కాశీరాం, కప్పెరి సత్యనారాయణ, కప్పెరి శ్రీనివాస్, తూర్పాటి రామకృష్ణ.

**బండ్లగుడా (గౌస్‌నగర్) సంఘం :**

అధ్యక్షుడు వాంద్రాసి కృష్ణయ్య, ఉపాధ్యక్షుడు వాంద్రాసి నర్సింహ, కార్యదర్శి తూర్పాటి నర్సింహులు, సహాయకార్యదర్శి కప్పెరి అంతయ్య, కోశాధికారి తూర్పాటి సాయిలు.

**దూదిబాయి - చిలుకలగుడా (ముషీరాబాదు మండల) సంఘం :**

సలహాదారుడు తూర్పాటి సిద్ధిరాములు, అధ్యక్షుడు తూర్పాటి యాదయ్య, ఉపాధ్యక్షులు పస్తం కృష్ణ, పస్తం నర్సింహ, కార్యదర్శి బాజె శంకరయ్య, సహాయ కార్యదర్శి మోటం నర్సింహ, కోశాధికారి ఊబిది కన్నమ్మ, తూర్పాటి ఎల్లమ్మ, కడమంచి చంద్రయ్య, బాజె చంద్రయ్య, బాజె సాగర్, తూర్పాటి యాదయ్య.

హైదరాబాదులోని కొన్ని బస్తీ సంఘాల అధ్యక్ష కార్యదర్శుల వివరాలు:

1. ఉప్పుగుడా - వాంద్రాసి అంజయ్య, తూర్పాటి గణేశ్
2. సైదాబాదు (కుర్మాగుడా) - నిదానకవి సత్తయ్య, నిదానకవి బాబూరావు
3. బండ్లగుడా(జి.ఎస్.ఐ.)- తూర్పాటి జగదీశ్వర్, తూర్పాటి సంజీవ
4. చింతల్ బస్తీ - సదుల మురారి, సదుల గౌరయ్య
5. ఖైరతాబాదు - గడ్డం చంద్రయ్య, సదుల (రెడ్డి) కిష్టయ్య
6. అచ్చయ్య నగర్ - కల్లెం యాదయ్య, వద్ది నర్సింహ
7. ఇందిరా పార్కు -సిరిగిరి లచ్చయ్య, సంకుపెంటయ్య
8. నాగమయ్యకుంట - పస్తం గండయ్య, వద్ది ఎల్లయ్య
9. ఉప్పల్ - తూర్పాటి ఇసంపెల్లి, తూర్పాటి నరసింహ
10. బైరామల్‌గుడా - కడమంచి వీరయ్య, కడమంచి నరసింహ
11. గుర్రం గుడా - మాదెన సుదర్శన్, మాదెన నారాయణ
12. సాహెబ్‌నగర్ - ఊబిది శంకరయ్య, మాదెనం యాదయ్య
13. లెనిన్‌నగర్ (మీర్‌పేట్) - ఆలేటి సుదర్శన్, కడమంచి నర్సింహ
14. జిల్లెల్ల గుడా - కల్లెం జంగయ్య, సదుల గోపాల్
15. మాదన్నపేట - నిదానకవి వెంకటేశం, ఇప్పముత్తిలింగం
16. దిల్‌సుఖ్‌నగర్ - మాదెన యాదగిరి, నిదానకవి కృష్ణ,తూర్పాటి భిక్షపతి
17. బోలక్‌పూర్ - మోటం సాంబయ్య, కల్లెం చిన్న యాదయ్య

18. కూకట్‌పల్లి - తూర్పాటి నర్సిహ్మా, వాంద్రాసి చంద్రయ్య
19. రామకృష్ణాపూర్ - పత్తిరాములు, కడమంచి నర్సింహ
20. యూసుఫ్‌గుడా - డొక్క లాలయ్య, గడ్డం లక్ష్మయ్య
21. మలక్‌పేట - పస్తం పెంటయ్య
22. బంజారాహిల్స్ - సదుల చంద్రయ్య, సదుల శంకరయ్య
23. నాచారాం - ఊబిది ఎల్లయ్య, కడమంచి యాదగిరి
24. గుడిమల్కాపురం - పస్తం గండయ్య, ప్యార్ల పెంటయ్య
25. వినాయక నగర్ - చిత్తారి గోవిందు, ఊబిది చంద్రయ్య
26. బాపూజీనగర్ (సికిందరాబాదు) - సిరిగిరి నర్సింహ
27. మల్కాజిగిరి - కడమంచి రాములు, తూర్పాటి శంకర్
28. బోడుప్పల్ - సదుల భీమయ్య, సదుల చంద్రయ్య
29. మూసాపేట్ - వాంద్రాసి నర్సింహ
30. కూకట్‌పల్లి - తూర్పాటి నర్సింహ

# రంగారెడ్డి జిల్లా



రంగారెడ్డి జిల్లా ఒకప్పుడు హైదారాబాదు జిల్లాలో భాగమే. హైదరాబాదు జిల్లాకు చుట్టూరా ఆవరించుకుని ఉన్న జిల్లా రంగారెడ్డి. హైదరాబాదుకు కాస్త దూరంగా ఉన్న చేవెళ్ళ, వికారాబాదు, తాండూరు, గండీడు, పరిగి, షాబాదు, మాలు మొదలైన ప్రాంతాలు తప్పిస్తే, జిల్లాలో మిగతా ప్రాంతాలు హైదరాబాదులోనివే అని భ్రమ గొలుపుతాయి. ఉప్పల్, లెనిన్ నగర్ (మీర్‌పేట్), *GSI* బండ్లగుడా, బోడుప్పల్, సాహెబ్ నగర్, గుర్రం గుడా, జిల్లెల్లగుడా, దిల్‌సుఖ్‌నగర్, వనస్థలిపురం, అంబర్‌పేట్, బుద్వేల్, కిషన్‌బాగ్, వినాయక నగర్, రామకృష్ణాపూర్, శంషాబాద్, ఇబ్రహీంపట్నం మొదలైనవి రంగారెడ్డి జిల్లాలోనివయినా – ఆ సంఘాలు హైదరాబాదులోనే చేరి ఉన్నాయి. మల్కాజ్‌గిరి మండలంలో మోటం మల్లయ్య, పత్తి రాములు గార్లు, మహేశ్వరం మండలంలో సదుల పెంటయ్య, తూర్పాటి జంగయ్యగార్లు; కులకచెర్ల మండలంలో తూర్పాటి అంజయ్య, వాంద్రాసి బాలకిష్టిగార్లు; చేవెళ్ళ మండలంలో తూర్పాటి మహేశ్ గారు; శంకర్‌పల్లి

మండలంలో అల్లం మల్లేశ్, కడమంచి మల్లయ్య గార్లు; ఇబ్రహీంపట్నం మండలంలో కప్పెరి నిర్సింహ గారు; బషీరాబాదు మండలంలో సంకుల నారాయణ, వానరాసి రాంచందర్, రుద్రాక్షల పకీరప్ప, కడమంచి వెంకటేశ్ గార్లు; యాలాల మండలంలో నాగుల ఆంజనేయులు, కడమంచి ఆశప్ప, కడమంచి యాదప్ప గార్లు కులాభివృద్ధికి కృషి చేస్తున్నారు.

హైదరాబాదు సంఘంతో పాటు రంగారెడ్డిలోని మండల సంఘాలు ముందుకు నడిచాయి. వినాయకనగర్, రామకృష్ణాపురం, శంషాబాదు, శంకర్‌పల్లి, మహేశ్వరం, చేవెళ్ళ, ఇబ్రహీంపట్నం మొదలైన సంఘాలు రంగారెడ్డి జిల్లాలోని ఇతర సంఘాల కంటే ముందున్నాయి.

**కొన్ని సంఘాల వివరాలు ఇలా ఉన్నాయి.**

**కులకచెర్ల మండల సంఘం (రిజి.నెం. 448/95) :**

సలహాదారుడు తూర్పాటి శంకరయ్య (భూరెడ్డిపల్లి), అధ్యక్షుడు తూర్పాటి అంజయ్య (భూరెడ్డిపల్లి), ఉపాధ్యక్షుడు సదుల ఎల్లయ్య (మర్రికల్లు), కార్యదర్శి వాంద్రాసి బాలకిష్టి (వీరాపూర్), సహాయకార్యదర్శి పొన్నకంటి రమణయ్య (చాకలిపల్లి), కోశాధికారి కప్పెరి ఎల్లయ్య (కులకచెర్ల), కార్యవర్గ సభ్యులు : కప్పెరి బాబయ్య (వెంకటాపూర్), తూర్పాటి చంద్రయ్య, తూర్పాటి చిన్నయ్య, తూర్పాటి సాయిలు (భూరెడ్డి పల్లి).

**బుద్వేల్ (రాజేంద్రనగర్ మండల) సంఘం :**

సలహాదారుడు కల్లెం రామస్వామి, అధ్యక్షుడు కల్లెం అంజయ్య, ఉపాధ్యక్షుడు గడ్డం పెంటయ్య, కార్యదర్శి తూర్పాటి యాదయ్య, సహాయ కార్యదర్శి మరియు కోశాధికారి తూర్పాటి శంకరయ్య.

**మహేశ్వరం మండల సంఘం(రిజి.నెం.2575/93):**

అధ్యక్షుడు సదుల పెంటయ్య (పెంద్యాల), ఉపాధ్యక్షుడు వాంద్రాసి బాబయ్య (డబ్లిగూడ), కార్యదర్శి తూర్పాటి జంగయ్య(కోళ్ళ పడకల్లు), సహాయ కార్యదర్శి కొండపల్లి

రంగప్ప (అమీర్‌పేట), కోశాధికారి తూర్పాటి అంజనేయులు (మాణిక్యమ్మగూడ), కార్యవర్గ సభ్యులు : తూర్పాటి బాలకిష్టి (తుక్కుగూడ), తూర్పాటిసిద్దప్ప (గట్టుపల్లి), మోటం భీమయ్య (కోళ్ళపడకల్లు), పస్తం అంజయ్య(పెద్ద తుప్పర).

**బషీరాబాదు మండల సంఘం (రిజి.నెం.1353/98) :**

సలహాదారులు వానరాసి రాంచందర్, బైల్పాటి ఈరప్ప, అధ్యక్షుడు సంకుల నారాయణ, ఉపాధ్యక్షులు రుద్రాక్షల పకీరప్ప, కడమంచి వెంకటేశ్, కార్యదర్శి మిరియాల నర్సింహులు, సహాయ కార్యదర్శులు సంకురాములు, టేకు మొగులప్ప, కోశాధికార్లు సంకుల బుగ్గప్ప, సంకుల ఈరప్ప; కార్యవర్గ సభ్యులు : కడమంచి బందప్ప, కడమంచి మొగులప్ప, కడమంచి తిరుపతి, వానరాసి కృష్ణ, సంకుల మొగులప్ప, సంకుల ఎల్లప్ప, కడమంచి ఉలిగప్ప, రుద్రాక్షల దస్తప్ప, బైల్పాటి నర్సింహులు, కడమంచి ఈశ్వరయ్య, వానరాసి శంకర్.

**యాలాల మండల సంఘం :**

అధ్యక్షుడు నాగుల అంజనేయులు, ఉపాధ్యక్షుడు కడమంచి ఆశప్ప, కార్యదర్శి కడమంచి యాదప్ప, సహాయ కార్యదర్శి రుద్రాక్షల రామప్ప, కోశాధికారి రుద్రాక్షల శ్యామప్ప, కార్యవర్గ సభ్యులు : కడమంచి ఆశప్ప (అక్కంపల్లి), కడమంచి పెద్ద ఆశప్ప(మరేటిపల్లి), నాగుల వెంకటయ్య (లక్ష్మీనారాయణ పురం), కప్పెర అనంతయ్య (అస్తేపురం), వాంద్రాసి వెంకటయ్య (రాగాపురం), కల్లెం గండయ్య (ముద్దాయిపేట), పస్తం చిన్న అనంతి (సంఘెం).

**చేవెళ్ళ మండల సంఘం :**

అధ్యక్షుడు తూర్పాటి జంగయ్య (చేవెళ్ళ), ఉపాధ్యక్షుడు మోతె లింగం(గొల్లగూడెం), కార్యదర్శి తూర్పాటి మహేశ్(దేవుని ఎర్రపల్లి), సహాయ కార్యదర్శి తూర్పాటి యాదయ్య (చేవెళ్ళ), కోశాధికారి తూర్పాటి రామకృష్ణ(దేవుని ఎర్రపల్లి), సలహాదారులు : నాగుల చెన్ బాష(గొల్లగూడెం), మోతె శంకరయ్య (ఆలూర్), తూర్పాటి రామచంద్రం

(ఎంకమ్మగూడెం), మోతె అంజయ్య (మల్కాపురం), సభ్యులు : మోతె కిష్టయ్య (కమ్మెట), తూర్పాటి ఎల్లయ్య (చేవెళ్ళ), తూర్పాటి గండయ్య (దేవుని ఎర్రపల్లి), తూర్పాటి దాసు (రామన్న గూడెం), వాంద్రాసి మల్లయ్య (రావుల పల్లి).

**ఆలూరు (చేవెళ్ళ మండలం) సంఘం (రిజి.నెం.3022/2001):**

సలహాదారులు : మోటం మొగులయ్య, కడమంచి వెంకటయ్య, అధ్యక్షుడు మోతె శంకరయ్య, ఉపాధ్యక్షులు : తూర్పాటి రామచంద్రం, తూర్పాటి జంగయ్య, కార్యదర్శి తూర్పాటి వెంకటయ్య, సహాయ కార్యదర్శులు : కడమంచి నర్సింహులు, తూర్పాటి మల్లయ్య, కోశాధికారులు : మోటం యాదయ్య, తూర్పాటి చంద్రయ్య కార్యవర్గ సభ్యులు : తూర్పాటి అంజయ్య, కడమంచి జంగయ్య, మోతె కిష్టప్ప, తూర్పాటి నర్సింహులు, వానరాసి రామయ్య, వానరాశి మల్లమ్మ, తూర్పాటి అంతమ్మ.

**గొల్లగూడెం (చేవెళ్ళ మండల) సంఘం (రిజి.నెం.1653/2001) :**

అధ్యక్షుడు మోతె యాదయ్య, ఉపాధ్యక్షుడు మోతె అంజయ్య, కార్యదర్శి వానరాశి సత్యనారాయణ, సహాయ కార్యదర్శి మోతె లింగం, కోశాధికారి నాగుల యాదయ్య, సలహాదారులు : నాగుల వెంకటేశం, మోతె కిష్టయ్య, సభ్యులు : మోతె పురుషోత్తం, మోతె చంద్రయ్య, మోటం ఆగమయ్య, వానరాశి మల్లయ్య, మోతె రామ్‌కోటి, మోతె శివకోటి, మోతె వెంకటేశం, మోతె సిద్ధయ్య.

**వినాయకనగర్ (మల్కాజ్‌గిరి మండల) సంఘం (రిజి.నెం.5703/91) :**

సలహాదారులు మోటం మల్లయ్య, తూర్పాటి నారాయణ, అధ్యక్షుడు పస్తం పాండు, ఉపాధ్యక్షుడు విభూతి షుల్లేశం, కార్యదర్శి ఆలేటి లక్ష్మీనారాయణ, సహాయ కార్యదర్శి కడమంచి రాములు, కోశాధికారి పస్తం అంజయ్య, కార్యవర్గ సభ్యులు : మోటం పెంటయ్య, పస్తం యాదయ్య, పస్తం అంజనేయులు, డి. నర్సింహ.

| మండలం పేరు | - | అధ్యక్ష కార్యదర్శులు |
|---|---|---|
| 1. ఘట్‌కేసర్ | - | కల్లెం రాములు, కొండపల్లి చంద్రయ్య, పత్తి రాములు, పత్తి నర్సింహ |
| 2. శంషాబాదు (రాజేంద్రనగర్ మం॥) | - | ఆలేటి రాములు, తూర్పాటి సదానంద్ |
| 3. వికారాబాదు | - | టేకి పెంటయ్య, కడమంచి రామయ్య |
| 4. శంకర్‌పల్లి | - | అల్లం మల్లేశ్, కడమంచి మల్లయ్య |
| 5. నార్సింగ్ | - | కల్లెం పెంటయ్య, కల్లెం సురేశ్ |
| 6. మహరాజ్‌పేట్ | - | వాంద్రాసి రోశయ్య, గడ్డం అంతయ్య |
| 7. మాల్(యాచారం మం॥) | - | కడమంచి నర్సింహ, మిరియాల లక్ష్మయ్య |
| 8. షాబాదు | - | తూర్పాటి నర్సిహ్మ, కప్పెరి ఎల్లయ్య |
| 9. ఇబ్రహీం పట్నం | - | కప్పెరి నర్సింహ. |

# మహబూబ్‌నగర్ జిల్లా



మహబూబ్‌నగర్ జిల్లాలో బుడ్గజంగాల జనసంఖ్య ఇతర జిల్లాల కంటే ఎక్కువ. సంఘ చైతన్యం కూడా ఎక్కువే. ఇతర జిల్లాల కంటే ఈ జిల్లాలో అవగాహన కలిగిన కార్యకర్తలుగా, నాయకులుగా ఎదిగిన వారు తగిన సంఖ్యలో ఉన్నారు. నారాయణపేట్, గద్వాల రెవిన్యూ డివిజన్లలో మాత్రం సంఘం కార్యక్రమాలు మందకొడిగా నడుస్తున్నాయి. స్థానికంగా తగిన నాయకత్వం ఇంకా సిద్ధించలేదు. మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి డివిజన్లలో కులాభివృద్ధి కార్యక్రమాలు పుంజుకున్నాయి.

*1984* కల్వకుర్తి మహాసభ, *1985* అచ్చంపేట మహాసభ, *1990* నుంచి మహబూబ్‌నగర్ పట్టణంలో ప్రతి రెండు సంవత్సరాల కొకసారి నిర్వహించిన సభలు, ఆయా మండలాల్లో పర్యటించినపుడు జరిపిన సమావేశాలు జిల్లా బుడ్గజంగాలకు ఒక ఊపునిచ్చాయి. ఉత్సాహాన్ని పొంగించాయి.

అచ్చంపేట వైపు విభూతి రామదాసుగారు (ఉప్పునుంతల మండలం), మహబూబ్‌నగర్‌లో రాచూటి వాసుదేవ్‌గారు, కప్పెర పెంటయ్య గారు, పొన్నకంటి రాములు గారు, మహబూబ్‌నగర్ డివిజన్‌లో కళ్యాణం నరసింహ గారు, వనపర్తి డివిజన్‌లో దొక్కా వెంకట్రాములుగారు, నాగర్ కర్నూలు డివిజన్‌లో కళ్యాణం మారెయ్యగారు, కులాభివృద్ధి కోసం కృషి చేశారు. ఇంకా సిరిగిరి వెంకట్రావు గారు(మహబూబ్‌నగర్), పస్తం ఎల్లయ్యగారు (జడ్చర్ల), తూర్పాటి కృష్ణయ్యగారు (వంగూరు), రేవెల్లె కృష్ణయ్యగారు (ఆత్మకూరు), సిరిగిరి రాజేంద్రప్రసాద్‌గారు (మద్దూరు), సిరిగిరి రామదాసుగారు (నారాయణ పేట్), తదితరులు కూడా సమస్యల పరిష్కారానికి పాటు పడ్డారు.

**జిల్లా సంఘం, కొన్ని మండల సంఘాల కార్యవర్గ వివరాలు :**

**మహబూబ్‌నగర్ జిల్లా సంఘం (రిజి.నెం. 4033/91) :**

కన్వీనర్ సిరిగిరి వెంకట్రావు (మోతీనగర్ - మహబూబ్‌నగర్), అధ్యక్షుడు కళ్యాణం పెద్ద మారయ్య (జొన్నల బొగుడ - పెద్ద కొత్తపల్లి), కళ్యాణం ప్రధాన కార్యదర్శి నరసింహ (కొత్తపేట - కేశంపేట), ఉపాధ్యక్షులు 1. కప్పెర పెంటయ్య (మహబూబ్‌నగర్), 2. కడమంచి కృష్ణయ్య (గోపాల్‌పేట మండలం), 3. రేవెల్లె కృష్ణయ్య (ఆత్మకూరు), 4. డొక్క వెంకట్రాములు (ఖిల్లా ఘణాపూర్), కార్యదర్శులు 1. విభూతి రాందాస్ (ఉప్పునుంతల), 2. గగనం కుమారస్వామి (గోపాల్‌పేట), 3. మోతె చంద్రశేఖర్ (భూత్‌పూర్), 4. కొండపల్లి జమ్ములు (వెల్దండ), 5. కప్పెరి హనుమంతు (బాలానగర్), 6. ధాచూటి వాసుదేవ్ (అప్పాయ పల్లి), 7. కొమారి సుబ్బారావు (మహబూబ్ నగర్), 8. పొన్నకంటి రఘు (అప్పాయ పల్లి), 9. తాటికొండ చింతలయ్య(పెబ్బేరు), 10, యడవల్లి కృష్ణయ్య (పెబ్బేరు), 11. యడవల్లి స్వాములు (కొత్తకోట), 12. సిరివాటి మాసయ్య (ఖిల్లా ఘణాపూర్), 13. కప్పెర నిరంజన్ (అమ్రాబాద్), 14. విభూతి రాములు ( మాచన్‌పల్లి), కోశాధికారి పొన్నకంటి రాములు (హన్వాడ మండలం).

**ఖిల్లా గణాపూర్ మండల సంఘం (రిజి.నెం.2798/93) :**

అధ్యక్షుడు డొక్క వెంకట్రాములు (షాపూర్), ఉపాధ్యక్షుడు సిరువాటి కుర్మయ్య (రుక్కన్నపల్లి), ప్రధాన కార్యదర్శి సిరువాటి మాసయ్య (గణాపూర్), సహాయ కార్యదర్శి సిరువాటి సవారయ్య (షాపూర్), కోశాధికారి పస్తం శంకరయ్య, కార్యవర్గ సభ్యులు : పొన్నకంటి రాములు (వెంకట్రాంపల్లి), వాంగ్రాసి దుర్గయ్య (వెంకట్రాంపల్లి), డొక్కా లక్ష్మీనరసు (షాపూర్).

**మహబూబ్‌నగర్ మండల సంఘం (రిజి.నెం.2223/91) :**

అధ్యక్షుడు కప్పెరి పెంటయ్య, ఉపాధ్యక్షుడు వాంగ్రాసి చెన్నయ్య, కడమంచి కిష్టయ్య, కార్యదర్శి కప్పెరి యాదగిరి, సహాయ కార్యదర్శి కడమంచి వెంకటయ్య, కోశాధికారి వాంగ్రాసి బాలకిష్టయ్య, మెంబర్లు : పొన్నకంటి హనుమంతు, పస్తం మన్నెం, వాంగ్రాసి పెద్ద హనుమయ్య, సిరిసాల బుగ్గన్న, వాంగ్రాసి చిన్న హనుమయ్య, నిడుగొండ చంద్రయ్య.

**హన్వాడ మండల సంఘం - మునిమోక్షం (రిజి.నెం.2280/89) :**

అధ్యక్షుడు పొన్నకంటి రాములు, ఉపాధ్యక్షుడు మిరియాల చంద్రయ్య, కార్యదర్శి మిరియాల నారాయణ, సహాయ కార్యదర్శి మిరియాల లింగయ్య, కోశాధికారి పొన్నకంటి శంకర్, సభ్యులు : సన్నమండ్ల బంగారయ్య, మిరియాల జగన్నాథం, ముగ్గు లక్ష్మయ్య, సిరిగిరి ఆనందం, డొక్క పెద్ద లక్ష్మయ్య.

**కేశంపేట మండల సంఘం - కొత్తపేట (రిజి.నెం.5510/93) :**

సలహాదారుడు కళ్యాణం నరసింహ, అధ్యక్షుడు కప్పెరి దశరథం, ఉపాధ్యక్షుడు తూర్పాటి రామచంద్రయ్య, కార్యదర్శి పర్తం జంగయ్య, సహాయ కార్యదర్శులు పర్తం అడివయ్య, వాంగ్రాసి లక్ష్మయ్య, కోశాధికారి కప్పెరి జంగయ్య, కార్యవర్గ సభ్యులు సిరిగిరి బుచ్చయ్య, కప్పెరి పరశురాములు, సదుల సత్తయ్య, వాంగ్రాసి నరసింహ,

పర్తం పెద్ద అంజనేయులు, కడమంచి మొగిలయ్య, పర్తం చిన్న జంగయ్య, కప్పెరి పెద్ద జంగయ్య, కప్పెరి రామచంద్రయ్య.

**బండమీదిపల్లి సంఘం (మహబూబ్‌నగర్ మండలం) రిజి.నెం.5049/98 :**

అధ్యక్షుడు పొన్నకంటి అబ్బులయ్య, ఉపాధ్యక్షుడు పొన్నకంటి బుచ్చయ్య, కార్యదర్శి బైల్పాటి రాములు, సహాయ కార్యదర్శి పొన్నకంటి శాంతయ్య, కోశాధికారి వాంద్రాసి చంద్రయ్య, కార్యవర్గ సభ్యులు : పొన్నకంటి వెంకటస్వామి, మోటం చంద్రమౌళి, పొన్నకంటి కేశన్న, బైల్పాటి సహదేవ్, వాంద్రాసి అంజనేయులు, పొన్నకంటి భీమయ్య.

**కోస్గి మండల సంఘం :**

అధ్యక్షుడు పస్తం చంద్రయ్య, ఉపాధ్యక్షుడు కడమంచి పెద్ద రాములు, కార్యదర్శి సిరివాటి రాములు, సహాయ కార్యదర్శి కడమంచి ఎల్లప్ప, కోశాధికారి కడమంచి బిచ్చప్ప, కార్యవర్గ సభ్యులు : కడమంచి ఎల్లప్ప(చెన్నారం), సిరివాటి జమ్మయ్య (పోతిరెడ్డిపల్లి), కడమంచి కాళప్ప (గున్మల్ల), బైల్పాటి వీరప్ప (నాచారం), కడమంచి రామస్వామి (తోపురం), సిరివాటి రామయ్య (సంపల్లి), డొక్క కాశయ్య (బొల్లోనిపల్లి), కడమంచి ఎల్లప్ప(కొత్తపల్లి), కడమంచి ఎల్లప్ప (కడెంపల్లి), కడమంచి తులశయ్య (హకీంపేట).

**కుందుర్గు మండల సంఘం (రిజి.నెం.2080/93) :**

అధ్యక్షుడు కల్లెం హనుమయ్య, ఉపాధ్యక్షుడు తూర్పాటి నర్సింహులు (పులుసు మామిడి), కార్యదర్శి వాంద్రాసి చిన్న భీమయ్య, సహాయకార్యదర్శి కల్లెం వెంకటయ్య (కొండోని బావి), కోశాధికారి తూర్పాటి చంద్రయ్య (వెనికిరాల), కార్యవర్గ సభ్యులు : మిరియాల కిష్టయ్య (ముష్టిపల్లి), కప్పెరికిష్టయ్య (గుంజల్‌పాడు), మోటం చంద్రయ్య (కేశిరోని పల్లి), గగనం కర్రెన్న (గణాపూర్), కడమంచి శంకరయ్య(చెన్నరెడ్డి పల్లి).

**పెద్ద మందడి మండల సంఘం :**

సలహాదారులు సిరువాటి మాసయ్య, డొక్క వెంకట్రాములు, అధ్యక్షుడు సిరువాటి మన్యం (చిన్నమందడి), ఉపాధ్యక్షుడు సిరువాటి జమ్మన్న (వీరాయపల్లి), ప్రధాన కార్యదర్శి కప్పెరి జానయ్య (వీరాయపల్లి), సహాయ కార్యదర్శి కడమంచి కురుమయ్య (ఖానాపల్లి), కొశాధికారి బైల్పాటి కురుమయ్య (చిలుకటోనిపల్లి), కార్యవర్గ సభ్యులు : డొక్క చంద్రయ్య (బలిజెపల్లి), పొన్నకంటి కొండయ్య(చిన్నమందడి), గగనం జానకిరాములు (వీరాయపల్లి), పస్తం అంజనేయులు (వీరాయపల్లి).

**పెబ్బేరు మండల సంఘం (రిజి.నెం.1077/87) :**

అధ్యక్షుడు మోతె రాముడు, ఉపాధ్యక్షుడు యడవల్లి బ్రహ్మయ్య, కార్యదర్శి పెల్లూరి సాయన్న, ఉపకార్యదర్శి యడవల్లి గోపాల్, కోశాధికారి సంకు సాయిలు, సలహాదారులు మోతె బాలస్వామి, యడవల్లి కృష్ణయ్య, యడవల్లి శివలింగం, మెంబర్లు : యడవల్లి ప్రభాకరదాసు, మోతె చంద్రశేఖర్, పెల్లూరి మనోహర్, సంకు అంజనేయులు, యడవల్లి పార్వతయ్య.

**నవాబు పేట మండల సంఘం (రిజి.నెం.2562/94) :**

అధ్యక్షుడు పొన్నకంటి బాలస్వామి (లోకిరేవు), ఉపాధ్యక్షుడు వాంగ్రాసి బంగరయ్య (లోకిరేవు), కార్యదర్శి వాంగ్రాసి చిన్న అంజయ్య (తిమ్మాయపల్లి), సహాయ కార్యదర్శి వాంగ్రాసి చిన్న భీమయ్య (లోకిరేవు), కోశాధికారి మిరియాల జానయ్య (కొండాపురం), కార్యవర్గ సభ్యులు : కడమంచి రామయ్య (నవాబుపేట), వాంగ్రాసి పోశయ్య (కారుకొండ) వాంగ్రాసి కృష్ణయ్య (కామారం), వాంగ్రాసి నర్సింహులు (హనుమసానిపల్లి), వాంగ్రాసి చెన్నయ్య (అజిలాపురం), వాంగ్రాసి పోశయ్య (లింగంపల్లి).

**నర్సింగాయపల్లి సంఘం (గోపాల్‌పేట మండలం) రిజి.నెం.3353/99:**

అధ్యక్షుడు గగనం రాములు, ఉపాధ్యక్షుడు సిరిగిరి మన్యం, కార్యదర్శి మిరియాల కిరీటి, సహాయ కార్యదర్శి తూర్పాటి బాల్‌రాం, కోశాధికారి మిరియాల రామచంద్రం,

కార్యవర్గ సభ్యులు : మిరియాల వెంకట్రాములు, గగనం నారాయణ, గగనం రంగన్న, గగనం సాయిబాబా, మిరియాల శ్రీరాములు, కడమంచి బాలస్వామి, సిరిగిరి శ్రీనివాసులు, సిరివాటి శ్రీరాములు, గగనం మద్దెల వెంకటస్వామి, గగనం కేశవులు.

**వనపర్తి మండల సంఘం:**

సలహాదారుడు డొక్క వెంకట్రాములు, అధ్యక్షుడు విభూతి పెద్ద వెంకటయ్య, ఉపాధ్యక్షుడు సిరువాటి మాసయ్య, కార్యదర్శి దూపం కేశవులు, సహాయ కార్యదర్శి సిరువాటి దశరథం, కోశాధికారి విభూతి చిన్న ముత్యాలు, కార్యవర్గ సభ్యులు : విభూతి కేశవులు, సిరువాటి మైబయ్య, సిరువాటి వెంకటయ్య, కల్లెం మైసమ్మ.

**షాద్‌నగర్ మండల సంఘం :**

సదుల కనకయ్య, సదుల శివరాముడు.

ఈ జిల్లాలో ఇంకా అచ్చంపేట, కల్వకుర్తి, ఉప్పునుంతల, బల్‌మూరు, నాగర్‌కర్నూలు, గోపాల్‌పేట, షాద్‌నగర్, బాలానగర్, జడ్చర్ల, బూత్‌పూర్, కుందుర్గు,కొత్తకోట, పెబ్బేరు, కోడంగల్, మద్దూరు, నారాయణపేట, దేవరకద్ర, ఆత్మకూరు, వంగూరు, తలకొండపల్లి, మిడ్జిల్ల, చిన్న చింతకుంట మొదలైన మండలాల్లో కుల సంఘం ద్వారా అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి.

# నల్గొండ జిల్లా



నల్గొండ జిల్లా అంతట సంఘం ప్రచార కార్యక్రమాలు సాగుతున్నాయి. 1984లో చౌటుప్పల్‌లో సభలు; 1985 నందనంలో సభలు; ఆ తర్వాత దేవరకొండ, నల్గొండ, ఆలేరు, ఇందిరాల, పల్లివాడ మొదలైన చోట్ల సభలతో బాగా చైతన్యం వచ్చింది. బ్రహ్మాండ్లపల్లి పస్తం రామస్వామి, పస్తం నర్సింహ గార్లు జిల్లాలో తూర్పువైపున ఉన్న మండలాల్లో ఎన్నో కులాభివృద్ధి కార్యక్రమాలు చేశారు. చౌటుప్పల్‌లో పస్తం పెద్ద ఎల్లప్ప, చిన్న ఎల్లప్పగార్లు, నందనంలో కడమంచి పోశయ్య, కల్లెం సాలయ్య గార్లు, ఇందిరాలలో రేవెల్లె పెద్ద నర్సింహ, రేవెల్లె స్వామి, రేవెల్లె చంద్రయ్య గార్లు, పల్లివాడలో సల్లా రాజారాం, సల్లా యాదగిరి, సల్లా లక్ష్మయ్యగార్లు, నల్లగొండ మండలంలో వేముల ఇస్తారి గారు, మునిపంపుల, రామన్నపేట మండలంలో సిరిసాల కృష్ణ, సల్లారాజు తదితరులు కులస్థుల్లో పరివర్తన తేవటానికి ఎంతో ప్రయత్నించారు. వీరి కృషి వల్ల జిల్లాలో బుడ్గజంగాల జీవన సరళి మారి, ప్రగతి వైపు పయనించటం ప్రారంభమయింది.

## కార్యకర్తల వివరాలు :

**చౌటుప్పల్ సంఘం :**

సలహాదారులు పస్తం పెద్ద ఎల్లప్ప, కల్లెం గురువయ్య, అధ్యక్షుడు మాదెనం యాదయ్య, ఉపాధ్యక్షులు పస్తం చిన్న ఎల్లప్ప, పస్తం యాదయ్య, కార్యదర్శి పస్తం గంగారాములు, సహాయ కార్యదర్శులు కల్లెం కనకయ్య, తూర్పాటి చిన్న నర్సింహ, కోశాధికారి తూర్పాటి నర్సింహ, కార్యవర్గ సభ్యులు : పస్తం కృష్ణ, మాదెనం భిక్షపతి, కల్లెం సత్తయ్య, తూర్పాటి దశరథ, తూర్పాటి చంద్రయ్య, కల్లెం ముర్హాళి, తూర్పాటి శంకరయ్య, తూర్పాటి చిన్న పెంటయ్య, పస్తం బాలయ్య, మాదెనం రామస్వామి, పస్తం జగన్, పస్తం లక్ష్మయ్య.

నల్గొండ జిల్లాలోని ఆయా మండల సంఘాల అధ్యక్షుడు లేక ఉపాధ్యక్షుడు లేక కార్యదర్శి లేక కొందరు క్యాబినెట్ మెంబర్ల వివరాలను ఈ కింద పొందుపరిచాను.

| మండలం పేరు | | కార్యవర్గ సభ్యుల పేర్లు |
|---|---|---|
| 1. రామన్న పేట | - | సిరిసాల దశరథ (మునిపంపుల), కల్లెం దశరథ (పల్లివాడ), సల్లా రామ చంద్రం (రామన్నపేట). |
| 2. కట్టంగూరు | - | కల్లెం యాదగిరి (కట్టంగూరు), వానరాసి రంగప్ప (కురుమర్తి),కల్లెం సింహాచలం (ఈదులూరు), కడమంచి వెంకయ్య (నారెగూడెం), వానరాసి భిక్షపతి (అవిటి పాముల) |
| 3. మోత్కూరు | - | కడమంచి యాదగిరి (అమ్మనబోలు), కడమంచి పోశయ్య (అనాజిపురం), సల్లా యాదగిరి (కొండ గడప), కడమంచి కాశయ్య (అంబాల), కడమంచి సైదులు (దాసారం), లోకేశ్ (సుద్దాల). |
| 4. నల్గొండ | - | వేముల ఇస్తారి (శేషమ్మగూడెం), సిరిసాల వీరయ్య (కతాలుగూడెం), వేముల సాయన్న (పిట్టంపల్లి). |
| 5. ఆత్మకూరు | - | కొండపల్లి జాలయ్య (కొరటికల్లు), కొండపల్లి అబ్బసలి (ఆత్మకూరు) |

6. భువనగిరి - కల్లెం రాములు (చాడ), కల్లెం యాదగిరి (ముత్తిరెడ్డి గూడెం)
7. బీబీనగర్ - పస్తం రామస్వామి, పస్తం నరసింహ (బ్రాహ్మండ్ల పల్లి), ఆనరాశి పెద్ద ఎల్లయ్య, ఈబూది యాదయ్య.
8. వలిగొండ - మోతె కిష్టయ్య (వెల్వర్తి), రేవెల్లె యాదగిరి (వలిగొండ).
9. తిరుమలగిరి - కడమంచి భిక్షమయ్య (అనంతారం), పత్తి రాంమల్లు (తిరుమలగిరి)
10. గుండాల - కడమంచి భిక్షమయ్య (బొమ్మల రామారం)
11. శాలిగౌరారం - వానరాసి మారయ్య (అడ్లూరు)
12. చిట్యాల - కల్లెం సాయిలు (గుండ్రాంపల్లి)
13. పోచంపల్లి - రేవల్లె పెద్ద నర్సింహ (ఇందిరాల)
14. నార్కెట్‌పల్లి - సిరిసాల నర్సింహ (తొండల వాయి)
15. యాదగిరిగుట్ట - కల్లెం రామదాసు
16. సూర్యపేట్ - తూర్పాటి శంకరి
17. మునుగోడు - ఊబిది శంకరయ్య

ఇంకా ఈ జిల్లాలో

కురుమర్తి, దర్వేజ్‌పురం,గుంటిపల్లి, ముకుందాపురం, నేరెడ,గోకారం, నెమలికాల్వ, చిన్నగొల్లపల్లి, కేసారం, నేడిచర్ల, గరిడెపల్లి మొదలైన గ్రామాల్లో సంఘాలు ఉన్నాయి. హుజూర్‌నగర్ ప్రాంతంలో గోపాలపురం, మాదరాని గూడెం, బూరుగడ్డ, మద్దుల్ నగర్, లింగగిరి మొదలైన గ్రామాల్లో కుల సంఘాలున్నాయి. కోదాడ, వెంకట్రామపురం, కొమరిబండ, ఎర్రారం, నల్లబండగూడెం, తుంగతుర్తి, మిర్యాలగూడెం, నందనం, కొలనుపాక, ఆలేరు, దేవరకొండ, డిండి, గోనకల్లు మొదలైన మండలాల్లో కూడ కుల సంఘాలున్నాయి.

# మెదక్ జిల్లా



మెదక్ జిల్లాలో పడమర దిక్కుగా ఉన్న మండలాలు మొదటి నుంచి చైతన్యంతో ఉన్నాయి. మెదక్‌జిల్లా హెడ్ క్వార్టర్ సంగారెడ్డి హైదరాబాదుకు దగ్గరగా ఉంది. హైదరాబాదు బుడ్గజంగం సంఘంతో సంబంధాలున్న కప్పెరి గండయ్యగారు సంగారెడ్డి నివాసి కావటం వల్ల ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో కుల సంఘాలు పెట్టించి, అభివృద్ధి దృక్పథాన్ని కలిగించారు. నవంబర్ 1983 లో సంగారెడ్డిలో బుడ్గజంగాల సభ నిర్వహించి, చుట్టుపక్కల జిల్లాల వారికి చైతన్యం కలిగించారు. కోహిర్ మండలం బిలాల్‌పూర్ వాస్తవ్యులు ప్యార్ల నర్సింహులు, బైల్పాటి నర్సింహులు 1970 నుంచే, విద్యార్థులుగా ఉంటూనే కులంలోని విద్యార్థుల్ని చదువుకోవటానికి ప్రోత్సహించారు. జహీరాబాదులో ప్రముఖ కాంగ్రేసు నాయకులు శ్రీ బాగారెడ్డి గారి అండదండలతో కొమారి బిచ్చయ్యగారు కులాభివృద్ధి కార్యక్రమాలు చేశారు. జహీరాబాదులో మునిసిపల్ కౌన్సిలర్‌గా ఎన్నికై కులానికి ఆత్మ విశ్వాసాన్ని కలిగించారు. ఆ తర్వాత కొమారి చంద్రయ్యగారు కూడ బాగా కృషి చేశారు. చంద్రయ్య గారి భార్య మునిసిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు.

మెదక్ లో వాంగ్రాని సాయిలు గారు కులాభివృద్ధి కోసం ఎంతో పాటు పడ్డారు. జూన్ 1985 లో మెదక్ లోని చిల్డ్రన్స్ పార్కులో బుడ్గ జంగాల మహాసభలు నిర్వహించారు. ఈ సభల వల్ల మెదక్, నిజామాబాదు, రంగారెడ్డి జిల్లా బుడ్గజంగాల్లో అభివృద్ధి కార్యక్రమాల పట్ల అవగాహన పెరిగింది. ఈ సభల నిర్వహణలో మోటం గురప్ప తదితరులు ఎంతో శ్రమించారు.

